# భారతి

సాహిత్య మాసపత్రిక

ఆగస్టు 1983



## మరో జన్మ

సౌంధ్యశ్రీ

## కొడుకూ - కోమలీ

సదానంద

## ఎవరో? వాడెవరో?

వేంకటేశ్వర్లు

## జాషువ

ఏకాంబరాచార్యులు

## కవచం

వీరభద్రరావ్ పమ్మి

## అప్పికొండ శాసనాలు

మార్కండేయశర్మ

ఇంకా రాధాకృష్ణశర్మ, యాదగిరిరావు, శిఖామణి, తిరునగరి, రంగాచార్యులు, ప్రియదర్శి, కిశోరుబాబు – అశోకుబాబు, రాయని, కోణార్క, వీరయ్య, విజయదత్తాత్రేయశర్మ, తారానాథ్, రామకృష్ణారావు, తిరుమలరావు, వీరప్రసాదరావు ఇతరుల రచనలు

వ్యవస్థాపకులు

దేశోద్ధారక నాగేశ్వరరావు పంతులు

# భారతి

మాసపత్రిక

శివలెంక శంభుప్రసాద్
సంపాదకుడు
(1938-1972)

ఆగష్టు 1983
సంపుటము : 60 సంచిక : 8

విడిపత్రిక వెల నాలుగు రూపాయలు

# విషయానుక్రమణిక

## ఆగస్టు 1983

# నవ ఢిల్లీ నగర జీవితం

## శ్రీ చల్లా రాధాకృష్ణశర్మ

లేడి పరుగు కాదు
గజ గమనమూ కాదు
ఆగి ఆగి నడిచే
అశ్వధాటి ఢిల్లీనగర జీవితం.

ఢిల్లీ నగరపు కనురెప్పలు
త్వరగా కిందికి వాలును
తాపీగా తెరుచుకొనును,
చలికాలపు ఉదయాలయితే
గడియారపు జోరెక్కువ.

ఆఫీసులు పని చేసే రోజుల్లో
ఉదయం ఎనిమిదింటికే
భోజన పదార్థాలు
పొగలు సెగలు గ్రక్కుతూ
కల కల లాడుతూ కనిపించును
కంచాలు గలగలలు వినిపించును
దక్షిణాది హోటళ్లలో.

పొద్దెక్కే కొలదీ
కొంగల బారుల్లా
సైకిళ్లూ, ఇతర వాహనాలు;
పొద్దు వాలే కొద్దీ
మళ్లీ ఈ కొంగల బారులు.
దర్శనీయ దృశ్యాలివి
ఢిల్లీ నగరంలో.

గ్రీష్మం తల చూపితే చాలు
కావలసిందే సన్నని వలిపములు
అతి శీతల పానీయములూ
మంచినీటి వ్యాపారానికి
మంచి రోజులప్పుడు!
మంచుగడ్డ ముక్కలకూ
మంచి రోజులే అప్పుడు!

రక రకాల మామిడిపళ్లు
బజారుని అలంకరిస్తాయి
టెంకలకూ ధర చెల్లించాలి ఢిల్లీలో!
మంచుగడ్డల గద్దెమీద
అధివసించిన చెరుకుముక్కలు
అలరించును మనస్సుని -
వాటిని చవి చూస్తే
పొలుక చల్ల బడుతుంది
మనస్సు చప్ప బడుతుంది.

ఇంకా ఏవేవో పళ్లు కనిపించును
ధరలకు మాత్రం కళ్లు కనిపించవు!

హేమంతం కాలు కదిపితే చాలు
అమాంతం ఉన్ని గుడ్డల మోపులు
అటక మీదినుంచి దూకాలి కిందికి.
అశ్రద్ధ చేస్తే మాత్రం
విషాద యోగం తప్పదు
అశ్రద్ధ చేయని పక్షంలో
హుషారు కలగక మానదు!

ఆర్థికంగా గడ్డుకాలం కావచ్చు
కుటుంబ యజమానికి,
ఒక్కొక్క సారి వీచవచ్చు
ఎముకలు కొరికే చలిగాలి,
మరొక సారి రాకపోవచ్చు
పంపుల్లో నీళ్లు, గడ్డకట్టి

అయినా
నవ ఢిల్లీ నగర హేమంత సుందరి
గ్రీష్మంలా భద్రకాళి కాదు
సుమకోమల మందస్మిత శాతోదరి.

బాగా ఉన్నవారి కయితే
హేమంతం నిత్యవసంతం.

ఢిల్లీనగర జీవితం
వైవిధ్య విలసితం;
అందుకే ఆ జీవితం
నాకు అభిమాన పాత్రం!

# మరో జన్మ

సాంధ్యశ్రీ

వసంతానికి ముందు
శ్లథశైశిరపలాశ గర్భిణిపడుతున్న పురుటినెప్పులు
సుఖాన్ని ఉపాసించే
ఆద్యవస్థలో ఇంద్రియ బలి....
అనుభవించే మనసుకు
ఆనంద ప్రతి పాదకం

దృశ్యం చూస్తున్న కళ్లకు
చూపుల బలి....
ఊపిరి బిగపట్టి
ఉనికికి ప్రాణప్రతిష్ట చేస్తున్న త్యాగం
ఈ బాధలో బరువుసుఖం
మరోజన్మ....

# అలజడి

శ్రీ గొట్టిపర్తి యాదగిరిరావు

జ్ఞాపకాల తెరమీద
గతస్మృతులు మెరుపుల్లా కదలుతున్నై.
మధురమైన ఆ స్మృతులు
మస్తిష్కం పొరల్ని తడుతుంటే,

గతంలోకి ప్రవేశించిన
ఈ మనసు....,
తిరిగి వర్తమానంలోకి రావాలంటే—
భవిష్యత్తుతో పోరాడాలంటే—
ఏదో తెలియని అలజడి.

శ్రీ రేకళిగెమఠం వీరయ్య

# చెన్నబసవేశ్వరుని జనన వివరములు

చెన్నబసవన్న తన మేనమామ యగు బసవన్నకు అతని రాజకీయములందు "చిక్క దండనాయకుడు"గాను, షట్స్థల విజ్ఞానము తెలుపుటయందు "షట్స్థల చక్రవర్తి"గాను, అనుభావ బోధనలందు "మహా అనుభావి"గాను ప్రసిద్ధిజెంది యుండెను. శివశరణుల ప్రవర్తనలందుగాని, స్వయముగా బసవన్న ప్రవర్తనయందుగాని, తప్పు గనిపించినచో నిశితముగా విమర్శించిన న్యాయనిష్ఠురుడు. సన్నివేశములకు తగిన మార్గములను జూపిన సమ్యక్ జ్ఞాని.

అతని గన్న తండ్రి సింగిరాజు ప్రకారము, శివస్వామి, తల్లి నాగాంబిక (అక్కనాగమ్మ). ఆమె సంసారభ్రాంతి నొదిలిన మహా యోగిని. శివస్వామి సంసారభ్రాంతి నొదలని వ్యామోహ జీవి. వారిరువురి దాంపత్య జీవనమునందు రానురాను పొత్తు కుదరక, వేరుగా నున్నందుననో, శరణుల సంగమమునం దుండనందుననో, అతని పేరు మరుగై జనుల నోళ్లలో మెలగుట మానియుండును. కనుకనే, అతని తర్వాత వచ్చిన కవులు కొందరు తమతమ కావ్యములందు అతనిని పేర్కొనకపోవుట తటస్థించినది.

చెన్నబసవన్న గురించి వ్రాయునపుడు, అతని తండ్రి శివస్వామిని గురించి పరిశోధించు నోపిక లేకనో, చెన్నబసవన్న అసాధారణమగు వ్యక్తిత్వమునకు సరిపోవునటుల, అతడు మానవాతీత వ్యక్తియని తెలుపు నుద్దేశముననో, కొందరు కవులు (అతడు) ప్రసాదమహిమ వలన జనించినాడని వ్రాసిరి. సింగిరాజు మాత్రము ఈ విషయమున కొంత పరిశోధించి, శివస్వామిని గురించిన వివరములను కొన్ని తెలిపి చెన్నబసవన్న, శివస్వామి నాగాంబికల ఔరస పుత్రుండని తెలిపెను. ఐనను, ఈ విషయమునందు ప్రసాదమహిమ కథనమునకే ప్రాముఖ్యత నిచ్చిన కవులే అధిక సంఖ్యయందు గలరు. ఏది యేమైనను, శివస్వామి గురించిన పరిశోధన పూర్తిగా జరుగనందున, చెన్నబసవన్న ప్రసాద మహిమమున జనించిన మానవాతీత వ్యక్తియని కొందరు కవులు భక్తిపారవశ్యమున వర్ణించినందున, చెన్నబసవన్న జననవిషయమొక్క జటిల సమస్యయై మహాయోగిని, అక్కనాగమ్మ విషయమునందు లేనిపోని అపోహలకు కారణమైన దనవచ్చును. ఈ విషయమునందు చారిత్రక పరిశోధకులు ఆసక్తిని జూపకుండుట విచారకరము. మిత్రులు డా॥ చాడాల రామయ్యగారి పరిశోధన, ఈ విషయమునందును కొంత వక్రమార్గమునే అనుసరించినటులు తోచుచున్నది. మధ్య యుగమునాటి పురాణములన్నియు, చెన్నబసవన్న జనన విషయమునందు మహిమలతో నిండియున్నవనియు, వాని వలన వాస్తవిక విషయములు తెలియుటలేదనియు శ్రీరామమూర్తిగారు తమ యభిప్రాయమును వ్యక్తపరచియున్నను, అట్టి మహిమల పరంపరతో నిండియున్న అత్తలూరి పాపకవి తెలుగు చెన్నబసవ పురాణమును అన్నింటికన్న మిన్నయని తలంచి, ఆ పురాణమునందు తెలుపబడిన చెన్నబసవని జననకథనమును నమ్మి, వారు "అక్కనాగమ్మ పరిణయ రహితయై కక్కయ్య ప్రసాదము వలన చెన్నబసవన్నను గన్న"దని తెలిపినాడు.

అత్తలూరు పాపకవి చెప్పినదానిని నమ్ముటకును, సింగిరాజు తెలిపినదానిని నమ్మక పోవుటకును శ్రీ రామయ్యగారు తెలిపిన కారణము లివి —

1. పురాణసాహిత్యమునందు సింగిరాజు తప్ప అందరును చెన్నబసవన్న ప్రసాదమహిమవలన జన్మించెననియే తెలుపుదురు.

2. వచన సాహిత్యమునందును శివస్వామి పేరు తెలుపబడలేదు. బసవన్నకూడ శివస్వామిని యెక్కడను స్మరించలేదు. ఘట్టివాళయ్య తనదొక వచనమునందు చెన్నబసవన్న తల్లిపేరు మాత్రము తెలుపును. తండ్రిపేరు తెలుపడు.

3. సింగిరాజు తర్వాత పదహారవ శతాబ్దమునాటికి కన్నడ కవులు, చెన్నబసవన్న జన్మవృత్తాంతమును మహిమలతో నింపి వేసినారు.

ఈ కారణముల సారాంశము "శివస్వామి ప్రఖ్యాతి చెందక సాహిత్యమునందు అతనిపేరు రాక అనామకుడుగా నున్నందున అతని గురించి వ్రాసిన సింగరాజు వ్రాతలు విశ్వసనీయములుగా"వని తెలియుచున్నది.

ఏదైనా వ్యక్తి కీర్తిని ప్రఖ్యాతిని పొందవలయుననిన, సాహిత్యరచన, సాహిత్యపోషణ, సామాజిక సంస్కరణ, ధార్మిక ప్రబోధనలు ముఖ్యకారణములు. రాజకీయనాయకత్వము కూడ కీర్తికి కారణమగును. ఇవియేవియు లేనివ్యక్తి కీర్తిని పొందలేడు. అంతేగాక ఇద్దరు ప్రఖ్యాత వ్యక్తుల మధ్యవచ్చు వ్యక్తికూడా సాధారణముగా మరుగైపోవును. అందులో ఆ వ్యక్తి ప్రజోపయోగి గాకుండిన ఆ వ్యక్తిని కీర్తికాంత వరించదు. అతని పేరు ఆచూకి తెలియకుండా మరుగైపోవును. ప్రతిరోజు ఎందరో వ్యక్తులు పుట్టుచు చచ్చుచు నున్నారు. వారందరి పేర్లు ఏ కవిని ఏ చారిత్రకుని ఆకర్షించుచున్నవి? కాని కొన్నికొన్ని శతాబ్దముల లోని వ్యక్తులు కొందరే ప్రసిద్ధిచెంది, చరిత్రయందును, సాహిత్యమునందును పేర్కొనబడుచున్నారు. మిగతావారంతా ఏమైనట్లు? పన్నెండవ శతాబ్దియందు, ముఖ్యముగా బసవని కాలమందే లక్షయేబది యారువేల శివగణము లను వ్యక్తులున్నట్లు, బసవన్న ప్రతి నిత్యము వారికి మహామందిరమందు లింగార్చన చేయించుచుండెననునది పురాణప్రసిద్ధము. అందులో సహస్రగణముల పేరులు మాత్రము, సోమనాథుని కృషివలన, మనకు తెలియవచ్చినవి. అందులోను ఎందరిపేర్లో, పురాణసాహిత్యము నందును, వచన సాహిత్యమునందును రాలేదు. కారణమేమి? అట్టివారి పేర్లు ఏమైనట్లు? ఆ వ్యక్తులా కాలమందున్నటులా? లేనటులా? అటులనే శివస్వామిపేరు యే కారణమువలననో, మరుగై తర్వాతవారికి తెలియకపోవచ్చును. పేరే తెలియకున్న ఆ వ్యక్తిని కార్యకర్తలు తమతమ కార్యమునందు ఎట్లుచేర్చుదురు.

ఒక వ్యక్తి కీర్తిని పొందక నలుగురి నోళ్ళలో బడకపోయిన ఆ వ్యక్తి ఉనికినే శంకించుట న్యాయమా? ఇట్టి నిదర్శనములు మనకీనాడును కనపడుచున్నవి. మనప్రధాని శ్రీమతి ఇందిరాగాంధిగారి భర్త కీర్తిశేషులు పేరోజుగాంధిగారు తమ జీవితకాలమునందు సుప్రసిద్ధ పురుషులేఅయి యుండిరి. కాని వారి మామ కీర్తిశేషులు పండిత జవహర్‌లాల్ నెహ్రూగారు మరియు వారిభార్యాపుత్రుల కీర్తి వాని కీర్తికన్నా మించినందున, ఇపుడే వానిపేరు దినదినము మరుగుపడుచున్నది. చరిత్ర తెలియనివారు, కొందరు 'గాంధి' యను శబ్దసామ్యమువలన, శ్రీమతి ఇందిరాగాంధిగారు మహాత్మాగాంధిగారి కుటుంబములకు చెందినవారని తలంచుచున్నట్లు వార్తలు తెలియుచున్నవి.

ఇటులే అక్కనాగమ్మ - చెన్నబసవన్న - బసవన్నల కీర్తి ప్రభావలయమువలన, శివస్వామి పేరు మరుగునపడి యుండవచ్చును. ఆనాటి సామాజిక ధార్మిక, సంస్కరణలకు సమ్మతింపక, అందులో పాలుగొనక, మూల గూర్చుండి యుండినందున అతడు ప్రఖ్యాతిని గడించకపోవచ్చును. అతడు వచనకర్త గానందున వచన సాహిత్యమునందు అతని పేరు రాకపోవచ్చును. అక్కనాగమ్మకు అనుకూలపతి గానందుననో, తన సంస్కరణలకు, ధార్మిక ప్రబోధనలకు అనుకూలముగా లేనందుననో, సంసార భ్రాంతి నొదలని, వ్యామోహజీవియై యున్నందుననో, శివస్వామి పేరును స్మరించు ఆసక్తి బసవన్నకు కలుగకపోవచ్చును. బసవన్న తన వచనము (713) నందు "అన్న, తమ్ముడు కన్నతండ్రి గోత్రమైననేమి?

లింగ సాహిత్యము లేనివారిని నావాడన నయ్యా అని స్పష్టముగా తెలిపినాడు. శివస్వామి తన సంస్కరణములను అంగీకరించి లింగధారణ చేసుకొననందున, బసవన్న అతనిని స్మరించకపోవుట సహేతుకముగానే నున్నది. రామయ్యగారు భావించినటులు అదిబసవని అలక్ష్యమనుటకుగాని, ఆ మనిషి లేడనుటకుగాని సరియైన హేతువుగాదు. మొత్తముపై ఏకారణము వలననో, శివస్వామి ప్రఖ్యాత పురుషుడు కానందున, అతనిని యెవ్వరును స్మరించనందున అతని ఉనికినే శంకించుట, ఆ మనిషే లేడనుట అనుచితము అన్యాయము. ఈ యన్యాయమే లేనిపోని ఊహాగానములకు కారణమైనది. ఈ యపోహములను కాదనుటకు, తర్వాత వచ్చిన కవులు, పండితులు, అసలు విషయము గురించి పరిశోధించి వాస్తవికాంశములను ధృవపరుచుటకుమారుగా, ఒకరిని జూచి మరొకరు "పాడిందేపాట" అన్నట్లు ప్రసాదమహిమ కథనమునే వర్ణించుట మొదలుపెట్టిరి. అందులోకూడ అందరు ఏకాభిప్రాయులుగారు. ఐనను, కక్కయ్య ప్రసాదమే చెన్న బసవన్న జననమునకు కారణమని తర్వాత వచ్చిన కవులు అభిప్రాయపడిరి.

ఏదైనా నొక మహావ్యక్తిని గురించి తెలుపవలయుననిన, ఆ వ్యక్తి ఏదోనొక దేవత అవతారమనియో, లేక నొకానొక ఋషి, ముని శాపపరిహారమునకని మానవజన్మమెత్తిన మహా పురుషుడనియో తెలుపుటకు, వైకుంఠమునో, కైలాసమునో వర్ణించి, అందలి అధిష్టానదేవత, విష్ణువో, శివుడో ఆ వ్యక్తిని భూలోకమునకు పంపెనను, పూర్వగాథను తెలుపుచు, ఆ వ్యక్తి గురించి వ్రాయుట పూర్వమునుండి వచ్చిన హిందూ సంస్కృతి యనునది పురాణ సాహిత్యము వలన తెలియుచున్నది. అందుకు కొందరిని, అయోనిజులుగా తెలుపుట గూడ పూర్వమునుండి

వచ్చిన పరిపాటియే! ఆ యాచారము ననుసరించియే సోమనాథుడు, హరిహరుడు బసవని గురించి వ్రాయ మొదలుపెట్టిరి. ఒకరు నందీశ్వరుని యవతారమనిరి, మరొకరు వృషభుడు శాప పరిహారమునకు భూలోకమున జన్మించె ననిరి. మరికొన్ని ఇతర విషయములందును వారిరువురు ఏకాభిప్రాయులు గారు. ఇటులనే ఇతర కావ్యకర్తలు గూడ తమతమ కావ్య నాయకుల గురించి వ్రాయునప్పుడును, భక్తిపారవశ్యమున వారి మహిమల నుగ్గడింతురు. అంతేగాక, తమతమ సిద్ధాంతముల ననుసరించి, తమతమ మత సాంప్రదాయముల ననుసరించి వ్రాయు ఆచారముకూడ కలదు కనుక, అట్టి కావ్యములందు, పురాణములందు వచింపబడిన మహిమలను విడిచి, ఆయా వ్యక్తుల గురించి తెలుసుకొనుట సముచితము.

స్వయముగా బసవన్ననే స్వర్గము, నరకములనునవి; దేవలోకము, మానవలోకము లనునవి వేరువేరుగా లేవని తెలిపెను. సత్యము నుడువునదే దేవలోకమనియు, అసత్యమాడునదే మానవలోకమనియు, ఆచారమే స్వర్గమనియు, అనాచారమే నరకమనియు గూడ తెలిపెను. అట్టిచో అతని గురించి గాని, అతని కుటుంబ వ్యక్తుల గురించి గాని, శివశరణుల గురించిగాని స్వర్గలోకము దేవలోకము లను కల్పనలను కల్పించి వ్రాయుట ఎంతవరకు సముచితమో ఆలోచింపతగిన విషయము.

అటులనే అతడు (బసవన్న) ఆడ–మగ కలియనిదే సంతాన ప్రాప్తి కాదనునది సృష్టి నియమమనియు, ఈ సృష్టి నియమము ననుసరించియే, తనదొక వచనమునందు, వర్ణవిభేదము లేమనియు, కూడదనియు తెలిపినాడు.

"హొలె గండల్లదె పిండదనెలె గాశ్రయదిల్ల,
జలబిందు నిన వ్యవహార వొందె –
.... .... .... ....
.... .... .... ....
కులవెంబు దక్కాపరు దృష్ట?

"సప్త ధాతు సమం పిండం సమ యోని సముద్భవం
ఆత్మ జీవ సమాయుక్తం, వర్ణానాం కిం ప్రయోజనమ్"
.... .... .... ....
.... .... .... ....
కర్ణ దలి జనిసి దవరుంటే జగదొళ్ ॥ (591)

అని సృష్టి నియమమును వివరముగా దెలిపి మానవు లందరి జననము ఒకేతీరుననుండుననియు, అది ఉచ్చ నీచ తారతమ్యములకు కారణము కాగూడదనియు, ఆ తారతమ్యము సంస్కారముల ననుసరించి యుండవలయుననియు, సంస్కారమును పొందుట కందరికిని అర్హత గలదనియు ఘంటాపథముగ తెలిపియున్నాడు.

"కర్ణ దలి జనిసి దవరుంటె జగదొళ్" అను మాటలో, కుంతీదేవి కన్నెరికము చెడకుండ సూర్యభగవానుని వరప్రభావము వలన కర్ణుడు, ఆమె చెవులోనుండి వచ్చి 'కర్ణుం'డను పేరును పొందినట్లు భారతము నందలి కథ అస్వాభావిక మనియు, సృష్టి నియమమునకు విరుద్ధమనియు గూడ పై వచనమునందు బసవన్న తెలిపినట్లు తెలియుచున్నది. ఈ వచనమును శ్రీ బాడాల రామయ్యగారు

"మైల గాసిదె పిండమున కాశ్రయ ముండదు
జల బిందువుల వ్యవహార మొక్కటియె
... ... ... ... ...
... ... ... ... ...
... ... ... ... ...
చెవినుండి యూడిపడినవారు గలరే భూమిపై"

అని అనువదించి యున్నారు. వారు పై అనువాదమునందు, సంతాన ప్రాప్తికి దాంపత్య జీవనమే కారణమని తెలిపినను, అత్తలూరి పాపకవి తన చెన్నబసవ పురాణములో చెన్నబసవని జనన విషయమును మహిమలతో నింపివేసినాడని వ్రాసియుండియు, ఆ పురాణమును నమ్మి అందలి 103, 104, 106 పద్యములను ఆధారముగా గొని, "నాగాంబిక వివాహము కాకయే కక్కయ్య ప్రసాద సంపర్కముచే చెన్నబసవన్నను కన్న"దని తమ తీర్మానమును తెలుపుటయందు వారు కొంత తొందరపాటు చెందినట్లు నాకు తెలియుచున్నది. "ప్రసాద సంపర్క"మను సమాసమును ఆ సందర్భమునందు వారు ప్రయోగించుట కూడ చిత్రముగా నున్నది. వారు కవిహృదయులు, కవిశ్రేష్ఠులు, ఆధ్యాత్మిక చింతనము గలవారు. వారి కా సమాసపద మెట్లు ఉచితముగా తోచినదో విస్మయముగా నున్నది.

అక్కనాగమ్మ కక్కయ్య ప్రసాదానుభవమువలన చెన్నబసవన్నను గన్నదను సంగతి యెంత అసంగతమో, ఆ విషయమును కొంత వివరముగా వివేచించిన తెలియగలదు. బసవన్న కక్కయ్య ప్రసాదమును పొందుటకు అతని యింటి ముందట పన్నెండు సంవత్సరములు కాపల యుండెనట. అప్పుడు ఒకనాడు కక్కయ్య ఇంటినుండి ఒక చీమ తన నోట నొక మెతుకును బట్టుకొని వచ్చుచుండుట బసవన్న చూచెనట. ఆమెతుకును బసవన్న కక్కయ్య ప్రసాదమని భావించి, ప్రక్కన పడియున్న ఇసుకను కొంత

తన పిడికిలిలో తీసుకొని ఆ చీమ ముందు చల్లెను. ఆ యిసుక చక్కెరగా మారెను. ఆ చీమ చక్కెరను జూచి తన నోటనున్న మెతుకను విడిచి, చక్కెరను దినబోయెను. అంత బసవన్న ఆ మెతుకును (కక్కయ్య ప్రసాదమును) తన చెరుగున కట్టుకొని, తన మహామందిరమునకు గొనిపోయి తన శివార్చన దీర్చుకొని, ఆ ప్రసాదమును భుజింపదలచి దాని యొకచోట నుంచెను. కాని నాగాంబిక, బసవన్న శివార్చనయందుండగా అతనికి తెలుపకనే దానిని భుజించెను. ఆమె గర్భమును దాల్చెను. అనునది పాప కవి పద్యముల సారాంశము.

తర్వాత జరిగిన సన్నివేశములను కూడ శ్రీ బండారు రామయ్యగారు, ఆ పురాణము ననుసరించియే తెలిపినారు. అందలి 139-152 పద్యములను తన తీర్మానమునకు ఆధారముగా తన సమగ్ర సమీక్షయందు ఉటంకించినారు. అక్కనాగమ్మ గర్భము దాల్చుటచే, బసవన్న వ్యసన పడినట్లును, బసవన్న వ్యసనమును చూడలేక, సంగమదేవుడే జంగమరూపమున వచ్చి, అతని వ్యసన మునకు కారణ మడిగినట్లును, బసవన్న తన అక్కవలన తాను 'బలునిందల' పాలుగావలసి వచ్చెనని తెలిపినట్లును; అందుకు ఆ జంగముడు ఇందులో అక్కనాగమ్మ దోషమేమి లేదనియు, పార్వతీదేవి శాప ప్రభావము వలన, ప్రసాద మహిమవలన, ఆమె గర్భము దాల్చెననియు, పన్నెండు సంవత్సరములు నిందల పాలై చివరకు ఆమెకు పుట్టిన బిడ్డవలన, అమె నిర్దోషి యని తెలియుననియు, కొంతకాలము తర్వాత ఆమెకు శివలోక ప్రాప్తి యగుననియు, ఆ జంగముడు తెలిపినట్లు పై పద్యములవలన తెలియుచున్నది.

పాపకవి అంతటితోనే ఆగక, మరికొన్ని సన్నివేశములు తర్వాత జరిగినటుల తన పురాణమునందు తెలిపియున్నాడు. కాని మిత్రులు రామయ్యగారు. తమ సమగ్ర సమీక్షయందు ఆ విషయ ముల నెందుకు తెలుపలేదో తెలియదు. ఆ విషయముల సారాం శము ఇది.

"అక్కనాగమ్మ గర్భమును దాల్చిన వార్త పట్టణము నందంతట ప్రాకును. బిజ్జలునకు తెలియును. అతడు బసవన్నను పిలిపించి, ఆ వార్తల యందలి సత్యమే" మని అడుగును. బస వన్న ఆ విషయమును అక్కనాగమ్మనే విచారించుమనును. బిజ్జ లుడు సభచేసి, అక్కనాగమ్మను పిలిపించి ఆమె గర్భమునకు కారణమడుగును. ప్రజలు ఆమెపై చేయుచున్న అపోహములకు సమాధానమును తెలుపుమనును. ఆమె ఆ విషయమును గర్భ మందలి శిశువునే అడుగుమనును. బిజ్జలుడు గర్భమందలి శిశు వును అడుగును. ఆ శిశువు "నాగమ్మ నిర్దోషి యనియు, తాను కక్కయ్య ప్రసాదమువలన ఆమె గర్భమందు నిలిచితిననియు, శాప ప్రభావమువలన, పన్నెండు వత్సరములు అమెగర్భమందుంటి ననియు, ఇప్పుడు శాపవిమోచనమైనందున, తాను ఆమె కుడి చెవిలో నుండి వచ్చెద" నని, సభికులు విస్మయమొందునటులు ఆమె కుడి చెవులోనుండి వచ్చును. శ్రీ బండాల రామయ్యగారు ఈ వివరములను గూడ నమ్మెదరా? బసవని వచనమును అనుసరిం చుచు, వారు "చెవిలోనుండి యూడిపడిన వారు గలరే భూమిపై" అని వ్రాసినారే! దాని తాత్పర్యమేమి?

పాపకవి తెలిపినట్లు చెన్నబసవన్న పన్నెండు సంవత్సర ములు తల్లి గర్భమునందున్నది అస్వాభావికముగను సృష్టి నియ మమునకు విరుద్ధముగ నుండిన; సోమన తెలిపినట్లు బసవన మూడు సంవత్సరములు తల్లి గర్భమున నుండుట అస్వాభవికము గాదా?" అని కొందరు వాదింపవచ్చును. అస్వాభావికమగు విషయముల నెవ్వరు వ్రాసినను, అవి అసంగతములనియే భావింపనగును. ఐనను, అది అస్వాభావికము గాదనియే అనవచ్చును. మూడు తొమ్మిది నెలలు, అనగా సుమారు మూడు వత్సరముల వరకు గర్భిణిగా నుండి, ప్రసవించినటులు జనవాడుక కలదు. కాని పన్నెండు వత్సరములు వరకు గర్భమును దాల్చియుండుట కని విని యెరుగని సంగతియే యగును.

అక్కనాగమ్మ "పరిణయ రహిత" యని పాపకవి తెలిపిన వివరములను, శ్రీ బండాల రామయ్యగారి అనుమోదమును, కాదను టకు అక్కనాగమ్మగారి ఒక్క వచనము నందలి మొదటి చర ణములోని ఒక్క పదము చాలును. ఆ వచనము శ్రీ రామయ్య గారి దృష్టికి రాకపోవుట విచారకరము. అక్కనాగమ్మ తనదొక వచనమునందు "అయ్యా! నానధవె" యనుచు సంబోధించుకున్నది. 'అధవె' యనగా, పతిని గోల్పోయినదని అర్థమగును. పాపకవి మాటలలో ఆమె "పరిణయరహిత"యే యైనచో, ఆమె 'అధవె', 'విధవె' యెటులగును? ఆలోచింపవలసిన విషయము. ఆమె కన్నడ వచనమును క్రింద వ్రాయుచున్నాను.

> "అయ్యా! నానధవె! అయ్యయ్యా కైయ్య కోలకొంబువరె
> అయ్యా ఎళెగరునిన ఎళెగంతెయ నెళెదొయ్యరే భక్తరు,
> అయ్యో, అయ్యో, ఎనమెయ్యరే బసవణ్ణప్రియ,
> — చెన్నసంగయ్యా! (అ. నా. వచనము 12/171)

> 'అయా నేనధవను (విధవను) నాచేతి కోలను లాగుకొందురా!
> అయ్యా లేదూడ మూపురమును నేలపై గొట్టెదరా భక్తులు!
> అయ్యో! అయ్యో! నన్నెందుకు గొనిపోవదయ్యా" అని

తన అనాథస్థితిని బసవేశ్వరుడు కూడల సంగమ క్షేత్రమునందు ఐక్యమైన తదుపరియో లేక ఉళివి ప్రాంతమందలి రణములలో చెన్నబసవన్న పోయిన తదుపరియో, ఆమె తన దీనస్థితిని తెలుపుచు విలపించినటులు, ఆమె పై వచనమువలన తెలియుచున్నది. అక్కనాగమ్మకు వివాహ మైనట్లు, అంతకన్న బలవత్తరమగు సాక్ష్య మింకేది గావలయునో శ్రీ రామయ్యగారికి? ఆమె 'అధవె', (విధవె) అన్న మాటలుకూడ కల్పితములని అనెదరా వారు? అక్కనాగమ్మ వివాహము కాకుండినచో బలదేవ దండనాయకుడు ఆమె తమ్ముడగు బసవని వివాహమును జేయ నిశ్చయించునా? అక్క వివాహము జరిగిన తదుపరియే తమ్ముని వివాహము చేయుట లోకాచారమని శ్రీ బాడాల రామయ్యగారి ఆలోచనకు రాకపోవచ్చునా? అక్కనాగమ్మ వివాహము మొదలే జరిగినందున, బలదేవుడు బసవని వివాహము గంగాంబికతో చేసియుంతు నను విషయమును వేరుగా చెప్పనక్కరలేకయే తెలుసుకొన దగిన విషయము.

ఏవిధముగా జూచినను, పాపకవి తెలిపినటులు అక్కనాగమ్మ "పరిణయ రహిత" యనుట పొసగదనియే తెలియుచున్నది.

బసవనికి పడిరాని వారలెవరో, శివస్వామి పేరు మరుగున పడియున్నది చూచి, అక్కనాగమ్మ చరిత్రను కళంకితముగా చేయుటకు ద్వేషభూయిష్టమగు వార్తలను సృజించియుందురు. ఆ వార్తలను కాదనుటకు తర్వాత వచ్చిన కవులు, తమ తమ కావ్యములందు ప్రసాదమహిమను వర్ణించుచు వారివారి ఊహలకు తగినట్లు వ్రాసిరేగాని, ఆ మహిమలందు చారిత్రిక సత్యము లేదనియే భావించవలయును. అట్టివారి పాపకవియు గూడ అట్టి కవులలోని వాడే! చెన్నబసవన్న జననము గూర్చి అతని కథనమునందు చారిత్రిక సత్యము లేదనియే దానిని త్యజింపవలయును.

బాడాల రామయ్యగారు పాపకవియందు ఉత్తమ కవితాశక్తి, సమయస్ఫూర్తి, అధ్యాత్మిక లక్ష్యము లేనందుననే, అతడు తన కవితాశక్తిని, కామమోహాములు వృద్ధియగునట్టి, చిత్రికన్య కథను వ్రాసినాడని విమర్శించినారు. అటులనే అతనియందు సమయస్ఫూర్తి, అధ్యాత్మిక లక్ష్యములే గాక సృష్టి నియమ పరిజ్ఞానము, చారిత్రక "వరగల్లు"కూడ లేదని తలంచి, చెన్నబసవన్న జననము గురించి అతడు వ్రాసిన విషయముల నెందుకు త్యజించకూడదు?

బసవన్న కళ్యాణమునకు వచ్చిన తదుపరియే, అతని కీర్తిని ఖ్యాతిని, దాసోహ ప్రసిద్ధిని విని, ఆనాటి శివశరణులందరు దూరదూర ప్రదేశములనుండి కళ్యాణమునకు వచ్చినట్లు తెలియుచున్నది. ఒకవేళ బసవన్న కళ్యాణమునకు చేరక మునుపే కక్కయ్యగా రక్కడ చేరియుండిరని భావించినను, బసవన్న అతని ప్రసాదమును పొందుటకు పన్నెండు సంవత్సరము లక్కడనుండినది, మరియు అక్కనాగమ్మ గర్భంబున చెన్నబసవన్న పన్నెండు సంవత్సరము లున్నది కలిపినచో బసవన్న కళ్యాణమునకు వచ్చిన తర్వాత ౨౪ సంవత్సరములకు చెన్నబసవన్న జనించినటు లగును. అటులైనచోకాని వారిరువురి వయస్సులలో పన్నెండు సంవత్సరముల అంతరము గలదను కాలజ్ఞాన వచన మెట్లు పొసగును. దానిని నమ్మకపోయినను, సొన్నలిపురము నుండి సిద్ధరామశివయోగిని వెంబడించుకొని ప్రభుదేవుడు కళ్యాణమునకు వచ్చి బసవన్న మహామందిరము ముందర నిలిచినప్పుడు ప్రభువు స్వాగతమునకు తాను బోక అప్పన్నను పంపుట సమంజసము గాదని, బసవన్నకు హితము దెల్పునంతటి పరిజ్ఞానము, వయస్సు చెన్నబసవన్నకు వచ్చుట యెట్లు పొసగును. పాపకవి ప్రకారము చూచిన, అప్పటికి చెన్నబసవన్న పుట్టెనో లేదో అను సందేహము కూడ కలుగును. ఇట్టివే అనేక సందర్భములలో పాపకవి కథనము పొసగదు కనుక బసవేశ్వరుడు కళ్యాణమునకు రాకమునుపే చెన్నబసవన్న జనియించియుండె ననునదియే సమంజసముగా నుండును. శ్రీ బాడాల రామయ్యగారు ఈ దిశయందు ఆలోచించినటులు తెలియుచున్నది.

అక్కనాగమ్మ బసవన్నకన్న పెద్దది. అతడు ఉపనయనమును నిరాకరించి, ఇల్లు విడిచినప్పుడు తన సుఖసంతోషములను త్యాగమొనరించి, అతని వెంబడి వుండి తల్లికిమారుతల్లిగా కాపాడిన మహామాత, ఆమే! బసవన్న చెరగుననున్న పదార్థము ఏదైనను, అతనికి తెలుపకనే, అతని కీయకనే, తానే భుజించునంతటి, స్వార్థపరురాలు గాదు ఆమె! ఆమె అట్లు చేసినదనిన అది నమ్మరాని సత్యము. ఆమె అట్టి కొంచెపు గుణము గలది గాదని ఆమె చరిత్ర తెలుపును.

ఈ సందర్భమున శ్రీ రామయ్యగారు తమ సమగ్ర సమీక్ష యందు ఉటంకించిన వచనములను విమర్శించి చూచిన, అవి వారు నిరూపించదలచిన విషయముల కెంతవరకు సంబంధించినవో తెలియగలదు.

1. "ఎవ్వరు లేరంటిరే, కంచిలో వంటకత్తె మాయక్క"

ఈ వచన భాగము (అనువాదము) ను శ్రీ రామయ్యగారు బసవన్న భక్తస్థల వచనములలో (351) వచనమునుండి గ్రహించియున్నారు. ఈ వచనమునందు బసవన్న తన కుటుంబ వ్యక్తులను తెలుపలేదు. అది అతని అలవాటు కాదు. అతడు శివగణముల

యందలి నింబవ్వను తన తల్లిగాను, చెన్నయ్యను తన తండ్రిగాను తెలిపినాడు. అటులే కంచిలోని చెంగళవ్వను తన అక్కయని తెలిపినాడు. తన కొడుకును ముక్కలు ముక్కలుగా నరికి పాయ సముగా వండి హరునకు అర్పించిన పరమభక్తురాలు ఆమె! ఆమె కంచిలో వంటకాయకము చేసి బ్రతికిన వ్యక్తిగాదు. బస వన్న కుటుంబ వ్యక్తి గాదు. అక్కనాగమ్మ కంచిలో ఎన్నడును వంటకత్తెగా పనిచేయలేదు. ఈ వచనమునందు బసవన్న అక్క అని తెలిపినది అక్కనాగమ్మ గాదు. ఆమె సిరియాళుని భార్య చెంగళవ్వ. ఈ వచనముతో అక్కనాగమ్మకు యెట్టి సంబంధము లేదు. శ్రీ రామయ్యగారు ఈ వచనము నెందుకు ఉటంకించినారో తెలియదు.

దాని క్రిందనున్న (852) వచనమునందు బసవన్న:-

"నా కెవ్వరులేరు నా కెవ్వరు లేరందురు?
బాణుని వాడనేను, మయూరివాడ నేను
కక్కయ్య పెద్దయ్య, చిక్కయ్య చిన్నయ్య
ఎత్తి ముద్దాడి పెంచిరి నన్ను."

అని వచించినాడు. ఇందులో ఆతడు తెలిపిన వావివరుసలు లౌకిక సంబంధములనియ్యా రామయ్యగారి ఊహ?

2. "నేను వేశ్య మా యక్క వేశ్య," ఈ వచనభాగము (అనువాదము)ను, బసవని భక్తస్థలవచనములలోని (826) వచనము నుండి, శ్రీ రామయ్యగారు గ్రహించినారు. ఈ వచనము కన్నడ మున నటులున్నది.

"అ మహిళాళు, భోజదేవుళాళు,
అను సూళె, యమ్మక్క సూళె
బెళ్ళిగె యావిన కరువెం, కొడెమళ్ళవాలు కరియువదే
కూడల సంగన శరనావముందె నానుకారిహె బాబిసిలే"

ఈ వచనమును శ్రీ రామయ్యగారు అనువదించినారు. కాని ఆ వచనము యొక్క తాత్పర్యము వివరముగా తెలియుటలేదు. దాని అంతరార్థము వేరుగా నున్నట్లు తెలియుచున్నది. కాకున్న అక్కతో బాటు తాను వేశ్యననుటలో అర్థముండదు. లౌకికముగ ఆ మాట పొసగదు. ఐనను "శరణ సతి-లింగ పతి" యను తత్త్వము ననుస రించి "శరణునకు సతి సంగమ మతిఘోర పాతకము" ని అక్క మహాదేవి తెలిపినట్లు తాను లింగమునకుపత్నిగా నుండియు, గంగాంబిక నీలాంబికలను వివాహమాడుట తప్పనియు అటులే అక్క నాగమ్మ లింగమునకు పత్నియై యుండియు శివస్వామితో పెండ్లియాడుట కూడ తప్పని యెంచి, అతడు అట్లు అనియుండ వచ్చునని నా భావము. ఏదిఎట్లున్నను, ఈ వచన భాగము చెన్న బసవన్న జనన విషయమునకు, సంబంధించినది కాదనియే తెలియు చున్నది. కన్నడ వచనము నందలి "సూళె" యను శబ్దమునకు రామయ్యగారు 'వేశ్య' అని అనువదించియున్నారు. అది సరి గాదని నా అభిప్రాయము. "వేశ్య" అనగా వ్యభిచారమునే వృత్తిగా గలది, అని అర్థమగును. "సూళె" అను శబ్దమునకు "లంజ" అని అర్థమగునని నా భావము. "లంజ" వ్యభిచార వృత్తిచే బ్రిదుకు ఆడది గాదని తెలియును.

3. "మా యక్క మగడ వీవె దేవా!"

ఈ వచన భాగము (అనువాదము) ను శ్రీ రామయ్యగారు బసవని ఐక్యస్థలమందలి (917) వచనము నుండి గ్రహించి యున్నారు. ఆ వచనమునకు -

"భ్రాంతిని వదలి భావము నిలిచినచో,
జ్ఞానము, అజ్ఞానము నీవే దేవా!
ఆడ మగ నీవే దేవా!
మా యక్క మగడవీవే దేవా" అని అనువాదమును వారె

చేసినారు. "భ్రాంతిని వదలి భావమును పరిశుద్ధముగా చేసుకొని నచో పిచ్చి - మంచి, ఆడ - మగ, అంతయు నీవే దేవా" యని, ఆ వచనము నకు తాత్పర్యమగునని నా భావము. అప్పుడు ఆడ మగ యందు భేదముండదు. ఈ భేదము బాహ్యదేహమునకే వుండును, కనుకనే,

"గడ్డము మీసములున్న మగవాడందురు
కచకుచములున్న ఆడది యందురు
మధ్య తిరుగాడు ఆత్మయొక్కటె" అను శరణులతత్త్వము

ననుసరించి; అక్కనాగమ్మ "నేను నీవను" భేదము నొదలి శివజీవానుసంధాన స్థితికి వచ్చినందున, "ఆమె మగడవు (అధి పతివి) నీవే" అని బసవన్న కూడల సంగమదేవుని సంబోధించి నటులు తెలియుచున్నది. ఐనను, ఈ వచనము కూడ చెన్న బసవన్న జననమునకు సంబంధించినది కాదని తెలియుచున్నది.

తత్త్వ జ్ఞానులు కొందరు తాము అనుభవించిన సూక్తు లను మర్మగర్భితముగా తెలుపుదురు.

"కుక్కను దిన్నవాడు గురులింగ జంగంబు
పందిని దిన్నవాడు పరమయోగి,
ఏనుగు దిన్నవాడు ఎంత సుజ్ఞానియో!

అని వేమనయోగి వచించినాడు. దాని సామాన్య అర్థము అశ్లీలము గను, అసహ్యముగను గనుపించును. కాని, 'కుక్క' యనగా, 'క్రోధ' మనియు, 'పంది' యనగా విషయాదులనియు, 'ఏనుగు' యనగా మదమత్సరములనియు, 'తిను'డనగా జయించుటయనియు అర్థము చేసిన, ఆ పద్య మెంత హితబోధకముగ నుండునో తెలియగలదు.

వేమన మరొక పద్యమున

"ఆరు మతములందు । నధికమైన మతము
లింగమతముకన్న । లేదు జగతి
లింగధారి కన్న । దొంగలు లేరయ్యా"

("లింగమతములోన । దొంగలు గలరయా" అని పాఠాంతరము గలదు.)

ఈ పద్యమునందు 'దొంగ' అనగా, దొంగతనము చేయువాడు గాదనియు, లింగాంగ సామరస్యానుభావము గల శివానుభావి యని తెలియవలయును.

4. "ఎన్న భవద బళ్ళియ బేరు హరియ త్తయ్యా
సంగన బసవణ్ణన ఒక్కుర కొండెనాగి ।"

ఈ వచన భాగమును, శ్రీ రామయ్యగారు, అక్కనాగమ్మ (౬) వచనము నుండి గ్రహించియున్నారు. ఈ భాగమునకు వారు మన్మనో వల్లరి మలసె వేళ్ళతో, సంగన బసవన్న ప్రసాదము దుట చేత," అని అనువదించినారు ; ఇది సరిగాదు. కన్నడమూలమందలి ప్రథమ చరణములోని "భవ" మను శబ్దమును వారు 'భావ' మని మార్చి ఉటంకించినారు. అందుచే ఆ వచనము యొక్క భావమే మారిపోయినది. మూలవచనమందలి ప్రథమ చరణమునకు, "భవము యొక్క తీగెవేరు హరించెనయ్యా !" అని అనువాద మగును. అనగా 'చావు పుట్టుకలను భవమాల తెగె' నని అర్థమగును. కాని శ్రీ బొడాల రామయ్యగారు 'భవమును,' 'భావము' గా మార్చి "భావ వల్లరి చక్కగా పాడుకొనె" అని అర్థము చేసె, సంతాన ప్రాప్తి యైనందున, తన "ఆశావల్లరి బలిసిన" దని అక్కనాగమ్మనే అన్నట్లు తెలుపు ప్రయత్నమును జేసినారు. ఈ విపరీతార్థము, వాని అభిప్రాయమును బలపరచినట్లు వారికి తోచినను, మూలవచనమునకు విరుద్ధముగా నున్నది. ఆ వచనము యొక్క కన్నడమూలము నిందు వ్రాయుచున్నాను పాఠకులకు దాని భావము వివరముగా తెలియును.

"ఎన్న భవద బేరు హరియ త్తయ్యా,
సంగన బసవణ్ణన ఒక్కుద కొండెనాగి,
ఎన్న మనదకపట హింగ త్తయ్యా
చెన్నబసవణ్ణన కరుణ షడెదనాగి,
ఎన్ని తరంగద సంశ సంశయ తొలగి త్తెందు
బసవన్న ప్రియచెన్న సంగయ్య వల్ల
ఎన్న పరమగురు అల్ల మా ప్రభుదేవర
శ్రీ చరణవ కండెనాగి"

సంసార భ్రాంతిని వదలి భవబంధనమునుండి విముక్తి అయ్యినానని అన్న, అక్కనాగమ్మకు సంతాన ప్రాప్తి వలన సంసార భ్రాంతి పెరిగినదని అర్థము చేయుట ఎట్లు పొసగునో బొడాల రామయ్యగారికే తెలుసును. పోని, ఒకవేళ్ల రామయ్యగారి మాటను అంగీకరించి భావ" మనే శబ్దమే సరియైన దనుకొనినచో, క్రింది చరణములలో ఆమె తెలిపిన విషయములు మనసులోని కపటము తగ్గెనయ్యా "అనియు" అంతరంగ మందలి సందు సంశయము తొలగెనయ్యా అనియు ఆమె తన మనో నైర్మల్యమును తెలిపినది - ఎట్లు పొసగునో తెలియదు ; కనుక ఆ వచనమునందు "భావ" మను మార్పు సరియైనది గాదు. ఈ వచనము కూడ చెన్నబసవన్న జననమునకు సంబంధించినదిగాదని తెలియుచున్నది. మీదు మిక్కిలి అక్కనాగమ్మ ఈ వచనమునందు చెన్నబసవన్న కరుణను బొందినందున మనస్సు నిర్మలమైనదని తెలిసినది.

5. "నిన్న ఒక్కుర మిక్క శేషవనిక్కి
అగు మాడి నిన్నంతరంగవల్లి అన్యనాగాయి
యంబు గొండడె, ఎన్న మననిమ్మ పాదరల్లి
కరగి కారగిత్తయ్యా సంగన బసవణ్ణా"

అను వచన భాగము చెన్నబసవన్న వచనములనుండి శ్రీ రామయ్యగారు ఉటంకించినారు. పై అక్కనాగమ్మ వచనమునకు విపరీతార్థము చేసినటులే వారు, ఈ వచనమునకును చేసినట్లు

తెలియుచున్నది. ఈ వచనమునందు చెన్నబసవన్న, బసవన్న యందు అతనికి గల భక్తి శ్రద్ధలు తెలిపి అతని ఐక్యమునకు విలపించినటులు తెలియుచున్నది. అతని సంపూర్ణ కన్నడ వచనము ఇట్లున్నది.

"నిన్న ఒక్కుదమిక్క శేషవనిక్కి అగుమాడి
నిన్నంతరంగవల్లి, అవ్వెనాగాయి యింబుగొండడె,
ఎన్నమన నిమ్మసారవల్లి కరగి కొరగిత్తయ్యా।
సంగణ బసవణ్ణా, కూడలసంగయ్యంగె
సుజ్ఞాన వెంబవాహన వాగచేకెందు
నిరవయవాదెయల్లా సంగనా బసవణ్ణా।"

"నీ ప్రసాదము నిచ్చి పరిణామిగా జేసినందున, అమ్మ నాగమ్మ నీ యంతరంగమందు నిండుకొనియే, నా మనస్సు నీ పాదములందు కరిగి కలిసి పోయేనయ్యా। కూడల చెన్నసంగయ్యకు సుజ్ఞానమను వాహన మగుటకు నిరవయవుండవు (శూన్యము) అయ్యితివా। సంగన బసవన్నా" అని ఆ వచనమునకు, తాత్పర్యమగును.

బసవన్న పిండజ్ఞాన స్థలమునందలి తన (3) వ వచనమునందు పరమేశ్వరుడు నిరాకార రూపుడుగా నున్నపుడు తాను సుజ్ఞానమను వాహనమై యుంటినని, తెలిపి, అతనికి పరశివునకు గల అవినా భావసంబంధమును (బసవన్న) తెలిపినాడు. చెన్నబసవన్న కూడ, తన పై వచనమునందు బసవన్నను, సదాశివునకు వాహన మగుటకు నిర్ణయిమైపోతివాయని, అతనిని తలంచి విలపించినట్లు తెలియుచున్నది.

వాస్తవ మిట్లుండగా, బొడాల రా॰య్యగారు తన భావమునకు సరిపోవునటుల అర్థము చేసి, "పై రెండు వచనముల వలన, చెన్నబసవన్న ప్రసాద ప్రభావముతో జన్మించెనని ఊహింపవచ్చు"నని తెలిపిరి కాని, "సత్యమేమో స్పష్టము కాలే"దని తమ అనుమానమును కూడ తెలిపిరి. పై వచనముల కా అర్థమే రాక పోయిన సత్య మెట్లు స్పష్టమగునో? తెలియదు.

సింగరాజు ఇట్టి విషయములను అన్నింటిని గ్రహించి మరుగున పడియున్న శివస్వామి గురించి పరిశోధించి, చెన్నబసవన్న శివస్వామి - అక్కనాగమ్మల ఔరసపుత్రుండని తెలిపి ఆ విషయమందలి అపోహలు నిరాధారములని తెలిపినాడు. అతడు వచన సాహిత్యమును పరిశోదించి బసవనిషత్స్థల వచనములలో లేని అనేక వచనములను వెలుగులోకి తెచ్చినాడు. సింగరాజు పరిశోధన ఫలితముగా, తెలిసిన శివస్వామి ఉనికిని తెలియుటయే ఉచితమనియు, పావకవి వ్రాసినటులు అక్కనాగమ్మ "పరిణయరహిత" కాదని నమ్ముటయే సమంజసమని నా యభిప్రాయము.

సత్యం - శివం - సుందరం



# నేను మానవుణ్ణి

**శిఖామణి**

మానవుణ్ణి నేను
నాగరీకుణ్ణి నేను
నడుస్తూన్న వాణ్ణి నేను

నా భుజానికి సంచి
నా కాళ్లకు చెప్పులు
నా చెప్పులకు రోడ్డు

మానవుణ్ణి నేను
నాగరీకుణ్ణి నేను
నాకెందుకో ఈమధ్య
అనుమానం
పెనుభూతంలా పీడిస్తుంది.
నేను మనిషిని కాదేమోనని

నా కళ్లు, నా ముక్కు
నా చెవులు, నా నోరు
నా చేతులు, నా కాళ్లు
నేను మనిషినే
అని సాక్ష్యం పలుకుతున్నాయి.
అయినా నాకు వాటిమీద
నమ్మకం కుదరటం లేదు.

పరిచయస్తుడు ఎదురు పడితే
సంచిలో నుండి ఒక నవ్వును తీసి
పెదాలకు అతికించు కున్నాను.
ఎదుటి వ్యక్తి హాయిగా నవ్వేశాడు.

పాఠాలు చెప్పిన
పంతులుగారు ఎదురుపడితే
సంచీలో నుండి
రబ్బరు తొడుగులాంటి ఓ నమస్కారాన్ని
చేతులకు తొడుక్కున్నాను.
అయన అభయహస్తం చూపించారు.

నా మీద పనిచేసే, శీతాకాలపు చలిలాంటి
ఓ అధికారి

చూడకుండా ప్రక్కనుండి వెళిపోతున్నా
ఆయన్ని పిలిచి మరీ సంచిలో నుండి
వినయపు ఉన్ని శాలువాను
వొంటినిండా కప్పుకున్నాను.
అయన నిండా సంతోషించాడు.

సంచిలో చెయ్యి పెట్టి చూసుకున్నాను.
ఫర్వాలేదు —
నా భార్యను అనునయించడానికి
నా పిల్లల్ని గారాబం చెయ్యడానికి
ప్రేమ —
యింకా విసుగు, కోపం
అన్నీ సమృద్ధిగానే ఉన్నాయి.
నవ్వు - నమస్కారం
వినయం - అన్నీ నా నుండి తీసి
సంచిలో వేసేశాను.
నన్ను నేనే గుర్తుపట్ట లేక పోతున్నాను.

అద్దంలో నా ముఖం —
ఆకారం మాత్రమే కనపడుతుంది.
అందులో మిగిలిన
అవయవాలేం కనబడ్డంలేదు
అద్దాన్ని నేలకేసి కొట్టాను.
ఎన్ని ముక్కలయిందో
అన్ని ముక్కల్లోనూ
పూర్ణ బిందువుల్లాంటి
నా ముఖబింబాలే

గబగబా
నా సంచీలోని
నా నవ్వు - నా నమస్కారం
నా వినయం - నా ప్రేమ
నా కోపం - అన్నీ
గబగబా తగిలించేసు కున్నాను.

ఇపుడు కొంచెం ధైర్యం చిక్కింది
నేను మనిషినేనని.
మానవుణ్ణి నేను
నాగరీకుణ్ణి నేను.

శ్రీ ఎ. విజయ దత్తాత్రేయశర్మ

# తూర్పు గోదావరి జిల్లా గ్రామ నామములు - ఒక పరిశీలన

"తూర్పు గోదావరి జిల్లా ఆంధ్ర ప్రదేశములో కోస్తా జిల్లాలు లేక సర్కారు జిల్లాలు అనబడు భాగములో చేరియున్నది. ఇది భారతదేశము యొక్క తూర్పు తీరమునందు బంగాళాఖాతము నంటి 16° 30' - 18° 30' తూర్పు అక్షాంశముల మధ్యను, 80° 25' - 82° 35' తూర్పు రేఖాంశ వృత్తముల మధ్యను వ్యాపించి యున్నది. ఈ జిల్లాకు ఉత్తరమున విశాఖపట్టణము జిల్లాయు, ఒరిస్సా, మధ్యప్రదేశ్ రాష్ట్రములును, తూర్పు, దక్షిణములందు బంగాళాఖాతమును, పశ్చిమమున పశ్చిమ గోదావరి జిల్లా, ఖమ్మంమెట్టు జిల్లాలు సరిహద్దులుగా గలవు. జిల్లా కంతకు దక్షిణ పశ్చిమములందు గోదావరి నది సరిహద్దుగా నున్నది."[1]

1975 సం॥ ఆంధ్రప్రదేశ్ స్టాటిస్టికల్ అబ్‌స్ట్రాక్ట్ ననుసరించి ఈ జిల్లాలోని గ్రామముల వివరము ఈ క్రింది విధముగా నున్నవి.[2]

పట్టిక - 1

| క్రమ సంఖ్య | తాలూకా † | గ్రామముల సంఖ్య జనావాసము కలిగినవి | లేనివి | పట్టణముల సంఖ్య | మొత్తం |
|---|---|---|---|---|---|
| 1. | అమలాపురం | 69 | 1 | 2 | 72 |
| 2. | ఆలమూరు | 42 | — | 1 | 43 |
| 3. | కాకినాడ | 101 | 4 | 2 | 107 |
| 4. | ముమ్మడివరం | 36 | — | — | 36 |
| 5. | కొత్తపేట | 54 | — | — | 54 |
| 6. | పెద్దాపురం | 84 | 2 | 1 | 87 |
| 7. | పిఠాపురం | 46 | 3 | 1 | 50 |
| 8. | ప్రత్తిపాడు | 120 | 13 | — | 133 |
| 9. | రాజమండ్రి | 80 | 3 | 3 | 86 |
| 10. | రామచంద్రపురం | 72 | — | 1 | 73 |
| 11. | రంప చోడవరం | 198 | 3 | — | 201 |
| 12. | రాజోలు | 54 | — | 1 | 55 |
| 13. | తుని | 49 | 3 | 1 | 53 |
| 14. | ఎల్లవరం | 338 | 137 | — | 475 |
| | మొత్తం | 1,334 | 169 | 13 | 1,516 |

## ప్రాచీన మధ్యయుగములలో పాలనా విభాగములు ++

5 వ శతాబ్దమువాడైన మాఠరశక్తివర్మ రాగోలు శాసనము[3] కళింగాధిపతి యైన అతని రాజధాని 'పిష్టపుర' మని ప్రకటించుచున్నది. 16 వ శతబ్దమువాడైన తెనాలి రామకృష్ణుని పాండురంగ మహాత్మ్యమునందు 'పీఠికాపురము' కళింగదేశాభరణముగా వర్ణింపబడినది. కావున చారిత్రకముగా తూర్పుగోదావరి మండలము కళింగ దేశాంతర్భాగముగా పరిగణింపదగినది.

## చీకూర విషయము

8వ శతాబ్దము నాటి ఒక సంస్కృత శాసనము[4]లో పేర్కొనబడిన చీకూర (నేటి చీడేపు), పులక (నేటి పలకూరు) గ్రామ సన్నివేశమును బట్టి ఈ విషయము రంపచోడవర తాలూకా ప్రాంతముగా గుర్తింపబడిది.

## అహేఱు పాకవాడు

శ॥ సం॥ 1186 నాటిదగు ఒక సింహాచల శాసనమున[5] అహేఱు పాకనాటిలోవి దని పేర్కొనబడిన 'మండప'మను గ్రామము నేడు ప్రత్తిపాడు తాలూకాలో యున్నది.

## సకట మంతివవాడు

సామర్లకోట సమీపమున గల చాళుక్య భీమవరమున లభించిన శ॥ సం॥ 1036, 1037 నాటివగు శాసనములందు[6] పేర్కొనబడిన గ్రామముల నిర్దేశనమును బట్టి ఆనాడు ఆనాడు నేటి కాకినాడ తాలూకా ప్రాంతములో కొంత భాగమునకు సంబంధించినదిగా గుర్తింపబడినది.

## ప్రోలువాడు/పొత్తపినాడు

సప్త గోదావరీ పరివృతమైన ఈ మండలమున జలము (లేక వరదలు) 'పొర్లు'చుండుటచే దీనికి 'పొర్లు'నాడు అని వ్యవ

హారము కలిగి, అదియే ప్రోలునాడైనదని ఒక వివరణ.[7] ఈ నాడు లోనివిగా పేర్కొనబడిన గ్రామములు పిఠాపురం, తుని, కాకినాడ, పెద్దాపురం తాలూకాలలోనివిగా గుర్తించబడుట జరిగినది.[8] శ.సం. 1024 నాటిదగు వీరచోడుని పిఠాపురం శాసనమునుబట్టి పొత్తపి నాడు ప్రోలునాటిలోని అంతర్భాగముగా గమనించబడినది.[9] శ.సం. 892 నాటిదగు దానార్ణవుని కొండ్యము శాసనమందు గూడ పొత్తపినాడు ప్రశస్తమైనది.

## కులోత్తుంగచోడ మండలము

వేంగి రాజ్యము చోడ రాజ్యములో కలిసిపోయిన పిమ్మట ఈ మండలమును కులోత్తుంగ చోడ మండలములోనిదిగా వ్యవహరింపబడినది.[10] పెద్ద డాకిరేమి (నేటి ద్రాక్షారామం) గంగగొణ్ణ వలనాడు లోనిదిగా చెప్పబడినది.[11] గంగైకొండ చోలవలనాడు కులోత్తుంగచోడ మండలములో నొక అంతర్భాగము.

## గుద్రవారము (గుద్దవాది విషయము)

విష్ణుకుండిన మాధవవర్మ పొలమూరు శాసనములోను,[12] తూర్పు చాళుక్య రాజరాజు కోరుమిల్లి శాసనములోను,[13] మల్ల దేవుని పిఠాపురం శాసనములోను[14] గుద్దవాడి విషయములోనివిగా పేర్కొనబడిన పులుంబూరు (పొలమూరు), కోరుమెల్లి (కోరుమిల్లి), జీడియూరు (జోడూరు) గ్రామములు నేడు రామచంద్రపురం తాలూకాలోనివిగా కానవచ్చుచున్నవి.

## చెంగళి

ముమ్మడి నాయకుని శ్రీరంగ శాసనము[15] (క్రీ. శ. 1368), కోరుకొండ శాసనము[16] (క్రీ. శ. 1363), సింగయ నాయకుని అక్కలపూడి శాసనము[17] (క్రీ. శ. 1388) లలో పేర్కొనబడిన చెంగళియే నేడు తూర్పు గోదావరి మండలములోని చాగల్నాడని వ్యవహరింపబడుచున్నదనియు, నది రాజమండ్రి, పెద్దాపురం తాలూకాలలోని మన్య ప్రాంతమునకు సరిపోవుననియు గుర్తింపబడినది.[18]

## కోన

శ॥ సం॥ 1117 నాటిదగు కోన మల్లపదేవుని పిఠాపురం శాసనమందు కోన మండలమనియు, శ॥ సం॥ 1296 నాటిదగు అనవేమారెడ్డి నడుపూరు శాసనమున[19] కోణస్థలమనియు, శ. సం. 1333 నాటిదగు కాటయ వేముని తొత్తరమూడి శాసనమున[20] కోన దేశమనియు పేర్కొనబడిన ఈ విభాగము శాసనములందు సింధుయుగ్మాంతర దేశమనియు, రెండేరుల (గౌతమి - వశిష్ట) నడిమి విషయమనియు గూడ ప్రస్తావింపబడినది. నేటి అమలాపురం, రాజోలు తాలూకాలు కోనసీమగా వ్యవహృతములు.[21] "కోణ మనగా మూల, అంచు అని అర్థము. ఈ మండలమునకు మూల, అంచున ఉన్న ప్రదేశము" అనియు, "కోణముగా సముద్రము లోనికి చొచ్చుకొని యుండుట వలన ఈ పేరు వచ్చెనని చెప్పుదురు"[23] అనియు 'కోన' శబ్దమునకు వివరణలు గలవు. అవి అలావుండగా ఒక పండిత ఉత్పత్తి కూడా గమనార్హం. "కోనసీమ (అమలాపురం తాలూకా) శబ్దానికి 'కం స్వర్గః ఊనం నికృష్టం యస్యాస్యా కోనాకోనా చాసౌ మాచ కోనసీమిప' అంటారు. ఫలితార్థం ఆ ప్రదేశం స్వర్గం కంటే కూడా రమణీయంగా ఉంటుందని. నిజానికి ఆ ప్రదేశం అట్టిదిగానే ఉంటుంది."[24]

## కడలునాడు

శ॥సం॥1065, 1100 నాటి ద్రాక్షారామ శాసనములలో[25] కడలునాడు లోనివిగా పేర్కొనబడిన గ్రామములు నేడు కాకినాడ తాలూకాలోనివిగా గుర్తింపబడినవి. శ్రీనాథుని భీమేశ్వర పురాణములో ఇది కడలుసీమగా గూడ పేర్కొనబడినది.[26]

## కిమ్మూరుసీమ

ఇంచుమించుగా నేటి పెద్దాపురం తాలూకా ప్రాంతమునకు సరిపోవునదిగా గుర్తించబడినది.[27]

## స్థలములు

సూర్యవంశ గజపతుల పాలనమునందు రాజమహేంద్రవర రాజ్యము లేక దండపాటలోనివైన బోడసకుర్రు, కిమ్మూరు, బిక్కవోలు, కుశకోట, కోరుకొండ, చాగల్నాడు, మొల్లేరు, కాకినాడ స్థలములు ఈ జిల్లాలోనివే.[28] శ॥సం॥1372, 1380 నాటి శాసనములలో[29] బిక్కవోలు స్థలములోనివిగా పేర్కొనబడిన గ్రామములు రామచంద్రాపురం, కాకినాడ తాలూకాలలో గుర్తింపబడినవి. శ॥సం॥1392 నాటిదగు ఒక ద్రాక్షారామ శాసనమున[30] పిఠాపురం స్థలములోనిదిగా పేర్కొనబడిన నడకతూరు గ్రామము నేడు కాకినాడ తాలూకాలో నుండుటను బట్టి ఆ కాలమున పిఠాపురం స్థలము నేటి కాకినాడ తాలూకా ప్రాంత పరివ్యాప్తమైయుండి యుండునని భావింపబడినది.[31]

పట్టిక - 2

| క్రమ సంఖ్య | శాసనములో గ్రామనామము | నేటి గ్రామనామము | తాలూకా | శాసనకాలము శ॥ సం॥ | ప్రమాణము |
|---|---|---|---|---|---|
| 1. | సిల | శీల | కాకినాడ | 1100 | యస్. ఐ. ఐ. IV, నెం. 1291 |
| 2. | మంజేరు | మంజేరు | ,, | 1065 | పైది, నెం. 1361 |
| 3. | అరియపట్టము | అర్యవటము | ,, | 1043 | పైది, నెం. 1364 |
| 4. | సబ్బవరము | సర్పవరము | ,, | 1123 | పైది V, నెం. 15 |
| 5. | పినవేంద్ర | వేంద్ర | ,, | 1380 | పైది, నెం. 49 |
| 6. | నడుకుతారు | నడకుదురు | ,, | 1392 | పైది VI, నెం. 1344 |
| 7. | భీమాపురము | భీమవరము | ,, | 1024 | వీరచోడుని పిఠాపురం శాసనం, ఎం. ఇ. V, పుట 70-74 |
| 8. | పొన్నవాడ | పొన్నాడ | పిఠాపురం | పైది | పైది |
| 9. | మల్లప్రోలు | మల్లవరం | ,, | ,, | ,, |
| 10. | కొల్లిప్రోలు | గొల్లప్రోలు | ,, | ,, | ,, |
| 11. | చేంద్రోలు | చేబ్రోలు | ,, | ,, | ,, |
| 12. | దుర్గవాడ | దుర్గాడ | ,, | ,, | ,, |
| 13. | నవఖండవాడ | నవఖంద్రవాడ | ,, | 1108 | పృథ్వీశ్వరుని పిఠాపురం శాసనం, ఎ. ఇం. IV, పుట 32-54 |
| 14. | నడుపుంబూడి | నడిపూడి | అమలాపురం | 1060 | యస్. ఐ. ఐ. IV, నెం. 1150 |
| 15. | ముక్రోమల | ముక్కామల | ,, | ,, | పైది |
| 16. | ఖండెనపల్లి | గున్నేపల్లి (అగ్రహారం) | ,, | 1153 | పైది, నెం. 1286 |
| 17. | పెద్దడాకిరేమి | ద్రాక్షారామం | రామచంద్రాపురం | 1006 | యస్. ఐ. ఐ. IV, నెం. 1015 |
| 18. | జననాధపురము | జగన్నాయకుల | ,, | 1039 | పైది VI, నెం. 1384 |
| | | పాలెం | | 1072 | ,, ,, ,, 1091 |
| 19. | త్రికక్కవోలు | బిక్కవోలు | ,, | 1372 | పైది V, నెం. 48 |
| 20. | పులుంబూరు | పొలమూరు | ,, | 546 | విష్ణుకుండిన (నాల్గవ) మాధవవర్మ పొలమూరు శాసనం. నేలటూరి వెంకటరమణయ్య "విష్ణుకుండినులు", పుట 19&73 |
| 21. | మయిండివాడి | మహేంద్రవాడ | ,, | ,, | ,, ,, ,, |
| 22. | జోదియూరు | జోడూరు | ,, | 1117 | కోనమల్లిదేవుని పిఠాపురం శాసనం, ఎ. ఇం. IV, నెం. 83 |
| 23. | అలమి | ఆలవిల్లి | తుని | 1024 | వీరచోడుని పిఠాపురం శాసనం, ఎ. ఇం. V, పుట 70-74 |
| 24. | బెండపూడి | బెండపూడి | ,, | ,, | ,, ,, |
| 25. | సింగవిక్రయ | శృంగవృక్షం | ,, | ,, | ,, ,, |
| 26. | దొడ్డంగి | తొండంగి | ,, | ,, | ,, ,, |
| 27. | మణ్డప | మండపం | ప్రత్తిపాడు | 1186 | యస్. ఐ. ఐ. VI, నెం. 692 |
| 28. | గుడివాడ | గుడివాడ | పెద్దాపురం | 1124 | మల్లపదేవుని పిఠాపురం శాసనం, ఎ. ఇం. IV, పుట 70-74 |
| 29. | ఏలవియ | ఏలివెల | రాజోలు | 1060 | యస్. ఐ. ఐ. IV, నెం. 1150 |
| 30. | ముక్తేశ్వరము | ముక్తేశ్వరము | అమలాపురం | 1296 | అనవేమారెడ్డి నడుపురు శాసనము, ఎ. ఇం. III, పుట 286. |

పై పట్టిక ఉదాహరణ పూర్వకముగా ఆయా గ్రామముల పేర్లు కాలగతిన పొందిన మార్పును, కొన్నితావులందు అవి శతాబములు గడిచినను తొల్లింటి పేరును నిలుపుకొనుటను తెలియజేయు చున్నది.

## రాజ వంశముల, పాలకుల ప్రభావము

### తూర్పుచాళుక్య

ఈ వంశములోని ఇమ్మడి విజయాదిత్య (క్రీ. శ. 808-846) సింహవిక్రముడగుటచే 'నరేంద్ర మృగరాజు' అను బిరుదు కలిగియుండెను. అతడు 108 స్థానములందు 108 శివాలయములు కట్టించి వాటికి నరేంద్రేశ్వరాలయములని పేరుంచి వాటికి పోషణాధారములను కల్పించినట్లు తెలుస్తోంది.32 ఈ జిల్లాలోగల నరేంద్రపురం (కొ), నరేంద్రపట్నం (గ్), నామిగిరి నరేంద్ర పట్నం (ప్రి) ఈ చాళుక్యనరేంద్రుని పేర వెలసినవి కావచ్చును.

### బిక్కవోలు (రామ)

బిక్కనవోలు లేక బిరుదాంకనవోలు గ్రామము అపభ్రంశ మొంది బిక్కవోలు అయినది. కాగా తూర్పుచాళుక్యులలో అగ్రగణ్యుడైన గుణగవిజయాదిత్యుని (క్రీ. శ. 849-892) 'బిరుదాంకభీమ' బిరుద సూచికముగా ఈ గ్రామము వెలసినదని భావింపబడినది.33

### రాజమండ్రి

తూర్పుచాళుక్య ప్రభువులలో మొదట అమ్మరాజు (క్రీ. శ. 922-929), రెండవ అమ్మరాజు (945-970), రాజరాజనరేంద్రు (1019-1060) లకు 'రాజమహేంద్ర' బిరుదు గలదు. వీరిలో మొదటి అమ్మరాజు 34 కాని రాజరాజనరేంద్రుడు35 గాని తమ బిరుద సూచికంగా రాజమహేంద్రవర నిర్మాతలని చరిత్రజ్ఞులు భావిస్తున్నారు. రాజమహేంద్రవరమునకు 'రాజమందిర' మని తొలిపేరున్నట్లును36 అంతకు పూర్వం అదియే 'అసనపురము' అని వ్యవహరింపబడినట్లును36 ఈ విధముగా ఈ విషయములపై ఇంకను వాదోపవాదములు కొనసాగుచునే యున్నవి.38 అది అట్లుండగా, ఈ జిల్లాలోని మహేంద్రవాడ (రామ), గ్రామ నామముపై 'రాజమహేంద్రు' లలో నెవరివలననైనా ఆ పేరు తెచ్చుకొని యుండవచ్చునా యనిపించును.

### చోడవరములు (రామ & ఎ & రం)

తూర్పు చాళుక్యులకు దాక్షిణాత్యులైన చోళులకు రాజకీయ వైవాహిక సంబంధముల ఫలితముగా నీ జిల్లా ప్రాంతము చాళుక్య చోళ వెలనాటిచోళుల పరిపాలనమున ప్రభవిల్లినది. ఆ ప్రభావ సూచికముగా చోడవరము గ్రామనామముగా ప్రాచుర్యము వహించినది. శ॥స॥ 1024 నాటిదగు వీరచోడుని పిఠాపుర తామ్రశాసనమును బట్టి అతను నేడు తుని, పిఠాపురము తాలూకాలలోని కొన్నిగ్రామములను కలిపి 'వీరచోడ చతుర్వేది మంగళము' ను పేరిట దానము చేసెనని తెలుస్తోంది.39 ఏరువ వంశమునకు చెందిన అన్నదేవర చోడుడు చోడ బోడసకుర్తి [బోడసుకుర్రు (అ)] మహాస్థలమున (కోనసీమ ప్రాంతం) తన పేరున అన్న చోడవర అగ్రహారమును దానిని దానముచేసెనని తెలియుచున్నది.40 ఈ విధముగా ఈ జిల్లా చోడవరములు ఏర్పడినవని చెప్పవచ్చునేగాని41 ఏవి ఎవరు ఏర్పరిచిరో ఖచ్చితముగా చెప్పుట భావిపరిశోధనముల మూలమునసే సాధ్యము.

### భీమవరములు (రం & ఎ & కా)

పై భీమవరములే కాక భీమవరపుకోట (తు), ములక్కాయల భీమవరము (ఎ) మున్నగునవి గూడ కలవు. భీమనామధేయులు ఈ మండలము నేలిన తూర్పు చాళుక్య, హైహయ, నాగవంశ ఇత్యాది వివిధ రాజ వంశములలో ఒకరి కంటె ఎక్కువగనే వున్నారు. వారిలో కొందరు గ్రామ నిర్మాతలుగా ప్రత్యక్షముగనో, పరోక్షముగనో కానవచ్చుచున్నారు. చాళుక్య భీముడు తన పేర చాళుక్య భీమవరమును నిర్మించాడు.42 నాగ వంశజుడైన భీమరాజు పేర అతని కుమారుడు వల్లభేంద్రుడు ఒక అగ్రహారమును సృష్టించాడు.43 అన్నింటికినీ మించి ఈ మండలమున ప్రధాన దైవతమైన దాక్షారామ భీమేశ్వరుని ప్రభావము కూడా అయా గ్రామములు భీమనామమును ధరించుటకు కారణమై యుండవచ్చును. భీమేశ్వరునికే ఆ పేరు చాళుక్య భీమునిచే ప్రతిష్ఠితుడగుటచే వచ్చినదనియు అభిప్రాయమున్నది.

### మల్లవరములు (రం & రాజ & పి & ప్ర & కా)

పై మల్లవరములే కాక, దొంగల మల్లవరం, మల్లవరప్పాడు, మల్లంపాడు (ఎ), కమతాం మల్లవరం (తు), మల్లం (పిఠా) చిన మల్లాపురం, డి. మల్లాపురం (ప్రి), పెదమల్లాపురం (పి), కె. ఓ. మల్లవరం (తు) ఇత్యాదులుగాగల గ్రామనామములకు ఆద్యులెవరో నిశ్చయించుటయును సులభసాధ్యము కాదు. తూర్పు చాళుక్య, హైహయ వంశజులలోని మల్లనామధేయులే కాక కాకతీయుల కాలమున రాజమహేంద్రవర దుర్గాధ్యక్షునిగా నున్న ఇందులూరి అన్నయమంత్రి మేనమరది పర్వతమల్లు కలడు.44 క్రీ. శ. 1444 ప్రాంతమున విజయనగర ప్రౌఢదేవరాయల ప్రతినిధిగా రాజమహేంద్రవర పాలకునిగా మల్లప్ప ఒడయరు కలడు.45 ఇట్లే సత్యవరం (ప్ర), సత్యవాడ (రామ) మున్నగు గ్రామనామ కారకులు హైహయ వంశజులైన సత్యనామధేయ ప్రభువులు కావచ్చును లేక ఆ గ్రామము తూర్పు చాళుక్య ప్రభువుల సత్యాశ్రయ బిరుదమును బట్టి ఏర్పడివుండవచ్చును.

## పల్లవ

పలివెల (కొ) గ్రామమున కాపేరు ఒకప్పుడా ప్రాంతమును పాలించిన 'పల్లవ' రాజుల మూలమున వచ్చినదనియు, అచ్చట గల ఉమా కొప్పలింగేశ్వరాలయ నిర్మాణశైలి కూడ పల్లవ సాంప్రదాయమును పోలినదనియు అభిప్రాయమున్నది.46

## వాగ వంశము

14 వ శ॥మధ్యభాగమున తొయ్యేటి పాలకుడు ఇమ్మడేంద్రుడు ఇమ్మడివరం (రం), ఇమ్మడివరప్పాడు (అ) ఈతని పేరున వెలసియుండును. ఇమ్మడేంద్రుని సోదరుడు వల్లభేంద్రుడు క్రీ. శ. 1374 లో తనతల్లిదండ్రుల పేర వాల్లంక, దోనేపల్లి అను రెండు గ్రామములను యేకమొనర్చి 'లక్ష్మీ భీమవరాగ్రహారము' ని పేరుంచి దానమొనర్చాడు. దాన గ్రామమునకు ఉత్తరముగా నున్నదని పేర్కొనబడిన ఓంకారపూడి నేడు వంగపూడిగా వ్యవహరింపబడుచున్నదనియు, రాజమండ్రితాలూకా నందివాడగ్రామ సమీపములో గల దోనేపల్లి దిబ్బలే లక్ష్మీభీమవరాగ్రహారమై యుండునని యు విమర్శకులు భావించుచున్నారు.47

## ముసునూరి 48

కాకతీయ రాజ్య పతనానంతరము తీరాంధ్రమును ముస్లిం పాలన నుంచి ఉద్ధరించినవాడు ప్రోలయ. అతని కేంద్రస్థానం గోదావరి మండలం. ఈ మండలములోని పోలవరములు (ము & ప & రం) అతని పేరున వెలసినవిగా ఎంచవచ్చును. ప్రోలయ తలపెట్టిన ఆంధ్ర విమోచనోద్యమమును తెలంగాణమునకు కూడ విస్తరింప జేసినవాడు కాపయ. కాపవరములు (రాజ&రామ&కొ&ప్ర) అతని ప్రభావ జనితములు కావచ్చును. తీరాంధ్రమున కాపయ ప్రతినిధిగా వ్యవహరించిన అనపోతు తొలి రాజధాని తొయ్యేరు49 (రం). పోతవరములు (రం&కొ) అతని పేరున వెలసినవై యుండవచ్చును.

## రెడ్డి

### కోరుకొండ

తీరాంధ్రమున కాపయ నాయకునకు అండదండగా నిలిచిన వారిలో కోరుకొండ పాలకుడైన మంచికొండ కూనయనాయకుడొకనిగా ఎంచబడినాడు. ఈ జిల్లాలోని కూనవరములు (రాజ&అ) అతని వలన రూపెత్తి యుండును. కోరుకొండ పాలకుడైన సింగమ నాయకుని పేరున వెలసినవి సింగవరం (ఎ & రాజ), సింగవరప్పాడు (ఎ). ఈ సింగమనాయకునిచే అక్కలపూడిని శ॥ సం॥ 1290 లో దానముగా పొందిన పరహితాచార్యుడు ఆ గ్రామమునకు ముమ్మడి సింగవరమని నూతన నామకరణ మొనర్చాడు.50 ఈ వంశంలోని ముమ్మడినాయకుడు కోరుకొండను పాలిస్తూండగా, అతని తమ్ముడైన సింగమ నాయకునకు ముమ్మడివీడు కేంద్రస్థానంగా ఉండినది. ముమ్మడి సింగానాయకుని ముఖ్య పట్టణమైన ముమ్మడివీడు నేడు ముమ్మడివరం పేరుతో చెలామణీ అగుచున్నది.

## కొండవీడు / రాజమహేంద్రవరం

"గిరి శబ్దం సంస్కృతం. ఇది పర్వతవాచకమే అయినా గ్రామ వాచకంగా (వేంకటగిరి, కనిగిరి వగైరాలు) కూడా దీనికి కొన్ని ఉదాహరణలు దొరుకుతాయి. ఆ వూళ్ళకు యే కోసెడు దూరంలోనో యేదో రాళ్ళగుట్ట వుండడమూ వుంది. అందుచేత గిరిశబ్దం సార్థకమే అనుకుంటే, యెక్కడో అయిదారామడలలో తప్ప కుక్కని కొట్టడానికైనా రాతిముక్క దొరకని శుద్ధ ఇసుక పట్టులో కొమరగిరి అంటూ వొక వూరు కనపడుతూ వుంది. దీనికి సమర్థనం యేలాగ? అంటే వినండి. రెడ్ల ప్రభుత్వపు రోజుల్లో కట్టించి వుంటారు ఆ యీ గ్రామాన్ని. ఆ ప్రభువుల్లో వొకాయన పేరు కుమారగిరి. దీనికి వికృతి కొమరగిరి. ఆయన పేర కట్టబడిన గ్రామం కావటంచేత చవట పట్టులో గిరి కనబడుతూవుందని సమన్వయించుకుంటే 'న చ శంకా నచోత్తరమ్'.51 "కాటయ వేమునకు కొమరగిరి యందు ఎంత వాత్సల్యము? ఎంత స్వామి భక్తి? కొమరగిరి ఆచంద్రార్క స్థాయిగా ఆంధ్రావనిలో నిలిచి యుండుటకు యెన్ని దానములు చేసినాడు. ఎన్ని కొమరగిరి పురములు వెలయింపజేసినాడు."52 ఈ జిల్లాలో కొమరగిరి (ము&పి), కొమరగిరిపట్నం (అ), కొమరవరం (రం & ఎ) ఆ విధముగా వెలసినవి. రాజమండ్రి రాజ్యాధినేత కాటయవేముని పేర ఏర్పడినది కాటవరము (రాజ). శ॥ 1296 లో అనవేమారెడ్డి కోనసీమ యందలి నడుపూరు అను గ్రామమునకు వేమవరమని పేరుంచి దానం చేసాడు.53

"అప్పటివరకును దేశమును పాలించిన రెడ్డిరాజుల పేర కొన్ని గ్రామములు వెలసినవి. వేమవరము, వీరారెడ్డినాగవరము, అల్లాడరెడ్డి వేమవరము ఈ రీతిగా నెలకొనినవి. ఇందు వేమవరమనునది రెడ్డిరాజ్యస్థాపకుడైన ప్రోలయవేమారెడ్డి పేరునగాని, ఆయన కుమారుడు, సుప్రసిద్ధ దానసూరుడును అగు అనవేమారెడ్డి పేరునగాని స్థాపించబడియుండును... కాటయవేమారెడ్డియు, అల్లాడ

రెడ్డి కుమారుడును, వీరభద్రారెడ్డి అనయునగు మరియొక వేమారెడ్డి కూడ వీరవరేణ్యులును, విజేతలును అయిఉండిరి. వేమవరములు వీరిపేర వెలసిన వెలసియుండ వచ్చును. అల్లాడరెడ్డి కాటయవేముని సేనానియు, వియ్యంకుడును కూడ అయివుండెను. కావుననే ఒక వేమవరము అల్లాడరెడ్డి వేమవరమయినది."[54] ఈ జిల్లాలో వేమవరములు (ము & కా & రా & అ) ఆ రీతిని వెలసినవి.

"వేమవరాగ్రహార శాసనమందు దానమీయబడిన గ్రామపు సరిహద్దులలో 'అనపోత్రిలారెడ్డి కొమరగిరి పురము' అనునది పేర్కొనబడినది. చూడగా ఈ గ్రామము అనపోత్రిలారెడ్డి కుమారుడైన కొమరగిరి పేర అతని సోదరుడైన అనపోతారెడ్డి దానము చేసినట్లు కన్పించుచున్నది. ఈ అనపోత్రిలారెడ్డి కుమారగిరిపురము తూర్పుగోదావరిజిల్లా రామచంద్రాపురం తాలూకా యందలి గ్రామము గావటంచేత అనప్రోలారెడ్డి కుమారుడు పశ్చిమగోదావరి జిల్లాయందే కాక తూర్పుగోదావరిజిల్లాయందు గూడ పరిపాలన చేసినట్లు తెలియుచున్నది.[55]

శ॥సం॥1312 లో కుమారగిరిరెడ్డి తుల్యభాగానదీతీరమున నున్న అనుపఅతి గ్రామమును అన్నవోతపురమని పేరుంచి రాజమహేంద్రవరమందలి గోపీనాథదేవరకు దేవభోగంగా సమర్పించాడు.[56] శ॥క॥ 1317 నాటి కాటయవేముని గోపవర తామ్రశాసనమును బట్టి అతడు గోపవరమని నూతన నామముంచి గోపీనాథదేవరకు సమర్పించిన గ్రామము అసలు పేరు తడుకపేరు అని తెలుస్తోంది.[57] అనవేమారెడ్డి కోరుకొండ రాజ్యమును జయించిన సందర్భమున తన మంత్రి ఇమ్మడేంద్రునికి 'ఇమ్మడిలంక' అను అగ్రహారమును తన పేరున అనవేమపురమని పేరుంచి దానమిచ్చినట్లు తెలియవస్తోంది.[58]

అల్లాడరెడ్డి కుమారుడు దొడ్డారెడ్డి శ॥1358 లో గుంఫిణి అను గ్రామమును అల్లాడరెడ్డి దొడ్డవరముగామార్చి దానమిచ్చాడు.[59] ఈ గ్రామపు సరిహద్దు గ్రామములు అమలాపురం తాలూకాలో నున్నవిగా గుర్తించబడినవి. వీరభద్రారెడ్డి అగ్రజుడు వేమారెడ్డి పినపళ్ళ గ్రామమును అల్లాడవేమభూపవరమని పేరుంచి తనమంత్రికి శ॥ 1346 లో దానమిచ్చాడు.[60] తుల్యభాగాతీరమునందున్న పినమహేంద్రవాడ, వెదురుపాక గ్రామములను ఏకముచేసి తన పేర అల్లాడరెడ్డి వేమవరముగా శ॥1356 దానమిచ్చాడు. వెదురుపాకకు సమీపమున నున్న కొంకుదురు గ్రామమును తన తల్లియైన హేమాంబిక పేర 'వేమసానక్క దొడ్డవరము' గా మార్చి దానమిచ్చాడు.[61] నిశ్శంక కొమ్మన శివలీలావిలాస మను కృతిగొన్న దొడ్డారెడ్డి పేర నీ జిల్లా లోని దొడ్డవరములేర్పడి వుండవచ్చు.

కాకినాడ తాలూకాలోని 'సంపర' గ్రామము శ్రీనాథుడు అక్షయంబగ కస్తూరికా భిక్షాదానము చేయమని కోరిన సాంపరాయని తెలుంగాధీరుని పేరన వెలసినదని కొందరి తలంపు.[62]

[ఇంకా ఉంది]



# డబల్ గేమ్!

"స్త్రీకి
స్వాతంత్ర్యం అవసరం"
బయట
ప్రతిచోటా
గొంతు చించుకుని
అరుస్తుంటాను!

ఇంట్లో
శ్రీమతి దాన్నే ప్రకటిస్తే
"అరుణాచలంలో" దూరి
సన్యాసం పుచ్చుకుంటానని
బెదిరిస్తుంటాను!

# ఆదర్శం!

"దంతక్రూర" దేశం
ఎన్ని కపట వ్యూహాలు
పన్నుతున్నా
వాటిల్లో ఇరుక్కోనకుండా
మెలగుతున్నది గాని
అభిమన్యునిలా చావటం లేదు
నాలుక!

ఎంతటి వెరవరి అది
దాని వైజ్ఞానిక గమనం ముందు
వడిగల తనం ముందు
ఎలాటి ధీరులైననూ
బలాదూరే!

ఈ "దంష్ట్రాకరాళ" దేశం
ఎన్ని మాయా వ్యూహాలు
సృష్టిస్తున్నా
మనం గూడా
అలాగే
పురోగమించటం
నేర్చుకోవాలి మరి!!

శ్రీ కె. కిశోరుబాబు
శ్రీ కె. అశోకుబాబు

## శ్రీ రాపాక ఏకాంబరాచార్యులు

# నవయుగ కవిచక్రవర్తి - జాషువ

'నవయుగ కవిచక్రవర్తి', 'కవి కోకిల', 'కవితా విశారద', 'మధుర శ్రీనాథ', 'విశ్వకవి సమ్రాట్', 'కళాప్రపూర్ణ', 'పద్మభూషణ్'మున్నగు బిరుదములతో నొప్పారి, ఆంధ్రసాహిత్య వియత్తలమున ధృవ తారగా నిలిచిన మహాకవి జాషువ. జాషువ ఆధునిక కాలమున రసవత్తర ఖండకావ్యము లనేకములు రచించి సాహిత్య చరిత్రమున నొక విశిష్ట స్థానమును సంపాదించుకొనెను. అలతి అలతి పదములతో భావోద్రేకమును కలిగించుచు, ద్రాక్ష, కదళీ ఫల పాకముల మధుర సమ్మేళనములతో ప్రసాదగుణ భూయిష్టమై నొప్పారు కవితకు నీరాజనము పట్టిన కవి తల్లజులు జాషువ. క్లేశమునందని భావావిష్కరణ, తేనె సోనలు కురిపించు పదముల సొంపు, శిరీషకుసుమ పేశలమైన లాలిత్యము, వినినంతనే హృదయ స్పందనము గావించు గుణము ఈయన కవితలోని ప్రత్యేక లక్షణములు. ఏ కవి పద్యములు ఆబాలగోపాలమునకు అహ్లాదము కలిగించి, హృదయమును రంజింపజేసి, రస జగత్తున ముంచి ముగ్ధులను జేయునో అట్టి కవి జన్మ సాఫల్యము నందును. అట్టి కవి సాహిత్య జగత్తున కీర్తి కాయముతో శాశ్వతత్వమును పొందును. అట్టి కవులు ఆంధ్ర వాఙ్మయమున నరుదుగా కన్పట్టుదురు. ప్రాచీనులలో పోతన, వేమన, అధునికులలో తిరుపతి వేంకట కవులు, జాషువ అట్టివారు. తన అసమాన ప్రతిభ, కవితా ధారలలో సాహితీ జగత్తును ముంచి, సాహితీ పిపాసువులను రసాంబుధిలో నోలలాడించిన జాషువా కవి 1895 సెప్టెంబరు 25 వ తేదీని లింగమాంబ, వీరయ్య పుణ్యదంపతుల గర్భమున చారిత్రక ప్రసిద్ధమగు వినుకొండ పట్టణమున జన్మించెను. రామ లక్ష్మణులు జటాయువు ద్వారా సీతను రావణుడు అపహరించెనను వార్త విన్న పట్టణ మీ వినుకొండ. ఆ పట్టణమును ఈ విధముగా నక్షర నిబద్ధము చేసినాడు

శ్రీరాముఁ డేకొండ శిఖరానఁ గన్నీట
నాలించె సీతాపహరణ వార్త
దాటించె నేపేటి దాపున నైతమ్మ
పట్టి మేల్పొట్టేలి వాహనంబు
కోట కొమ్మలమీద గుచ్చినా రేపేటి
తెలుగు రాజుల విరోధుల శిరాలు
ముత్యాలతో నారబోసి నా రేపేటి
నృపతు లేపేటఁ బండిన యశస్సు

భాస్కరుని దానధార కే పట్టణంబు
చారుచరితకు బంగారు నీరు వోసె
నట్టి వినుకొండ కడుపునఁ బుట్టుకతన
ధన్యుఁడనుఁ నేన యుత్తమోత్తముడ నేన"

జాషువ వినుకొండ యందు విద్యాభ్యాసం గావించినారు. జూపూడి హనుమచ్ఛాస్త్రిగారు జాషువ ప్రధాన గురువు. శాస్త్రముల యందలి యతి గహనములైన రహస్యములు, మర్మములు, తెలిసికొనవలెనను జిజ్ఞాస, కావ్యపఠనాసక్తి మిక్కుటముగ జాషువకు ఉన్నను అస్పృశ్యత మిక్కుటముగానున్న ఆ రోజులలో ఆయనకు అవసరమైన శాస్త్రములు, కావ్యములు ఎవరు చెప్పుదురు? అస్పృశ్యుడు వేదములు కాని, శాస్త్రములను కాని ముట్టరాదని ఆనాటి సనాతనుల భావము. జాషువ ఎట్లో రాత్రి సమయమునందు ఎవ్వరును కానని ప్రదేశములకు వెళ్ళి అచ్చట శాస్త్రరహస్యములను స్వయం కృషివలన తెలిసికొనగలిగిరి. తుదకు ఉభయభాషా ప్రవీణులైరి. కవి సమాజమున పొందిన వ్యథ నిట్లు వాక్రుచ్చిరి.

"నా కవితా వధూటి వదనంబు నెగాదిగ జూచి, రూపు రే
ఖా కమనీయ వైఖరులు గాంచి 'భళీభళి' యన్నవాడె మీ
దే కులమన్న ప్రశ్న వెలయించి చివాలున లేచిపోవుచో
బాకున గ్రుమ్మినట్లగును పార్థివచంద్రః వచింప సిగ్గగున్"

జాషువ 1920 నుండి 1942 వరకు వినుకొండ స్కూలునందు ఉపాధ్యాయులుగా నుండిరి. కొంతకాలము గుంటూరు లూథరన్ పాఠశాలయందు అధ్యాపకత్వము నెరపిరి. రెండవ ప్రపంచయుద్ధ సమయమున వారు "సౌండ్ అండ్ డ్రామా" విభాగమున "ప్రచారాధికారి" గా పనిచేసిరి. ప్రసిద్ధాంధ్ర పట్టణమైన విజయవాడలో ఈ కవిగారికి 1947 వ సంవత్సరమున ప్రసిద్ధశతావధాని చెళ్లపిళ్ల

వేంకటశాస్త్రిగారి అధ్యక్షతలో గండపెండెర సన్మానము జరిగినది. ఆ తరుణమున శాస్త్రిగారిపై జాషువయల్లిన పద్యములు:

"చెళపిళ సత్కవీశుడు ప్రసిద్ధుడు వీరశతావధాని యాం
ధ్రిల శుభర క్తనాళముల రూపము నెత్తినబ్రాహ్మణుండు నా
పలుకుల రాణి పాదమును బంగరు గగ్గెరతో నలంకృతున్
సలిపె నికేమి కావలె ప్రశస్త కవిత్వ కళా వధూటికిన్"

"తొడిగెం గాలికి చెళ్ళపిళ్ళ కవి మద్దుం గండపెండారమున్
ముడిచెన్ కొప్పున నా కళాసతి యశంబున్ పుష్పగుచ్ఛంబు గా
నడచెన్ గుజ్జుపుదండు నా వెనుక యాంధ్రబెల్ల పొంగారగా
జడ జన్మంబున నే మహాకవుల పూజల్ సల్పి మెప్పించితో"

1956–60 ల మధ్య జాషువ మద్రాసు ఆకాశవాణి కేంద్రంలో తెలుగు స్పోకెన్ వర్డు ప్రొడ్యూసరుగా ఉద్యోగించిరి. 1951 లో ఈ కవికి గుంటూరులో కనకాభిషేకము, గజారోహణ వైభవములు జరిగినవి. రసజ్ఞశేఖరులైన ఏకా అంజనేయులు గారు, ఏకా దండయ్యపంతులుగారు, జాగర్లమూడి కుప్పుస్వామి గారి రసాభిజ్ఞత వలన అనాడు జాషువ పొందని సత్కారము లేదు, సన్మానము లేదు. ఈయన కవితా వధూటి అట్టి సన్మానములు పొందుటలో ఆశ్చర్యమూ లేదు. 1964 నుండి 1971 వరకు జాషువ శాసనమండలి (ఆంధ్రప్రదేశ్) సభ్యులు. "క్రీస్తు చరిత్రము" నకు 1966 లో కేంద్రసాహిత్య అకాడమీ బహుమతి నొసంగినది. ఆంధ్రవిశ్వవిద్యాలయము వారికి 1969 లో "కళా ప్రపూర్ణ" బిరుద ప్రదానము చేసినది. 1970 లో భారత రాష్ట్రపతి వారికి "పద్మభూషణ" బిరుదము నొసగిరి. 'పిరదౌసి', 'గబ్బిలము', 'ముంటాజమహలు', 'క్రీస్తు చరిత్రము', 'నేతాజి', 'బాపూజీ', 'కాందిశీకుడు', 'స్వప్నకథ', 'కొత్తలోకం', 'స్వయంవరము', 'నా కథ', 'ఖండకావ్య సంపుటులు', 'మీరాబాయి', 'తెరచాటు', 'రుక్మిణీ కళ్యాణము', నాగార్జునసాగర్', 'రాష్ట్రపూజ', 'ముసాఫర్లు', 'ధ్రువవిజయము', 'హిమదమార్క పరిణయం', 'చిదానంద ప్రభాతం', 'చిన్నానాయకుడు', 'అనాధ' మున్నగు రచనలు గావించి, అనేక సన్మానములను, బిరుదములను పొంది తుదకు 1971 జూలై 24 వ తేదీన జాషువా కవి తనువు చాలించిరి. ప్రతిమానవుడు కోరుకొను అనాయాసమరణము, అదైన్యజీవనము వారికి లభించాయి. మహాకవి జాషువ యశశ్చంద్రికలకు తావలమైన వారి రచనా విశేషములను ఇచట రేఖామాత్రముగ స్పృశింతును.

జాషువా కవి సుమారు ముప్పది కృతులను సంతరించిరి. ఈ కృతు లన్నియు ఖండ కావ్యములుగ పేరు పొందినవి. ఆధునికాంధ్ర కవిత్వమున ఇన్ని ఖండ కావ్యములను రచించి నేటి మహాకవుల కోవలో చేరి ఒక విశిష్ట వ్యక్తిత్వమును సంతరించుకొన్న ఈ కవిని ఖండకావ్య కవి అని అనినను అనవచ్చును. ఈయన తరువాత వచ్చిన ఖండకావ్య కవులందరికి ఈయనే మార్గ దర్శకులు. జాషువ ప్రతి ఖండకావ్యము ఒక మహాకావ్య మనవచ్చును. ఈయన కావ్యములు పరిమాణమున చిన్నవైనను ప్రమాణమున గుణమున దొడ్డవి. అందలి పద్యములు ఒక్కొక్కటి తేనె సోనలు కురిపించుచు, మధురిమతో భావోద్వేగముతో శబ్దమునకు తగిన అర్థము, అర్థమునకు తగిన శబ్దమును ప్రయోగించుట వలన హృదయ స్పందన గావించుచు పాఠకుల హృదయములపై చెరగని ముద్రవేయును. ఈయన పద్యములం దెచ్చటను శబ్దాడంబరము గోచరించదు. జాషువా కవితయందు కృతకములయిన అలంకారము లెచ్చటను గోచరించవు. అలతి అలతి పదముల నుపయోగించి భావములను సూటిగ హృదయమునకు హత్తుకొనునట్లు చేయును. ఈ కవి దృష్టిలో పడిన ఏ చిన్న వస్తువైనను బంగారము కావలసినదే. ఈయన చేతిలో పరుసవేది విద్య కలదేమో. లేకున్న ఈయన పట్టిన కావ్యమెల్ల బంగారమెట్లు కాగలదు.

జాషువా కవి రచనలు చదువుచున్నంత కాలము మన మనస్సులలో జాలి, దయ, బాధ, ఆవేదన, విషయ ప్రపంచమునందు విముఖత, భౌతిక విషయములందు అల్పత్వము, తాత్విక చింతన మున్నగు భావ పరంపరలు మన హృదయములను ముసురుకొనుచుండును. క్రౌంచ మిథునము లో నొకదానిని బోయవాడు కూల్చినప్పుడు చూచి వాల్మీకి కవి శోకము ను శ్లోకరూపముగ వెలువరించినట్లే జాషువా కవి ఒక విషాద సన్నివేశము ను గాంచినప్పుడు కాని, ఒక నిమ్నజాతివాని ఆవేదనా మూలకమైన కవోష్ణ ధారను చూచి కాని, సమాజములో నొక ప్రముఖ వ్యక్తికి రావలసిన కీర్తిప్రతిష్టలు చేకూరనప్పుడు కాని, మానవునకు తుది శత్రువయిన మృత్యువును తలచి శరీరము జలదరించినపుడు మాత్రమే ఈయన కలమెత్తును, రచన గావించును. సృష్టిలో నీయనకు పిపీలకము నుండి బ్రహ్మ పర్యంతము కావ్య వస్తువులు. ఈయన రచనలో నెచ్చటను వస్తువునకు క్షుద్రత్వము నాపాదించరు. వీరికి అన్ని వస్తువులు సమానములే. ఒక కవికో, ఒక అస్పృశ్యునికో, ఒక శూరునికో కలిగిన అన్యాయమును కథావస్తువుగా తీసికొని కవిత చెప్పి పాఠకుల హృదయములను ద్రవింప జేయును. శిలలైనను ఈయన కవిత్వము విన్న ద్రవింపక మానవు. గాజు కన్నైనను అశ్రుకణము రాల్చక మానదు.

ఈయన ఖండకావ్యములలో ప్రసిద్ధము లైనవి 'పిరదౌసి', 'గబ్బిలము', 'ముంటాజ మహలు', 'క్రీస్తు చరిత్ర', 'నేతాజీ', 'స్వప్నకథ', 'కొత్తలోకము' మున్నగునవి. ఈయన ఖండ కావ్య సంపుటులు పాఠకలోకమునకు సుపరిచితములు. అందు 'శ్మశాన వాటి', 'శిశువు', 'భారతవీరుడు', 'సాలీడు', 'శిల్పి', 'తెలుగుతల్లి' మున్నగునవి ప్రఖ్యాత ఖండికలు. ఈయన 'శ్మశానవాటి' లోని పద్యములను విన్న ప్రతి శ్రోత కన్నులు చెమర్చక మానదు. బలిజేపల్లి లక్ష్మీకాంతంగారి సత్య హరిశ్చంద్ర నాటకమున శ్మశానవాటి పద్యములను కాటికాపరి తప్పక చదివెడివాడని వినికిడి. మచ్చునకు రెండు పద్యములు :

"ఇచ్చోట; నే సత్కవీంద్రుని కమ్మని
 కలము, నిప్పులలోనఁ గఱగిపోయె
యిచ్చోట; నే భూములేలు రాజన్యుని
 యధికార ముద్రిక లంతరించె
యిచ్చోట; నే లేఁత యిల్లాలి నల్లపూ
 సల సౌరు, గంగలోఁ గలసిపోయె
యిచ్చోట; నెట్టి పేరెన్నికం గనుఁగొన్న
 చిత్రలేఖకుని కుంచియ, నశించె
 ఇది పిశాచులతో నిటాలేక్షణుండు
 గజ్జె గదలించి యాడు రంగ స్థలంబు
 ఇది మరణదూత తీక్ష్ణమౌ దృష్టు లొలయ
 నవనిఁ బాలించు భస్మ సింహాసనంబు."

"ఆలోకించిన గుండియల్గరఁగు; నాయా పిల్లగోరీలలో
నే లేబుగ్గల సౌరు రూపఱియెనో! యే ముద్దు నిద్రించెనో!
యే లీలావతి గర్భగోళమున వహ్నిజ్వాల జీవించునో?
యీ లోకంబున వృద్ధిగాఁ దగిన యేయే విద్య లల్లాడునో"

సహజ కవచకుండలములతో నుద్భవించి, దానశీలతయందు 'నహిప్రతి' యనుకీర్తిని సంపాదించి, మహాశూరుడైనను, మహావీరుడైనను భారతమున కర్ణునికి సముచిత స్థానము దక్కలేదని వాపోయిన యీ కవి కర్ణుని ఘనతను కొనియాడుచు వ్రాసిన ఖండికయే "భారత వీరుడు". ఈ ఖండికయందలి పద్యములన్నియు జాతిరత్నములని చెప్పవచ్చును. మచ్చునకు రెండు పద్యములు –

"అంబుజనాభు నంతటి మహాత్ముడు పార్థుని తేరిమీద గుఱ్ఱంబులు దోలుచుండ, సమరం బొనరింపఁ దెగించునే? లలాటాంబకుడైన, నీ తెగువ యబ్బురముం గలిగించు, వీరలోకంబున నీకుఁ జాలిన మగండు జనింపఁడు సూర్యనందనా!"

"నా యరదంబు గ్రుంగిన దనంత; కిరీటి క్షణంబు తాళడో యీ! యిది యుద్ధ ధర్మమని యీవు వచించుచునున్న, నిన్ను న న్యాయముగా వధించిన ధనంజయుడా విజయుండు? నీవు కావా? యకటా! యిదెక్కడి నిరర్థక ధర్మమొ! సూర్యనందనా!

పూర్వాంధ్ర కవులపై జాషువా కవికున్న భక్తి తాత్పర్యములు అప్రతిమానములు. వారిలో ఎవరు చూచినను ఒకరికొకరు తీసిపోని మేటికవులు. అందువలననే యీ కవి

"విజయ విలాసుని వినుతింపఁ దలచిన
 జక్కన్న కోరమీసాలు దువ్వె
జక్కన్న కవనంబు చక్కనిదని పల్కి
 పినవీరకవి నాల్క వ్రేల్ఁబెట్టె
పినవీరకవి పల్కు వెలఁదికి మగఁడన్న
 గండపెండారంబు ఘల్లుమనియె
పెద్దన్న కవితకుఁ బెదతాత యని పల్కి
 రామభూషణుండంబరంబు సూచె
భట్టుమూర్తికి గవిరాజ పట్టమీయ
తిట్టిలింగడు చేపల బుట్ట సూపె
నందఱందఱు మహనీయులని తలంచి
యొకనమస్కార మొనరించి యూరకుంటి."

అని ప్రాచీన కవులందరికీ తన నమస్సుమాంజలు లర్పించినాడు.

ఈయన కావ్యములలో ప్రఖ్యాతములైనవి రెండు. అందు మొదటిది పిరదౌసి, రెండవది గబ్బిలము. 'ఫిరదౌసి' ఒక మహాకవి విషాద గాథ. గబ్బిలము ఒక అస్పృశ్యుని బాధ. పారశీక కవులలో మొనగాడని పేరు వడసిన పిరదౌసి గజనీమామూద సమకాలికుడు. గజనీసుల్తాను తన వంశ చరిత్రమును కావ్యముగా నంతరింపుమని పిరదౌసి కవిని కోరి, ఒక్కొక్క పద్యమునకు ఒక్కొక్క బంగరు నాణెము నిచ్చెదనని వాగ్దానము చేయును. ప్రమాణము చేయును. పిరదౌసి ముప్పది సంవత్సరములు శ్రమించి కావ్యము పూర్తిచేసి సులతాను కీయగా నాయన ఒక్కొక్క వెండినాణెము నిచ్చును. కవి తీసికొనక రాజ్యము వీడి పోవును. పెద్దపెద్ద బొజ్జలు పెంచి సులతానుకు సలహానిచ్చిన పండితుల మూలకముగా నీ కవి కట్టి అవమానము జరిగినది. తరువాత రాజు పశ్చాత్తాపముతో జరిగిన దానికి చింతించి బంగారు నాణెములు ఒంటెలపై కవికి పంపినాడు. కాని ఏమి ప్రయోజనము. ఆనాటికే కవి మృతుడైనాడు. కాని సుల్తాను పిరదౌసి పేరనొక స్మారక చిహ్నమేర్పరచినాడు. అదియే సులతాను కవికి తీర్చిన

ఋణము. ఇది కరుణ రస ప్లావితమైన గాథ. మనలను విషణ్ణ చిత్తులను చేయు కావ్యమిది. ఇందలి ప్రతి పద్యము సాన బట్టిన జాతి రత్నము. ఉదాహరణమునకు కొన్ని పద్యములు:—

గజనీ వంశీయుల చరిత్ర వ్రాయునెడ కవి పడిన శ్రమ -

"ఒక్కొక్క పద్దియంబునకు నొక్కొక్క నెత్తురుబొట్టు మేనిలో
దక్కువగా రచించితి; వృథాశ్రమయయ్యెఁ; గులీనుడైన రా
జిక్కరణిన్ మృషల్వలుకునే? కవితాఋణమీయ కుండునే
నిక్క మెఱుంగనైతి గజనీసులతాను మహమ్మదగ్రణీ!"

సృష్టికర్త ఘనతను గూర్చి కవి యిట్లు వర్ణించినాడు :

"విత్తనంబున మహావృక్షంబు నిమిడించి
సృష్టించి గారడీ సేయు వాఁడ
కడుపులో శిశువును గల్పించి పదినెలల్
మోయించి యూపిరి వోయువాడ
సద్భక్తవరులకు సాక్షాత్కరింపయు
న్నున్నచో తెలియఁగింప కున్నవాడ
పొటమరింపకముందె పుష్పసంతతులకు
వింతగా రంగులు వేయువాడ

చెలువ మొప్పఁ బుడమి సృష్టించి మా కిచ్చి
అనుభవింపుఁ డనుచు నానతిచ్చి
విలువ నీడ లేక నిల్చిన కలవాడ!
కడుపు నిండ నన్నుఁ గన్నవాడ!"

కవి తన వ్యధ నీ క్రింది విధముగా చిత్రించినాడు :

"కృతి యొక బెబ్బులింబలె శరీర పటుత్వము నాహరింప శే
షితమగు నస్థిపంజరము జీవలవంబున నూఁగులాడఁగా
బ్రతికియుఁ జచ్చియున్న ముదివగ్గు మహమ్మదుగారి ఖడ్గ దే
వతకు రుచించునా? పరిభవ వ్యధయింతట నంతరించునా?"

"ముత్యముల కిక్కయైన సముద్రమునను
బెక్కు మాఱులు మున్కలు వేసినాఁడ
భాగ్య హీనుఁడ ముత్యంబు పడయనైతి!
వనధి నను మ్రింగ నోరు విచ్చినది తుదకు."

ఈ కవి రచనలలో 'గబ్బిలము' పేరు మోసిన కావ్యము. కాళిదాసుని మేఘ సందేశము వలె గబ్బిల మొక సందేశ కావ్యము. మేఘ సందేశమున విరహుడైన ఒక యక్షుని సందేశమును మేఘుని ద్వారా యక్షుని భార్యకు మోసుకొని పోగా, గబ్బిలమున నొక అస్పృశ్యుని యావేదనను గబ్బిలము ద్వారా పంపును. ఇందలి పద్యములు హృదయమును ద్రవింప జేయును. కరుణరసప్రధానమైనదీ గాథ. సమాజములోని ఆచారములను, సంప్రదాయములను సున్నితమైన హాస్యముతో నీ కవి ఎత్తిపొడుచును. ఈ పద్యము చూడుడు

"ప్రతిమల పెండ్లి సేయుటకు వందలు వేలు వ్యయించుగాని దుః
ఖిత మతులైన పేదల పకీరుల శూన్యములైన పాత్రలన్
మెతుకు విదల్ప దీ భరత మేదిని ముప్పది మూడు కోట్ల దే
వత లెగవడ్డ దేశమున భాగ్యవిహీనుల క్షుత్తు లాఱునే"

"పరమార్థంబులు బోధసేయుదురు లోభస్వాంతులై సత్యమున్
గురువుల్ ముక్కుకు సూటిగాఁదగులు యుక్తుల్ పన్ని కైవల్యపుం
దెరువుల్ సూపి మహాపరాధి వనుచున్ దీర్మానముల్ సేయుచుం
దురు వేదాంత రథంబు సాగ దనుకొందున్ నేను లేకుండినన్"

ఈ కవి యీ కావ్యమున ప్రాచీన సంస్కృతికి, చరిత్రకు నీరాజనము పట్టినాడు. గబ్బిలమును ఆ యా ప్రదేశములను సందర్శింపుమని చెప్పుచు నెల్లూరిని దర్శింప మనును. కారణ మేమియో తెలియునా! —

"యతియుం బ్రాసయులేని సంస్కృత కవిత్వారణ్యమందున్న భారత వేదానఁ బదేను పర్వముల కాంధ్రత్వంబు నేర్పించి శా
శ్వతుడై పోయిన తిక్కయజ్వకు నివాసంబైన నెల్లూరికిన్
నతులర్పింపుము స్నానమాడు మతిగణ్యంబైన పెన్నానదిన్."

జాషువ కృతులలో రసవత్తర ఖండ కావ్యము "ముంటాజ మహలు." ప్రపంచము నందలి అద్భుత కట్టడములలో ఒకటిగా పేర్కొనబడు "టాజ మహల్" నిర్మాణమును షాజహాన్ తన ఆత్మసమానమగు భార్య స్మారక చిహ్నముగా రూపొందించినాడు. ఇందు మరణశయ్యపై నున్న ముంతాజ్ బేగమ్ భర్తకు గావించిన తాత్త్వికోపదేశము అపూర్వము. ఉదాహరణమునకు కొన్ని పద్యములు :

"ఈ సుఖ దుఃఖ మిశ్రమ మహీవలయంబను సత్రశాలలో
నీ సతినై ముగించితిని నేటికి నాదు ప్రవాసయాత్ర యో
ధీరముపేత! యిట్టి పరదేశము వెల్గ తిరంబు గాదు క్ష్మా
వాస కథా విశేషములు స్వాప్నికముల్ జపలా విలాసముల.

ఈ తనువుండు నంతవఱ కింతయు నెమ్మదిలేదు ప్రాణి కీ
ఘాతలమందుఁ గష్టసుఖముల్ జెలికత్తియలై భజింప నా
నా తరళాక్షి తాండవము సల్పుచు నుండును మృత్యుదేవతా
మూర్తి వినోదరంగమిది తోరపు సంపదలెల్లఁ బాచికల్.

అవిరి యోడలో జలధి యాన మొనరెండు బాటసారులో
భూవర రేవులందు దిగి పోయెద రించుక వెన్కముందుగా
నీ వసుధా పణంబు పనియెల్ల ముగించి స్వదేశగాములై
పోవుచు వచ్చుచుంద్రు సతముల్ బ్రజలీ నరజన్మ వర్తకుల్.

భూరి పరాక్రమోన్నతుల పుచ్చిన మేటి కపాల పాత్రలన్
నీరము ద్రావుచున్నవి వనీ వన భూములలోని సింహముల్
వారల యస్థిపంజరముల న్నివసించుచు పూర్ణ నాభముల్
దారము తీసె నింతియ కదా! భువి నాల్గు చెరంగు లేలినన్.

ఏ పుష్పంబును జేసి వాడుకొనునో ఈ దేహమున్ దైవమో
భూపశ్రేష్ఠ! విచారమందకుము మామూలేకదా ఈ మృతి
వ్యాపారంబు సమస్త జీవులకు విశ్వవ్యాప్తి గర్భంబునన్
మాపుల్ రేవులు నెందతో యిముడుచున్నారందు నేనొక్కటెన్."

ఆమె మరణించిన పిదప పాదుషా ఉన్మత్తుని వలె తిరుగా ...మా తుదకాయన కూడ దేహమును చాలించినాడు. ఈ కావ్యము ...ందలి తుది పద్యము అశ్రులక్షలు చేయును. ఈ పద్యమున కవి ...ోక సహజమయిన సాధారణ తత్త్వమును చెప్పును. కాని ఈ ...ద్యము పాఠకుని హృదయమును పట్టి విడువదు.

"రాణి విడిచిపోయె రాజు నొంటరిఁజేసి
రాజు విడిచిపోయె రాజ్యరమను
రాజ్యరమయు విడిచె రాజులఁ బెక్కండ్రి
తాజి విడువలేదు రాజసంబు."

ఈ రీతిగా జాషువ 'నేతాజి' 'స్వప్నకథ' 'కాందిశీకుడు' 'స్వయంవరము' మున్నగు రసవత్తర కృతులెన్నియో సంతరించినారు. వీరి చివరి కాలంలో వ్రాసిన ప్రఖ్యాత రచనలు 'క్రీస్తు చరిత్రము', 'కొత్తలోకము'. క్రీస్తుచరిత్ర మాయనకు మంచి కీర్తిని గడించి పెట్టినది. భారత ప్రభుత్వము కూడ దీనిని గుర్తించినది. తత్ఫలితమే వారికి ఐదువేల రూప్యముల నగదు బహుమానము. 'పద్మభూషణ' బిరుదప్రదానము. కవి ఊహాగానములో లోకము ఉండవలసిన తీరు "కొత్తలోకము" రూపములో అక్షర రూపము దాల్చినది.

ఇట్టి మహత్తర సాహిత్య సేవగావించి యావదాంధ్రుల మన్ననలను పొందినను, కొంతమంది అసూయాగ్రస్తుల విమర్శలకు గురికాకుండా ఉండలేకపోయారు జాషువ కాని ఆత్మ విశ్వాసం కోల్పోలేదు. విమర్శకుల నీ పద్యంలో ఎదురుదెబ్బ తీశారు.

"గవ్వకు సాటిరాని పలుగాకుల మూకలసూయ చేత న
న్నెవ్విధి దూరినన్ నను వరించిన శారద లేచిపోవునే
యివ్వసుధా స్థలిం బొడమరే రసలుబ్ధులు ఘంటమూనెదన్
రవ్వలు రాల్చెదన్ గరగరల్ పచరించెద నాంధ్రవాణికిన్"

జాషువ తన పద్యాలలో నెక్కువగ సాధారణమగు పదములు, సామాన్యమానవుడు కూడ అర్థం చేసుకొన గలిగిన మాటలు, తరచు వాడుకలో కనిపించు మాటలు, ఎక్కువగా ఉపయోగించిరి. అంతే కాకుండ, అన్యదేశ్యాలు అందున ప్రఖ్యాతముగా పారశీక పదాలు, ఉర్దూ పదాలు తమ కవితలో వాడి పద్యాలకు క్రొత్త మెరుపును కలిగింపజేశారు. సర్వకాలమునకు పనికి వచ్చు పద్యములు, సార్వకాలీన సత్యాలను నిబిడీకృతంచేసి పద్యాలు చెప్పారు. వారు నవ్వులపై చెప్పిన పద్యం ఈ కోవకు చెందినదే.

"నవ్వవు జంతువుల్, నరుడు నవ్వును, నవ్వులు చిత్తవృత్తికిన్
దివ్వెలు, కొన్ని నవ్వులెటు తేలవు, కొన్ని విషప్రయుక్తముల్
పువ్వులవోలె ప్రేమరసమున్ వెలిగ్రక్కు విశుద్ధమైన లే
నవ్వులు సర్వదుఃఖదమనంబులు వ్యాధులకున్ మహౌషధుల్"

జాషువ కవి వ్రాసిన ప్రతి కావ్యము ఒక మహాకావ్యము నచెప్పవచ్చును. ఈ కవి కావ్యములందు రసోచితమైన పద్యములు కోకొల్లలుగా నున్నవి. ఈ కవి పద్యములను తరచు మనము ఉదాహరింతుము. అనగా మనము వానిని ప్రమాణముగా స్వీకరింతుము. దీనికి కారణమాకవి సార్వకాలిక సత్యముల నెన్నిటినో తన రచనలయందు నిక్షిప్తము చేసినాడు. పాఠకులలో శ్రోతలలో సహృదయత ఉన్నంతకాలము, కావ్యపరిశీలనానురక్తి, సాహిత్యానురక్తి, కావ్యగత రసాస్వాదనాశక్తి, ఉన్నంతకాలము జాషువ అజరామరుడు. ఆయన మూర్తి, కీర్తి కాయంతో నిత్యమూ ఆంధ్రసాహిత్య రసిక జనహృదయ పీఠములపై నదివసించియే యుండును. జాషువ వంటి మహాకవి మరల ఆంధ్రదేశమున ఉద్భవించుట అసంభవము. ఉద్భవించిన ఆంధ్రుల యదృష్టమని చెప్పవచ్చును. వారికివే నా హృదయాంజలులు.

"జయంతితే సు కృతినో రససిద్ధాః కవీశ్వరాః"

# విషాదం

## శ్రీ తిరునగరి

నడుస్తున్న చరిత్రనీ
గడుస్తున్న కాలాన్నీ
చూస్తూంటే
హృదయం నీరై పారుతుంది
జీవితం విషాదగీతంగా పలుకుతుంది

ఇన్నాళ్ళూ చీకట్లను తొలగించేందుకు
దీపాలు వెలిగించారు మహాత్ములు
ఈనాడో వెలుగుల్ని ఆర్పేసేందుకు
ఎన్నెన్ని కుట్రలూ-కుతంత్రాలూ
రాజకీయాలూ

ఎన్ని జీవితాలు ధారవోస్తే
ఇన్నాళ్ళకి మనం ఈ విజ్ఞాన శిఖరాల్ని
అధిరోహించాం

యుగాల నుంచీ ఇంతకృషి జరిగిందెందుకు ?
మనుషుల్ని మనుషులు హననం చేసుకునేందుకా ?
దేశం మరో దేశాన్ని భస్మీపటలం కావించేందుకా ?
ప్రపంచమంతా భయంకర వధ్యవాటిగా మారేందుకా ?

నాగరకత ముసుగులో
ఎంత అనాగరకత !
సభ్యత వెనువెనుక
ఎంత అసభ్యత !
నవ మానవుని హృదయం
ప్రపంచమంత విశాలం
అన్న మాట ఎంత నిజం ?

నవోదయం కోసం నేటి నరుడు
నడుముకట్టాడని విశ్వకవులు రాస్తే
నిజం కాబోలు అనుకున్నాను
కానీ
నిజం కాదని నేడు తెలుసుకున్నాను

ఈవేళ భూగోళంలో ఎక్కడో
యుద్ధజ్వాలలు
ఆ జ్వాలల్లో కాలిమసైపోతున్న మానవాళి
ఉవ్వెత్తుగా లేస్తోన్న ప్రేతధూమాన్ని కని
విరగబడి నవ్వుతున్న సామ్రాజ్యాధినేతలు

సముద్ర గర్భాల్లో అణుపరీక్షలు
సమరాలకు శంఖారావాలు
ఈ మానవాళి నిర్మించుకున్న
నాగరకతా సౌధం
దుష్పరిణామాల తాకిడికి
దభీలున కూల వలసిందేనా ?

పటుకరాళ యుద్ధాలకు బలియౌతున్న దుఃఖితుల
రక్తాలతో ఈ నేల తడిసి పోతున్నది

నడుస్తున్న చరిత్రనీ
గడుస్తున్న కాలాన్నీ
చూస్తూంటే
హృదయం నీరై పారుతుంది
జీవితం విషాదగీతంగా పలుకుతుంది.

# శ్రీ ఎన్. టి. రామారావుగారి చైతన్యవంతమైన నాయకత్వంలో సామాజిక న్యాయం, ఆర్థికాభ్యుదయం దిశగా ఆంధ్రప్రదేశ్‌లో ఒక సరికొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టడం జరిగింది !

శ్రీ ఎన్. టి. రామారావుగారి సారథ్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పాలనా నిర్వహణ బాధ్యతల్ని స్వీకరించి, ప్రాధాన్యతాక్రమాన్నిబట్టి ప్రణాళికా కార్యక్రమాల్ని తిరిగి రూపొందించే కృషిలో నిమగ్నమైంది. బలహీనవర్గాల సంక్షేమ కార్యక్రమాలకు నేడు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం యిస్తున్నది. ప్రజాభ్యుదయ పథంలో ఒక కొత్త శకానికి అంకురార్పణ జరిగింది. సాహసోపేతమైన, క్రియాశీలకమైన కార్యక్రమాల నెన్నిటినో ప్రభుత్వం చేపట్టి అమలుపరుస్తున్నది. కొత్త ప్రభుత్వం సాధించిన విజయాలు. .... యివిగో. ......

## కిలో 2 రూ. లకు బియ్యం

ప్రజల ముఖ్యాహారమైన బియ్యాన్ని 6 వేల రూ.ల వార్షికాదాయంమించనివారందరికీ కిలో 2 రూ.లకే ప్రభుత్వంసరఫరాచేస్తున్నది.

## గ్రామాలకు మంచినీరు

వందమంది జనాభాకు కనీసం ఒక్క మంచినీటి వనరునైనా కల్పించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నది. ఇంతవరకు 2086 గ్రామాలకు మంచినీటి సౌకర్యాన్ని కల్పించింది.

## బలహీనవర్గాల ఇళ్ల నిర్మాణం

ఈ వర్తమాన సంవత్సరంలో ప్రతి జిల్లాలో 10,000 శాశ్వత గృహాల్ని నిర్మించాలని, 2 లక్షల కుటుంబాలకు ఇళ్ల స్థలాలను పంపిణీ చేయాలని ప్రభుత్వం ఉద్దేశించింది. ఇప్పటివరకు 28, 192 కుటుంబాలవారికి ఇళ్ళ నిర్మాణానికి ఆర్థిక సహాయం అందించడం జరిగింది. 1.39 లక్షల బలహీన వర్గాల కుటుంబాల వారికి ఇళ్ల స్థలాలు పంపిణీ అయ్యాయి.

## ఆర్థిక సహాయ కార్యక్రమాలు

ఈ కార్యక్రమాల క్రింద 1.17 లక్షల షెడ్యూలు కులాల కుటుంబాలకు, 0.19 లక్షల షెడ్యూలు జాతుల కుటుంబాలకు మార్జిన్ మనీ పంపిణీ చేశారు.

## మహిళా, శిశు సంక్షేమం

ఆర్థిక సహాయ పథకాలు, ప్రసూతి, గర్భిణీస్త్రీలకు పౌష్టికాహార కార్యక్రమాలు, ప్రతి జిల్లా ప్రధాన కార్యస్థానాల్లోనూ ఉద్యోగ మహిళావసతి గృహాలు, తిరుపతిలో మహిళా విశ్వ విద్యాలయం, ఆస్తిలో స్త్రీలకు సమాన హక్కు కల్పించేందుకు హిందూవారసత్వ చట్టాన్ని సవరించే ప్రయత్నాలు— యివి మహిళలకు సమాజంలో సముచితమైన స్థానాన్ని కల్పించడానికి ప్రభుత్వం తీసుకున్న అభ్యుదయకర చర్యలలో కొన్ని.

## నిరక్షరాస్యతా నిర్మూలన

6 – 11 సం.ల మధ్య వయస్కులైన సుమారు 40 లక్షల బాలబాలికల్లో శారీరక, మానసిక వికాసానికి వీలుగా రూ. 50 కోట్ల ఖర్చుతో కూడిన మధ్యాహ్న ఆహార పథకాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టింది. 40 రెసిడెన్షియల్ పాఠశాలలను ప్రారంభించడం, జాతీయ గ్రామీణ ఉపాధికల్పనా కార్యక్రమం క్రింద పాఠశాల భవనాల నిర్మాణానికి అధిక ప్రాధాన్యం యివ్వడం, విద్యాలయాల్లో కేపిటేషన్ ఫీజు రద్దుచేయడం, సార్వత్రిక విశ్వవిద్యాలయాన్ని ప్రారంభించడం, తెలుగు విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటుచేయాలని నిర్ణయించడం— యివి ప్రభుత్వం తీసుకున్న మరికొన్ని అభ్యుదయకరమైన చర్యలు.

## గ్రామీణాభివృద్ధి

పాడిపశువులు, దున్నలు, గొర్రెలు, పంపుసెట్లు మొదలైనవాటిని గ్రామీణులకు సరఫరాచేసి, వారి ఆర్థిక పరిస్థితుల్ని మెరుగుపరచడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నది. 1.24 లక్షల షెడ్యూలు కులాలకు, 0.14 లక్షల షెడ్యూలు జాతులకు చెందినవారితో సహా మొత్తం 1.43 లక్షల గ్రామీణ కుటుంబాలకు యీవిధమైన ప్రయోజనాన్ని ప్రభుత్వం కల్పించింది.

## భారీ సేద్యపునీటి ప్రాజెక్టులు

ప్రాణాధారమైన జీవనదుల జలాలను అడ్డగించి, బంజరు భూములను సాగులోకి తేవడం జరుగుతున్నది. మద్రాసు నగర పౌరుల దప్పిక తీర్చడానికి తరలించే కృష్ణాజలాలతో రాయలసీమ ప్రజల జీవితాల్లో కొత్త శకానికి నాందిపలికే ప్రయత్నమే తెలుగుగంగ పథకం. కాకతీయులనాటి తెలంగాణా ప్రాంతపు సిరిసంపదలను తిరిగి ప్రతిష్ఠించడానికి శ్రీరాంసాగర్ ప్రాజెక్టు రెండవదశ దోహదం చేయగలదు. శ్రీశైలం ఎడమగట్టు కాలువ రాయలసీమ, తెలంగాణా ప్రాంతపు రైతుల జీవితాల్లో కొత్త ఆశల్ని చిగురింపచేయగలదు.

DIPR No. 19927/Advt./C4/83

డైరెక్టరు, సమాచార, పౌరసంబంధ శాఖ, హైదరాబాదు.


శ్రీ నాగాభట్ల మార్కండేయ శర్మ

# రెండు అప్పికొండ శిలాశాసనములు

విశాఖపట్నానికి 30 కి. మీ. దూరంలో ఉన్న అప్పికొండ గ్రామములో గల సోమేశ్వరాలయ ముఖ మండప స్తంభాలపై రెండు శాసనములు గలవు. అవి తొలుత కేంద్ర ప్రభుత్వ శాసన శాఖవారిచే 1941-42 వార్షిక నివేదికలో ఒకటి, రెండు నెంబరులుగా నమోదు చేయబడినవి[1] కాని శాసన పాఠములు ప్రచురించబడలేదు. మొదటి శాసనము క్రీ. శ. 12వ శతాబ్దమునకు చెందిన పశ్చిమ చాళుక్య మూడవ సోమేశ్వరుని కాలము నాటిది. ఇది అసంపూర్ణ శాసనము. రెండవ శాసనము క్రీ. శ. 14వ శతాబ్దమునకు చెందిన ఎలమంచిలి ప్రభువైన మూడవ ఉపేంద్రుని కాలము నాటిది.

## మొదటి శాసన సారాంశము

శక సంవత్సరము 1053 (క్రీ. శ. 1131) చాళుక్య విక్రమ సంవత్సరము 55, సాధారణ సంవత్సరము, ఫాల్గుణ, బహుళ ఏకాదశీ పుణ్యకాలాన పశ్చిమ చాళుక్య ప్రధాని మాచమయ్య మరియు సైన్యాధిపతి మార్తాండయ్య నాయకుడూ దంతి వారము లోపల వెలసియున్న సోమేశ్వర దేవరకు 'అప్పికొండ' గ్రామ



అప్పికొండ సోమేశ్వరాలయ శిఖరము

మును దేవ భోగము నిమిత్తమై పునరుద్ధరించారు. మాచమయ్య నాయకుడు మహాప్రధాని దండనాయకుడైన అన్నరాజు యొక్క ప్రధాని అనియు, అతడు విశాఖపట్టణ సమస్తాధికారి అనియు శాసనము చెప్పుచున్నది. పశ్చిమ చాళుక్య ఆరవ విక్రమాదిత్యుని 47వ రాజ్య వర్షము నాటి రాచనపల్లి (అనంతపురం జిల్లా) శాసనమున ప్రస్తావింపబడిన 'మాచరస' సేనానియే అప్పికొండ శాసన దాతలలో ఒకరైన 'మాచమయ్య' కావచ్చును.[2]

మూడవ సోమేశ్వరుని తండ్రి అయిన ఆరవ విక్రమాదిత్యుని శాసనాలు క్రీ. శ. 1115 నుంచి దాక్షారామమున కనిపించుచున్నవి.[3] కులోత్తుంగునితో ఆరవ విక్రమాదిత్యునికి ప్రత్యక్ష వైరము లేదు. కాని వేంగీ రాజ్యములో కల్లోలాలు సృష్టించడానికి ప్రయత్నించాడు. కాని ఆ ప్రయత్నములు 1092-93 వ సంవత్సరము వరకు ఫలించ లేదు. తరువాత కళింగ రాజ్యంతో, కొలను (కొల్లేరు) ప్రభువైన భీమునితో యుద్ధము చేసెను. క్రీ. శ. 1118లో ఆరవ విక్రమాదిత్యుని దండనాయకుడైన అనంతపాలుడు వేంగీ 14,000 ప్రాంతమునకు పరిపాలనా దక్షుడుగా ఉన్నట్లు శాసనాధారా లున్నాయి.[4] క్రీ. శ. 1120 లో అనంతపాలుని పట్టమహిషి దాక్షారామ భీమేశ్వరునకు దాన మొసగెను.[5] క్రీ. శ. 1118 నాటికి వేంగీ రాజ్యమున చోళుల ప్రభావము సన్నగిల్లినది. అటువంటి పరిస్థితులలో అతని కుమారుడైన మూడవ సోమేశ్వరునకు కళింగము జయించుటకు చక్కటి అవకాశము లభించెను. శక సంవత్సరము నాటి గురజాల శాసనము పలనాడు సోమేశ్వరుని అధీనమునకు వచ్చినట్లు తెలుపుతున్నది.[6] శక. 1053 (క్రీ. శ. 1131) నాటి బాపట్లలోని యొక శాసనము ఒక వెలనాటి ప్రభువు పశ్చిమచాళుక్యులసార్వభౌమాధికారాన్ని అంగీకరించేడని చెప్తోంది.[7] చాళుక్య భీమవరము (తూ. గో. జిల్లా) నందు గల క్రీ. శ. 1136 న కేశవ దేవునకు దండనాయక లక్ష్మరస యిచ్చిన శాసనము[8] పశ్చిమ చాళుక్యుల అధికారము వేంగీ యందు గలదని నిరూపించుచున్నది.

మూడవ సోమేశ్వరుని కె. బి మ్యూజియమ్ శాసనప్రకారము దాన గ్రహీత జోయి సింగమ నన్నయభట్టు కళింగ విజయ యాత్రకు సుముహూర్తము చాళుక్య విక్రమ 51 వ సంవత్సర పరాభవ, కార్తీక, బహుళ ౨ గురువారమున అనగా క్రీ శ 1126, అక్టోబరు, మంగళవారమున నిశ్చయించినందుకుగాను అతడు క్రీ శ. 1127 సంవత్సర ఫిబ్రవరి, 20 వ తారీఖున దానమును పొందినట్లు తెలుస్తోంది[9] అనగా కళింగమును మూడవ సోమేశ్వరునకు జయించవలెననే తలంపు రాజ్యమునకు వచ్చిన మొదలు మనసున ఉన్నను కారణాంతరముల వల్ల కొద్ది సంవత్సరములు గడిచిన పిదప అనగా క్రీ శ 1131 ని కళింగ దండయాత్ర నెరపి తన ఆశయం నెరవేర్చుకొని యుండవచ్చును. తాను జయించిన రాజ్యభాగమందునే దానము తిరిగి నిల్పగల అర్హత రాజులకు కలుగును కదా ! అటులనే మధ్యమ కళింగాన్ని మూడవసోమేశ్వరుడు జయించిన పిదపనే అతని ప్రధానులైన మాచమయ్య, దండనాయకుడు మార్తాండయ్య సోమేశ్వరదేవరకు అప్పికొండ గ్రామ దానమును పునరుద్ధరింప గలిగిరి. ఈ శాసనములో పేర్కొన బడిన పంప (పా) వాడి యనగా పంపానదికి "రెండు పార్శ్వములుగల భాగ" మని యూహింపవచ్చును.[10] ఈ పంపా నది తూర్పుగోదావరీ మండలములోనిది. అప్పికొండ పంపానదికి తూర్పున గలదు. అప్పికొండ గ్రామనామము నాటి నుంచి నేటి వరకు యెట్టి మార్పులను చెందక నిలిచియున్నది. ఈ గ్రామ నామము సమీపమున గల సింహాచల అప్పన్న ప్రభావము వలన ఏర్పడినది కావచ్చును (అప్ప - అప్పి).

ఈ దేవాలయము సముద్రపుటొడ్డునున్నది. సోమేశ్వరాలయమునకు సమీపమున మూడు శిథిలాలయములు గలవు. సోమేశ్వరాలయము ముందు 5 అడుగుల ఎత్తుగల నందివిగ్రహము అలంకార శోభితమై ఉన్నది ఒకప్పుడు ఈ అప్పికొండ ఆలయ సముదాయము విశేషాదరణ ప్రాచుర్యములు అనుభవించినవని గ్రహించగలం ఈ ప్రాంతమున ఆలయములను కప్పివేసిన యిసుక మేటలను తొలగించి, ఖనన పరిశోధన జరిపినచో శిల్పములు, మిగతా ఆలయ భాగములు మొ॥బయల్పడు అవకాశము గలదు. ఆంధ్రప్రదేశ్ పురావస్తు పరిశోధన శాఖవారు యీ ఆలయమును సంరక్షిత జాబితాలో చేర్చిరి

## రెండవ శాసనము[11]

ఈ శాసనము కాలసూచన లేకుండా ఉంది ఇది సర్వలోకాశ్రయ, విష్ణువర్ధన బిరుదాంకితుడైన ఉపేంద్రచక్రవర్తి తన తండ్రి కొప్పదేవ చక్రవర్తి పుణ్యమునకై అప్పికొండ సోమేశ్వర దేవరకు ఏదియో ఒక దానము చేసినట్లు చెప్పుచున్నది. పంచధార్ల వద్ద లభించిన ఒక శాసనము ఎలమంచి చాళుక్యుల పూర్వవంశాను క్రమణను చెప్పుచూ మూడవ ఉపేంద్రుడు కొప్పదేవ గంగాంబికల కుమారునిగా పేర్కొనినది[12] కొప్ప లేక కొప్పదేవ చక్రవర్తి 1300-1356 సంవత్సరాల మధ్య, అతని తరువాత ఉపేంద్రుడు. క్రీ శ 13,2 వరకు పాలించి యుండ వచ్చును.

పై రెండు శాసనములు అప్పికొండ సోమేశ్వరాలయములో ఉన్నవి. సోమేశ్వరాలయము 12 వ శతాబ్దపు పూర్వకాలము నుంచి 14 వ శతాబ్దపు చివరవరకు ప్రాభవోజ్వలములను కలిగి యుండినదిగా తెలియజేయుచున్నది. కాలగతిని, ప్రకృతి వైపరీత్యముల వల్ల అప్పికొండ ఆలయ సముదాయము ఇసుకతో మేట వేసుకొని పోయెను.



అప్పికొండ సోమేశ్వరాలయము ముందుగల నంది విగ్రహము

## మొదటి శాసన పాఠము  మొదటి వైపు

1 స్వస్తిశ్రీ సక వరుషంబులు
2. ౧౦౫౩ అగు నేండు స్వస్తి సమ
3. ధిగత పంచ మహా శబ్ద మహా
4 సామంతాధిపతి మహా ప్రచణ్డ
5. దండ నాయకు నయిరి (భయానక ?)
6. సుజన జన కు ముద వన సుధాకర
7. విప్రాది వాకర  అభిమాన మందార వి
8 భవ పురందర గోత్ర పవిత్ర పరాంగ
9. నా పుత్ర హార చరణ సరసీరుహ శ్రీ
10. సమా మన సింగి విద్వి జ్జనోద్యాన కో
11 టి వసంత సకల లక్ష్మీకాంత నా [మా]
12 ది సమస్త ప్రశస్తి సహితం శ్రీమ
13. న్మహా ప్రధానం దండ నాయకం అన్న
14. రాజుల ప్రధానం పంపవాని తూర్పు
15 భూమికి విశాఖ పట్టన పు సము
16. స్తాధికారి సమస్త స్థానాధిపతి మా

## రెండవ వైపు

17. చిమయ్య దండ నాయకులు
18 సేనాపతి మాత్తణ్ణయ్య
19 నాయకులు శ్రీ మచ్చా
20. ళుక్య విక్రమ వరుషము [5]
21. [5] నగు సాధారణ సంవత్సరాన [ఫా] ల్గు
22. న బహుళ ౧౧ బుధవారము నాండు
23. దంతి వారము లోపలి శ్రీ సోమీశ్వర దే
24. వర దేవ భోగపు ఊరు అప్పికొండ కు
25. ం బూర్వ[ా] మయ్యా దను గ్రామ గ్రామము [గ]
26 యీ దేవర అముదునకు దేవర

## రెండవ శాసన పాఠము  మొదటి వైపు

1 స్వస్తిశ్రీ యశాం సకల భు
2. వన మాన మానవ్యస గోత్రాణా
3 ం హారితి పుత్రానాం కంసేక వరా
4. ప్రసాది లబ్ద రాజ్యానా మా
5 త్రు గణన పరి పాలితానాం
6. స్వామి మహా భగవం
7 న్నారాయణ ప్రసాదిత
8 స్వే (శ్వే) తాత పత్రి పింఛ కుంత
9 సంప హేగు దన కనక దండ
10. గంగా యమునాది రాజ్య చిహ్నా
11. నాం వర వరాహ లాంచ్ఛన క్ష
12 నా (ణ) క్షణ వసే (శీ) కృతానాం అశ్వ
13. మేధాణం ప్ర బ్రి (భృ) తి జల

## రెండవ వైపు

14. న చక్షత గాత్రానాం చాళుక్యా
15. నాం కుల మలంకరా (రి) ష్ణో ర్వర మ మా
16 హేశ్వర పరమ బ్రహ్మణ్యం శ్రీ బి
17. శ్వేశ్వర శ్రీ మహాదేవర అమ్మత్వా
18 ద ంద్మాశ్రయ అనంత లక్ష్మీశ్వర స
19. ర్వ లోకాశ్రయ శ్రీ విష్ణు వర్ధన మహా
20. రాజునైన ఉ [పే] ంద్ర దేవ చక్రి వ
21 త్తులు తమ ఏంద్రి కొ (కొ) పయ్య దే
22. ప చక్రవర్తి కిం బుణ్యముగా
23 ను అప్పికొండ శ్రీ సోమేశ్వర దే
24 వర

## రెండవ శాసనము: మూడవ వైపు

25. కుల్గాన వారు నుంరి యీ ధ ర్మమునకు
26. విఘ్నము దలంచిన వారు పం
27 చ మహా పాతకము నం బ
28. దుదురు  ధర్మ మార్గావు సెడక ణ్డ
29 నడపిన వారి శ్రీ పాదములు
30. నా శిరస్సున్నవి.

సూచికలు

1. కేంద్రప్రభుత్వ శాసన పరిశోధన శాఖ వార్షిక నివేదిక 1941-42.
2. ,, ,, ,, ,, ,,
3. దక్షిణ హిందూ శాసన సంపుటి 4, సంఖ్య 1017, 1036, 1214
4. ,, ,, ,, 4, సంఖ్య 1322.
5. ,, ,, ,, 4, సంఖ్య 1211.
6. ,, ,, ,, 10, సంఖ్య 27.
7. ,, ,, ,, 6, సంఖ్య 193
8. ,, ,, ,, 5, సంఖ్య 68
9. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పురావస్తు పరిశోధన శాఖ ప్రచురణ సంఖ్య 3, పట్టాను చెరువు, పేజీ 17-19, కె. బి. మ్యూజియమ్ శాసనము
10. ప్రాచీనాంధ్ర చారిత్రక భూగోళము, కుందూరి ఈశ్వరదత్తు, పేజీ 196.
11. కేంద్రప్రభుత్వ శాసన పరిశోధనశాఖ వార్షిక నివేదిక, 1941-42 నెం 1,
12. ఎ పి ఇం. సంపుటి 19, పేజీ 164, పాదము 16.

[ ఈ శాసనములపై ఆసక్తిని కలిగించిన కీ. శే. మల్లంపల్లి వెంకట నాగాదిత్య శర్మగారి సంస్మరణ చేయుట యీ సందర్భమున ఎంతయో సమంజసముగా యీ వ్యాస రచయిత భావిస్తున్నాడు. ]

# ఆ రెండు హర్మ్యాలు

ప్రియదర్శి

ఆ రెండు హర్మ్యాలను
ముంచెత్తుతున్న
వెన్నెల వెల్లువలో
నిర్వాసితాలయిన
స్మృతులు
వెన్నెలలో కరగిన
నీలి రంగును
తుడిచేసుకుంటూ
తమస్వినీ మరుభూముల
నివాసాన్ని అన్వేషిస్తూ
పరుగులెత్తేయి
మరీచికల
మిధ్యా జలాలలో
ప్రతిఫలించిన
ధవళ చంద్రికలు
వెల్లువలో వదలి వచ్చిన
ఆ రెండు హర్మ్యాలను
తలపుకు తేగా
స్మృతులు
అశ్రువులు రాల్చేయి.

డా. ఏ. వీరప్రసాదరావు

# తెలుగు సాహిత్యములో అభ్యుదయ కావ్యములు - రఘునాథనాయకాభ్యుదయము పరిశీలనము

తెలుగు సాహిత్యములో అభ్యుదయ కావ్యములు తంజావూరు నాయక రాజుల కాలము నుండి అవతరించినవి.[1] ఈ అభ్యుదయ కావ్యములు రాజకీయ సాంఘిక మత విషయములను, పౌరాణిక తాత్త్విక విషయములను తెలియజేయుచున్నవి. తెలుగు సాహిత్యములో కొన్ని కావ్యములకు 'అభ్యుదయము'ను పేరు అనుబంధముగ చేర్చబడియున్నది. ఈ కావ్యములు నాయకాభ్యుదయ సూచకములై విలసిల్లుచున్నవి. వీనిలో ఎక్కువ భాగము చారిత్రిక విషయములే కన్పట్టుచుండును. తెలుగు సాహిత్యములోని నాయకాభ్యుదయ కావ్యములు 'అభ్యుదయ కావ్యములు' అను పేరుతో ప్రసిద్ధిపొందియుండుట గమనింపదగినది.

దాక్షిణాత్యాంధ్ర యుగమునందే ఈ అభ్యుదయ కావ్యములు వెలసినవి. ఇందు చారిత్రక పురుషుల అభ్యుదయ కార్యములు వర్ణింపబడినవి 2

## నాయకాభ్యుదయ కావ్యలక్షణము

ఆ కాలము నాటి రాజ జీవితములకు దర్పణము వంటివి ఈ అభ్యుదయ కావ్యములు రసదృష్టితో ఉత్తమ గ్రంథములు కాకపోవచ్చును కాని చారిత్రక దృష్టితో మిక్కిలి ఉత్కృష్టమైనవి. ఇందలి ఇతివృత్తము సామాన్యమై తమిళదేశపు 'ఉలా' ప్రబంధ పద్ధతి ననుసరించినది. ఇది ఒక విధముగ తమిళ సాహిత్య ప్రభావము కావచ్చును.[3]

తమిళ సాహిత్యమున 'ఉలా' ప్రబంధ ప్రక్రియ ప్రాచీనమైనది ఇది దేవతల రథోత్సవము, ప్రసిద్ధ పురుషుల గజోత్సవములకు సంబంధించిన వర్ణనలతో నొప్పారుచుండును. ఈ ఉత్సవము వీధులలో సాగుచున్నప్పుడు సప్తవిధ గణికలు దానిని చూచుట తటస్థించును. ఇందలి ఇతివృత్తము ఆ గణికలలో నొక వర్గమునకు చెందిన కన్యక ప్రేమను ప్రకటించు గాథకు సంబంధించినది.[4]

ఈ అభ్యుదయ కావ్యములలో రాజు స్వారి వెడలుట, కీరసందేశము, భూపాలుని దినచర్య, నాయికా నాయకుల విరహము, వారి సమాగమము మొదలగు విషయములు వర్ణితములు ఇందులో ఆనాటి రాజుల ఆభరణ విశేషములు, ఆహార విహారములు, విద్యా వినోదములు, కొలువుకూటములు, అంతఃపుర మర్యాదలు, పరిపాలనా రహస్యములు మున్నగునవి అన్నియు వర్ణింపబడి యుండును.[5] కావున అభ్యుదయ కావ్యము ఆనాటి రాజకీయ మత సాంఘిక పరిస్థితులను ప్రతిబింబించు చుండును.

తంజావూరు నాయక రాజులు తమ అంధ్రుల గాథలను గ్రంథస్థ మొనర్ప నడుకట్టిన కుమారులు. తండ్రి యొక్క వీర కృత్యములను, దిగ్విజయములను, సమగ్రముగ, విపులముగ వర్ణింపక పోయినను సూచనప్రాయముగ తెలుపుట గమనింపదగియున్నది 6 అయినను ఈ అభ్యుదయ కావ్యములు వీరి వీర కార్యములలో కొన్నింటినైనను తెలియజేయుచున్నవి.

చారిత్రక కావ్యమున ముఖ్యముగ గమనింప వలసినది చారిత్రక ప్రామాణికత్వము అభ్యుదయ కావ్యములలో చారిత్రక ప్రామాణికత్వముతో పాటు సాహిత్య ధర్మ సమన్వయము కూడ నుండును ఇది పాఠకుని యందు భావావేశమును కలిగించి ఆనాటి మానవుని జీవిత విధానములకు సంబంధించిన విషయములను విశదీకరించును

ఈ అభ్యుదయ కావ్యములు కథానాయకుల జీవితాభ్యుదయ సూచకములుగ రచింపబడెను కావున వీనిని నాయకాభ్యుదయ కావ్యములు అని కూడ పేర్కొనవచ్చును.

## తెలుగు సాహిత్యములోని నాయకాభ్యుదయ కావ్యములు

తెలుగు సాహిత్యమును పరిశీలించినచో 'అభ్యుదయ' మను అనుబంధ నామముతో కొన్ని రచనలు కన్పట్టుచున్నవి. చారిత్రక ప్రసిద్ధి కలిగినవే ఎక్కువగా నున్నను పౌరాణిక, తాత్త్విక విషయ సంబంధమైన అభ్యుదయ కావ్యములు కూడ నున్నవి. అభ్యుదయ రచనలు అనగా అభ్యుదయము అను పేరుతో నున్న కావ్యరచనలు.7

ప్రాచీన కావ్యములలో ప్రత్యేక వ్యక్తుల జీవిత చరిత్ర లను చిత్రించు రచనలకు 'అభ్యుదయ రచనల' ని పేరు. ఇవి కావ్య రూపములలో నున్న జీవిత చరిత్రలని పేర్కొనదగును. సంస్కృత వాఙ్మయములో నిట్టి రచనలకు మూలము వేదాంత దేశిక ప్రణీతమైన యాదవాభ్యుదయము. ఈ అభ్యుదయ రచనలు తెలుగులో మొదట తంజావూరి నాయక రాజులు మాత్రమే కావించిరి.8

తంజావూరి ప్రభువులకు పూర్వము విజయనగర రాజుల కాలములో నిట్టి రచనలు సంస్కృతములో వెలసినవి. వీనిలో రాజనాథ డిండిమకవి - సాళ్వాభ్యుదయము సాళువ నరసింహ నృపతి - రామాభ్యుదయము, రాజనాధ డిండిమకవి - అచ్యుత రాయాభ్యుదయము పేర్కొనదగినవి.

తెలుగులో నాయక రాజులకు పూర్వము భట్లపెనుమర్తి కోదండరామకవి-వల్లభాభ్యుదయము, అయ్యలరాజు రామభద్రకవి రామాభ్యుదయము గణింపదగినవి. ఇట్టి రచనల ననుసరించియే దక్షిణాంధ్రమున తంజావూరు రాజ్యమున అభ్యుదయ రచనలు ప్రశస్తముగ సాగినవి. సంస్కృత సాహిత్యములో ప్రఖ్యాతి గాంచిన ఇట్టి రచనలను తెనుగునకు దెచ్చిన కీర్తి రఘునాథ భూపాలునిది 9

రఘునాథనాయకుడు తన తండ్రి దినచర్యను అచ్యుతాభ్యుదయ మను10 పేర ద్విపద కావ్యముగ వెలయించెను. దీని నాధారముగ గొనియే తరువాతి వారు తెలుగులో అభ్యుదయ రచనలు చేసిరి 11 రఘునాథుడు తన తండ్రిని గురించి వ్రాసిన రీతిలో విజయరాఘవుడు తన తండ్రి పేర రఘునాథనాయకాభ్యుదయమును రచించెను. ఆ రీతిగనే విజయరాఘవుని తనయుడు మన్నారుదేవుడు విజయరాఘవనాయకాభ్యుదయమును రచించెను.12

## పౌరాణిక సంబంధమైన అభ్యుదయ కావ్యములు

ఆధునిక యుగమున తెలుగులో ఎక్కువగ పౌరాణిక సంబంధమైన అభ్యుదయ కావ్యములు వెలువడినవి ఇవి సంఖ్యలో ఎక్కువగ నున్నను ప్రాశస్త్యమున ప్రాబల్యమును పొందలేక పోయినవి. పురాణ గాథలను ఇతివృత్తములుగ కలిగియున్నవి. ఇందులో ఒకటి రెండు యక్షగానములుగ రచితములైనవి. పౌరాణికేతివృత్త సంబంధమైనను ప్రబంధపు పోకడలు సంతరించు కొనిన అభ్యుదయకావ్యములు కూడ గలవు.

శివసూర్యుడు రచించిన పాండవాభ్యుదయము, ఖులుసు పాపయ్యశాస్త్రి రచితమైన ప్రద్యుమ్నాభ్యుదయము, కాకరపర్తి కృష్ణశాస్త్రి కృతమైన కౌశికాభ్యుదయము, మండపాక పార్వతీశ్వర కవి వ్రాసిన శ్రీకృష్ణాభ్యుదయము, రాపాక లక్ష్మీపతి కవి ప్రణీతమైన భద్రాయురభ్యుదయము, సత్యవోలు కామేశ్వరకవి రచించిన కుచేలాభ్యుదయము, మాడభూషి వేంకటాచార్యులు విరచించిన భారతాభ్యుదయము, మాడభూషి విద్యానవ పండితరాయ రచితమైన భరతాభ్యుదయము, కవి సమ్రాట్ విశ్వనాధ సత్యనారాయణ రచితమైన శ్రీ కుమారాభ్యుదయము పేర్కొనదగినవి. గణనాథాభ్యుదయము, ఉమాపత్యభ్యుదయము పురాణ కథా సంబంధములైన అభ్యుదయ కావ్యములు.

పౌరాణికేతి వృత్తమును గ్రహించినను ప్రబంధములుగ తీర్చిదిద్దబడిన అభ్యుదయ కావ్యములు కొలదిగ గలవు ప్రబంధ కవిత్వ రచనా పాటవమున ఈ కథలు శృంగార ప్రబంధములవలె రచింపబడినవి వీ లో వేంకటాచార్యుల రచితమైన భరతాభ్యుదయము, కాకరపర్తి సాంబయ్య కృతమైన విఘ్నేశ్వరాభ్యుదయము పేర్కొన దగినవి.

ఇతివృత్తములను పురాణ కథలనుండి గ్రహించినను అభ్యుదయ కావ్యము లను పేర నాటకములుగ రచింపబడినవి కొన్ని గలవు. వీనిలో సన్నిధానము సూర్యనారాయణశాస్త్రి రచితమైన ప్రద్యుమ్నాభ్యుదయము (కీర సందేశము) పేర్కొనదగినది.

## తాత్త్విక సంబంధమైన అభ్యుదయ కావ్యములు

వీనిలో భీమవరపు సాంబశివశర్మ రచించిన భారతాభ్యుదయము పేర్కొనదగినది. ఇందులో శ్రీ విద్యారణ్య చరిత్రము వర్ణితము. తాత్త్విక, నీతి విషయములు ఇందులో ప్రస్తావింపబడినవి.

ఈ రీతిగ ఆధునిక కాలమున తెలుగు సాహిత్యములో అభ్యుదయ కావ్యములు వెలసినను వీనికి అంత ప్రాబల్యము కలుగలేదు. తంజావూరు నాయక రాజుల నాటి అభ్యుదయ కావ్యములకు చారిత్రక ప్రాశస్త్యము గలిగినది.

## రఘునాథ నాయకాభ్యుదయము

ఈ కావ్యములో పాండ్యరాజైన కృష్ణప్పనాయకుడు కర్ణాట ప్రభునికి కప్పము కట్టక తిరుగబడుట,[13] జగ్గరాజు రామదేవరాయలను తక్క శ్రీరంగరాయలను సకుటుంబముగ హతమార్చుట,[14] పోర్చుగీసువారు సేపాళభూపాలుడైన సంకిలి కుమారుని పదవీచ్యుతుని చేయుట,[15] యుద్ధములకు కారణములు. రఘునాథ నాయకుడు 'పాండ్యరాజును పెనుగొండ యుద్ధములోను, జగ్గరాజును తోపూరు యుద్ధములోను, సింహళమున పోర్చుగీసు వారిని ఓడించి విజయములను బడసెను.

విజయరాఘవ నాయకుడు రఘునాథ కళావతుల తనయుడు. ఈతడు క్రీ. శ. 1590 ప్రాంతమున జన్మించియుండును. క్రీ. శ. 1633 నుండి 1673 వరకు తంజావూరు రాజ్యమును పరిపాలించెను. మొట్టమొదట మత సహనముగల వైష్ణవుడయ్యు రానురాను వీర వైష్ణవానుయాయిగ మారెను. ఇతడు తన కావ్యములో కృత్యాదిలో శ్రీ రాజగోపాలుని, శ్రీలక్ష్మిని, భారతిని, పార్వతిని, చెంగమలవల్లిని, కనకాంగవల్లిని ఇష్టదేవతాస్తుతి గావించెను.

ఈ నాయకాభ్యుదయ కావ్యమున మూడాశ్వాసములు గలవు. ఇందులో మొత్తము 2082 ద్విపద పంక్తులు గలవు. ప్రథమాశ్వాసమున రఘునాథనాయకుడు పురవీధుల స్వారి వెడలు నప్పటి వరకు గల వృత్తాంతము వర్ణింపబడినది ద్వితీయాశ్వాసమున రాజు స్వారి వెడలుట మొదలు శుకద్యూతము వరకుగల కథ వర్ణింపబడినది. తృతీయాశ్వాసమున రఘునాథనాయకుని మధ్యాహ్న భోజనాదిక వృత్త విశేషములు, శుకద్యూతము, నాయికా నాయకుల సమాగమము మొదలైన విషయములు అభివర్ణింపబడినవి.

ఈ కావ్యమున నాయకుడు రఘునాథనాయకుడు పురవీధుల స్వారి వెడలుచుండగ ఇతనిని చూచి వలచిన గణిక సుందరి చిత్రరేఖయే ఈ కావ్యమున కథానాయిక. రఘునాథ నాయకుని ఒకనాటి దినచర్య వృత్తాంతము నిద్రలేచినది మొదలు రాత్రి నిద్రించు వరకు గల వృత్తాంతమును సందర్భోచితములగు పుర వర్ణన, మన్మథోపాలంభన మొదలగు ప్రబంధ లక్షణములతో విజయరాఘవుడు సుందరముగ రచించినాడు.[16]

ఈ కావ్యమునందలి వర్ణనలలో తంజాపుర వర్ణనము పేర్కొనదగినది. ఇందుగల ప్రాకారములు, రాచనగరు, కోట, హజారము, పెనులాగడపుఁ బని పెద్దబవంతి (గజశాల), పటాని బవంతి మేడ (గుఱ్ఱాల శాల), సంప్రతి కరణముల విశాల శాల, శ్రీరామ భద్రశాల, లక్ష్మీ విలాస భవనము, లాగుల చప్పరము, గరడికూటము, నాటకశాల, మన్నారుడున్న మదనగోప విలాసమందిరాంగణము, శ్రీరామ సౌధరాజము, విజయభవన రాజము, ఇందిరా మందిరము, విజయ రాఘవ విలాసగృహము, మొదలగు మందిరములతో వేడుకయైనది తంజాపురాంధ్ర నాయక రాజ సదనము.[17]

ప్రథమాశ్వాసమున చరిత్ర పరిశోధకులకు తంజావూరుకు సంబంధించిన పెనుగొండ యుద్ధము, తోపూరు యుద్ధము, జాఫ్నా విజయములను గూర్చిన విషయములు తెలియును. ఇందులో తంజావూరి నాయక రాజులను గూర్చి విశేషముగ తెలుపబడినది. విజయరాఘవ నాయకునకు గల 'జీర్ణకర్ణాటక సామ్రాజ్య సింహాసన స్థాపనాచార్య' బిరుదము వలనను, పూర్వోక్త సంఘటనల వలనను ఈ రఘునాథ నాయకాభ్యుదయము క్రీ. శ. 1643 1644 ప్రాంతమున రచింపబడినట్లు తెలియుచున్నది [18]

## రఘునాథ నాయకాభ్యుదయ ప్రాశస్త్యము

ఈ గ్రంథమునందలి కవిత్వము అంత ప్రౌఢమైనది కాకపోయినను మృదు మధురమై, సరళమై, ధారాశుద్ధి గలిగి యొప్పారుచున్నది ఇందు తెలుగు దనము సేకరింపబడినది. ఇది సౌకుమార్యమును, లాలిత్యమును అలరించుకొని యన్ని విధముల దేశియైనది. ప్రయోగింపబడిన పదములు బహుళముగ అతికోమలములైన అచ్చ తెనుగు పదములు.[19]

ఈ కావ్యమున ప్రబంధ లక్షణములు కొన్ని గోచరించినను దీర్ఘములుగ గోచరింపవు. ఇందలి ఇతి వృత్తము ప్రాచీన ప్రబంధ కథా విధానము ననుసరించి దీర్ఘముగను, అనేక సంఘటనాత్మకముగను నుండక సామాన్యమై తమిళదేశపు 'ఉలా' ప్రబంధ పద్ధతి ననుకరించినది.[20] ఇది తమిళ సాహిత్య ప్రభావమై యుండవచ్చును. ఈ కావ్యమున గల యుద్ధవిశేషములు చారిత్రా

త్మకములు! ఇందు పేర్కొనబడిన రఘునాథుని దినచర్య మానవ సహజమైనది. ఇందులో అనాటి ప్రభువుల నిత్య కృత్యములు ప్రతిబింబించు చున్నవి.

ఉదాహరణమునకు రఘునాథ నాయకాభ్యుదయములోని కొన్ని ఘట్టములు చూడుడు —

## యుద్ధవర్ణన

" రఘునాథ విభుఁడు
వసుమతీ రాజ్య నిర్వాహకుండగుచు
దుండీర వీరుని దురములో దఱిమి
చండించి ఖండించె జగ్గభూ విభుని
నాలంబు చేసి పాండ్యావని పాలు
పాళెంబు దాసి తద్బాలికా మణులు
మొఱవెట్టగా దన మూకల చేత
జెఱవట్టి తెప్పించి చెలఁగె నా పట్ల"-

[రఘునాథ నాయకాభ్యుదయము, అశ్వాసము 1,
ద్విపద పంక్తులు 241-247.]

రఘునాథ నాయకుడు రాజ్య నిర్వాహకుడగుచు యుద్ధములో తుండీర వీరుని తరిమెను. జగ్గరాజును ఖండించెను. పాండ్య రాజును అతని భార్యలు మొఱపెట్టగ చెఱపట్టి తెప్పించెను ఇవి రఘునాథరాయలు చేసిన యుద్ధములను గూర్చి తెలుపుచున్నవి.

## రఘునాథ నాయకుని సాహిత్య సృష్టి

"భువి మెచ్చ నచ్యుతాభ్యుదయ కావ్యంబు
నవరస చిత్రంబు నలచరిత్రంబు
హరువైన పారిజాతాపహరణంబు
మెఱవడి జూపు వాల్మీకి చరిత్ర
జానకీ కళ్యాణ చాటుకావ్యంబు
తా నిర్వహించిన తక్కిన కృతులు
కొందఱు వినిపింప "

[రఘునాథ నాయకాభ్యుదయము, అశ్వాసము 1,
ద్విపద పంక్తులు 516-522]

రఘునాథరాయలు తాను రచించిన అచ్యుతాభ్యుదయ కావ్యము, నలచరిత్ర, పారిజాతాపహరణము, వాల్మీకి చరిత్ర, జానకీ కళ్యాణ చాటుకావ్యము, తక్కిన కృతులు కొందరు స్త్రీలు వినిపింప కొలువుతీరి యుండెను ఇవి రఘునాథరాయలు రాజకవి యను దానిని ధృవ పరచు చున్నవి

## రఘునాథరాయల చక్కదనము

"కమ్మ విల్కాని చక్కదనంబు వాడు
పూర్ణేందు కళలను బోలు బొందు వాడు
కర్ణాంత దీర్ఘమౌ కనుదోయి వాడు
రసికుడా యచ్యుత రఘునాథ శౌరి."

[రఘునాథనాయకాభ్యుదయము, అశ్వాసము 2,
ద్విపద పంక్తులు 390-393]

రఘునాధుడు చక్కదనమున మన్మథుని పోలినవాడు. పూర్ణేందు కళలతో నొప్పారువాడు. కర్ణాంత దీర్ఘములైన కను దోయి కలవాడు. రసికుడు. ఈ రీతిగ రఘునాథరాయల చక్కదన మును, కళాసంపదను, కనుల నొబగును, రసికత్వమును పేర్కొన బడినవి.

## నాయికా నాయకుల సమాగమ ఘట్టము

"తరుణీ లలామ నీ తళుకు వాల్గూపు
హరిణీ విలాసంబు లంగీకరించె
గంజదళాక్షి నీ కంఠు కంఠంబు
మంజు ఘోష విశేష మహిమ వహించెఁ
బంచాస్యమధ్య నీ బాహు వల్లికలు
కాంచన మాలిక గరిమ ఁ బాటించె"

[రఘునాధనాయకాభ్యుదయము, అశ్వాసము 3,
ద్విపద పంక్తులు791-795.]

నాయిక వాల్చూపు హరిణపు చూపువంటిది. ఆమె కంఠ మును మంజు ఘోష విశేష మహిమ చేతను, బాహువల్లికలను కాంచన మాలికలచేతను వర్ణించెను

ఈ కావ్యమున తంజావూరు నాయక రాజుల వంశమును, వారి వంశ పారంపర్యమును, వారు గావించిన ఘనకీర్తులు ప్రశంసా పూర్వకముగ తెలుపబడినవి ఈ కావ్యము పరమ వైష్ణవ తపోభాగ దేయుడైన రాజగోపాలునకు అంకితముగ నీయ బడినది.21

## రఘునాథ నాయకాభ్యుదయము - సాంఘిక విషయములు

ఈ అభ్యుదయ కావ్యమున ఆనాటి సాంఘిక విషయములు ద్యోతకములగు చున్నవి.

## 1. రాజు - కొలువు

రఘునాథుడు ప్రతి దినము రెండుమారులు కొలువు తీరెడివాడు. నిదుర మేల్కొనిన తరువాత బంధుమిత్రుల తోడను, స్నానాదులు ముగిసిన పిదప అలంకృతుడై అందరితోడను కొలువు తీర్చెడివాడు 22

## 2. రాజు - స్వారి

తంజావూరు నగరమున రఘునాథ భూపాలుడు స్వారి వెడలు చుండెడివాడు

## 3. వస్త్రములు

చలువలు, పైరిణి చలువలు, దువ్వటములు, దువ్వలువలు, రంగురుమాలు, సరిగదుప్పటి, పీతాంబరములు, చలువచీరలు, కీలు రత్నము గండ్ల కెంబట్టి రవికలు పురుషులు, స్త్రీలు ధరించెడివారు.

## 4 ఆభరణములు

కంఠమాలికలు, కంఠసరములు, పచ్చల పదకములు, కెంపుల పిడి, వజ్రముల ఉత్తరిగలు, వజ్రముల చేసరులు, కెంపుల కిడియములు, రత్నాంగుళీయకములు, వజ్రముల చేసరుల హారములు, కట్టాణి ముత్యముల కంఠసరులు, సోగముత్యముల ఒంట్లు మొదలగునవి రాజుల ఆభరణములు

## ఆహారము

పచ్చళ్లు, శాలితండులములు, బంగారు రంగు గల పప్పులు, శాకపు కూరలు, కప్పురపు కోడి, కుంకుమ కోడి, కస్తూరి కోడి, పాల కోడి, కట్టుకోడి, పన్నీరు పాయసము, వెన్న, చక్కెర వేసి వండిన చేపలయూర్పు, బిరంజి, అప్పడములు, వడియములు మొదలగునవి రాజుల ఆహారము.

## పిండి వంటలు

పేణీలు, మండిగెలు, లడ్వములు, పూర్ణకలశములు, వెన్నకజ్జాయములు, మణుగు బూలు, అతిరసాలు, సారసత్తులు, కరిపడలు, దధి వడలు, పప్పు కుడుములు, తెలికొక్కు రొట్టె, తెంకాయ రొట్టె, సంబారు రొట్టె, తని బాలు, టెంకాయ పాలు జీలకర్ర పాయసము, చలువ పాయసము మొదలగునవి.

## ఫలములు

ఎందాడి పండ్లు, పనస తొనలు, తియ్యమామిడి పండ్లు, ద్రాక్ష పండ్లు, ఖర్జూర ఫలములు, నేరేడు, రేగ, కిత్తడి, పాల దోస, వెలగ పండ్లు, దానిమ్మపండ్లగింజలు మొదలగునవి.

## వాద్య విశేషములు

వీణ, ఖురళి, రబాబు, తంబుర, కిన్నెర ముఖవీణ, స్వర మండలము, రావణ హస్తము, చెంగు, దండె, డక్క, తాళము మొదలగునవి ఉత్సవ సమయములందు చిరుత మద్దియలు, కాహళలు, భేరులు, ఢక్కలు, ధవళ శంఖములు మొదలగునవి వాడెడివారు.

## నాట్యములు

పదకేళి కొరవంజి, శివలీల, గుజరాతి, దేశి మొదలగునవి

## రాజకీయోద్యోగులు

గుత్తిగొల్లలు, బొక్కసము వారు, వేత్రహస్తులు, మజాలశీలు, రాయసములవారు, అవసరముల వారు మొదలగువారు

## మతము

నాయకరాజులందరును వైష్ణవ మతావలంబులు రఘునాథ రాయలు వైష్ణవ మతావలంబకుడు.23 ఇతని కులదైవము రాజ గోపాలస్వామి తాతాచార్యులు ఈతని కులగురువు వీరి రచన లన్నియు వైష్ణవభక్తికి నిదర్శనములు.

ఈ రీతిగ నాయకరాజుల వైభవమును, దినచర్యను, సాంఘిక మత రాజకీయ స్థితిగతులను విజయరాఘవుడు రమ్యముగ రచించినాడు. చారిత్రకాంశములను కూర్చి శృంగార కావ్యముగ, కవితామాదుర్యము గలిగిన రఘునాథ నాయకాభ్యుదయమును విజయరాఘవ నాయకుడు సంతరించినాడు

## పాదసూచికలు

1. [అ] కొక్కొండ సత్యవతి — తంజాపురాంధ్ర సాహిత్య చరిత్ర, పుట 85.

[ఆ] నిడుదవోలు వేంకటరావు — దక్షిణదేశీయాంధ్ర వాఙ్మయము, పుట 115.

# ఆంధ్రసచిత్రవారపత్రిక

## [ 16-9-1983 ]

## వినాయక చవితి సంచిక

# వజ్రోత్సవ సంచికగా

## వెలువడుతుంది!

**1908** లో వినాయక చవితినాడు వారపత్రికగా జన్మించిన ఆంధ్రపత్రిక తెలుగువారికి చేస్తూ వచ్చిన సేవ ఇంతా అంతా కాదు. ఇప్పటికి ఏడున్నర దశాబ్దాలుగా ఆంధ్ర సచిత్ర వారపత్రిక ఆంధ్రుల ఆదర్శాలకీ, ఆశయాలకీ, వారి సంస్కృతికీ ప్రతిబింబంగా ఉంటూ వచ్చింది పాఠకులు, ఇతర శ్రేయోభిలాషుల ఆదరాభిమానాలతో, మరింత ఉత్సాహంతో ఈ సేవని కొనసాగించాలన్న కృతనిశ్చయంతో ఉంది

తెలుగువారి సర్వతోముఖ వికాసానికి 75 సంవత్సరాలకాలంలో ఆంధ్ర సచిత్ర వారపత్రిక చేస్తూవచ్చిన కృషి ఎటువంటిదో కొంతవరకయినా ఈ వినాయక చవితికి వెలువడే వజ్రోత్సవ సంచిక తెలుపగలదు!

ఆంధ్ర సచిత్ర వారపత్రిక సంచికలో అప్పటివారివి, ఇప్పటివారివి ఎన్నో రచనలు ఉంటాయి — కథలూ, వ్యాసాలూ, కవిత్వం, బొమ్మలూ మొదలయినవి!

ఆంధ్ర సచిత్ర వారపత్రిక వజ్రోత్సవ సంచిక కనీసం రెండు వందల పేజీలతో, పూర్తి ఆఫ్‌సెట్ ముద్రణతో వెలువడుతుంది!

వెల. రూ. **4-00.**

2. జి. నాగయ్య — ద్విపద వాఙ్మయము, పుట 334.

3. విజయ రాఘవుడు - రఘునాథనాయకాభ్యుదయము (ద్విపద) పీఠిక - మల్లంపల్లి సోమశేఖర శర్మ, పుట 142.

### 'ఉలా' ప్రబంధ విషయము

తమిళ సాహిత్యములో నున్న 64 విధములగు ప్రబంధ ప్రక్రియలలో 'ఉలా' అనునదొకటి. 'ఉలా'అనగా ఉత్సవము అని స్థూలముగ గ్రహింప వచ్చును ఉత్సవ సమయములలో అశ్వముపై లేదా మదపుటేనుగుపై దేవుని యొక్క లేదా ఆ దేశాధీశునియొక్క ఊరేగింపు ఉత్సవము ఊరియొక్క ప్రధాన వీధులలో జరుగుచుండెడిది. ఆ సమయములలో మేడలపై అధివసించి అదితిలకించు సప్తవిధ గణికలు ఆ దేవునియొక్క మూర్తిని లేక రాజును చూచి పరవశము చెందుచుండెడివారు. ఈ సప్తవిధ గణికలను వయో భేదమును బట్టి సప్త విధములుగ గణించిరి. ఆ ఉత్సవ సమయములో యౌవ్వనవతులైన గణికలు రాజు యొక్క సౌందర్యమునకు పరవసించి సమ్మోహితులగు చుండెడివారు: మన్మథ భావములకు లోనైన అట్టి యౌవ్వన వతుల గాజులు వదులై వారి మణికట్టులపై జారి పడు చుండెడి పట. ఇది వారి మోహ పారవశ్యమును సూచించు చుండును. అదే సమయమున రాజు కూడ అట్టి గణికను గాంచి మోహము చెంది విరహ దగుచుండెను. ఇట్టి కావ్య మును మోదాంతముగ లిఖించెడివారు రాజును ఆనందింప జేయుటకై వెలసిన కావ్యముల కోవలోనికే ఈ ప్రబంధ ములు చేరును. అందువలననే తాము కొలువున్న రాజును కథానాయకునిగ చేసి 'ఉలా' ప్రబంధములను ఆనాటి కవులు రచించిరి. ఈ ఫక్కికనే అభ్యుదయ కావ్యములలో కవులు ప్రవేశ పెట్టిరి. కొన్ని కావ్యములలో దేవతలను కథా నాయకులుగ చిత్రించి సప్తవిధ గణికలు భక్తి పారవశ్య మును చెందినట్లు చిత్రింపబడినవి

4. ద్విపద వాఙ్మయము, పుట 335.

5. కె. వి. ఆర్. నరసింహం — దక్షిణాంధ్రయుగ వాఙ్మయము, ప్రథమ భాగము, పుటలు 98 - 99.

6. బి అరుణకుమారి — తెలుగులో చారిత్రక కావ్యములు, పుట 249.

7. దక్షిణదేశీయాంధ్ర వాఙ్మయము, పుట 115.

8. పైదే, పుట 115

9. పైదే, పుట 117

10. "భూషించి యచ్యుతాభ్యుదయాది ప్రబంధ
నిర్మాణమున మాకు నిఖిల దేశముల
నిర్మల సత్కీర్తి నెగడు "

[రఘునాథ నాయకుని నల చరిత్ర (ద్విపద), అశ్వాసము 1, ద్విపద పంక్తులు 138 - 140.]

11. డా॥ ఎన్. వెంకటరావు — ది సదరన్ స్కూల్ ఇన్ తెలుగు లిటరేచర్ - "అచ్యుతాభ్యుదయము ఈస్ ఎ ద్విపద కావ్య బయి రఘునాథ డెపిక్టింగ్ ది లయిఫ్ అఫ్ అచ్యుతప్ప నాయక, హిస్ ఫాదర్. దిస్ ఈస్ ది ఫస్ట్ అఫ్ ది టయిప్ అఫ్ అభ్యుదయ కావ్యాస్ ఇన్ సదరన్ స్కూల్", పే 10.

12 ఏ. వీరప్రసాదరావు — రఘునాథ నాయకుని కృతులు - విమర్శాత్మక పరిశీలనము (అముద్రిత సిద్ధాంత వ్యాసము), పుటలు 18 - 19

13. అర్. సత్యనాథ అయ్యర్ — హిస్టరీ అఫ్ ది నాయక్స్ అఫ్ మదుర, పే 127.

14. దక్షిణాంధ్రయుగ వాఙ్మయ చరిత్ర, ప్రథమ భాగము, పుట 22.

15 కురుగంటి సీతారామయ్య తంజాపురాంధ్ర నాయక రాజ చరిత్రము, పుటలు 203 - 209

16. ద్విపద వాఙ్మయము, పుట 336.

17. రఘునాథనాయకాభ్యుదయము, పీఠిక, మల్లంపల్లి సోమశేఖర శర్మ, పుటలు 52 - 56.

18. పైదే, పుట 33.

19 పైదే, పుట 51.

20. పైదే, పుట 52

21. పైదే, అశ్వాసము 1, ద్విపద పంక్తులు 325 - 329.

22. తెలుగులో చారిత్రక వ్యాసములు పుట 251.

23. రఘునాథనాయకాభ్యుదయము, అశ్వాసము 1, ద్విపద పంక్తులు 564 - 581.

—)(—

శ్రీ కలువకొలను సదానంద

# కొడుకూ - కోమలీ

కొండ పైకి వెళ్ళే బస్సెక్కి కూర్చోగానే, కళ్ళలో మెదిలేది గోవిందుడే! మొట్టమొదటి సంపాదన — దిన జీతం పన్నెండు రూపాయలు చేతిలో పడగానే, గుండె చాటున తచ్చాడే కోమలి గుడిసె తలుపు తెరిచి చిరునవ్వుల మరుమల్లెలు పరిచి స్వాగతం చెబుతున్నట్లున్న ఊహా చిత్రం తప్ప మరేదీ పొడగట్టలేదు, హనుమంత కళ్ళకు!

నరుడి కోరిక తీర్చే పాతాళ భైరవిని పదిలపరచుకున్నట్లుగా పన్నెండు రూపాయల్ని పంట్లాం వెనక జేబులో దోపుకుంటూ, గేటు దాటి రోడ్డుమీది కొచ్చాడు హనుమంతు. పిచ్చెక్కిన గుర్రాల గుంపులా పరుగులు తీస్తోంది రోడ్డు. మైలున్నర దూరం లోనే వుంది గూడెం. ఏం చెయ్యాలో తోచని హనుమంతుకు మాత్రం రోడ్డుమీద కాళ్ళు సాగలేదు.

'ఏయ్! ఏంటిదీ! వొదులూ!' .. పది రోజుల క్రితం గుడిసెలో దూరి తాను కోమలిని వాటేసుకున్నప్పుడు ఆమె అనిన ఆ మాట గుర్తుకొచ్చి, అతడి నరాలు జివ్వుమన్నాయి. ఆ మెత్తదనాలన్నీ మళ్ళీ ఓమారు ఒంటిమీద పారాడినట్లనిపించి పులకించి పోయాడతను.

ఇరానీ హోటల్లో టీ తాగి, సిగరెట్లు రెండు కొనుక్కొని గుప్పు గుప్పున పొగవదుల్తూ సినిమాకు బయలుదేరాడు. సినిమా బాగుంది. అందులో రేప్ సీను బావుంది. హీరో హీరోయిన్ల శృంగారం బావుంది. హీరోయిన్ అందచందాలు బావున్నాయి. ఆమె హీరో కౌగిట్లో ఒదిగిపోయినప్పుడల్లా హనుమంతు కుర్ర వయసు బావురుమంటూ ఏడవసాగింది. ఆ కౌగిలి తనదైతే ఎంత బాగుంటుంది! అందరాని చందమామ ఆ హీరోయిన్! కౌగిట్లో యిముడ్చుకుంటే కోమలి చాలుగదా, హీరోయిన్ వంపుసొంపులన్నీ, ముద్దు మురిపాలనీ తలపింపజేయటానికి?

కోమలికి పెళ్ళయింది. పెళ్ళయిన రెండేళ్ళకే పసుపు కుంకం చెరిగిపోగా, పుట్టింటికి తిరిగొచ్చి, ఏకాకిగా వుంటున్న ముసలి తండ్రికి తోడుగా వుంటోంది. గూడెంలోని కోడెకారు చిన్నవాండ్రు కొందరు కోమలి సందిట్లో వయసు పొంగుల వేడి నురగల మీగడ తరగల్ని రుచిచూశారన్న గుసగుసలు గొంతెత్తి చెవిలో కుయ్యిలిడకుండా వుండివుంటే; హనుమంతు ఆ రోజు ఆమెను అలా వాటేసుకుని వుండేవాడు కాదు. అంత ధైర్యం చేసినా, వేడి నురగల రుచి తన నోటికి అందనే లేదు. ఆమె తనను విదిలించిపారేసి, పైట సవరించుకుని, "కడుపు కూటికేడిస్తే, కొప్పు పూలకేడ్చిందంట! రూపాయి సంపాయించే బగిసి లేనోడికూడా ఆడది గావాల! ఓ యబ్బో, మొకం జూడు! నేనేం బండమింద రోలనుకుంటివా, తేరగా దంచుకుపోటానికి? ఫో!" అంటూ ఈసడించింది.

జేబులో డబ్బులున్నాయి, ఇప్పు డేమంటుందో కోమలి?.... ఏమంటుంది? 'శుభం' అంటూ శకునం పలికింది వెండి తెర.

హనుమంతు ఇరానీ హోటల్‌లో చికెన్ బిరియానీ తిని బిల్లు చెల్లించి, మిగిలిన డబ్బు లెక్కపెట్టుకున్నాడు. ఆరు రూపాయలున్నాయి. ఫరవాలేదు, కోమలి ఈసడించుకోదు. పగబట్టి ముసురుకుంటున్న వెన్నెల వేడిని సిగరెట్టు దమ్ములతో తడిపేసుకుంటూ గూడెం చేరుకున్నాడతను.

మకుక్కతూ, మూలుగుతూ గుడిసె బయట అరుగుమీద కడుపులో కాళ్ళు ముడుచుకుని పడుకున్న మునెయ్య కళ్ళల్లో చుక్కలు మెరిశాయి. "అబ్బోడొచ్చేసినాడే లచ్చిమీ! .. ఇంత రేతిరిదాకా ఏంజేస్తా వుంటివిరా నాయినా, తొందరగా యింటికి రాకుండా?"

"టౌన్‌లో వుంటి! " హనుమంతు కాళ్ళు కడుక్కొని యింట్లోకి వెళ్ళాడు. పంట్లామూ చొక్కా విప్పి గోడకు తగిలించాడు. నాలుగు మూరల పంచె కట్టుకుని, సిరిచాప పరుచుకున్నాడు.

"అదేందిరా! తినకుండా పండుకుంటావా? నాలుగు గంజి మెతుకులుండాయి, రా!" అంది లచ్చిమి.

"వొద్దులేయే! నిద్దరొస్తావుంది నాకు. మీరు తాగెయ్యండి!" కళ్ళు మూసుకుని బోర్లపడుకున్నాడు హనుమంతు. తాను వద్దన్న

గంజి అమ్మా అయ్యా తాగారో లేదో అతడు గమనించలేదు. లచ్చిమి దీపం ఆర్పేసి పడుకుంది.

అరగంట గడిచాక, హనుమంతు పైకిలేచి వాకిట్లోకి వచ్చాడు. వెన్నెల గంగవెర్రులెత్తినట్లు గంతులు వేస్తోంది. చందమామ కప్పుకున్న మేలిముసుగులా ఇరవై బారల దూరంలో కోమలి గుడిసె కనిపిస్తోంది. వెన్నెల్లో వేగిపోతూ విసవిసా నడిచాడు హనుమంతు. గుడిసె బయట గంగిరేణి చెట్టు కింద నులక మంచంలో ఒదిగిపోయి గురక తీస్తున్నాడు, కోమలి తండ్రి రాజయ్య. హనుమంతు మెల్లగా ఒడిసె తలుపు తట్టాడు.

తెరుచుకున్న తలుపు సందులో నుంచీ మైనపు ముద్దలా కరిగి మాయమై పోయాడు.

ఇదంతా చూస్తూనే వున్నాడు మునెయ్య.

◆ ◆

కోమలి గుడిసెలోంచి బయటపడి, కొడుకు ఇంట్లోకి రావటాన్ని చూడవలసివస్తుంది కదా అన్న సిగ్గుతో మూసిన కన్ను తెరవలేదు మునెయ్య.

తెల్లవారింది

పెదవి విప్పటానికి ఓపికలేనట్లు, నిలబడటానికి తీరికలేనట్లూ, కాళ్ళకు చక్రాలు తొడుక్కున్న వాడిలా తొందర తొందరగా టౌనుకు వెళ్ళిపోయాడు హనుమంతు.

లచ్చిమి కూలికి వెళ్ళింది. ఒంట్లో శక్తి ఉడిగిపోయి, పనీ పాటా చేసుకోలేని స్థితికివచ్చిన మునెయ్య ఇంట్లోనే కూర్చున్నాడు.

పొద్దు గూట్లో పడేదాకా లచ్చిమి తిరిగిరాదు. క్రితంరోజు నాయుడుగారు ఆమెకు కూలిడబ్బులు యివ్వనేలేదు. పాతబాకీ కింద చెల్లువేసుకున్నాడు. అందుచేత, కాలే కడుపును నిన్న గంజి నీళ్ళతో చల్లార్చుకోవలసి వచ్చింది. పాపం, పరగడుపుతోనే పనికి వెళ్ళింది లచ్చిమి.

మధ్యాహ్నం కాగానే మునెయ్య కడుపులో ఆకలి అగ్గిగా మారింది. మంచినీళ్ళు ముంచి తాగుతుంటే, రాజయ్య యింటి వాకిట్లో నుంచి కోమలి కేకవేసి పిలవటం వినిపించింది. "మావోఁ! ఓ మునెయ్యమావోఁ!"

"ఏవేఁ?" అంటూ బయటికి తొంగిచూశాడు మునెయ్య.

"ఇట్రా! అయ్య రమ్మంటావుండాడు."

తలుపు గొళ్ళెంపెట్టి ఆ యింటికి వెళ్ళాడు మునెయ్య.

"ఏందిరా రాజిగా?"

"ఏరోస్! అయిపోయిందంటే కోమలా?"

"ఇదో! ఎంతసేపులే, ఇంకొక్క నిమషం!"

"కానీ మరి! నీ కొడుక్కేందో ఉద్యోగ మొచ్చిందంట గదరా మునెయ్యా?"

"ఆఁ పదోతరగతి పరీక్ష తప్పినోడికి ఏముద్యోగమొస్తుందిలే? నదువుకు సున్నజుట్టి ఐదారేండ్లు బసవెద్దు మాదిరిగా తిరిగినాడు. ఇప్పుడదేందో చిన్న నౌకరీ ఏసినారు. ఏ పొద్దు జీతం ఆ పొద్దే యిచ్చేస్తారంట! నిన్నట్నుంచీ మొదులు! అదయినా, పరిమినెంటుగాదు. రెండు మూణ్ణెల్లుంటే జాస్తి."

మాటల మధ్యలోనే, అన్నంలో వేడివేడిగా కూరపోసి రెండు కంచాలు తెచ్చి వాళ్ళముందర పెట్టింది కోమలి

"తినరా మునెయ్యా! పావుకిలో మాంసందెచ్చి కూరి జేసింది. ఉడికింది గదా, పెట్టమ్మీ అంటే, మావఁరానీ మావఁ రానీ అని ఒకటే పాట!"

నోట్లో వూరుతున్న నీటిని గుటకవేస్తూ, పొగలు కక్కుతున్న కూరలో చెయ్యి పెట్టాడు మునెయ్య.

"ఏమంటివి? పరిమినెంటుద్యోగం కాదంటావా? ఏదో ఒకటి! మంచికాలం రాకుండానే పోతుందా? చెట్టంత కొడుకు-సాకి సంతరించేస్తాడు. నాకా ఒక కొడుకు లేకపోయె. ఈ తిప్పలుండేవి కావు మాకు!"

మునెయ్య నోట్లో నీళ్ళూరటం ఆగిపోయింది. ముద్ద నోటికి వెళ్ళలేదు. "ఏమీ అనుకోబాకరా రాజయ్యా! ఒళ్ళు అదోక మాదిరిగా వుంది నేను తిన్లేను." అంటూ పైకిలేచాడు. చరచరా బయటకు వచ్చేశాడు.

అతడి వెనకే గుమ్మందాటి వచ్చిన కోమలి "ఏం మావాఁ? నా చేతి కూడు తినగూడదా?" అని అడిగి, టక్కున తల వంచుకుంది.

"ఛా, అదేం మాటే? నీ చేతికూడు తినాలంటే అడిగి రావాల! అదురుష్ట మంటే మీ అయ్యదేనే! నా కొడుకు నాకు బెట్టాల్సిన కూడే అది. దాన్ని నువ్వు పెడ్తే తినాల్సొచ్చింది గదా అని సిగ్గుగా వుంది. ఒసే కోమలా! నువ్వు ఆడపిల్లయితే మాత్రం ఏవేఁ? బుద్ధిమంతురాలివి! తప్పో ఒప్పో, నీకు చేతనైన పన్జేసి, ఏ దిక్కూలేని తండ్రికి పట్టెడు కూడు బెడతా వుండావు. నీ అయ్యకు నువ్వు కూతురివి గావు, కొడుకువి! దయ అనేది లేకపోతే కొడుకెందుకే, నీ బోటి కూతురు మేలు!" అంటూ ఆమె తల నిమిరి, చెమర్చే కళ్ళతో గుడిసెవైపు నడిచాడు మునెయ్య.

## శ్రీ కాకుమాను తారానాథ్

# భాష - సంస్కృతి : అప్పుడు - ఇప్పుడు

ప్రొఫెసర్ జీన్ ఫిలియోజాట్ గత సంవత్సరం అక్టోబరు చివరి వారంలో గుండె పోటుతో, తన 76వఏట పారిస్‌లో మరణించాడు. ఫ్రాన్సులో అధునాతన భారతీయ భాషల ఆచార్యుడుగా జీవితం ప్రారంభించి, 1955 నుంచి 1977 వరకు, పాండిచేరి లోని ఫ్రెంచి ఇన్స్టిట్యూట్‌కు డైరెక్టరుగా ఉన్నారు. అంతర్జాతీయ ఖ్యాతి చెందిన ఫిలియోజాట్ తమిళ, సంస్కృత భాషలలో అనేక పరిశోధనలు జరిపారు. భారతీయ భాషా ప్రేమికుడు.

శ్రీ ఫిలియోజాట్ తన అభిప్రాయాలను నిష్కర్షగా చాటే పండితుడు. నేటికి రెండు దశాబ్దాలకు ముందు నవంబరు 1962 లోనే ఒక విలేఖరి అడిగిన ప్రశ్నలకు సూటి సమాధానాలిచ్చాడు.

మీ దృష్టిలో ఈ దేశపు ఏకత్వాన్ని కాపాడేందుకు ముఖ్యమైన విషయంగా ఏది తోస్తుందో చెప్పగలరా అన్న దానికి సమాధానంగా ఇలా అన్నారు- "ఇండాలజీని నేను అర్థం చేసుకొన్న కొద్దీ - హిందూ మతము, సంస్కృత భాష - ఈ దేశానికి సంస్కృతిని (కామన్ కల్చర్) ప్రసాదించిన మూలకారణాలని (బేసిక్ ఫ్యాక్టర్స్) నేను నమ్ముతున్నాను. అయితే హిందూయిజం అనే మాట పరిధి మనం సంకుచిత భావనతో వాడే 'మతము' అనే దానికంటే విశాలమయింది. హిందూ జీవిత తత్వము, దానిచే నిర్ణయింపబడిన వ్యక్తి యొక్క వ్యక్తిగత సామాజిక నడవడికకు సంబంధించిన సిద్ధాంతాలు ఎంత ఆచరణ యోగ్యంగా మలచబడ్డాయంటే, ప్రపంచమంతటా ఆచరణ యోగ్యాలు కాగలవు. అయినా బాహ్య ప్రవర్తనలో కావలసినంత వైవిధ్యానికి స్థానమిస్తున్నాయి. నేను భారత దేశంలో పర్యటించాను. ఉత్తర భారత గ్రామీణులు కాని, దక్షిణ భారత గ్రామీణులు కాని— పరిశీలిస్తే వారివారి ప్రత్యేకతలలో ఎంతో వైవిధ్యం కనిపిస్తుంది. అయినా వారిలో జీవన మూల్యాల పట్ల ఒకే దృక్పథము, ఆరాధనా పద్ధతిలో, కళాత్మక భావ ప్రకటనలో ఒకే ధోరణి కలిగి ఉండటాన్ని గమనించాను. నా ఉద్దేశ్యంలో సంస్కృతికి ఈ దృక్పథమే పెద్ద శ్రీరామరక్ష. అయితే దేశంలో రకరకాలైన కర్మ కాండలు, నమ్మ వీలులేని అనేక మూఢాచారాలు కనపడతాయి. అంతమాత్రాన ఏ పరిశీలకుడైనా బాహ్యంగా కనిపించే ఈ తంతునంతా హిందూయిజానికి ఆపాదించినట్లయితే, హిందూయిజంలాంటి గొప్ప మతం పట్ల అన్యాయంగా ప్రవర్తించడమే. ఆసియా జాతుల చరిత్రను ఏ కొద్ది పాటైనా సరే తులనాత్మకంగా అధ్యయనం చేసినట్లయితే, భారత దేశము ఏక సంస్కృతి (కామన్ కల్చర్) కలిగి ఉండటానికి హిందూయిజం తప్ప వేరు కారణం కాదని ఎవరైనా ఒప్పుకోక తప్పదు. ఉదాహరణకు ఇండో-చైనా తీసుకోండి. మొత్తం ప్రాంతానికి అనేక సమానతలున్నా, అది విభిన్న జాతులుగా విడిపోక తప్పలేదు. దానికి ముఖ్యకారణం, నా దృష్టిలో, హిందూయిజంలాంటి సామాన్య మతం లేక పోవటమే "

అలాగే సంస్కృతాన్ని గురించి ఇలా అన్నారు— "సూటిగా చెప్పాలంటే కేవలం పురాతనత్వం వల్లకాదు. మతైక భాషగా ప్రారంభమయిన సంస్కృతం, లౌకిక భాష అయింది. దౌత్య వ్యవహారాలలో న్యాయ స్థానాలలో, పరిపాలనా వ్యవహారాలలో, ఉపయోగించబడి ప్రజల దృష్టిలో కూడ గౌరవాన్ని పొందింది. అంతర్‌రాష్ట్రీయ వ్యవహారాలలో కూడ ఉపయోగించబడింది. అశోకుని కాలంలోను, అంతకుముందు, సామాన్య ప్రజల భాష ప్రాకృతము. అపుడు— సుమారు క్రీస్తు శకారంభ ప్రాంతంలో — తన విస్తృత పదజాలం వల్లా, తన అందం వల్లా, వ్యక్తీకరణలో తనకుగల సౌలభ్యం రీత్యానూ —సంస్కృతం ప్రాకృతాన్ని జయించింది. భారత దేశం మొత్తంలోను, ఎక్కడైనాసరే, సంస్కృత మొక్కటే సంప్రదాయ సిద్ధంగా (క్లాసికల్లీ) నేర్పబడుతున్న భాష. అది కేవలం భారతదేశంలోని బౌద్ధులకు, హిందువులకు మాత్రమే కాదు, జపాన్, టిబెట్, ఇండోచైనా, ఇండోనేషియాలోని ప్రజలకు కూడా — మధ్య యుగాల్లో ప్రీతికరమైన భాష అయింది. నిజానికి బౌద్ధము, వైష్ణవము, శైవము మొదలైన మతాలు సంస్కృతభాష ద్వారానే విదేశాలలో ప్రచారమయ్యాయి. చోళరాజుల పాలనాకాలంలో కాంబోడియా, తమిళనాడులమధ్య సాంస్కృతిక సంబంధాలు కూడా సంస్కృతం ద్వారానే సాగాయి. నిజానికి, అన్ని భారతీయ భాషలకూ వెనుకగల ఆత్మ సంస్కృతమే అనేది అందరికి తెలిసిన విషయమే."

తమిళానికి, సంస్కృతానికి గల సంబంధాలను గురించి ఇలా అంటారు- "సంస్కృతం యావద్భారత భాష అయిన తరువాతి దశలో తమిళ మేధావులు దానిని క్రమబద్ధంగా స్వీకరించారు. అలా

జరగటానికి ఒక చిన్న కారణముంది. అప్పటికే తమిళం పూర్తిగా వికసించింది. ఈ పద్ధతిని చూసి భయపడలేదు. ఎందులో శ్రేష్ఠమైన విషయమున్నా దానిని స్వీకరించటమనే తమిళ సంస్కృతితో-ఈ సమన్వయ ధోరణి ఏకీభవించింది. అంతే కాక సంస్కృతం వారికి వాణిజ్య, సాంస్కృతిక రంగాలలో బాగా ఉపయోగపడింది. తమిళనాడులో దీని ఫలితంగా వచ్చిన పెద్ద గొప్ప మార్పు, సంస్కృతంలో భక్తి సంబంధమైన సాహిత్యంపు పెంపుదల, భారతదేశంలోని కోటాను కోట్ల హృదయాలతో తమ తాత్విక చింతనను ఏకం చేసేందుకుగాను, ప్రముఖులైన శంకరులు, రామానుజులు, ఇంకా అనేకులైన తత్వవేత్తలు, భక్తులు, ఋషులు సంస్కృతాన్ని పఠించారు. నేనొక చోట చెప్పినట్లుగా శంకరులు, రామానుజులు దక్షిణాపథంలో సంస్కృతీకరణకు పూనుకున్న ద్రావిడులు (శాన్స్క్రిటైసింగ్ ద్రవిడియన్స్). ఈ సమాసం సంస్కృతభావ పట్ల తమిళుల భావాలను మనం అర్థం చేసుకోవటానికి సహాయం చేస్తుంది. ఈ నాటికీ సంస్కృత పదాలు, భావాలు తమిళంలో కలిసి పోయినట్లు కనపడతాయి.''

తమిళాన్ని "శుద్ధి" చేసే ప్రయత్నాన్ని గురించి ఇలా అంటారు- "తమిళం అభివృద్ధి చెందుతున్న భాష, దాన్ని ఇంకా సుసంపన్నం చేసేందుకు చేసే ప్రతి ప్రయత్నమూ హర్షింప తగిందే. కాని తమిళ సంస్కృతికి, సంస్కృతం పరాయిది అనే భావన ఆధారంగా గనుక 'శుద్ధి' అనే మాట వాడబడితే, దానిని మించిన అర్థరహితమైన విషయం ఇంకొకటి ఉండబోదు. అట్లాంటి ధోరణుల వెనుక తొంగి చూస్తూ, భారతదేశంలోనే కాక యూరప్ ఖండములోకూడ త్యజించబడిన 'జాతి అపోహలు' (రేషియల్ మిత్స్) ఉన్నాయన్న మాట."

ఇంత నిష్కర్షగా వుండేవ్యక్తి కాబట్టే, 1968 జనవరిలో మదరాసులో జరిగిన ద్వితీయ ప్రపంచ తమిళ మహాసభలకు అధ్యక్షత వహించటమే కాకుండా, "ఆర్కియాలజీ అండ్ తమిళ్ స్టడీస్" అనే వ్యాసం కూడా చదివారు. స్వర్గీయ అన్నాదొరై నాయకత్వంలో ఈ మహాసభలు చాలా వైభవంగా జరిగాయి. కాని దురదృష్ట వశాత్తు ఇందులో చాలా "అతి" ధోరణులు వ్యక్తమయ్యాయి. సంస్కృతం కన్నా తమిళమే ప్రాచీన భాష, వీలయితే తమిళమే "లింకు భాష" కావాలి అనేటంత దూరము ఈ ధోరణులు పోయాయి.

ప్రొఫెసర్ ఫిలియోజాట్ తన వ్యాసంలో 'మణి ప్రవాళ' రచనలే కాకుండా తమిళంలోని, సంస్కృతంలోని రచనలను బాగా అధ్యయనం చేయాలని చెప్పారు. నేటి ఇంగ్లీషు భాషవలె, ఒకప్పుడు తమిళ దేశానికి కూడా, సంస్కృతం "లింకుభాష" అని చెప్పారు.

ఇంతకూ 'మణిప్రవాళం' ఏమిటి ? తెలుగు విభక్తి ప్రత్యయాలను చేర్చి, సంస్కృత పదజాలాన్నంతా తెలుగుగా చేసే అవకాశం మనకుంది. తెలుగు, సంస్కృతం విడివిడిగా కనపడుతూ ఒకే వాక్యంలో సమన్వయించితే దానికి 'మణిప్రవాళ' మని పేరు. మణులు, పగడాలు, కలిపి ఒకే దారములో గుచ్చితే వాటి ప్రత్యేకస్వరూపం ఎలా సుస్పష్టమవుతుందో, అట్లా 'మణిప్రవాళ' రచనలో, తెలుగు, సంస్కృత పదాలస్వరూపం స్పష్టమవుతుంది.

ఈ విషయాన్ని మార్చి 1968 'భారతి'లో శ్రీ నిడదవోలు వెంకటరావుగారు "తెలుగు — సంస్కృతం" అనే వ్యాసంలో సులభగ్రాహ్యంగా చర్చించారు.

వారిలా అంటారు "...మన భాషాసాహిత్య విమర్శనలలో అందరును 'దేశభాషలందు తెలుగు లెస్స' అను సూక్తి నుదహరించిన వారేకాని అందలి అర్థముకాని భావముకాని వివరింపలేదు...... ఇచట తెలుగు అనగా కేవలము అచ్చ తెలుగు అను అర్థముకాదు. అట్లయిన ఇది దేశభాషలలో శ్రేష్ఠమగుట కవకాశమేలేదు. ఏలననగా అది కావ్య నిర్మాణమునకు సమర్థమగు భాషకాదు. సంస్కృత పదములు తత్సమములుగా అచ్చ తెలుగులో చేరిన వెనుకనే, భాషాపరిణామము పూర్తియైనదని, అప్పుడే అది కావ్యరచనకు అనుకూలపడినదని ఈపరకే తెలుపబడినది. ఈ అభిప్రాయమును పురస్కరించుకొనియే పూర్వలాక్షణికులు, తత్సమరహితమగు కావ్యమే వుండదని స్పష్టపరిచియున్నారు...... ఒక్క కావ్యభాషయే కాదు తెలుగువారి నిత్య వ్యవహారములో కూడా సంస్కృతపదములు వాడుకలేక దైనందిన కృత్యములే సాగవు. ఇట్లు వ్యవహారమునను, గ్రాంథికమునను సంస్కృతము శరీరమునకు రక్తమువలె ప్రవహించి రెండిటికి విడదీయరాని అనుబంధము సమకూర్చి సంస్కృతములేక తెలుగు లేదని స్థిరీకరించినది. ఇందువల్ల దేశభాషలందు తెలుగు లెస్స అయినది........"

* * *

## మన మహాసభలు

తమిళ ద్వితీయ ప్రపంచ మహాసభలను చూచే, మనం 1968 మార్చిలో గుంటూరులో తెలుగు సంవత్సరాదికి వైభవంగా సభలను జరుపుకున్నాము. (నా దృష్టిలో తరువాత అధికారికంగా జరుపబడిన ప్రపంచ తెలుగు మహాసభలకన్నా ఇవే చక్కగా జరుపబడ్డాయేమో అనిపిస్తుంది). ఈ రెండు మహాసభల ధోరణులు, ఈ రెండు భాషలు మాట్లాడే ప్రజలకు చాలావరకు ప్రతిబింబాలు సుమా

తమిళ మహాసభలలో రాజకీయధోరణులు వేరయినా, విద్వాంసులు మట్టుకు సంస్కృతంకన్నా తమిళానికి ప్రాచీనతను అంటకట్టడానికి సిద్ధపడలేదు. అలాగే తమిళ సంస్కృతి భారతీయ సంస్కృతికంటే విభిన్నమయినదని అనలేకపోయారు. మన తెలుగు సంవత్సరాది గుంటూరు మహాసభలలో 'అతిధోరణులు' కనపడనే కనపడలేదు, పైగా భాషైక్యత కొట్టవచ్చినట్లు కనపడింది.

నాటి గుంటూరు పోస్టుగ్రాడ్యుయేటు సెంటరు అధిపతి డా॥ సచ్చిదానందమూర్తిగారు, ఔత్తరాహుల సంస్కృతిని దక్షిణాదివారికి అందించటంలోను, అలాగే దాక్షిణాత్య భావాలను జీర్ణింపచేసుకొని వాటిని ఉత్తరాదివారికి అందించటంలోను ఆంధ్రులు ఆదినుంచి ఎంతో కృషి చేస్తూ వచ్చారు అని చెప్పారు. శతాబ్దాలతరబడిగా ఆంధ్రభాషా సంస్కృతి ఉత్తర దక్షిణ భారత సంస్కృతులకు వారధిగా వుంటుందని వారన్నారు. ఉపసంహార సభ అధ్యక్ష పీఠంనుంచి శ్రీ పింగళి లక్ష్మీకాంతముగారు "ఏ భాషైనా దృశ్యమాన కాల పదార్థాలు కానవచ్చే విషయాన్ని వ్యక్తీకరించగలగాలి. ఆ శక్తి సంస్కృత భాషకు వచ్చింది. అక్కడనుంచి మనం నేర్చుకున్నాం" అన్నారు.

1968 భవన్స్ జర్నల్ ఆగస్టు ప్రత్యేక సంచికలో "యూనిటీ ఆఫ్ ఇండియన్ కల్చర్" అనే వ్యాసంలో శ్రీ హెచ్.డి. సంకాలియా, ప్రొ॥ఫిలియోజాట్ ప్రపంచ తమిళ మహాసభలలో క్రీ.శ. రెండవ శతాబ్దములో తమిళదేశానికి కూడా, సంస్కృతమే "లింకుభాష" అని ఋజువు చేసారంటూ తన వ్యాసం చివరలో భాషే కేవలం ఈదేశంలో ఐక్యతా సాధకం కాదు అంటాడు. "చేర, చోళ, పాండ్య దేశాలు మూడిటికీ తమిళం లింకుభాష అయినప్పటికీ ఈ మూడుదేశాలవారూ ఎప్పుడూ తమలో తాము యుద్ధం చేసుకునేవారన్న విషయాన్ని మరచిపోరాదు."

* * *

## డాక్టరు రఘువీర

కేవలం ఒక భాష ప్రాచీనత వల్లనే సర్వోత్కృష్టతను దానికంటగట్టలేము. నూత్నమైనంత మాత్రాన న్యూనతను ఆపాదించలేము.

భాషలకొక ధోరణి ఉండాలి. తమను తాము విస్తృతం చేసుకొంటూ ముందుకుపోవాలి. నూతనపదాల నిర్మాణం జరగాలి. ముఖ్యంగా భారతీయ భాషలు తమ ప్రాంతమే కాకుండా, వీలయితే, మిగతా ప్రాంతాలవారికి కూడా అర్థమయ్యే రీతిలో పదనిర్మాణం చేయగలిగితే మరీ మంచిది. దీనికి సంస్కృతం మనకెంతో ఉపకరిస్తుంది. కాని దురదృష్టవశాత్తు తమిళుల ధోరణి దీనికి వ్యతిరేకంగా వున్నది. ప్రాచీనత పేరుతో, సంస్కృతం బదులు శుద్ధ తమిళాన్ని పెట్టడం, ఫలితంగా "శ్రీ" బదులు "తిరు" అనటం, "ఆకాశవాణి" బదులు ఇంకేదో— దీని ఫలితం ఇదివరకు అర్థమయినంతమందికి కూడా తమిళం అర్థంకాకుండా పోవటమే. అంటే వురకలు, పరుగులతో ముందుకు పోవలసిన భాషకు, అడ్డుగోడలు కట్టడమేమోనని అనిపిస్తుంది.

ఈ సందర్భంలో భారతీయ భాషల అభివృద్ధికి తన యావజ్జీవితాన్ని ధారపోసిన స్వర్గీయ డా॥ రఘువీర చిరస్మరణీయుడు. ఆయన దృష్టిలో ప్రపంచంలో శాస్త్రీయ యుక్తిమైన నిర్మాణానికి అనువైన భాషలు మూడు మాత్రమే— లాటిన్, చైనీస్, సంస్కృతం. తన నిఘంటువుకు పరిచయ వాక్యాలలో రఘువీర 520 మూలక్రియలను ఉదహరించాడు, ఇవన్నీ సంస్కృతక్రియలు. కాని వీటిలో 400 అన్నీ భారతీయ భాషలకు సామీప్యమైనవి. ఏదో ఒక రూపములో, 10-11 సంవత్సరాలు, మెట్రిక్యులేషన్ దాకానైనాసరే, భారతదేశములోని ఏ 14 భాషలలో నైనాసరే ఒక దానిని చదివితే, ఈ 400 క్రియల పరిచయం తప్పనిసరిగా జరుగుతుంది. ఈ విధంగా ఈ 520 క్రియలను తన ముడిసామగ్రిగా రఘువీర తన నిర్మాణాన్ని సాగించాడు. మన పద నిర్మాణంలో మనం కేవలం అనువదించటంలేదని, మన భాషలలోకే పారజూచుకొంటూ నిర్మాణాత్మకంగా పరిణామాన్ని కలిగించుకుంటున్నామంటాడు డా॥ రఘువీర.

శబ్దప్రష్ట, ప్రముఖ వేదపండితుడు, సంస్కృత విద్వాంసుడు, వీటినిమించిన హిందీ ప్రేమికుడు, వీటన్నిటినీ మించిన భారతీయ భాషా ప్రేమికుడు, సేవకుడు కాబట్టే 1962 ఆగస్టులో అఖిల భారతీయ భాషా సమ్మేళనాన్ని జరిపి, తన ఆహ్వాన ఉపన్యాసంలో ఇలా అంటాడు "భారత్‌కీ జనతా, చాహే ఉస్‌కీ కోయీ భాషాహో, హిందీ హో, బంగాల్ హో, తామిళ్ హో, కోయీ భీ భారతీయ భాషాహో, హమ్‌కో ఇకట్టే యుద్ధభేరినాద్ కరనాహై. హమారి భాషా యెం హమారి దేశ్ మే చలేంగి, అంగ్రేజీ, అంగ్రేజోంకే దేశ్ మే ఫలేఫూలే పర్ హమ్ ఇస్కో అపనీ దేశ్‌మే న చల్‌నే దేంగే, యహ్ హమారీ ప్రతిజ్ఞాహై. హమారీ సంఖ్యా 98 ప్రతిశాత్ హమ్ జీతేంగె, అవశ్య జీతేంగె."

* * *

ఇంకో ఉదాహరణ ప్రొ॥ హ్యారీ స్పిట్‌బార్ట్ హైదరాబాదులోని సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్‌లో జర్మన్ ఆచార్యులుగా ఉన్నారు. ఆయనకు ఇంగ్లీషు, రష్యన్, సంస్కృతం, ఇండోనేషియన్ భాషలు తెలుసు. ఆయనేమంటాడు? భారతదేశములో ప్రముఖులైన పాణిని, భర్తృహరి, పతంజలి మొదలగువారు చక్కటి వ్యాకరణానికి పునాదులు

వేశారని, మన ఆలోచనకు, భాషకు పొంతన ఉండాలని, ఇంకా ఈనాటి భాషా శాస్త్రవేత్తలు చెప్పేదంతా ఎప్పుడో మన పూర్వీకులు 2000 సంవత్సరాల క్రితమే చర్చించారంటారు. "ది గ్రేట్ ఇండియన్ గ్రమేరియన్స్ పర్ ఆల్సో గ్రేట్ పొయట్స్, ఫిలాసఫర్స్ అండ్ వాట్ మాడరన్ ఫయిలాలజిస్ట్స్ బ్రింగ్ అవుట్ యాస్ న్యూ థీరీస్ హాడ్ బీన్ డిస్కస్డ్ బై దీస్ క్లాసిక్ ఆథర్స్ 2000 ఇయర్స్ అగో."

ఈ పండితుడు ఇండోనీషియాలో ఆదేశస్థులు ఇంగ్లీషు, డచ్ రెండు భాషలను వదలివేసి బహుశా 'ఇండోనీషియా' అనే దానిని పెంపొందించుకున్నారని అంటారు. అలాగే తేలిక అయిన హిందీతో 'భారతీయ భాష' అనే దానిని మన అవసరాలకు పెంపొందించుకో వచ్చు అంటారు. భాషా శాస్త్రవేత్తలకొక హెచ్చరిక చేస్తూ, పదాల యొక్క నిర్మాణము, అర్థము వాటి అవసరాలను మనము అంచనా వేసేటప్పుడు ఒక భాషయొక్క చారిత్రక, సాంఘిక, సాంస్కృతిక 'బ్యాక్ గ్రౌండ్' విస్మరించకూడదని అంటారు.

## మన "భాష" మీద మన "ప్రేమ"

ఇక మన ప్రస్తుతం. మన మాంధ్రులం. ఆ వేశ పరులం, ఆరంభశూరులం. భాషాప్రయుక్తంగా ఆంధ్రరాష్ట్రం ఏర్పడిన వెంటనే ఎప్పుడో, 1955 సెప్టెంబర్ 29ననే మన శాసనసభ ప్రాంతీయ భాషలో పరిపాలన సాగించటానికి తీర్మానించింది.

కాని ఎక్కడ వేసిన గొంగళి అక్కడే వుంది.

నేడు మనం గ్రాడ్యుయేట్ స్థాయిదాకా కూడా 'తెలుగులోనే' చదువ గలుగుతున్నాం. కాని ఉద్యోగాలన్నీ 'ఇంగ్లీషు' ఉద్యోగా లయ్యాయి. 'ఆబ్జక్టివ్' పరీక్షల్లో మనం తట్టుకోలేం. ఇంగ్లీషు, తెలుగు, రెండూ రావటములేదు. ఇంకా మూడోభాష జోలికేంపోతాం!

నేడు ఎంతమందికి మన పూర్వీకులు తెలుగు భాషాభివృద్ధికి కష్టపడింది తెలుసు!

ఉదాహరణకు 1901 లోనే హైదరాబాదులో స్థాపింపబడిన శ్రీకృష్ణదేవరాయ ఆంధ్ర భాషానిలయానికి నాటి మునగాల జమిందారు శ్రీ రాజా నాయని వెంకటరంగారావుగారి పోషకత్వ ముందని, అలాగే వారి పోషకత్వంలోనే 1904 లో హనుమకొండలోని శ్రీ రాజరాజ నరేంద్ర ఆంధ్ర భాషానిలయము ఉద్భవించిందని ఎంతమందికి తెలుసు?

అలాగే నేటి తెలంగాణాలోని ఆంధ్రులలో ఉత్తేజాన్ని కలిగించేందుకు 1921 నవంబరులో ఆంధ్ర మహాజనసభ స్థాపించబడిందని ఎంతమందికి తెలుసు?

1928లో ఆంధ్ర జనకేంద్ర సంఘ సమావేశం నల్గొండలోని సూర్యాపేటలో జరిగి, అందులో ఈ విషయాలను ప్రచారం చేసేందుకు వేతనము మీద గుంటూరుజిల్లా వుస్నవ గ్రామానికి చెందిన వుస్నవ వెంకట్రామయ్యగారిని ప్రచారకులుగా నియమించారని, ఆయన దివ్యంగా పనిచేసాడని మనము గుర్తుంచుకోవాలి.

నాటి నిజాం రాష్ట్రాంధ్రుల రెండవ మహాసభ నల్గొండజిల్లాలోని దేవరకొండలో 1931 ఫిబ్రవరి, మార్చిలలో జరిగితె, సర్కారు ప్రాంతాలనుంచి, నాటి "ప్రజామిత్ర" సంపాదకుడు శ్రీ గూడవల్లి రామబ్రహ్మం, తరువాత తరువాత ప్రముఖ చరిత్రకారుడుగా ప్రసిద్ధి గాంచిన శ్రీ మారేమండ రామారావుగారు హాజరయ్యారని మనము గుర్తుంచుకోవాలి.

శ్రీ వెంకటరామయ్యగారు మే 1933లో, ఆనాటి కరీంనగరు జిల్లాలో హుజూరాబాద్ తాలూకాలో గట్ల నరశింగాపురం అనే గ్రామములో ఆంధ్రోద్యమాన్ని ప్రచారం చేస్తుంటే, రాత్రి 11 గంటలకు పోలీసువారు వెళ్ళి హోం సెక్రటరి మిమ్ములను వెంటనే వచ్చి కలవమన్నారని వారికి తాకీదు అందజేసారు. వారు హైదరాబాదు వచ్చి హోం సెక్రటరీగార్ని కలిస్తే "మీరు రాజకీయాలు ప్రచారం చేస్తుంటే మిమ్ములను మన్ననూరు పంపెదము" అనివున్న తాకీదు వారికి వినిపించాడు. మన్ననూరు మహబూబ్‌నగర్ జిల్లాలో అమరాబాద్ కొండల ప్రాంతంలో వుంది, నాటి నిజాం హయాంలో రాజకీయదోషులను విచారణ లేకుండా నిర్బంధించే స్థలము. అప్పుడు ఉద్యమ క్షేమంకోరి శ్రీ వెంకట్రామయ్యగార్ని ప్రచారక ఉద్యోగంనుంచి విముక్తులను చేసారు. వీరు తరువాత కొన్నాళ్ళు గోల్కొండ పత్రికలో పనిచేసి 1942 ప్రాంతాల్లో గుంటూరుజిల్లాలోని వారి స్వగ్రామమైన వుస్నవకు వెళ్ళిపోయారట.

ఎక్కడి 1928-33 సం॥రాల నాటికాలం! ఆనాటి నిజాంలో కల ప్రయాణసౌకర్యాలేమిటి, ఆ రోజులలో వుస్నవ వెంకట్రామయ్యగారు మారుమూలలో సైతము చేసిన ప్రచారం స్వరూప మెట్టిది! తెలుగు భాషపట్లగల వారి అభిమాన మెట్టిదీ!

అలాంటి మహాపురుషుల కృషితో ప్రారంభమైన మహత్కార్యము యొక్క స్వరూపం, ఈనాడు, అర్ధశతాబ్ది తరువాత ఎట్లావుందో మనము నిస్సందేహముగా ఆత్మ విమర్శ చేసుకోవలసిన సమయ మాసన్నమైంది.

శ్రీ రావి నారాయణరెడ్డిగారు కోరినట్లు ఆంధ్రుల ఐక్యత ఇప్పుడన్నా పరిపూర్ణమవుతుందా!

# చిలుక - పురుగు

కవి కుమారుడు వాహ్యాళి వెడుతున్నాడు ఉదయాన
కాలిబాట వెంట.
కనిపించిందొక సీతాకోక చిలుక-
నవనవలాడే పూలలోని మధువును
సువిలాసంగా చవిచూస్తూ,
విహాయస వీధిలో విహారాలు చేస్తూ.
అంతలో చిలుకకు అవనిమీద అగుపించిందొక
అతిమెల్లగా ప్రాకిపోతూన్న గొంగళి పురుగు.
గొంగళి పురుగును చూచి సీతాకోక చిలుక
నింగి నుండీ నేలకు వ్రాలింది.
పురుగు వద్దకు పోయి పరిపరివిధాల
పరిహసించింది,
వికవిక నవ్వింది,
వెక్కిరించింది.
కవి ఆ దృశ్యాన్ని కనుగొని హృదయంలో
కలత చెందాడు.
అతని కావ్యదృశ్యం
మనో నేత్రానికెలా
కనిపించిందంటే-
పూర్వాశ్రమంలో తానే అయిన వ్యాధుణ్ణి వాల్మీకి
అపహసించినట్లు
నల్లని మేఘాన్ని చల్లని వాన అల్లరి పట్టించినట్లు,
తియ్యని పండు కాయను దుమ్మెత్తిపోసినట్లు,
వృక్షం విత్తును చిన్నచూపు చూసినట్లు,
జీవుడు దేవుడిని చీవాట్లు పెట్టినట్లు!

○●○

# అన్నదాతా! సుఖీభవ!

అవని గర్భంలో అణగి ఉండి
అంబర చుంబి సౌధపు
అద్భుత భారాన్ని మోస్తుంది పునాది.
ధరణి గర్భంలో దాగి ఉండి
దశదిశలా శాఖోప శాఖల్ని
వ్యాపింప చేసిన వట వృక్షపు
భారాన్ని భరిస్తుంది మూలం.
నేల నాలుగు చెఱగులా
మారు మూలల్లో నెలకొని ఉన్న గ్రామసీమల్లో ఉంటూ
పేరు ప్రతిష్ఠల పేరు కూడా తెలియక
నిత్యతృప్తుడై,
నిరంతర కృషిలో నిమగ్నుడై,
ఋషిలా తపోమూర్తియైన కృషీవలుడు
బ్రహ్మాండంగా పెరిగి పోతూన్న పట్టణాలలోని
అసంఖ్యాక నాగరకులకు
అన్నం పెట్టే బాధ్యతా భారాన్ని
అనాదిగా అనంత సహనంతో మోస్తూన్నాడు,
అనంతుడు అనంత భూభారాన్ని మోస్తూన్నట్టు.
అన్నదాతా! సుఖీభవ!

శ్రీ శంకరగంటి రంగాచార్యులు

శ్రీ వంతరాం రామకృష్ణారావు

# ఆంధ్ర వాఙ్మయ చరిత్ర గ్రంథకర్తృత్వ వివాదాలు

ఆంధ్ర వాఙ్మయ చరిత్రలో కొన్ని గ్రంథముల కర్తృత్వము విషయమున వివాదములు బయలుదేరినవి. వాది దౌర్బల్యమే గాని వాద దౌర్బల్యముండదు గాన ఈ వివాదాలు రావణ కాష్ఠమువలె రగులుచునే ఉన్నవి. ఉన్నది కాదనుట, తమ ఊహాపోహలతో ఏదో అల్లుట, చరిత్రపేర చలామణి చేయుట, పాశ్చాత్యుల రాజనీతిలో ఒక భాగము. అదే చరిత్ర పరిశోధన అన్న భావదాస్యమే, ఈ కర్తృత్వ వివాదముల కన్నింటికి, మూలకందము. ఈ వివాద పరిష్కారము నకు మార్గదర్శక సూత్రములు, నేటివరకు ఎవ్వరును రూపొందించ లేదు. అట్టి పరిష్కార సూత్రములు రూపొందించుటయా? ఈ వివాదాల నిట్లే కొనసాగనిచ్చుటయా? కొనసాగనిచ్చినచో ఈ వివాదము లింతతో ఆగవు. ఊహాపోహలతో అల్లిన అల్లికయే సరియైన చరిత్ర పరిశోధన అన్నచో, ఎట్టి అనర్థములు కలుగునో తెలుపుటకు, కొన్ని సరిక్రొత్త కర్తృత్వ వివాదములను సహేతుకముగా ముందు ప్రతిపాదించుచున్నాను.

1) తిక్కన పేరనున్న భారతము తిక్కన రచించినదికాదు కేతన రచించి తిక్కనపేరు పెట్టినాడు.

2) ఆంధ్ర భాషా భూషణకర్త కేతనకాడు. తద్వంశీయు డెవడో రచించి కేతనపేర వెలయించినాడు. అతడు 16వ శతాబ్దివాడు.

3) ఎఱ్ఱన నృసింహ పురాణము వ్రాయలేదు. చదలువాడ మల్లన రచించి, యెఱ్ఱనపేర ప్రకటించినాడు.

4) ఛందోదర్పణ కర్త అనంతుడు కాడు. ఆ వంశీయుడెవడో రచించి అనంతుని పేరుపెట్టినాడు.

5) రాఘవ పాండవీయము పింగళి సూరన వ్రాసినదికాదు. భీమకవి గ్రంథమునే సూరన తన రచనగా ప్రకటించుకొన్నాడు.

6) ఆంధ్ర కవుల చరిత్ర వీరేశలింగము వ్రాయలేదు. గురజాడ శ్రీరామమూర్తిగారి గ్రంథమునే తమపేర వీరేశలింగముగారు ముద్రించుకొన్నారు.

పై ప్రతిపాదనలకు సంగ్రహముగా ఉపపత్తులను వ్రాయు చున్నాను.

I భారతము కేతన వ్రాసి తిక్కన పేరుపెట్టినాడనుటకు ఆధారములు—

1) కావ్యారంభము :- తిక్కన నన్నయ వలెనే నిర్వచనోత్తర రామాయణమును సంస్కృత పద్యముతో ఆరంభించినాడు. ఆయన నిజముగా భారతము రచించియున్నచో ఈ సంప్రదాయమునే అనుసరించి ఉండును. భారతము తెలుగు పద్యముతో ఆరంభమగుటను బట్టి యిది కేతన కృతమని స్పష్టపడుచున్నది. కేతన దశకుమార చరిత్ర తెలుగుపద్యముతోనే మొదలయినది.

2). రాచకార్యములలో నిమగ్నుడైన తిక్కనకు భారతము వ్రాయునంత తీరిక దొరికియుండదు. ఆయన అభిలాషను గుర్తించి కేతన భారత రచనచేసి తిక్కన కర్పించి యుండును. తన పేర నున్నచో హరిహరాద్వైత ప్రచారమున కుపయుక్తముగా ఉండునని భావించి ఆనాటి క్లిష్ట పరిస్థితుల మూలమున తిక్కన అందుకు సమ్మతించియుండును.

3) స్వప్నవృత్తాంతము :- హరిహరనాథుడు తిక్కన స్వప్నమున సాక్షాత్కరించినపుడు తిక్కన తండ్రియగు కొమ్మనను, తనకు సిఫార్సుచేయుటకు తీసికొని వచ్చెననుట పరిహాసనీయముగా ఉన్నదనక తప్పదు. కొమ్మన సిఫార్సు చేయుటకు తిక్కన కలలో కనబడెననుట, తిక్కన భారతము వ్రాసెనని లోకులను నమ్మించుటకే అయి యుండవలెను.

4) లేఖక ప్రసక్తి :- తిక్కన చెప్పుచుండగా కుమ్మరి గురునాథుడు లేఖకుడుగా ఉండెనన్న కట్టుకథ ప్రచారములో ఉన్నది. తిక్కన వ్రాసినాడన్న విశ్వాసము లోకులకు కలిగించుటకు ఈ కట్టుకథ ప్రచారముచేసి యుందురు. లేనిచో నన్నయ శ్రీనాథాదులకులేని లేఖక ప్రసక్తి తిక్కనకు వచ్చుటకవకాశములేదు.

5) పద్యశిల్పము :- "తొడరిన హరునైన దోర్బలంబునఁ దన్ను, మిగులంగ నీఁడను మేటిమాట... ఒరులకైనఁ గైవారమై యుల్లసిల్లు" అన్న విరాటపర్వ పద్యశిల్పము, కేతనోపజ్ఞము. ఇట్టి పద్యము కేతన దశకుమార చరిత్రలో మాత్రమే గలదు. అందు "పరులకైన" అని కేతన వాడినాడు. ఇందు 'ఒరులకైన' అని వాడినాడు. ఇట్టి పద్యశిల్పము నిర్వచనోత్తర రామాయణమునలేదు. కాన భారతకర్త కేతనయే అని తెలియుచున్నది.

6) అంతస్సాక్ష్యము :- "కాంచనమయ వేదికాకనత్కేతనో, జ్జ్వల విభ్రమము వాఁడు గలశజుండు" అన్న విరాటపర్వ పద్యపాదములోని కేతన శబ్దము కేతన కర్తృత్వమునకు సూచన. ఇది అర్జునుడు ద్రోణుని విషయమున చెప్పినది. ద్రోణార్జునులు గురుశిష్యులు. తిక్కన కేతనలు గురుశిష్యులు. కాన కేతనచే ఉజ్జ్వలమైన విభ్రమముగలవాడు తిక్కన అన్న అంతరార్థము దీనిలో కలదు. కాన భారతమును కేతన రచించి తిక్కన పేరుపెట్టినాడని నిర్ణయింపవచ్చును.

**II** కేతన ఆంధ్రభాషా భూషణ కర్తకాదనుటకు నిదర్శనములు—

1) ఆత్మస్తుతి :- ఆంధ్రభాషా భూషణమువంటి అల్పపరిమాణముగల కృతి వ్రాయుచు, కేతన వంటివాడు- "భాషా వేదులు సముఁగని యా షణ్ముఖ పాణినులకు నగునెనయని సంతోషింప" అని ఆత్మస్తుతి చేసికొను ననుట విశ్వసనీయము కాదు. కేతన అంత అనేడమూకుడుకాడు.

2) "ఆ షణ్ముఖ పాణినులకు నగునెనయని" ఆత్మస్తుతిచేసికొన్న లక్షణ కర్త గ్రంథములో, సంస్కృత వ్యాకరణ శాస్త్ర వాసనయే లేదు. ఈ లక్షణ కర్తయెవరో షణ్ముఖ పాణినుల పేర్లు విన్నవాడే గాని వ్యాకరణ శాస్త్రముల మొగము చూచినవాడుకాడు.

3) "బహు పథంబులాంధ్ర భాషకుఁ గలవని యరసి కొనుఁడు" అని ఆంధ్రభాషా భూషణము. బహుపథము లాంధ్రభాషకున్నప్పుడు, "మున్ను తెనుఁగునకు లక్షణ, మెన్నఁడు నెవ్వరును జెప్పరే జెప్పెద" అనుట యెట్లు? ఇది పూర్వాపర విరుద్ధ ప్రసంగము. బహుపథము లాంధ్ర భాషకేర్పడిన తరువాత వ్రాసినదే ఆంధ్రభాషా భూషణమనుట స్పష్టము.

4) త్రిభువనీరాయ పెండారుడు-అన్న దశకుమార చరిత్ర ప్రయోగమునకు ఆంధ్రభాషా భూషణములో గతిచూపలేదు. కేతనయే అయినచో ఇట్టివి గ్రాహ్యములని తెలిపియుండును.

5) త్రాసు :- విజ్ఞానేశ్వరీయములో కేతన 'త్రాసు' శబ్దమును వాడినాడు. ఇది అన్యదేశ్యము. అన్యదేశ్య విభాగమే ఆంధ్రభాషా భూషణమునలేదు.

6) ప్రాణగొడ్డము :- ఈ రూపము దశకుమార చరిత్రలో ప్రయుక్తము. ఇది వైరి పదమన్నచో, ఇట్టి సమాసములు దుష్టములన్న ఆంధ్ర భాషా భూషణోక్తి విరోధించును. సమస్త పద తద్భవమన్నచో, సమస్త పద తద్భవములు లక్షణ గ్రంథమున నిర్దిష్టములు కాకపోవుట విరోధించును.

13వ శతాబ్దమున లేక అర్వాచీన కాలమున ఏర్పడిన రూపము లాంధ్రభాషా భూషణమున కలవు. కాన ఇది అర్వాచీనకృతి కాక తప్పదు. ఎట్లనగా—

7) మెప్పించు :- "కవిత చెప్పి యుభయకవి మిత్రు మెప్పింప" అని ఆంధ్రభాషా భూషణమున ప్రయుక్తము. ఈ రూపము 1580 ప్రాంతమునుండి వాడుకలోనికి వచ్చినది. మెచ్చించు-అన్నదే ప్రాచీన రూపము.

8) చిగురుఁబోఁడి; మొ॥ :- ఆంధ్రభాషా భూషణమున చిగురుఁబోఁడి, తవిరుఁబోఁడి, మెఱుఁగుఁబోఁడి—దేశ్యములుగా నిర్దిష్టములు. ఇట్టి రూపములు 15వ శతాబ్దినుండి వాడుకకు వచ్చినవి. 13వ శతాబ్దికిలేవు.

9) రేఁగు మ్రాఁకులు-అని ఆంధ్రభాషా భూషణములో కలదు. 'రేఁగు' శబ్దము వంటివి ఏకవచనాంతములు 16వ శతాబ్దికి వచ్చిన రూపములు.

10) మచ్చెకంటి :- ఆంధ్రభాషా భూషణములో ఈ బహువ్రీహి ఉదాహృతము. స్త్రీ సమఘటిత బహువ్రీహులే ప్రాచీనములు. 14వ శతాబ్దినుండి యిది క్వాచిత్కముగా వాడుకకు వచ్చెను.

11) గొబ్బాలు :- గొడ్డురాలు—ప్రాచీన రూపము. గొబ్బాలు — 15వ శతాబ్ది రూపము.

12) మల్లె, మొ॥ :- మల్లె, లంజె, గద్దె, ఒల్లె-అను రూపములు కూడ ఒప్పునని ఆంధ్రభాషా భూషణము. అంతేకాక, మల్లెలు-అని లక్షణకర్తయే వాడెను. మల్లియ, లంజియ, గద్దియ, ఒల్లియ—ప్రాచీన రూపములు. మల్లె-వంటివి, 15వ శతాబ్దినుండి యేర్పడిన రూపములు.

13) వినెన్, మొ॥ :- ఆంధ్రభాషా భూషణము వినెన్, కనెన్, కొనెన్-అను రూపములు సాధించుచున్నది. ఇవి 15వ శతా

ట్టిలో వచ్చిన రూపములు. వినియెన్, కనియెన్ కొనియెన్-అన్నవే ప్రాచీనములు.

పై ప్రబల ప్రమాణములను బట్టి ఆంధ్రభాషా భూషణము కేతన కృతము కాదని, 16వ శతాబ్దికి చెందిన తద్వంశీయుడెవడో రచించి కేతన పేరు పెట్టెనని సిద్ధాంతము. ఆ వ్యక్తి పేరు కూడా కేతనయే కావచ్చును.

III ఎఱ్ఱన నృసింహ పురాణ కర్తకాడనుటకు కారణములు—

1) ఎఱ్ఱన తాత, ఎఱ్ఱన భావమున ఆవిర్భవించి నృసింహ పురాణము వ్రాయుమని చెప్పినట్లు నృసింహ పురాణావతారికలో కలదు. ఇది విశ్వసనీయము కాదు. ఎఱ్ఱన కర్తృకమని లోకము నమ్ముట కిది కల్పితము.

2) నృసింహ పురాణకర్త అంతవరకు ఏ కావ్యమును రచించి కీర్తి పొందినవాడు కాడని, క్రింద నృసింహ పురాణ పద్యమువల్ల స్పష్టపడుచున్నది.

"మించిన వేడ్కవీనులకు మిక్కుటమై మధువృష్టి గ్రమ్మ రా
యంచలు గూయఁ గ్రౌంచమునునాదటఁ గూయఁ గడంగు భంగి బా
వాంచిత శబ్దసారులు మహాకవులాఢ్యులు గావ్యశయ్య గీ
లించిన కీర్తి సంగ సుఖలీలకు నేనును గాంక్షఁజేసితిన్."

నృసింహ పురాణమున ఆరణ్యపర్వశేష ప్రసక్తి కలదు. "ఎన్నికమై ప్రబంధ పరమేశుఁడనంగ సరణ్య పర్వశే షోన్నయ మాంధ్రభాష సుజనోత్సవ మొప్పఁగ నిర్వహించితి"(నృసింహ) దీనిని బట్టి ఆరణ్యపర్వ శేషము రచించి ప్రబంధ పరమేశ్వర బిరుదము నెఱ్ఱన పొందినట్లు తెలియుచున్నది. నృసింహ పురాణ కర్త అంత వరకు కవిగా కీర్తిపొందలేదని పై పద్యమువల్ల తెలియుచున్నది. కాన నృసింహ పురాణమెఱ్ఱన కృతము కాదు. నృసింహ పురాణమెఱ్ఱన చరమకృతి అనియు, సత్త్వగుణాతిశయము వలన పై పద్యమున విన యము ప్రకటించెననియు, ఎవరైన వాదించవచ్చును. కాని ఎఱ్ఱనవంటి ఋజు ప్రవర్తనుడు ప్రబంధ పరమేశ్వర బిరుద విభ్రాజితుడు, నృసింహ పురాణముచే కవిగా కీర్తిపొంద నెంచెననుట అసందర్భము. ఆరణ్యపర్వ శేషపూరణమే యెఱ్ఱన ఖ్యాతికి కారణము కాని నృసింహ పురాణముకాదు. స్వగ్రంథ తారతమ్యము నెరుగనంత అవివేకి ఎఱ్ఱన కాడు.

కాన, ఎఱ్ఱన వంశీయుడగు చదలువాడ మల్లనయే నృసింహ పురాణము రచించి యెఱ్ఱన పేరుపెట్టి యుండును. మల్లన తన విప్ర నారాయణ చరిత్రలో ఎఱ్ఱనను పేర్కొనియున్నాడు.

3) వర్ణనలు :- వర్ణనల విషయమున 16వ శతాబ్ది ప్రబంధములకు నృసింహ పురాణము మార్గదర్శకమని వాఙ్మయ చరిత్ర కారులు చెప్పుదురు. అసలిది 16వ శతాబ్ది కావ్యము గనుకనే ఆ కాలపు వర్ణనల ధోరణి చోటుచేసికొనియుండును. ఎఱ్ఱనవంటి సంయమనశీలి, ఔచితీవేత్త యిట్టి ప్రబంధ వర్ణనలకు పాల్పడు ననుట విశ్వస నీయముకాదు.

కాగా, నృసింహ పురాణము మల్లన కృతముగాని ఎఱ్ఱనకృతము కాదు.

IV. భోజరాజీయ కర్త అనంతుడు కాడనుటకు ప్రమాణములు—

1) అర్ధబిందు ప్రాస :- ఛందో దర్పణములో అర్ధబిందు ప్రాస "వ-ట" వర్ణములకే చెల్లునని లక్షణము చెప్పఁబడినది. దీనికి విరుద్ధముగా, వటేతర వర్ణములకును అర్ధబిందు ప్రాస భోజరాజీయ మున ప్రయుక్తము. (భోజరా. 3_226; 4_84; 6_35; 161; 328) భోజరాజీయ కర్తయే ఛందోదర్పణము వ్రాసినచో ఇట్టి వైరుధ్య మునకు తావులేదు.

2) ప్రాసమైత్రి ప్రాస :- బిందు పూర్వకములగు బ మలు ప్రాసమైత్రి నందునని ఛందోదర్పణము. కాని భోజరాజీయములో బిందు పూర్వక బకారము మకార ద్విత్వముతో ప్రాస కూర్పఁబడినది. (భోజరా. 7-231)

3) త్రిప్రాసము :- ఛందో దర్పణమున చెప్పిన త్రిప్రాస లక్షణమునకు విరుద్ధముగా భోజరాజీయమున కకారమునకు రేఫయుత కకారమునకు సంయుతా సంయుత ప్రాస ప్రయుక్తము (భోజరా. 6-273). దీనిని బట్టి భోజరాజీయకర్త, ఛందో దర్పణకర్త వేరు వేరు వ్యక్తులనుట స్పష్టము.

4) పోలిక వడి :- ఛందోదర్పణమున పోలిక వడికి చూపిన లక్ష్యము ము విభక్తి యతికి సరిపడునదిగా ఉన్నది. కాని భోజరా జీయమున ముకారయతి ప్రయోగములు కలవు. (భోజరా. 3-167, 5-61) భోజరాజీయకర్త ఛందోదర్పణము రచించి యున్నచో ముకార యతిని సంగ్రహించి యుండెడివాడనుటకు సందేహము లేదు.

5) దుస్సంధులు :- ఛందోదర్పణమున, తద్ధిల ఉత్స్థితము అను దుస్సంధులు సాధించఁబడియున్నవి. (ఛందో 4-64) భోజ రాజీయకర్త ఇట్టి అపశబ్దములు సాధించుననుట నమ్మశక్యము కాదు.

పై ప్రమాణములను బట్టి ఛందోదర్పణకర్త అనంతుడు కాడ నుట విస్పష్టము.

V రాఘవ పాండవీయము పింగళి సూరన ప్రణీతము కాదనుట కుపపత్తులు—

శ్లేష కవితా ధర్మములు గల కవి రచనలలో అర్థాంతర ఘటన

గల పద్యములు ప్రయత్నముగా జాలువారు చుండును. పింగళి సూరన కళాపూర్ణోదయ ప్రభావతీ ప్రద్యుమ్నములలో ఈ లక్షణము కాన రాదు. కాన శ్లేష కవితాధర్మము పింగళి సూరనకు కలదనుట సందిగ్ధము.

2) పింగళి సూరన రాఘవ పాండవీయమునకు ముందు శ్లేష కవిగా ప్రసిద్ధుడనుటకు ఆధారములేదు.

3) "భీమనతొల్లి చెప్పెనని పెద్దల మాటయేకాని యందునొం, డేమియు నేయెడ న్నిలుచు టెవ్వరుఁగానరు" అని కృతి ప్రేరకుడగు పెద వేంకటాద్రి పలికినట్లు రాఘవ పాండవీయ పీఠిక. ఈ పెద వేంకటాద్రి భీమన కృతికై దేశమంతయు గాలించలేదు గదా! "ఏ యెడ న్నిలుచు టెవ్వరుఁగానరు" అని యెట్లు చెప్పెను? ఇది సూరన వాక్యముగా ఉన్నది గాని పెద వేంకటాద్రి వాక్యముగా లేదు. భీమన కృతికై యెవరును ప్రయత్నించకుండ నివారించుటకు పింగళి సూరన ఇట్లు గడుసుగా ప్రకటించి యుండును.

4) భీమన రాఘవ పాండవీయము పింగళిసూరనకు లభించి యుండును. అరుదైన గ్రంథము పండితులకు లభించినచో టీకలు వ్రాయుదురు. పింగళి సూరన, కవి కనుక తన పేరనే ప్రకటించుకొని యుండును.

5) "తాళీదళ సంపుట ప్రకట కాంతారంబులో నర్థపుం దెరువాటుల్ తెగఁగొట్టి" అన్న మనుచరిత్రకు కవి నిందను బట్టి గ్రంథ చౌర్యము నాటి కవుల కొక అపలక్షణముగా నుండెనని తెలియుచున్నది.

పై కారణములను బట్టి భీమన కృత రాఘవ పాండవీయమును పింగళి సూరన తన పేర ప్రకటించుకొని యుండునని నిర్ణయించ వచ్చును.

**VI** ఆంధ్రకవుల చరిత్ర వీరేశలింగ కృతము కాదనుటకు ఆధారములు——

1) కవుల చరిత్ర పరిశోధనాత్మక గ్రంథము. వీరేశలింగము గారు వ్రాసిన పద్యములనే సరిదిద్దుకొను అలవాటులేనిపద్య రచయిత. ఇట్టి మనస్తత్వము గల వ్యక్తికి కవుల చరిత్ర వ్రాయు ఓర్పు కలుగుట దుర్లభము.

2) సంఘ సంస్కరణ కార్యములతో, కోర్టుల వెంబడిని తిరుగుటతో తీరికలేని వీరేశలింగముగారికి పరిశోధనాత్మక రచన చేయు తీరిక దొరుకుట అసంభవము.

3) ధర్మశాస్త్రములను తెప్పించియు వాటిని పూర్తిగా చదువుటకు తీరికలేక, అక్కడక్కడ శ్లోకములను పూర్వాపర సందర్భ శూన్యముగా గ్రహించి వితంతు వివాహ శాస్త్ర చర్చ చేసిన వీరేశలింగముగారికి కవుల చరిత్ర వ్రాయు ఓర్పు నేర్పు ఉన్నవనుట ఎంత మాత్రము నమ్మశక్యము కాదు.

4) వీరేశలింగముగారే కవుల చరిత్ర రచించి యున్నచో ఆంధ్ర కవుల స్వప్న వృత్తాంతములన్నింటిని తప్పక ఖండించి యుండవలెను. మూఢ విశ్వాసములని తమకు తోచిన విషయము లెక్కడ ఉన్నను ఆయన ఖండించకుండ ఉండలేరనుట సర్వవిదితము. ఇట్టి ఖండన మొక్క అప్పకవి విషయముననే ఉండి తక్కినవారి విషయమున లేకుండుటచే అన్యవ్యక్తి రచించిన కవుల చరిత్రలో అక్కడక్కడ కొన్ని విషయములు చేర్చి తమ పేర వీరేశలింగముగారు ప్రకటించుకొనియుందురని అర్థమగుచున్నది.

5) కవుల చరిత్ర పునర్ముద్రణ పేర మదరాసు వెళ్ళిన వీరేశలింగముగారు తాము సేకరించిన చారిత్రికాంశములు ట్రాము బండిలో మరచి పోయినామనుట మిడతంభట్ల జోస్యము కథవలె నున్నది గాని విశ్వసనీయముగా లేదు. చరిత్ర విషయములు సేకరించుట ఆయన మనస్తత్వమునకు విరుద్ధము.

6) జనశ్రుతిలోని కథలను సేకరించి కవుల చరిత్ర మొట్టమొదట ప్రకటించిన గురజాడ శ్రీరామమూర్తిగారే చారిత్రిక దృష్టితో ఆంధ్ర కవుల చరిత్ర రచించి యుందురు. ప్రామాణ్యము కలుగుటకు వీరేశలింగము గారికిచ్చి వేసియుందురు. అక్కడక్కడ చేర్పులు మార్పులుచేసి వీరేశలింగముగారు తమపేర ప్రకటించుకొనియుందురు.

కాగా, ఆంధ్ర కవుల చరిత్ర వీరేశలింగ కృతము కాదన్నది సిద్ధాంతము.

ఇదే ధోరణిలో ఏ గ్రంథ కర్తృత్వమును గూర్చి అయినను ఏవో ఉపపత్తులు కల్పించవచ్చును. అట్లు కల్పించుట సరియైన మార్గమగునా? దీనివల్ల వాఙ్మయ చరిత్రకు కలుగు లాభమేమి? ఇది నేలవిడిచిన సాముకాదా? విజ్ఞులాలోచించ వలసి ఉన్నది. గ్రంథ కర్తృత్వ వివాద పరిష్కారమునకు కొన్ని సూత్రములు రూపొందించుట ఆవశ్యకము. కొన్ని ముఖ్య సూత్రములు——

1) కళంకా పాదకములగు రచనల విషయమున తప్ప, గ్రంథస్థ ప్రమాణములను కాదనరాదు.

2) వైరుధ్యములు కన్పించినచో సమన్వయ దృష్టితో పరిశీలించవలెనే కాని విపరీత ధోరణి నవలంబించరాదు.

3) ఊహాపోహలే ఉపపత్తులనుకొని గ్రంథకర్తృత్వములను తారుమారు చేయరాదు.

4) పరిశోధకులు న్యాయవాదులవలె స్వవాద స్థిరీకరణమే ప్రతిష్ఠగా భావించరాదు.

5) వివాద పరిష్కారములలో పరిశోధకులు న్యాయమూర్తుల వలె "బెనిఫిట్ ఆఫ్ డౌట్" అన్న సూత్రము నవలంబించవలెను.

పై పరిష్కార సూత్ర నిర్మాణావశ్యకతను గుర్తించుటకే ఈ వ్యాసముద్దిష్టమని పాఠకులకు మనవి.

# "యమా! రా!"

## "రాయవి"

'ఆశ ఖరీదు అణా' చదివి
పరవశించి పరుగులెత్తాను

చుట్టుముట్టు చీకటిని
తిట్టుకుంటూ కూచోక
వెలిగించానో దివ్వె నేను
చిన్నదనే ఒగులు మాని

తల పండిన మేధావుల
ఫ్యూచరాలజీని చదివి—

యుగాంతం రాబోదని
తనకాపు తాను చూసుకు
మన మనుగడకవసరమౌ
పరిస్థితిని కల్పించడం
ప్రకృతికి చేతౌనని
సెల్ఫ్ బాలన్స్ సిస్టమునీ
సంతోషంతో రెట్టింపయ్యా.

ఇంధనానికి కరువు రాదని
భాను కిరణం చల్లబడదని
జెనెటిక్ కోడ్ మార్పుచేసి
గాలిమీద బతకొచ్చని
ఆశతో నమ్మకంతో
బతుకుతున్న హ్యూమనిస్టుని.

కాన్నోనో ఎస్కేపిస్టుని
కానేకాదు శాడిస్టుని
అసలేకాదు పెసిమిస్టుని
సిసలైన ఆప్టిమిస్టుని.

ఐనా—
చేతులు బారజాపి
మృత్యువు నాహ్వానిస్తున్నా.

ప్రకృతికి ప్రళయానికి
మృగాలకూ మృత్యువుకూ
దేనికీ భయపడని నేను
భయంతో కంపిస్తున్నా
తోటి మనిషి నీడచూసి
దరికానని స్వార్థం చూసి

తన కడుపు నించి కోరదు
కూడబెట్టు గుణం లేదు
లేదు దానికి భావి చింత
అన్యప్రాణి మిన్న ఔను
పోగుచేయు మనిషి కంటె

ఆకలి లేని భోజనం
అదో విధి మైథునం
దాహం లేని తాగడం
మనిషికే చేతౌను.

తను మొదలు తదుపరిసంతతి
వారి వారి సంతతులు
అర్హతతో లేదు నిమిత్తం
కావాలంతా సంపన్నులు
అందుకోసం కూడబెట్టు
తన్నుమాలి ధర్మం
మొదలు చెడ్డ బేరం

వేట కూటికి జంతువుకు
హింస వినోదం మనిషికి

అందుకే
ఇమడలేక సమాజంలో
నా చేతులు బారజాపి
మృతిని కౌగలిస్తున్నా!

## శ్రీ సర్దేశాయి తిరుమలరావు

# మానవాత్మలో సమ సమాజం

(గత సంచిక తరువాయి)

ధర్మరాజేమి తక్కువ తిన్నాడా? తల్లి కన్నెపిల్లగా వున్నపుడు తప్పుచేసింది, కర్ణుడు పుట్టినాడు. ఈ సంగతి ఆమె ధర్మరాజుకు సకాలంలో చెప్పలేదు కాబట్టి కర్ణుణ్ణి పాండవులు చంపినారు. ఈ ఘోరానికి ధర్మరాజు చాల బాధపడతాడు. ఇంతవరకూ బాగుంది. తర్వాత ఈ విషయం రహస్యంగా ఎందుకుంచినావు. రహస్యాన్ని దాచి వున్నందున కదా "యింతపుట్టె" అని పలికి అక్కడికీ నిలుపక.

అంగనాజనమ్ములకు రహస్యరక్ష
ణంబు నందలి శక్తి మనంబులందు
గలుగకుండెడు మెల్లలోకములనని శ
పించెనా ధర్మదేవతా సుతుండు.

[మహాభా. శాంతిప. అ1. ప. 41]

స్త్రీలకింక మీద నోట్లో నువ్వుగింజ వేస్తే నానకన్నా ముందే వాళ్ళు తమకు తెలిసింది ఇంకొకరికి చెబుతారుగాక అని శాపమిస్తాడు ధర్మదేవతా సుతుడు. ఇటువంటి స్త్రీలు, తమవారికీ, సంఘానికీ, దేశానికీ న్యూసెన్సు అవుతారనే దూరదృష్టి ఈయనకు లేదు.

స్త్రీలూ, సమానప్రతిపత్తిగల వ్యక్తులనీ, విశ్వసనీయులనీ, బాధ్యతాయుతులనీ మన పెద్దలు భావించలేదు. స్త్రీలు రెండవ తరగతి పౌరులుగా పరిగణింపబడ్డారు. వాళ్ళగురించి పెద్దలు ఒక విధమైన ప్రోత్సాహక బుద్ధితో వ్యవహరించినారు. వారిని పూజించనైనా పూజించండని మనువు అంటాడు కానీ ఆమెకు స్వాతంత్ర్యమీయడు. తండ్రి, మగడు, కొడుకు ఎవరి పంచనో పడివుండ మంటాడు. పైగా అనుమానస్థుడు. తల్లితోగానీ, సోదరితోగానీ, బిడ్డతోగానీ ఏకాంతంగా కూర్చోవద్దు. ఇంద్రియాలు బలవంతాలు అంటాడు. మన వాళ్ళు స్త్రీని స్త్రీగా చూడరు. పనుల్లో దాసివలె, సలహాయిచ్చే దాంట్లో మంత్రివలె, వడ్డించేటపుడు తల్లివలె, మరొక సమయంలో రంభవలె అవతారం ఎత్తమంటారు స్త్రీని. కన్నుదోయికి నన్యకాంతలడ్డంబైన మాతృభావన చేసి మలలు వాడట ప్రహ్లాదుడు. పైకేమో బాగుంది. కాని ఆలోచిస్తే అశ్లీలమైన అర్థం వస్తుంది. అన్యకాంత తన తండ్రికి భార్యగా వుండవలెనని దీని అర్థం. అన్యకాంత అడ్డమైతే ఈమె అన్యకాంతలే అని మలలకూడదా?

తల్లిగా కాక అన్యస్త్రీ గౌరవనీయ కానేకాదా? స్వంత ఆస్తిలో స్త్రీ ఒక భాగంగా పరిగణింపబడే వఱకు స్త్రీ ప్రతిపత్తి బానిసత్వం గానే, ఆస్తిలో ఒక భాగంగానే ఉంటుంది. స్త్రీ లైంగిక జలదారిగానే పరిగణింపబడుతుంది. స్త్రీ గడప చాపగానే పరిగణింపబడుతుంది. స్వలాభానికి దోచుకొనే ఆర్థిక వ్యవస్థలో అన్ని నీతినియమాలూ స్వంత ఆస్తి పరిరక్షణ చుట్టూ అల్లబడి యుంటాయి. భార్యపేరుతో ఆస్తి వ్రాస్తారు. స్త్రీయంటే కనికరం వల్లకాదండి. భార్య = ఆస్తి కాబట్టి. అదీ కాకుండా ఏడేడు జన్మాలకీ నీవే పతివి అని ఆమె వ్రతాలు, నోములు చేస్తుంటుంది కదూ? ఇక ఆస్తికి ఢోకాలేదు. ఆస్తి అద్దరాటం అయిందా, భార్యకూడ విసర్జనీయ మాలిన్యంవలె అవుతుంది. 1970లలో భూపరిమితి చట్టం అమలులో వచ్చినప్పుడు, వున్న భూమినీ కుటుంబానికి దక్కించుకొనేందుకు, భూస్వాములైన భర్తలు భార్యలకు ఉత్తుత్తి విడాకులిచ్చి దాని వల్ల పర్యవసించిన రెండు కుటుంబాలకు సరిపోయే భూమిని ఉంచుకొన్నారు. భార్యనూ "ఉంచు" కొన్నారు. ఈ మాజీ భార్య ఆస్తికోసం ఉంపుడుకత్తెగా ఉండటాని కంగీకరించిందన్నమాట! ఇదీ స్వంత ఆస్తిలోని నీతిసారం. ఆస్తి వ్యవస్థపోతే, ఇప్పుడు మనం సుగుణాలుగా, ధర్మాలుగా, నీతులుగా ఎంచే ఎన్నో చప్పున అంతరిస్తాయి.

ఉదాహరణకు : దానధర్మాలు, త్యాగం, పరోపకారం, యుద్ధవీరం, దయ, పొదుపు, కర్మ, భయభక్తులు, పుణ్యపాపాలు.

ఆస్తి వ్యవస్థపోయి సమసమాజం వస్తే ప్రాముఖ్యం వహించే సుగుణాలు:- మానవత, అహింస, సహకారం, సమత, స్వాతంత్రత, వ్యక్తిత్వం, ఆత్మవిశ్వాసం, అంగడి వెచ్చం బెట్టని కళాభిరతి, శ్రమ పితం, సహానుభూతి, ప్రవర్తనా నియమావళి, పాలనాతత్పరత.

ఆర్థికమైన మిట్టపల్లాలు పోయేదెట్లా? స్త్రీల దుర్గతి బాసేదెట్లా?

ఆర్థికమైన మిట్టపల్లాలు, ఒక రాబిన్‌హుడ్, ఒక సర్వాయి పాపడు, ఒక "అగ్గిరాముడు" ల సాహసకృత్యాలతో పోవు. స్త్రీల

దుర్గతి "శశాంక విజయం" లోని తార, చలం హీరోయినుల "లేచిపోవడాల" వలన సమసిపోదు.

పరిమిత వనరులను సమష్టిగా అనుభవించే వ్యవస్థలోనే ఇది సాధ్యం.

పరిమిత వనరులను ఏ పద్ధతిలో సంబాళించుకోవలెను? ఏ పంపిణీ విధానం మంచిది? వనరులను పంపిణీచేసేందుకు ఏడు విధానాలున్నాయని బెర్నార్డ్‌షా, బుద్ధిమంతురాలికై వ్రాసిన పుస్తకంలో వివరించినాడు.

దిగువ పట్టికలో ఏడు పద్ధతులూ, వాటికి అభ్యంతరాలూ ఇవ్వబడినవి. తుదకు సమసమాజ, అంటే సోషలిస్టు పద్ధతే, పరణీయం అని నిర్ధారింపబడినది :

## వనరుల పంపిణీ

| సంఖ్య | పద్ధతి | అభ్యంతరం |
|---|---|---|
| 1. | ఎవరు ఎంత ఉత్పత్తి చేస్తారో వారి కది యిచ్చివేయుట | ఇది పిచ్చి పద్ధతి |
| 2. | ప్రతి ఒక్కరికీ వాని యోగ్యతమేరకు ఇచ్చుట | యోగ్యత నిర్ణయించేదెవరు ? |
| 3. | ఎవరెంత దక్కించుకొంటే వారికది ఉండిపోవడం | సాదులు పేదవారల సంగతేమి కావలెను. |
| 4. | ఒకనికి ఎక్కువిచ్చి, తతిమ్మా వాళ్ళకి బ్రతుకడానికి బొటాబొటి సరిపోయేంత ఉండనిచ్చుకోవడం | ఇప్పుడున్న పరిస్థితి ఇదే. దీనిని మార్చవలెననేకదా మన ఆశయం. |
| 5. | అందరూ పనిచేయవలసిందే కాని వివిధ వర్గాలకు వివిధ రీతుల పంపిణీచేయవలె | ఇది వర్గ అసమానతలకు దారి తీస్తుంది. |
| 6. | స్వేచ్ఛావిపణి | ఇది పెట్టుబడిదారీతనం. స్వంత ఆస్తి విధానం. |
| 7. | " సోషలిజం " = సమ సమాజం | నిరభ్యంతరకరం. |

మొట్టమొదటి ఆధునిక సోషలిస్టు, ఫ్రెంచివాడైన బా బీ ఫ్ (1796). హింస ద్వారా అధికారం చేజిక్కించుకోవడం, రహస్యమంతనాలూ, తక్కువ సంఖ్యలోగల వైప్లవికులు ప్రభుత్వాన్ని నడుపడం మున్నగు విధానాలు రూపొందించిందితడే. మార్క్స్-ఎంగెల్స్-లెనిన్-స్టాలినులు ఇతని విధానాలనే అనుసరించినారు. సోషలిజం అనే మాట 1830లలో ఫ్రాన్సులో చలామణిలోకి వచ్చింది. ఫ్రాన్సులో సైంట్ సైమన్, చార్లెస్ ఫొరియరు అనే వార్ల మౌలిక భావాలు సోషలిజంకు ఆధారాలు. ఫొరియరు సోషలిస్టు స్వప్నం ఎంత ఆకర్షకం అంటే సోషలిస్టు వ్యవస్థలో ఉప్పునీటి సముద్రం నారింజ రసం అవుతుందట. పులి, సింహం మొదలైన క్రూరమృగాలు సైతం మానవునికి తోడ్పడతాయి అంటారు. ఇతని సోషలిస్టు వ్యవస్థ మహాభారతంలోని కణ్వాశ్రమం బోలి వుంటుందని మనం భావించుకోవచ్చు. వీరికి దాదాపు సమకాలికుడు రాబర్టు ఓవెన్ అనే ఇంగ్లిషు పారిశ్రామిక వేత్త. ఆచరణ సాధ్యమైన సోషలిస్టు సూత్రాలని చేయడమేకాక, వాటిని తన నూలు మిల్లులలో కార్మికుల యోగక్షేమాలకై అనువర్తించచేసినాడు. జర్మన్ ఆదర్శవాదాన్నీ, బ్రిటిష్ ఆర్థిక శాస్త్రాన్నీ, ఫ్రెంచి సోషలిజాన్నీ సమ్మిళితం చేసి మార్క్స్ శాస్త్రీయ సోషలిజంను ప్రతిపాదించినాడు. సోషలిజంలో చాలా "బ్రాండు" లున్నాయి. మోర్ యొక్క అతల సోషలిజం, సైంటు సైమన్ ఆలోచనాత్మక సోషలిజం, ఫొరియరు కమ్యూనిజం, ఓవెన్ ఆచరణాత్మక సోషలిజం, మార్క్స్ శాస్త్రీయ సోషలిజం, చార్లెస్ కింగ్సులే క్రైస్తవ సోషలిజం, ఫేబియన్ సోషలిజం, కోల్ యొక్క గిల్డు సోషలిజం, హిట్లరు బ్రాండు నేషనల్ సోషలిజం, మన దేశంలో గాంధీ సోషలిజం, మానవేంద్రనాథరాయ్ నవీన మానవీయ సోషలిజం.

ఇంతకీ సోషలిజం అంటే ఏమిటి అనే ప్రశ్న మిగిలిపోయింది. సోషలిజం అంటే :-

1. సర్వసమానత. ఇదికాక పోతే సోషలిజం మరేమీకాదు అంటాడు షా.
2. ఒక విలువ.
3. పరిమిత వనరులను సర్వజన హితానికీ, సర్వజన సుఖానికి (బహుజన హితాయ, బహుజన సుఖాయ కాదు) తార్కికంగా, శాస్త్రీయంగా వినియోగించడం.

4. స్వంత ఆస్తి పద్ధతి లేకుండుట.

5. అందరికీ సమానావకాశాలుండడమే కాకుండా ఆ అవకాశాలను ఉపయోగించుకొనే వాతావరణాన్ని కల్గించే పద్ధతి.

సమసమాజం ఏర్పడితే జీవిత మెట్లుంటుంది. అనే ప్రశ్న వస్తుంది. ముఖ్యంగా మధ్యమ తరగతి వనస్కృతకలవారికి సమసమాజ మన్నా, విప్లవమన్నా భయాందోళనలు కల్గుతాయి. ధనవంతునికి తెలుసు, తన ధనమంతా ఎప్పుడో ఒకప్పుడు ఊడ్చుకపోతుందని. వాడు విప్లవానికి సిద్ధమై కూర్చున్నాడు. పేదవాడన్నామా? వాడు పోగొట్టుకొనేదేముంది — సంకెళ్ళు తప్ప. వాడూ విప్లవం అంటే 'రెడీ'యే. హృదయం ధనం మీదా, కాళ్ళు దరిద్రం మీద పెట్టుకొని జీవించే మధ్యమ తరగతివాని పరిస్థితి ఇరకాటంలో పడుతుంది. అన్ని నీతులకూ, సంస్కృతులకూ తానే ప్రతీక అనుకొంటాడు మధ్యమ తరగతి మనిషి.

సమసమాజంలో ఎట్లా ఉంటుంది ?

1. స్వంత ఆస్తి పద్ధతి ఉండదు.

2. పొలాలు, ఫ్యాక్టరీలు అందరికీ చెందుతాయి.

3. దినదిన జీవితంలో కార్మికునికీ సమాజ పర్యవేక్షకునికీ (సమ సమాజంలో ప్రభుత్వాధికారులుండరు. పర్యవేక్షకులుంటారు. వీరికి విధులేకాని అధికారాలుండవు) జీవన స్థాయిలో భేదం వుండదు. కార్మికునికి లేని సౌకర్యం పర్యవేక్షకునికీ ఉండదు.

4. మనిషి తన శక్తిని ఉద్యోగ క్రియా తృప్తికీ స్వీయ వ్యక్తిత్వ సాధనకీ ఉపయోగిస్తాడు: ధనార్జనకూ, అధికార చెలాయింపుకూ దుర్వినియోగం చేయడు. ఎట్టి ప్రావీణ్యంగల ఘనవ్యక్తి కూడా సామాన్య కార్మికునివలె జీవించవలసిందే.

5. ప్రతి వ్యక్తికీ కష్టంకాని జీవితం గడపడానికి ఏర్పాట్లుంటాయి.

6. సైన్యం ఉండదు. సమసమాజ స్థాపన "వసుధైక" వ్యవస్థకు[12] దారి తీస్తుంది.

7. పోలీసులు, స్కౌటులూ ఉంటారు. ట్రాఫిక్ కంట్రోలుకూ, ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కొనేందుకు జనులకు తోడ్ప డేందుకూ, ముసలివాళ్ళకూ, పిల్లలకూ, అంగవికలులకు సహాయ చేయడం వీరి పని.

8. భిక్షాటనం ఉండదు. అంగసౌష్టవం, తగ్గవయసు కలవా ఉపాధి ఇవ్వబడుతుంది. ముసలివాళ్లు విశ్రాంతిసదనానికి పం బడతారు. అంగవికలులు వైద్యహాస్టళ్ళకు పంపబడతారు. పిల్లలు కే. జీ. లలో విద్య నేర్చుకొనేందుకు పంపబడతారు. స సమాజంలో వీరలే ప్రత్యేక హక్కుదారులు.

9. ఆకలితో ఎవరూ చచ్చిపోరు. బలవంతానైనా తినిపిస్తారు. సావ హిక వంటసాలలుంటాయి.

10. సక్రమంగాకానీ, అక్రమంగాకానీ పుట్టిన సంతానాలన్నిటినీ సః జమే భరిస్తుంది. పోషిస్తుంది. విద్యగరువుతుంది. ఉద్యోగమిస్తుం

11. కుటుంబ పద్ధతి పోతుంది. సహకార జీవనం ఉంటుంది. ఇంటిలో వివిధ వర్గాలవారూ, మతాలవారూ సహజీవన చేస్తుంటారు.

12. స్త్రీకి ఆర్థిక భద్రత, స్వేచ్ఛఉన్నందువల్ల, వేశ్యావ్యవస్థవుండ

13. ఏకాంతంలో తన ఆత్మనుగానీ, తన సృష్టికర్తనూ (అటువం వాడున్నాడని విశ్వసించేపక్షంలో) ఆరాధించేదే మతంగా ఉంటుం కాని, బహిరంగప్రదర్శనంగా, ఆర్భాటంగా, ఇతరులకు మ క్షోభ, తొందర కలిగించేదిగా ఉండదు.

14. నిరుద్యోగ సమస్యఉండదు. ఉన్న ఉద్యోగాల సంఖ్యకు పోయే ఉద్యోగ అభ్యర్థులు లేని సమస్య ఉంటుంది.

15. శాస్త్ర, సాంకేతిక విజ్ఞానం, బాధను, రోగాన్నీ, అలసటనూ వే కనూ తగ్గించేందుకూ, ఆనందం, సౌకర్యం, ఆరోగ్యం, ఉత్సాహ పెంపొందించేందుకుపయోగింపబడుతుంది. కష్టపు పనుల రోతపు పనులను యంత్రాలే చేస్తాయి. మనిషి ఆనందకర, స నాత్మక పనులూ, ప్రణాళికలు మాత్రమే చేస్తాడు.

16. ప్రతివానికి, తన వ్యక్తిత్వంలోని సంపూర్ణశక్తులను అభివ జేసుకొనే నిజమైన పరిస్థితులుంటాయి. ఆ వ్యక్తిత్వం క శాస్త్రం, తత్వం సంబంధికావచ్చు.

---

[12] వేదంలోని "యత్రవిశ్వం భవత్యేక నీడం", రామాయణంలో "వసుధైవకుటుంబకం", వేమన "ఉర్విజనులకెల్ల ఒక్క కంచముబె థామస్ పెయిన్ "ప్రపంచం నా ఇల్లు", వెండల్ విల్కీ " ప్రపంచం" మున్నగునవి "వసుధైక" వ్యవస్థసాధ్యమే అని భర ఇస్తున్నాయి.

17. సమ సమాజంలో అందరూ విరక్తులే. అందరూ కర్మయోగులే. కర్మలోనేకాని, తత్ఫలితంలో అధికారంలేనివాడు విరాగి, కర్మయోగి.

18. ఏలాగో ఒకలాగు డబ్బువెనుకవేసుకొన్న విరామ వర్గాలుండవు, ప్రయోజనకారిపనులు (కృషి, పరిశ్రమ, కళ, శాస్త్రం, తత్వం, శిక్షణ, ప్రణాళికా రచన సమాజ పర్యవేక్షణ) చేసే వాళ్ళందరికీ తత్తదుచిత విరామం, విశ్రాంతి ఉంటాయి. పని దొంగలుండరు. పని తప్పించుకొనేందుకు జబ్బు నటించే మనస్తత్వం ఉండదు.

19. జైళ్లు ఉండవు. కోర్టులుండవు. సివిల్ వ్యాజ్యాలుండవు. పాత వ్యవస్థావాసనవల్ల ఎవరన్నా నేరాలు చేస్తే, వారిని మానసిక వైద్యశాలలకో, సంస్కార శిక్షణాలయాలకో పంపి, సమాజోప కారక సభ్యులుగా చేస్తారు.

మానవుని ఇచ్ఛాశక్తి అంతుపట్టే అంశంకాదు. అన్ని వ్యవస్థలూ, అన్ని విప్లవాలూ, అన్నిమేళ్లూ మానవుని సంకల్ప శక్తితోనే సంభవిస్తాయి. ఇచ్ఛాశక్తి ఆత్మగతం. మనిషి 'నేను' అనే అంతరంగపు నిలదొక్కుకోవడమే ఆత్మ.

ఆత్మ అంటే ఏమో దృష్టాంతాలిస్తాను. ఒక ముసలిదాన్ని ఒక చిన్న పిల్లవాడు చేయిపట్టుకొని రద్దీవుండే రోడ్డు దాటిస్తూండగా ఆ దృశ్యం చూచినప్పుడు మనలోపలనుండి "ఆ పిల్లవాడు బాగా చేస్తున్నాడు కదూ" అనే శబ్దం వినవచ్చినట్లు అవుతుందో అదే ఆత్మ. బస్సులో పక్కవాడి మనీ పర్సు జారిపడినప్పుడు దాన్ని తీసి వానికివ్వకుండా మన జేబులో వేసుకొనే ప్రయత్నం చేసేటప్పుడు "ఏయ్ ఇదివాడిది" అంటూ మన లోపలనుండి ఏదైతే హెచ్చరించినట్లవుతుందో అది ఆత్మ. ఈ వ్యాసంలో ఉదహరింపబడిన సోక్రటీసు వాఙ్మూలంలో ఆయన "అంతరంగ ప్రబోధం" అని దేన్నంటున్నాడో అదే ఆత్మ. అందుకే ఈ ప్రకరణానికి "మానవాత్మలో సమసమాజం" అనే పేరు పెట్టినాను. మానవాత్మ సంకల్పంవల్ల సమసమాజం స్థాపించబడినప్పుడు, అందులోని మానవుని స్థితి ఏలాగుంటుంది అనే విషయం మేధావులెందరో చర్చించినారు. అట్టివారిలో ఆస్కార్ వైల్డ్ ఒకడు. ఆయన ఇంగ్లీషు భాషలో "సమసమాజంలో మానవాత్మ" అనే గొప్పవ్యాసం వ్రాసినాడు. వైల్డ్ వాడిన సోల్ పదమే నా వ్యాసానికి ప్రేరేపకము. అందులోని 19వ శతాబ్దంలో ఇంగ్లాండులో ఉండే కొన్ని సంగతులు తప్పించి తక్కినదంతా సార్వకాలిక, సార్వదేశీయ భావాలతో నిండి ఉంది. ఆ వ్యాసం నా ప్రకరణానికి భరత వాక్య ప్రాయంగా ఉంటుందని, దానిని అనువదించినాను. పందొమ్మిదవ శతాబ్దం చివరన ఉండే వైల్డ్ భావాలతో, ఇరువదవ శతాబ్దం చివరన ఉండే నా భావాలను జోడించడం, ఈ వ్యాసాదిన హనుమభీముల భావ సంవాదం వలె ఉంటుందని నా ఆశయం.

(అయిపోయింది)

# ఎవరో? వాడెవరో??

## శ్రీ బులుసు వేంకటేశ్వర్లు

ఎవరో! వాడెవరో ?
యమునాతటమున, వెన్నెలరేయిని
సుమధుర వంశీనాద వాహినుల
పర్వగజేసెడు వాడెవరో? ఎవరో?

బాలతమాల నికుంజము మాటున
దాగుచు దాగుచు సన్న సన్నగా
హేలను నవరస మురళీ ధ్వని-క్రమో
గించుచు తిరిగెడు మోహనాంగుడతడెవరో?ఎవరో!

కంటు కాధ్వముల గాఢతమస్సుల-నను
గమింప జేయుచు నిద్రజాలముగ
మింటిని మంటిని రాగధారలను
నేకము చేసిన నీలజలద వర్ణుడతడెవరో? ఎవరో!!

కనుపించీ కనుపించక నాతో
దొంగాటలు సయ్యాటలు ఆడుచు
సుందర మందస్మిత బంధుర వద
నారవింద మూర్తియైనవాడెవరో ? ఎవరో !!

నాయెదలోనే దాగియుండి, నను,
వనములు వాగులు వెదుకగ జేసిన
సల్లలితాంబుద శ్యామల దేహుడు,
అల్లరిపిల్లడు అతడెవరో!! అసలెవరో!! ఎవరో!!

# కవచం

## శ్రీ వీరభద్రరావ్ పమ్మి

ధైర్యంగా బతుకు
ధైర్యంగా బతుకు
ధైర్యంగా బతకడం నేర్చుకో!
నీ ధైర్యానికి
కర్ర భయపడుతుంది.
రాయి గజగజ వణుకుతుంది
తుపాకి జడిసి పక్కకి తప్పుకుంటుంది.
నీ ధైర్యానికి మెచ్చుకుని
భూమి నీ పాదాలకి నమస్కరిస్తుంది.
ఆకాశం నిన్ను ఆశీర్వదిస్తుంది.
సముద్రం నిన్ను పొగుడుతుంది.
పిరికితనాన్ని మించిన అస్వస్తత మరోటి లేదు.
అందుకే
ధైర్యంగా బతుకు
ధైర్యంగా బతుకు
ధైర్యంగా బతకడం నేర్చుకో.

ధైర్యంగా బతకడం ప్రమాదమని
చాలామంది నీకు పిరికిమందు పోస్తారు.
ఉగ్గుపాలతో తల్లి పోస్తుంది.
ప్రతిదినం తండ్రి చెప్తాడు.
పాఠాల పేరుతో గురువు చెప్తాడు.
రేడియోద్వారా ప్రభుత్వం చెప్తుంది
చుట్టూవున్న పరిస్థితుల్ని చూసికూడా
'నాకెందుకులే' అనుకోడం కన్నా వేరే పిరికితనం లేదు.
ధైర్యం ఒక గుణం మాత్రమే కాదు
ధైర్యం ఒక వరం
ధైర్యం ఒక వ్రతం
ధైర్యం ఒక తపస్సు.
ధైర్యం ఒక కవచం మాత్రమే కాదు
ధైర్యం అనేక రుగ్మతలకి ఔషధం
ధైర్యం ఒక సామాజిక అవసరం
ఇది చారిత్రిక సత్యం!

# ఆహ్వానం

## శ్రీ యల్లాప్రగడ కోణాచార్య

ఇది నా కవితా వధూటి మీటిన
హృదయ వీణా మంజుల నాదమ్ము!
ఇది నా మానస మందిర మందున
మెదలిన స్నిగ్ధపూర్ణ నినాదమ్ము!

రత్న గర్భ హృదయ తాపమార్చెడి
స్నిగ్ధ పూర్ణ మంజుల నాదమ్మిది!
ధర్మమూర్తి పూర్తి రూపు కూర్చెడి
నిత్య నూత్న సుస్థిరవాదమ్మిది!

వేన వేల వత్సరాల గాథల మాటున
దాగిన జీవన సూత్రం!
మానవజాతికి తర తమ బాధలపాటున
కోర్చెడి సాధన పాత్రం!

హిమగిరీంద్రమున ప్రభవించిన ది
వ్య మునులు ప్రవచించిన సూక్తుల;
జీవనదీ ప్రాంతాశ్రమ వాటిక
లందున వినదించిన మధు రోక్తుల
సారమంతయు శివ జటా జూట వి
నిర్గత దివ్య భాగిరథీ శ్రీ
నీరమ్ములతో, దివ్యౌషధముల
క్షీరమ్ములతో రంగరించితిని_
జీవధారా ప్లావిత మృదు మృత్తి
కలతో, హృదయ చక్రమున కుదించి,
మానసోష్ణ మందున ఆరనిచ్చి,
కలరూపైన కలశము నింపితిని.

సౌహార్ద్ర సౌమనస్య
సౌశీల్య సుమపరాగ
భరితమ్మీ అమృత భాండం!

అందుకోండందు కోండందరు_
అందుకుని పంచుకోండందరు_
పంచుకుని పెంచుకోండందరు_
మానవత నించుకోండందరు_

నిలబడకండి, తడబడకండి;
కలతలబడి కలవర పడకండి!.
త్యాగరండాగళ పూరితం!
రయుండానంద తాండవం!.

# కలగూరగంప

## గుడి పడువా ?

మార్చి 1983 భారతిలో 'కలగూర గంప' శీర్షికలో శ్రీ "తి" గారు 'పండుగ' పద వ్యుత్పత్తిని వివరిస్తూ— "మరాఠీభాష లోని 'గుడి పడువా' (గుడి పండుగ) అంటే మన ఉగాది" అని వ్రాశారు. మరాఠీ భాషలో ఉగాదిని 'గుఢీ పాడవా' అని అంటారు గాని 'గుడి పడువా' అని అనరు. గుఢీ అనగా పతాక. పాడవా అనగా పాడ్యమి (ప్రతి పక్షములోని మొదటి తిథి.) సంస్కృతంలోని 'ప్రతి పదా' పదము ప్రాకృతంలో 'పడివా'గా రూపాంతరం పొందినది. తదుపరి మరాఠీ, హిందీ భాషలలో క్రమంగా 'పాడవా', 'పడవా'గా మారింది. గుఢీ పాడవా అంటే మరాఠీలో చైత్ర శుక్ల ప్రథమా నాడు ఎగురవేసే ధర్మధ్వజం లేదా ఉగాది అని అర్థము. ఉగాదినాడు మరాఠీ వారు తమ సంప్రదాయ ప్రకారం ఒక పొడుగైన వెదురు కర్రకు క్రొత్త వస్త్రము, వేపకొమ్మ, మామిడి మంజరి, చక్కెర పతకాలహారం అమర్చి వాటిపై ఒక చెంబును తల క్రిందుగా వుంచి, దానిని యింటి ముందు నిలబెట్టెదరు. ఇదే గుఢీ పాడవా.

కావున మరాఠీలోని గుఢీ, పాడవా పదాలకు మన తెలుగులోని గుడి, పండుగ పదాలకు అర్థరూపంగా, వ్యుత్పత్తిపరంగా ఎలాంటి సంబంధం లేదని గ్రహించాలి.

**శ్రీ కావలి రాములు**

## కారణాలు వేరైనా కార్యాలొక్కటేనా?

"భారతి" సెప్టెంబరు 1982 సంచికలోని "కార్యాలొకటైనా కారణాలు వేరు" అన్న కవితను చదివి రాస్తున్నదిది.

> "కార్యాలొకటే అయినా కారణాలు వేరు
> కావచ్చుననే సత్యం గ్రహించిన విజ్ఞులకు
> సవాళ్ళతో నిమిత్తం లేదు !"

అని వ్యాఖ్య. ఇది కవితయా ? అకవితయా ? అన్నది అప్రస్తుతం "కార్యాలొకటే అయినా కారణాలు వేరు" అన్నది నిజమేనా అన్నది మీమాంస !

బాలభీముడు ఇంద్రలోకం వెళ్ళాడు. గరుత్మంతుడూ ఇంద్ర లోకం వెళ్ళాడు. శ్రీకృష్ణుడు కూడా ఇంద్రలోకమే వెళ్ళాడు. ఇందులో ముగ్గురి లక్ష్యం ఒకటే కాని కార్యాలు మాత్రం వేరు. భీముడు, ఆకాశానికి నిచ్చెనను తమ్ముడు అర్జునుడు వేస్తే, నడచుకొంటూ వెళ్లాడు. గరుత్మంతుడు రెక్కలబలాన్ని ఘణంగా పెట్టాడు. కృష్ణ డేమో పుష్పకాన్ని ఎక్కి ఉంటాడు. ఈపరిస్థితుల్లో వారి కార్యాలు ఒకటేనని చెప్పడమెలా ? కారణాలు వేరువేరే. కాదనను. భీముడు ఐరావతం కోసం ! గరుడుడు అమృతం కోసం ! ఇక కృష్ణమూర్తి గారేమో భార్యామణి సత్యభామాదేవిగారి ముద్దుకోర్కె తీర్చడం కోసం ! కాబట్టి ఒక విషయం స్పష్టం.

కార్యాలు ఒకటే అయినా కారణాలు వేరనేది తప్పు అని ! లక్ష్యమొకటే అయినా కార్యాలు వేరు కావచ్చును. లక్ష్యసాధనకు అవలంబించిన విధానమే కార్యమని భావిస్తే, వేరు వేరు కారణాలకు తప్పనిసరిగా వేరు వేరు కార్యాలే ఉంటాయనేది ఎవరూ వేలెత్తి చూప డానికి వీలులేని నిర్వివాదాంశము !

విజ్ఞులకు సవాళ్ళతో నిమిత్తం లేదనడం సబబుకాదు. సవాలు చేయడానికి వీలులేకుండా భావప్రకటనను స్పష్టీకరిస్తే, అది విజ్ఞత అవుతుంది కాని, అసలు సవాళ్ళతోనే నిమిత్తంలేదని మిన్నకుండి పోవడం విజ్ఞత అవుతుందా ? ఆలోచించవలెమరి.

మానసికశక్తి శాశ్వత అయస్కాంతం. ఆత్మశక్తి విద్యుదయ స్కాంతం. మొదటిది పరిమితం. రెండవది అపరిమితం. ఈ అర్థాలు వచ్చేలా వచన కవితలో ఉన్నది. మనసుకులేని శక్తి ఆత్మ కలవడం ద్వారా వస్తుందనే అర్థం స్ఫురిస్తుంది. అవి రెండూ వేరువేరని విశ్లేషించడం కష్టం ! విద్యుత్తు శాశ్వతమా? అయస్కాంతము శాశ్వతమా? పోనీ ఈ విద్యుత్తును ఎక్కువగా తీవ్రతరం చేయడం తీగెచుట్టలు పెంచడంవల్లనో, ప్రవాహసత్వం ఎక్కువ చేయడంవల్లనో సాధ్యమవు తుందని తెలియజేసి ఉన్నారు. మరి ఆత్మశక్తిని పెంచుకోవడమెట్లా? చిత్తైకాగ్రత అతిముఖ్యమని కదా మన పురాణపురుషులు చెప్పేది. అంటే మనసు ఆధీనంలో స్వాధీనంలో ఉంటేనే ఆత్మకాని, ఆత్మ శక్తికాని ! మరోమాట. మనసు అని కాని, ఆత్మ అని కాని వేరే ఉన్నదా ? అంతరంలో ఒక శక్తి ఉన్నది. అంతవరకు వాస్తవమే! దానికందని మరోశక్తి ఉన్నదంటే నమ్మడమెట్లా ? ఊహించుకొంటే

చేసేదేమున్నది? ఆత్మమానసికమైనది కాదా? మనస్సు ఆత్మగత మైనది కాదా? కేవలం తర్కంకోసమే "సైన్స్" అని అనుకొంటే అది వేరేవిషయం మనస్సును, ఆత్మను స్పష్టంగా భేదపరచి నిర్దుష్టంగా గిరిగీచినట్లు ఇది మనస్సు, అది ఆత్మ అని చెప్పలేని "ఆర్గ్యుమెంట్" నాకు తెలిసినంతవరకూ వ్యర్థమే. పిడివాదానికి, విజ్ఞతకు హస్తిమశకాంతరమున్నది. గ్రహించి మెలగవలె. ఆంతరిక శక్తి ఉన్న మాట నిజం. ఆ శక్తి ప్రభావాన్ని బట్టిమనోగతసంస్కారం వింగడించడం వాస్తవం. అంతవరకే! ఇందులోకూడ "ద్వైతం" రావడం అభ్యంతరకరం.

ఈ విమర్శ వికటమని, వినోదంకోసమని, అనుకొంటే చెయ్యగలిగేదేమీలేదు.

# డా॥ గుమ్మనూరు రమేష్‌బాబు

# మార్క్సిస్టు మేధావులలో పునరాలోచన

సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి శ్రీ వి. ఆర్. కృష్ణ అయ్యర్ గుంటూరులో జరిగిన మార్క్సు శతవర్ధంతి సభలో చేసిన ప్రసంగం ఎంతో ఆలోచనలు రేకెత్తించేదిగా వుంది. శ్రీ కృష్ణ అయ్యర్ మార్క్సిస్టులలో మహామేధావి. వారు లోగడ కేరళలో కమ్యూనిస్టు ప్రభుత్వంలో మంత్రిగా కూడా పనిచేసినవారు. మార్క్సు పేరు తలచే వాళ్ళేగాని, ఆయన ఆలోచనల అధ్యయనం చేసేవారు కానరావటం లేదనీ దేశంలో మార్క్సు అంటే గిట్టనివాళ్ళు, మార్క్సు వారసులమని చెప్పకొనే పార్టీ కార్డు హోల్డర్లు అనే రెండురకాలవాళ్ళు తప్ప మరొకరు లేరనీ వారు చెప్పినమాట అక్షరాలా నిజం.

అయితే ఈ సందర్భంలో శ్రీ కృష్ణ అయ్యర్ ప్రసంగంలోని ఒకటి రెండు అంశాలు 'మార్క్సు' సిద్ధాంతానికి న్యాయంచేకూర్చ గలిగేవిగా ఉన్నాయా అనే సందేహం కలుగుతోంది. ఉదాహరణకు, మార్క్సుకు మతం అంటే సరిపడదనేది తప్పుడు అభిప్రాయమనీ, మతానికి స్థానంలేదని మార్క్సు చెప్పలేదనీ శ్రీ అయ్యర్ చెప్పారు. కాని మార్క్సిజం భౌతికవాదం మీద ఆధారపడినట్టిది. భౌతిక వాదానికి ఆదర్శ (ఆధ్యాత్మిక) వాదానికి చుక్కెదురు. "మతానికి వ్యతిరేకంగా సలిపే పోరాటం ఆధ్యాత్మిక వాసనా దూషితమయిన మతంతో కూడిన వ్యవస్థతో సలిపే పోరాటమే అవుతుంది" అని మార్క్సు "మతం మత్తుమందు" అని చెప్పిన చోటనే (కాంట్రిబ్యూషన్ టు ది క్రిటిక్ ఆఫ్ హెగెల్స్, ఫిలాసఫీ ఆఫ్ లా అనే గ్రంథంలో) వివరించాడు. ఆదర్శ (ఆధ్యాత్మిక) వాదాన్ని తుత్తునియలు చేయటం కోసం మతానికి వ్యతిరేకంగా మార్క్సు చేసిన విమర్శ ఇది. లెనిన్ కూడా మార్క్సు అభిప్రాయాన్నే ధ్రువపరుస్తూ 'మతం మత్తుమందు' అని చెప్పాడు. ఈ సందర్భంలో "మార్క్సు, రెలిజియన్, రాజ్" అనే శీర్షిక క్రింద ది 26-3-83 నాటి "మెయిన్‌స్ట్రీమ్" అనే మార్క్సిస్టు అనుకూల సిద్ధాంత వారపత్రికలో మరొక మార్క్సిస్టు మేధావి శ్రీ యస్. భట్టాచార్య (కలకత్తా) చేసిన చర్చ గమనార్హం. ఇలా ఉండగా మార్క్సు మతానికి వ్యతిరేకి కాదనటంలో ఉన్న తర్కం ఏమిటో పరమార్థం ఏమిటో బోధపడదు. మతం, ఆధ్యాత్మికత గట్టిగా వేళ్ళూని ఉన్న భారతదేశంలో మతాన్ని వ్యతిరేకిస్తే మార్క్సిజానికి చోటు దొరకదేమోననే ఉద్దేశ్యంతో ఒక "ఎత్తు"గా మార్క్సిస్టు మేధావులలో కొందరు ఇప్పుడు ఈ మాట అంటున్నారా? లేక 'మార్క్సిస్టు'లయిన వారు "స్పిరిచ్యువలిస్టు" లుగా పరిణతి చెందే సంధి దశలో ఇలా మాట్లాడుతున్నారా?

అదే విధంగా కమ్యూనిజంలో నైతిక విలువలకు స్థానం లేదనుకోవటం పొరపాటు అనీ, నైతిక విలువలను మించిన ఉన్నత జీవన విలువలను కమ్యూనిజం ప్రతిపాదిస్తుందనీ శ్రీ కృష్ణ అయ్యర్ తమ ప్రసంగంలో అన్నారు. నైతిక విలువలను మించిన ఉన్నత జీవన విలువలు అంటే భౌతిక విలువలు అని చెప్పటమే వారి ఉద్దేశ్యమై ఉండాలి. ఆధ్యాత్మిక విలువలను నిషేధించిన కమ్యూనిస్టుల "మక్కా" అయిన రష్యాలో నైతిక విలువలూ వాటితో పాటు భౌతిక విలువలూ ఏ స్థాయికి దిగజారుతున్నాయో గమనించిన మీదటే ఈ మాటలు శ్రీ కృష్ణ అయ్యర్ చెప్పి ఉంటారు. రష్యాలో ముఖ్యంగా యువకులలో ఈనాడు 70శాతం పైగా 'వోడ్కా' వ్యసనానికి బానిసలు. వివాహపూర్వమే గర్భధారణ స్త్రీలలో సర్వసాధారణ విషయం. గర్భవతులయిన స్త్రీలలో ప్రతి వేయిమందిలో 180 మంది గర్భవిచ్ఛిత్తికి పాల్పడుతున్నారు. మరొకవైపున వివాహ బంధాలు ఫట్‌ఫట్‌మని తెగిపడుతున్నాయి. విడాకుల సంఖ్య పెరిగి పోతోంది. త్రాగుడు, వ్యభిచారం, విడాకులు, జూదం మొదలయిన వ్యసనాలవల్ల రష్యా సమాజజీవనం అత్యంత క్లిష్టదశలో వున్నదనీ, ఈ పరిస్థితి బాగు చేయకపోతే ప్రమాదం ఎదురవుతుందనీ రష్యా ప్రభుత్వంవారు దారి తెలియక తలలు పట్టుకుంటున్నారని రెండేళ్ళ క్రిందట "ప్రావ్దా" పత్రిక వ్రాసింది. కాపిటలిస్టు అమెరికాలో ఏయే సామాజిక దోషాలు చోటు చేసుకుంటున్నాయో ఆయా దోషాలు అన్నీ కమ్యూనిస్టు రష్యాలో కూడా కనిపిస్తున్నాయి. కాపిటలిజం అయినా కమ్యూనిజం అయినా

భౌతికవాదమనే నాణేనికి ఇరువైపులు మాత్రమే. అయినా ఆధ్యాత్మిక విలువలు లేకుండా నైతిక విలువలకు ఆధారం ఏముంటుంది? భౌతిక వాదం నైతిక విలువలను ఏ విధంగా ప్రతిపాదిస్తుంది? ఆధ్యాత్మికతకు మతానికి కూడా చోటు వుందని చెప్పబూనుకుంటే ఆకాశ పాతాళాల కున్న అంతరం ఉన్న ఆధ్యాత్మిక వాద, భౌతిక వాదాలను ఒకే గాట కట్టివేయటం ఎలా? ఈ అంశాలను గురించి మార్క్సిస్టు మేధావులు పునరాలోచన చేసి ప్రజలకు వివరించవలసి ఉంది.

మార్క్స్ గొప్ప మానవతా వాది అనీ, మానవతావాదంలేని కమ్యూనిజం లేదనీ శ్రీ కృష్ణ అయ్యర్ అన్నారు. మానవత్వానికి మూలాధారం ఏమిటి? 'మానవత్వం' అంటే నిర్వచనం ఏమిటి? పాంచభౌతికమయిన శరీరం ఆధారంగానే ప్రాణం, మనస్సు, బుద్ధి మొదలయినవి పరిణామక్రమంలో - వికసించాయని సిద్ధాంతీకరిస్తుంది మార్క్సిజం. మనుషులను మనుషులుగా కాకుండా అనగా పరిస్థితు లను ప్రభావితం చేయగలిగే "చైతన్యశీలురు"గా కాకుండా పరిస్థితుల చేత ప్రభావితమయ్యే జడ "పదార్థాలు"గా, పరిస్థితులకు బానిసలుగా పరిగణించే సిద్ధాంతం మార్క్సిజం. ఇట్టి స్థితిలో 'మానవత్వం' అంటే ఏమిటో, 'మనిషి' యొక్క మనశ్శరీరాలలో ఏది ముందో, ఏది వెనుకో, అసలు దేనిని బాగుచేస్తే ఏది బాగుపడుతుందో పునరాలోచన చేయవలసిన అవసరం మార్క్సిస్టు మేధావులకు కనిపిస్తోందన్న మాట.

హింసద్వారా మార్క్సిజాన్ని అమలు చేయలేమని ప్రపంచ వ్యాప్తంగా ఈనాడు గుర్తిస్తున్నారు. అంటే హింసాత్మకమయిన వర్గ కలహ సిద్ధాంతానికీ దానితో ముడిపడివున్న సంఘర్షణకూ స్వస్తి చెప్పటం అవసరమని భావిస్తున్నారు. మనదేశ పరిస్థితులకు అన్వ యించుకొని అధ్యయనం చేయాలంటున్నారు. అంటే మార్క్సిజానికి భారతీయకరణ జరగాలంటున్నారు. మన జాతీయ జీవనమూల్యాలు ఏమిటో మన జాతీయ పరంపర ఏమిటో గ్రహించ వలసివుందని హెచ్చరించుకుంటున్నారు. మతం అవసరం అంటున్నారు. తాము ప్రజా స్వామ్య వాదులమే అంటున్నారు. దేశభక్తి తమకూ ఉందని అంటు న్నారు. కుటుంబ వ్యవస్థ అవసరమే అంటున్నారు. నీతి నియమాలను గురించి మాట్లాడుతున్నారు. భారతీయ సమాజజీవనానికి వేళ్ళు ఎక్కడ వున్నాయోకనుగొనాలని అంటున్నారు. అంటే ఇక అప్పుడు 'మార్క్సి జం'లో మిగిలేవి ఏముంటుంది "మార్క్సిజం" అన్న బ్యానర్ తప్ప. అప్పుడు ఆ బ్యానర్ అనే కుబుసాన్ని కూడా వదలివేసి మా"ఇజం" 'మార్క్సిజం' కాదు "హిందూయిజమే" అని చెప్పవచ్చునుకూడా. మంచిదే, వినాయకుడిబొమ్మ వేసి క్రింద "కోతి" అని వ్రాయటం ఎందుకు?

ఇదంతా చూస్తుంటే భారతదేశంలో మార్క్సిస్టు మేధావులు క్రమంగా తమను ఆవేశించివున్న 'మార్క్సిజం' భూతాన్ని ఎలాగో అలా వదిలించుకోవాలని ప్రయత్నిస్తున్నట్లు కనిపిస్తోంది. ఇదే అయితే ఆహ్వానింప దగినవిషయమే. ఇదికాక మార్క్సిజానికి ఆమోద ముద్ర వేయించుకొనేందుకు అదీ మార్క్సిజమే ఇదీ మార్క్సిజమే అనిచెబుతూ ప్రచ్ఛన్నంగా తమ ప్రయత్నాలుతాముకొనసాగిస్తూ చాపక్రిందనీరులాగా మార్క్సిజం సిద్ధాంతాలను వ్యాపింపజేయాలనే ఎత్తుగడ అయితేమాత్రం ఈ ధోరణిని కనిపెట్టి వుండటం జాతీయ వాదులకు అవసరం అవుతుంది.

**శ్రీ దోనెపూడి వెంకయ్య**

# శ్రీశైల చరిత్ర

స్కాంద మహాపురాణాంతర్గతమగు సనత్కుమార సంహిత యందలి శ్రీశైల ఖండము ముదిగొండ వీరేశలింగ శాస్త్రిగారిచే వచన మున నాంధ్రీకరింపబడి శైవ ప్రచారిణీ మాసపత్రిక 3వ సంపుటిలో 27-3-1926వ తేదీన ప్రచురింపబడినది.

శ్రీశైల ఖండము నాంధ్రీకరించు తఱి శాస్త్రిగారు కవిత్రయము వారివలె కథానువాద పద్ధతి నవలంబించిరి. మూలము నందలి కథా సూత్రమును విడువక, వర్ణనాదులనవసరములని తోచినచోట్ల తగ్గించి, అవసరమని తోచినచోట్ల పెంచియు స్వతంత్ర గ్రంథముగా భాసిల్లునట్లు రచించిరి.

"శ్రీశైలం శిఖరేశ్వరం గణపతిం శ్రీహాటకేశం పునస్సారంగే శ్వర బిందుతీర్థ మమలం ఘంటార్క సిద్ధేశ్వరం గంగాం శ్రీభ్రమ రాంబికాం గిరిసుతాం ఆరామ వీరేశ్వరం శంఖం చంద్ర వరాహ తీర్థ మనిశం శ్రీశైలనాథం భజే"[1]

అను శ్లోకముతో నీ గ్రంథము ప్రారంభింపబడినది. — "పురాతన పుణ్యక్షేత్రమై, యోగులకు త్రింశత్కోటి దేవతల కాలవాలమై, ముము క్షువులకు కొంగుబంగారమై, ఐహిక భోగంబుల నభ్యర్థించు నభ్యర్థు లకు కల్పభూరుహమై, శిఖరేశ్వర హాటకేశ్వరాది దివ్యక్షేత్రములకు గన్నతల్లియై, సర్వాభీష్టముల నొసంగు భ్రమరాంబా మల్లికార్జునులకు నివాసస్థానమై, స్నానమాత్రంబున సకల పాపంబుల భస్మీపటలముఁ జేయు పవిత్ర పాతాళ గంగామతల్లికి పట్టుగొమ్మయై, దర్శన మాత్రం బుననే ముక్తినొసంగు శిఖరరాజమునకు నిలయమై వెలయునది శ్రీశైల మని" శ్రీశైలక్షేత్ర ప్రాశస్త్యము చెప్పబడినది.

దేవీభాగవతములో అష్టాదశ పీఠములలో నొకటగు శ్రీశైల మున 'అంబా' నామధేయురాలై శక్తి వెలసినదని చెప్పబడినది. శంబా సురుడి దౌష్ట్యము నణచుటకై భ్రమరీ రూపము దాల్చినప్పటినుండియు తల్లి భ్రమరాంబయై ప్రఖ్యాతి గాంచినట్లు గలదు. ద్వాదశ జ్యోతిర్లింగ ములలో నొకటగు మల్లికార్జున లింగ మిచట స్వయంభువుగా వెలయు టయు శ్రీశైల ప్రాశస్త్యము నినుమడింప జేసినది.

కృతయుగమున పుత్రార్థియై ఘోరతప మాచరించిన శిలాద మహర్షికి పరమేశ్వరానుగ్రహంబున జనించిన నందికేశ్వర, పర్వతనామ ధేయులగు కుమార రత్నములు తమతీవ్ర తపోగ్నిజ్వాలలచే త్రిలోకం బుల గడగడలాడించి పరమేశ్వరుని ప్రత్యక్షము గావించుకొనిరి. వారిలో నందీశ్వరుడు ప్రమథగణాధిపత్యమును, ఈశ్వర వాహనత్వ మును వరములుగాఁబడసెను. పర్వతుడు తాను పర్వతాకారముదాల్చుదు నని, తన శిఖరముపై పరమేశ్వరుడు త్రింశత్కోటి దేవతలతో ప్రమథులతో సర్వతీర్థక్షేత్ర రాజములతో స్వయంభూ లింగరూపమున పార్వతీ సమేతుడై వెలయవలయునని, తన శిఖర దర్శన మాత్రంబు ననే జనులకు ముక్తి నొసంగ వలయునని వేడుకొనిన నాటినుండి శ్రీశైలము మహామహిమోపేతమై ప్రఖ్యాతిగాంచినది. శ్రీశైలమని పేరువచ్చుటకు గల కారణము— కృతయుగాంతమున గల 'సుమతి' నామధేయుడగు మునీంద్రుని పుత్రికామణియగు 'శ్రీ' తన యుగ్ర తపంబుచే నీశుని మెప్పించి 'ఈ పర్వతమున కెల్లకాలము నాపేరు ముందునిడి ప్రజలు పిలుచునట్లు వరమనుగ్రహింపుమని ప్రార్థించి, సఫల మనోరథురాలైనప్పటి నుండి ఈ పర్వతము శ్రీ పర్వతమనియు, శ్రీశైలమనియు వ్యవహరింపబడినది.

స్వామికి మల్లికార్జున నామధేయము గలుగుటకు కారణము...

శ్రీశైల సమీపమందలి మల్లికాపుర మహారాజగు చంద్రగుప్తుడు శత్రువిజేతయై, స్వదేశమునకు ద్వాదశ వర్షానంతర మేగుదెంచి, పర మేశ్వరానుగ్రహ సంజాతయు, అపురూప లావణ్య పుంజమును, తన పుత్రికా రత్నమును నగు చంద్రమతిని గాంచి కామించెను. ఎవరెన్ని విధముల వలదని వారించు చున్నను వినక మోహవివశతచే కామాం ధుడై ననుచితముగా ప్రవర్తింప కన్యక తప్పించుకొని శ్రీశైలమున కేగి శివుని మల్లికా కుసుమంబుల బూజింజి ప్రత్యక్షము గావించుకొని నది. కామాంధుడగు తన తండ్రిని శిక్షించి, మల్లికాపురమును దగ్ధమొన రింప వలసిన దనియు, తనకు దృఢమగు శివభక్తి నొసగి సర్వజన భజనీయయగు, అంబారూపంబు నొసగి మల్లికార్జునాఖ్యచే పరమేశ్వరుడు సుప్రసిద్ధుడు కావలయుననియు వరముల కోరుకొనినది. అది మొదలు కొని పర్వతేశ్వరునకు మల్లికార్జునుడను పేరు గలుగుట, చంద్రమతి భ్రమరకీట న్యాయమున అంబా స్వరూపముగా భ్రమరాంబ నామమున. సర్వలోక భజనీయమగుట జరిగినది.

పరమేశ్వర శాపదగ్ధమై మల్లికాపురము నిర్మూలన మగుటయు, చంద్రగుప్తుడు పచ్చబండై పాతాళ గంగలో బడుటచే నాజలము పచ్చగా మారుటయు జరిగినది.

శ్రీశైలమున భ్రామరీ శక్తిపీఠము, పద్మావతీపీఠము మున్నగు పీఠములును, గోకర్ణ తీర్థము, పాపవినాశనము, కపిలతీర్థము, సర్వేశ తీర్థము, పుష్కర తీర్థము మున్నగు తీర్థములును, వరాహక్షేత్రము, వేంకటేశ్వర క్షేత్రము, గరుడాద్రి, అంజనాద్రి, వృషభాద్రి, నారాయ ణాద్రి మున్నగు అద్రులును, సూర్యతాల, చంద్రతాల, నక్షత్రతాలము లను మూడు తాళ్ళను, అదృశ్యకరణి, సంధానకరణి, సంజీవకరణ్యాది మహౌషధులును, హాటకేశ్వర సమీపమున పాలధార, పంచధారలును, పంచపాండవ ప్రతిష్ఠిత లింగములును, పార్వతీ సహితవృద్ధమల్లికార్జున స్వామియు, సహస్ర లింగసహిత మహాలింగమును, సాక్షిగణపతియు, శిఖరేశ్వరము, పాతాళగంగ, లింగాలఘట్టు, ఘంటాసిద్ధేశ్వర మఠము మున్నగు విశేషముల శేషములుగ గలవు.

శ్రీశైలమునకు యాత్రికులు పోవుటకునాలుగు మార్గలు ము కలవు. 1) చుక్కల పర్వతము గుండా వెళ్ళెడి ప్రాగ్ద్వార మార్గము, 2) దక్షిణ ద్వారమార్గము, 3) పశ్చిమద్వార మార్గము, 4) ఉత్తర ద్వార మార్గముల గూర్చియు, మధ్య మజిలీల గూర్చియు, భోజన వసతి సదుపాయముల గూర్చియు, మార్గమధ్యమున తారసపడు దుర్గ మారణ్యముల గూర్చియు, కన్నులకు గట్టినట్లు సవివరముగా శాస్త్రిగారీ గ్రంథమున దెలిపిరి.

రెడ్డిరాజుల, విజయనగర రాజులకాలంలో మహా వైభవోపేతమై సువర్ణశిఖర ముఖమంటపాదులు గలిగిన శ్రీశైలముయొక్క మహోన్నత దశ, తాళికోట యుద్ధానంతరము మహమ్మదీయ హస్తగతమైన తదుపరి శ్రీశైలముయొక్క దుర్దశ, సౌభాగ్యక్షీణతల గూర్చి యిందు చక్కగా వర్ణింపబడినది.

శ్లో॥ కేదారే చోదకంపీతః కాశ్యాంతుమరణంగతః
శ్రీశైలే శిఖరం దృష్ట్వా పునర్జన్మనవిందతి॥

పై యభియుక్తోక్తి నాధారముగా గొని కొందరు శ్రీశైలమల్లి కార్జున దేవాలయ శిఖరమే శ్రీశైల శిఖరమనియు, అద్దాని గాంచవలయు ననియు, మఱికొందరు శ్రీశైలమునకు శిఖరేశ్వరము శిఖరమనియు, అది యన్నిటికంటె యెత్తైనదనియు, చాలదూరము వఱకు గన్పించును కావున శిఖరేశ్వరమును చూచినగాని ముక్తి లభింపదనియు, ఇంకొందఱు

'శ్రీశైలం శిఖరే దృష్ట్వా' అను పాఠము నాధారముగాగొని 'శిఖరే' శిఖరేశ్వర శిఖరమునుండి "శ్రీశైలం" శ్రీశైలమును లేక శిఖరమును దృష్ట్వా' చూచి, పునర్జన్మ = తిరిగి జన్మను, నవిందతి = పొందదు అనియు నర్థముఁదెల్పుచున్నారని ప్రతిపక్షముల గూర్చి వివరింపుచు శాస్త్రిగారు విషయనిర్ధారణకు తత్తద్విషయ బోధకగ్రంథములు, వృద్ధాచారములు ముఖ్యములని యందును పూర్వజనాచరణ మార్గమే శ్రేష్ఠమనియు తెలిపిరి.

శిఖరేశ్వరమునుండియే నువ్వులు, కొబ్బరి వేసి రుబ్బుచు శ్రీశైల మల్లికార్జున శిఖరమును ఁజూడవలయుననెడి విషయమును, శ్రీశైల ఖండమును, వృద్ధాచారమును బోధించుచున్నవి కావున శిఖరమనగా మల్లికార్జునాలయ శిఖరమే యనియు, శిఖరేశ్వరము నుండియే నువ్వులు, కొబ్బరివేసి రుబ్బుచు శ్రీశైలమల్లికార్జునస్వామి శిఖరమును ఁజూడవలయుననియు, ఇందుకు శ్రీశైలం శిఖరేదృష్ట్వా అనుపాఠమును శ్రీశైలేశిఖరం దృష్ట," అనుపాఠమును సాధకములని తమ యభిప్రాయమును సయుక్తికముగా నిరూపించిరి.

శ్రీ॥లో॥ కొడిమేల రాజలింగారాధ్యులవారి ప్రార్థనపై నూరుగురు భక్తమాహేశ్వరులతో ఁగలిసి 22-1-1926వ సం॥న శ్రీశైలమున కేగిన శాస్త్రిగారు తమ ప్రయాణ సన్నాహ సంరంభముల గూర్చి, ఆనందసందోహముల గూర్చి, భక్తిపారవశ్యతలగూర్చి, భోజన వసతి సదుపాయములగూర్చి, కష్టనిష్ఠూరములగూర్చి శరీర ప్రయాస, ప్రయాణ బడలికల గూర్చి, దర్శించిన శ్రీశైల మార్గస్థ పుణ్యతీర్థక్షేత్రముల గూర్చి స్వానుభవ పూర్వకముగుటచే కనులకుగట్టినట్లభివర్ణించి పఠితల నైతము శ్రీశైలయాత్ర మనోంబర వీధిలో గావింపజేసిరి.

ఈ గ్రంథమందలి వచన రచనా విధానమంతయు సులభశైలిలో, అలతి అలతి సమాసములతో, మధుర పదవిన్యాసముతో గావింపబడి, శ్రీశైల క్షేత్ర రాజమును కనుల పండువుగా దర్శింపజేసినది—

క్షేత్రమాహాత్మ్య ప్రతిపాదకమగు నీ గ్రంథమును పద్యమున రచించినచో జనసామాన్యమున కందుబాటులో నుండుటయు, ప్రజాబాహుళ్యమును భక్తిపరవశుల గావించుట ద్వారా మత ప్రచారమొనరించుటయు సులభమనెడి భావనతో కేవల వచనమున నీ గ్రంథమును శాస్త్రిగారు రచించిరి.

---

[1] శైవప్రచారిణీ మాసపత్రిక శివ సంపుటం.

[2] శైవప్రచారిణీ మాసపత్రిక శివ సంపుటం, 13వ పేజి.

**శ్రీ శివలెంక భవానీశాస్త్రి**

# తెలుగు ~ తెనుగు

( కోరాడ రామకృష్ణయ్యగారి అభిప్రాయం )

నేను ఫిబ్రవరి భారతి (1983 : 12-17)లో 'తెలుఁగులో అరసున్న' అనే శీర్షికలో ఒక వ్యాసం రాశాను. అది రాయకముందు ఆ వ్యాసంలో నేను ప్రతిపాదించదలుచుకొన్న ల~న వ్యత్యయం అంతకుముందు పి. ఎస్. సుబ్రహ్మణ్యంగారు మాత్రమే ఊహించారని అనుకొన్నాను. రాశాక ల~న వ్యత్యయాన్ని నిర్మాణాత్మకమైన ఉపపత్తులతో నిరూపించగలిగానని తృప్తి పడ్డానుకూడా.

ఆతర్వాత ఏదో ఒక వేరే సందర్భంలో తెలుగు భాషాపరిశోధన తొలిదశల్ని గురించి ఆలోచించాల్సి వచ్చింది. రామకృష్ణయ్యగారిని గురించి రాస్తున్నపుడు వారు ఒక వ్యాసంలో ఈ ల~న వ్యత్యయాన్ని గురించి స్పష్టంగా రాసి వుండటం కనిపించింది. నా వ్యాసానికి బలంగానూ, పూర్వపక్షికృత్తుని గుర్తించాల్సిన అవసరం, బాధ్యత పరిశోధకుడిగా నాపైన ఉన్నందువల్లా వారి ఆంగ్లవ్యాసంలోని అవసరమైన అంశాల్ని అనువదించి భారతి పాఠకలోకానికి అందిస్తున్నాను.

వారి ఆంగ్లవ్యాసం పేరు 'అవర్ సెల్వ్స్ : అవర్ హోమ్, రేస్ అండ్ లాంగ్వేజ్' (శ్రీ వేంకటేశ్వర ఓరియంటల్ ఇన్స్టిట్యూట్ పరిశోధన పత్రిక 1952 : పార్ట్ 2, సం. 13 పుటలు 1-20) అంటే 'మనం, మనం తొల్లినివసించిన ప్రాంతం, మనజాతి, మన భాష' అనే అంశాల్ని గురించి ఆలోచించారన్నమాట. ఆ వ్యాసం ఎస్. రామకృష్ణశాస్త్రిగారు అంతకుముందు అదే పత్రికలో రాసిన మరో ఆంగ్ల వ్యాసానికి (ఆంధ్రాస్ అండ్ తెలుగూస్ - దెయిర్ ఒరిజినల్ హోమ్ అండ్ లాంగ్వేజ్) అన్నదానికి ( 1952 సం. 9, పార్ట్స్ 1&2 ) ఖండనం. రామకృష్ణశాస్త్రిగారు ఆనాటి సంప్రదాయ పండితులు, పరిశోధకులు భావించినట్టే ఆంధ్ర - తెలుగుల వ్యుత్పత్తిని గురించిరాశారు. ఆయన అప్పటికే సోమయాజిగారు (ఆంధ్రభాషా వికాసం 1945) భావించినరీతిలో 'తెనుగు' దిగ్వాచి అని, న~ల వ్యత్యయం కారణంగా 'తెలుగు' ఏర్పడిందని అభిప్రాయపడ్డారు. కానీ రామకృష్ణశాస్త్రిగారూ న~ల వ్యత్యయ విషయం పునరాలోచించాల్సివుందని భావించారు.

సరిగా ఈ అంశాన్ని గురించి స్పష్టం చెయ్యటానికే రామకృష్ణయ్యగారు ఈ ఖండన వ్యాసంరాస్తూ, కేవలం శాస్త్రిగారి అభిప్రాయాల్ని సవరించడం మాత్రమే కాకుండా నిర్మాణాత్మకంగా తెలుగు ~ తెనుగు రూపాల వ్యుత్పత్తిని గురించి తమవ్యాసంలో చర్చించారు. ప్రస్తుతాంశానికి సంబంధించిన చర్చ ఆ వ్యాసంలో ఒక చోట లేదు. 10-20 పుటలమధ్య అక్కడక్కడా చేయబడింది. వాటిల్లో

అవసరమైన అంశాల్ని మాత్రం అనువదించి చూపుతున్నాను. ఇది యదామాతృకానువాదం మాత్రమే.

'ద్రవిడ' అనే రూపం నుంచి 'తమిళ' అనే రూపాన్ని నిష్పన్నం చెయ్యటం ఎలాంటిదో 'త్రిలింగ' నుంచి 'తెలుగు'ను సాధించడమూ అలాంటిదే. ఇదితప్పు. 'త్రిలింగ' అన్నపదం జాతి-ప్రజల సూచకంగాలేదు. తెలింగ్~తెలుగు అన్న(తద్భవరూపాలు?)** రూపాలు మాత్రమే జాతి వాచకాలు. తెలుగులు ఒక సంస్కృత రూపాన్ని వాడి తమనితాము 'రిఫర్' చేసుకోవాల్సిన అవసరం ఏముంది? ఇది ఎలా సంభవం? (పు. 9)

'తెనుగు' అనేమాట 'తెలుగు' మాటలాగా జాతి పరంగా వాడినట్టు కనిపించడంలేదు. నన్నయాదికవులందరూ తెనుగును భాషా సూచకంగానే వాడివున్నారు. తెలుగు-కి సంబంధించినంతవరకు తెలంగాణా (ఒక ప్రాంతం), తెలగాణ్యులు (ఒక బ్రాహ్మణ తెగ), తెలగాలు (ఒక బ్రాహ్మణేతరవర్ణం)— వీరు తెలుగుదేశం నుంచి బర్మా వైపు వలసపోయి 'ప్రోం' ప్రాంతంలో అధివారాన్ని కూడా చెలాయించినారట, ఈ శతాబ్దాదిలో—ఈ జాతి తొలుత గోదావరి, కృష్ణల నడిమి ప్రాంతంలో వుండటం— అక్కడి ద్రావిడభాష ఈజాతి పేరిటే పిలవబడటం జరిగివుండాలి. ఈజాతి జనులు ద్రావిడులే కావచ్చు. కాని వారు తప్పనిసరిగా ద్రావిడ భాషల్లో ఒకదాన్నే మాట్లాడివుండాలి. (ఇంతకుముందు తద్భవమన్నది జాతికి సంబంధించిన నిష్పత్తిని గురించి కావాలి—బ్రహ్మానంద). (పు. 12)

టాలెమీ ఈ దేశాన్ని 'త్రి లింగాన్, ట్రిగ్లిఫాన్' అని పిలిచాడనడం వుంది. ఆరూపాల్లో కూడా 'ల' కారంవుంది—ఇది 'తెలుగు'కి సంబంధించిందే తప్పా 'తెనుగు'కి సంబంధించిందికాదు. తెలుగులు ద్రావిడులా కారా అన్న ప్రశ్నతో మనకి నిమిత్తంలేదు. ఏ జాతివారు ఏభాషనైనా మాట్లాడవచ్చు. ల→నగా మారితేనే తెలుగు > తెనుగు అయింది. (పు. 12).

'తెలంగ' ను 'త్రిలింగ' గా మార్చడం టాలెమీ రాకముందే దేశీయ సంస్కృత విద్వాంసులు చేసిన పనికావాలి. పండిత వ్యవహారంలో ఉన్నదాన్నే టాలెమీ కూడా రికార్డుచేసి వుండాలి. (అదేపుట).

"ఆంధ్రులు ప్రాకృతాన్ని మాట్లాడుతూండినవారు. ఔత్తరాహులు. గోదావరి, కృష్ణ మధ్య ప్రాంతానికి వలస వచ్చారు. దాన్నే కేంద్రంగా, అక్కడ అప్పటికే వుండిన జాతితో కలిసి ఆ భాషను అనుసరిస్తూ, తమ ప్రభుత్వాన్ని - తద్వారా ఆ ప్రజలకూ ఆంధ్రులన్న ముద్రను కల్గించారు. జాతిగతంగా సాంస్కృతికంగా తమకన్నా అధికులు కావటంమూలాన వారి ప్రాబల్యం అధికమై ఉండాలి. గోదావరి, కృష్ణల నడుమ ఉండిన ఆ ఆదిమ తెగవారే 'తెలంగులు'. వారు ద్రావిడపూర్వ, ద్రావిడ జాతుల సాంకర్యాన్ని విలక్షణంగా కల్గినవారు. తెలంగజాతి ఇతర ద్రావిడ సగోత్రకులతో, భాషామూలాలతో ఎప్పుడో తెలియని అతిప్రాచీనదశలోనే వేరుపడివుండాలి. శాతవాహన రాజులు మొత్తం గోదావరి కృష్ణలనడిమి దేశాన్నంతా ఏలినా పూర్వార్థభాగంలోని ప్రజలు మాత్రమే ఆంధ్రులని పిలవబడ్డారు. పశ్చిమార్థంలోని ప్రజలు కారు— (ఆ ప్రాంతమే కర్నాడు - కర్నాటక)*** ఆంధ్రులు కర్నాటకను ఎప్పుడూ తమ రాజకీయ కేంద్రంగా చేసుకోలేదు. ఆంధ్రుల పాలన మొదలుకాకముందే ఈ యీ ప్రాంతాల్లో తెలుగు కన్నడ భాషలు స్వతంత్రమై స్థిరపడ్డాయి కూడా. అంచేత ఈనాటి 'ఆంధ్రులైన తెలుగువారు' శాతవాహనుల కాలంనుంచో, లేదా అంతకంటె పూర్వంనుంచో ఉండిన 'ఆంధ్ర - తెలుగుల్ని' మూల పురుషులుగా కల్గినవారు. కర్నాటకలో జైనం, ఆంధ్రలో బౌద్ధం ప్రధానమతాలుగా స్థిరపడటంలోనూ ఈ తారతమ్యం తెలుస్తోంది......" (పుటలు18—19)

'ల > న గా మారటం ద్రావిడభాషల్లో చాలా సహజమైన పరిణామం. పో.చూ. ముళ్ ⌣ మున్; తొల > తొన ; ఇల్ ~ ఇన్; లాంగలి ⌣ నాంగలి. అలాగే తెలుగు > తెనుగు కూడా ! (పుట 20)

'అంచేత మనం మొదట తెలుగులం
తర్వాత ఆంధ్రులం '— (పు. 20)

అని రామకృష్ణయ్యగారు తమ వ్యాసాంతంలో చాలా బాగా చెప్పారు.

ఈ వ్యాసాన్ని మళ్ళీ ఇక్కడ ఉద్ధరించడంలో ఒక ప్రయోజనముంది. పరిశోధకుడు ప్రతి ఒకడూ తానే ఈ 'పాయింటు' మొదట చెప్పానని - పూర్వులెవరూ చెప్పలేదని ఒకో సందర్భంలో అనుకోవడం జరుగుతూ వుంటుంది. సరిగా నేనూ, సుబ్రహ్మణ్యంగారూ కూడా ల ⌣ న ల విషయం దాదాపు మొదటి ఆలోచించినట్టే అనుకున్నాం. రామకృష్ణయ్యగారు ఈ విషయకంగా సమకాలీన చారిత్రక పరిశోధకుల నుంచీ స్ఫూర్తి పొందివుంటారని నేననుకొంటున్నాను. వారు స్పష్టంగా తమ అభిప్రాయ మూలాన్ని చెప్పలేదుమరి.

ఒకసారి మా చేకూరి రామారావు మాష్టారు ఒక జోక్ లాంటి సత్యం మాతో చెప్పారు. ఎవరో అన్నారట 'ఉత్తున కత్తు పరంబగునపుడు సంధి నిత్య'మని రామారావు మొదట చెప్పారని. దాన్ని చెప్పి ఆయన అన్నారు— నేను కాదు సూరి చెప్పాడు, సూరీ కాదు చింతామణి కారుడే చెప్పాడని. సరిగా ఈ విషయమూ అంతే.

పరిశోధనలో 'వ్యగ్రత' పూర్వపక్షికృత్తుల్ని (ఇది శేషేంద్ర వాడేమాట) సరిగా అంచనా వేసుకోకపోయినా అసలు చూడకపోయినా సిద్ధించదు. చాలా ఇబ్బందులూ వస్తాయి. అలాంటప్పుడు మన అవగాహనల్లో 'పాక్షికత' దానిద్వారా 'అసమగ్రత' వ్యాపిస్తాయి. అవి శాస్త్ర పరిరక్షణకు, ప్రగతికి అవరోధాలు.

ఇంతకీ రామకృష్ణయ్యగారు ఏం తేల్చారని? ల → న గా మారడమే తప్పా ఈ సందర్భంలో న > ల గా మారలేదని. సరిగా నేనూ ఈ విషయాన్నే ముందు వ్యాసంలో చర్చించింది.

---

* కోరాడ రామకృష్ణయ్యగారి వ్యాసాలను అందించినవారు ఆచార్య కోరాడ మహాదేవశాస్త్రిగారు. వారికి ధన్యవాదాలు.

** నా వ్యాసంలో నేను మధ్యద్రావిడ భాషల్ని ఆధారంగా- ంగు విషయకంగా చేసిన చర్చ ఆరోజులకి లేదు. అంచేతే తద్భవమని వారు భావించి వుండాలి- (కాని చూ. పు. 12)

*** ఈ విషయాన్ని స్వతంత్రంగా మరికొన్ని ఉపపత్తుల ద్వారా నేను మరో వ్యాసంలో చర్చించాను. చూ. బ్రహ్మానంద (1983) 'రాయలసీమ తెలుగు' స్రవంతి 350 : 12-18.

**డా. హెచ్. ఎస్. బ్రహ్మానంద**

# గురజాడ చేసిన పొరపాటు ?

నవంబరు 1982 భారతిలో శ్రీ రామమోహనరాయ్ గారు "ఉత్తమ సాంఘిక నాటకాలు" అనే వ్యాసం రాశారు. ఆ వ్యాసంలోని ఒక స్టేట్‌మెంటును చర్చించడం నా ఉద్దేశం.

రామమోహనరాయ్‌గారు నాటకంలో పాత్రలకు పేర్లు పెట్టడాన్ని గూర్చి చర్చిస్తూ, (బోయి భీమన్నగారి పాలేరు నాటక చర్చలో) "నాటక శిల్పంలో ధనవంతుని పేరుకు 'కుబేర్రావు' అనీ, సంస్కారి అయిన బడిపంతులు పేరు 'ఉపకారి' అనీ వుండటం చాలా 'ప్రిమిటివ్ టెక్నిక్' కోపిష్టికి అగ్నిహోత్రుడని, పిసినారికి లుబ్ధావధానులనీ, పేరు పెట్టిన గురజాడ చేసిన పొరపాటే భీమన్న చేశారు" అని అన్నారు.

శ్రీ రాయ్‌గారు పాత్రలకు పేర్లు పెట్టడం కూడా నాటక శిల్పంలో భాగంగా గుర్తించడం శిల్పంపట్ల ఆయనకున్న అవగాహనను నిరూపిస్తున్నది. ఎందుకంటే, కొందరు విమర్శకులు కథ, నిర్మాణం, కథనం, పాత్రలు నాటకీయత, శైలి, వర్ణన- ఈ మొదలైన విషయాలన్నీ చర్చించి, చివర్లో శిల్పం అని ప్రత్యేకంగా ఒక అధ్యాయం రాస్తున్నారు. అంటే రచనలో శిల్పం అనేది, పై విషయాలకన్నిటికీ అతీతమైనదని వారి అభిప్రాయం. కవిపనితనం ఎక్కడో ఒకచోట ఉండదు. వస్తువును ఎన్నుకోవడం మొదలు, దాన్ని ప్రదర్శించడం వరకు ఆయన పనితనం ఉంటుంది. పాత్రలకు పేర్లు పెట్టడంలోకూడా రచయిత పనితనం కనబడుతుంది. అదే శిల్పం. ఈ విషయంలో శ్రీ రాయ్‌గారితో నేను ఏకీభవిస్తున్నాను.

కోపిష్టికి అగ్నిహోత్రుడనీ, పిసినారికి లుబ్ధావధాని అనీ పేరు పెట్టడం, అంటే పాత్ర స్వభావాన్ని పట్టిచ్చే పేరు పెట్టడం శిల్పంలో 'ప్రిమిటివ్ టెక్నిక్' అనీ, అది 'పొరపాటు' అనీ అనడం సరికాదని అనిపిస్తుంది.

జీవితంలో మనుషులకు పేర్లు పెట్టడం అనేక రకాలుగా జరుగుతుంది. జన్మనక్షత్రం ప్రకారం మొదటి అక్షరాన్నిబట్టి, నమ్మకమున్న దైవాన్నిబట్టి (కుమారస్వామి, వెంకటేశ్వరరావు) నచ్చిన సినిమా యాక్టర్లనుబట్టి (శ్రీదేవి) తాతముత్తాతలమీద భక్తితో, (వేదం వెంకటరాయశాస్త్రి) సమకాలిక ఉద్యమ ప్రభావంతో (జై ఆంధ్రరావు) నచ్చిన రాజకీయ నాయకులనుబట్టి (లెనిన్, సుభాష్, గాంధి) సౌందర్య దృష్టితో (సుందరి, లావణ్య) ఇద్దరు కొడుకులుగాని, కూతుర్లుగాని పుట్టినప్పుడు అక్షర రమ్యతకోసం (రాము: సోము; సమత: మమత) సమకాలిక పదజాలాన్నిబట్టి (చైతన్య, ప్రమోదచైతన్య) ఇష్టమైన కోరికల్నిబట్టి (విద్యాసాగర్, లక్ష్మి) ఇంకా అపూర్వతా దృష్టితోను (సుమన) ఇష్టమైన రంగుల్నిబట్టి (నీలిమ) ఇష్టమైన పుస్తకాలలో పాత్రలనుబట్టి (నీలోవ్న)- అనేక రకాలుగా పేర్లు పెడుతుంటారు. ఈ విధంగా పేర్లు పెట్టుకున్న వాళ్ళలో కొందరు సార్థకనామధేయులు కావచ్చు, మరికొందరు విరుద్ధంగాను తయారుకావచ్చు. 'లెనిన్' అని పేరు పెట్టుకొని ఒకప్పుడు లెనిన్ సాహిత్యాన్ని కాల్చివేసే ఉద్యమంలో ప్రముఖపాత్ర వహించిన వాళ్ళున్నారని తెలిసిన వాళ్ళు చెబుతారు. విద్యాసాగరులు పొట్టిబొడిస్తే ముక్కరాలని వాళ్ళవుతారు. తాతముత్తాతలపేర్లను మర్యాద దక్కకుండా చేసే వాళ్ళవుతారు.

జీవితాన్ని ప్రతిబింబించే సాహిత్యంలోను ఈ వైవిధ్యం కనబడుతుంది. రచనకు పేరుపెట్టడం ఒక పెద్దపని. (చూ. సాహిత్యతత్త్వము శివభారత దర్శనము- శ్రీ సర్దేశాయి తిరుమలరావుగారు). రచనలో పాత్రలకు పేర్లు పెట్టడం అంతకన్నా పెద్దపని. ఈ పనిని రెండు మూడు రకాలుగా చూడవచ్చు. పాత్రల స్వభావానికి, స్వరూపానికి అనుగుణంగా పేరు పెట్టడం- ధర్మరాజు, భీముడు, ధనపాలుడు, కా

పోలుడు, ప్రవరుడు, వరూథిని మొ॥ 2. వేతిబీరకాయలాగా స్వభావానికి విరుద్ధంగా పేరుపెట్టడం - నిగమశర్మ, సుకుమారుడు, గుణనిధి మొ॥ శుచిముఖి, కలభాషిణి, సుముఖాసత్తి, సుగాత్రి, శాలీనుడు, మణి కంధిరుడు మొదలైనవి మొదటిరకం పేర్లులాగా అనిపిస్తాయి కాని, వాటికి కొంత సింబాలిక్ విలువఉంది. 3. ఇష్టం వచ్చినపేర్లు పెట్టడం.

ఆధునిక రచనల్లో పాత్రల పేర్లు పెట్టడంలో చాలా జాగ్రత్త కనబడుతుంది. ప్రాచీన కావ్యాలలోని పేర్లను ఈనాటి విలన్ పాత్రలకు పెట్టడం ఒక రకం - ధర్మరాజు, దశరథరామయ్య మొ॥ అలాగే ఎప్పుడు ఎక్కడ అవసరమైతే అక్కడ ప్రత్యక్షమయ్యేవాడిని 'కృష్ణ' అనడం ఉంది. కొందరు రచయితలకు తమకు తెలిసిన వ్యక్తుల్ని పాత్రలుగా తీసుకోవడం అలవాటు. విశ్వనాథకు ఈ అలవాటున్నట్లు చెబుతారు. ఒక దుర్మార్గుడిని - తెలిసినవాడిని - పాత్రగా చేసినప్పుడు,రచయిత అతడి అసలుపేరుగాక,మార్చి పెడతాడు.కొందరు భయపడి "ఇందలి పాత్రలు, సంఘటనలు ఎవరినీ ఉద్దేశించినవికావు, కేవలం కల్పనలు" అని ప్రకటించుకుంటారు. ఈ ప్రకటనే ఇందులోని నిజాన్ని చెబుతుంది. ఒక వ్యక్తిని పాత్రగా తీసుకొని, అతని పేరే ఆ పాత్రకు పెడితే, ఆ వ్యక్తి బాధపడవచ్చు. పేరు మార్చినా, ఆపేరుగల వ్యక్తి - ఎవడో ఒకడుంటాడు - బాధపడవచ్చు. కాబట్టి స్వభావాన్ని వ్యంజించే పేర్లు పెడితే ఈ సమస్య పరిష్కారం కావచ్చు.

గురజాడ డైరీలను, లేఖలను, నోట్సులను పరిశీలిస్తే తనకు బాగా తెలిసిన వ్యక్తుల్లో ఫలానా వారు ఫలానా పాత్రకు యోగ్యుడు అని రాసి పెట్టుకున్నట్టు తెలుస్తుంది (చూ : కె. వి. రమణారెడ్డి మహోదయం, పుట 259, 260). భారతంలో ప్రతి పాత్ర స్వభావ వ్యంజకం కానట్లే, గురజాడ కూడా తన పాత్రల కన్నిటికీ స్వభావాన్ని సూచించే పేర్లు పెట్టలేదు. అగ్నిహోత్రావధాన్లు, లుబ్ధావధాన్లు, కరటకశాస్త్రి, సౌజన్యారావుపంతులు వంటి కొన్ని పాత్రలకే ఆ విధమైన పేర్లున్నాయి. మీనాక్షి, వెంకమ్మ వంటి పేర్లు సాధారణాలు.

అగ్నిహోత్రావధాని లాంటి పేర్లు పెట్టడం పొరపాటు అనడం కన్నా, ఆ పేర్లు ఎందుకు పెట్టాడో ఆలోచిస్తే, అది పొరపాటు కాదనిపిస్తుంది. ఏదైనా ప్రయోజనాన్ని సాధించకపోతే అది వ్యర్థం, శిల్పం దెబ్బ తిన్నట్టు. శిల్పం అంటే ప్రయోజనసహితత్వం, అధికార్థ సంగ్రహణం అంటారు విశ్వనాథ. "శాకుంతలం యొక్క అభిజ్ఞానత"లో అనవసరమైన ప్రతి వాక్యమూ, పదమూ శిల్పాన్ని దెబ్బ తీస్తుంది అంటారు సోదుం రామ్మోహన్ "సాహిత్యాలోకన" లో.

అగ్నిహోత్రావధాని, లుబ్ధావధాని సంప్రదాయ కుటుంబీకులు. ఆనాటికి సంప్రదాయం వికృత రూపం ధరించి వ్యాపారంగా మారింది. వీళ్ళు వేదాలు చదువుకున్నా, తిట్లు, శాపనార్థాలే వీళ్ళ నోట్లో ఎప్పుడూ నానుతూ ఉంటాయి. సంధ్యావందనాలు చేస్తున్నా సంయమనం లేదు అగ్నిహోత్రావధానికి. అతడు అగ్గిరావుడే. ప్రతిపైసాకు నసిగే రకం. పైగా వీళ్ళు వివాహితులైనా వివాహవ్యవస్థ ధర్మాలన్నిటినీ విస్మరించి ఆడబిడ్డల్ని అమ్మడానికి, కొనడానికీ వెనుదీయని సమాజ శత్రువులు. వీళ్ళను దృష్టిలో పెట్టుకొనే శ్రీశ్రీ "వీరిది శిథిలీకృతమవుతున్న ఒకానొక సాంఘిక వ్యవస్థయొక్క కరాళనృత్యం" అన్నారు. ఈవ్యవస్థకు ప్రతినిధులైన వాళ్ళను అలా చిత్రించడం సబబే. ఈ వ్యవస్థ నవ్వులపాలైంది. దీన్ని అపహాస్యం చెయ్యడం గురజాడ అభిమతం. ఆయన స్వాభావికంగా హాస్యచతురుడు. హాస్యం సామాజిక విమర్శకు వజ్రాయుధం వంటిది. "అప్పారావు హాస్యం హాస్యంకోసమే కాదు. దాని ప్రయోజనం గంభీరమైనది... సంఘ దౌష్ట్యాలపై అది ప్రచండ పరశువు" అంటారు కె. వి. రమణారెడ్డిగారు. సంఘశత్రువును నవ్వులపాలు చేసి, వాడి వికృతరూపాన్ని ఉతికి ఆరగట్టడం గురజాడ లక్ష్యం. దానికి హాస్యాన్ని చక్కని సాధనంగా వాడుకున్నాడు. ఆ వాడుకోవడం - పాత్రలకు పేర్లు పెట్టడం నుండి ప్రారంభమైంది. లేకపోతే పనిగట్టుకొని కొన్నిపాత్రలకే ఆ విధంగా పేర్లు పెట్టవలసిన అవసరంలేదు. కాబట్టి అగ్నిహోత్ర, లుబ్ధావధాన్ల నామధేయాలు అలా ఉండటం 'ప్రిమిటివ్ టెక్నిక్కు' కాదు, 'పొరపాటు' కాదు, నాటక శిల్పంలో (గురజాడకు సంబంధించి) అత్యున్నతాంశం అనిపిస్తుంది. తక్కిన నాటక కర్తల విషయం పరిశీలించవలసి ఉంది.

రష్యన్ కామెడీలలో ఇటువంటి పేర్లు ఉన్నట్లు తెలియవచ్చింది.

**శ్రీ రాచపాళెం చంద్రశేఖరరెడ్డి**

# "పట్టుకారు" అన్యదేశ్యమే

"పట్టుకారు" అను పదబంధము "అన్యదేశ్యముగాదు. అది యచ్చముగా తెలుగు పదమే" అనుటకు శ్రీ కపిలవాయి లింగమూర్తి గారు కావించిన ప్రదర్శనములు (కలగూరగంప, భారతి, నవంబరు 1982) అవిమృశ్యకారిత్వమునకు నిదర్శనములు.

1. "శకట రేఫాంతమైన "కాఱు" నకు ఆంధ్రభాషార్థవకర్త పట్టుకారను అర్థమిచ్చెనుగాని ప్రాదెనుగున కాఱు-కల్లు-పదములు కేవలముపకరణ వాచకములుగనే కనిపించును."

ఇందు ఆంధ్రభాషార్థవకర్త అనగా సుదురుపాటి వెంకన్న. అతడు పుదుకోట సంస్థానాధిపతి కోటి రఘునాథ తొండమాన్

ఆస్థానకవి. కాలము 1766–1789. అనగా పదునెన్మిదవ శతాబ్ది ఉత్తరార్ధము. అప్పటి సుదురుపాటి వెంకన్న ఆంధ్రభాషార్ణవము నందు "కాఱు" అనుపదములేదు. "పట్టుకారు" అను అర్థమునులేదు. ఆంధ్రభాషార్ణవమునందు ఇట్లుకలదు.

"–పొలుచు దోస్తానమనఁ దోలు పొరలతిత్తి
మీఱు సందంశకము పేరు కారనంగ." [ద్వి. కాం.298 ప.]

ఇది సూర్యరాయాంధ్ర నిఘంటువునందు "మీఱు సందంశకము పేరు కాఱనంగ" అని కలదు. అది పట్టుకొని శకటరేఫాంతమని ప్రకటనము!

"–మొగులు విరినీరు నాఁగను దగు జలంబు
మీఱను హిమాంబు సంజ్ఞ పన్నీరనంగ." [ప్ర.కాం. 153 ప.]

అని కూడ ఆంధ్రభాషార్ణవమునందు కలదు. అది "పన్నీఱనంగ" అని దిద్దుట బ్రహ్మాతరము కాదు. కనుక ఆంధ్రభాషార్ణవకర్త ప్రయోగించిన "కారు" అను పదమును దిద్దవలసిన ఆవశ్యకములేదు. రేఫ శకటరేఫ ప్రాసయతి ఆంధ్రభాషార్ణవ కర్తకు సమ్మతమని గ్రాహ్యము. కనుక ఆంధ్రభాషార్ణవములేని "కారు" అనుపదము సాధు రేఫాంతమే.

సందంశకమన "పట్టుకారు" మాత్రమేకాదు; మొనకారు, నీరు కారు కూడ. అంతేకాదు. శ్రావణమును సందంశకమే.

సుదురుపాటి వెంకన్నకు శతాబ్ది పూర్వుడైన కాకునూరి అప్పకవి [సాధు] రేఫాక్షర సీసమాలికయందు ఇట్లుకలదు.

"కారులు కల్లలు కారుమెఱుంగులు
పటుకారు ముక్కారుపంట రిపులు" [2ఆ. 196 ప.]

ఇందు "కారు" అను పదము మాత్రమేగాక, "పటుకారు" అను పదబంధము కూడ శకటరేఫాంతము కాదు. సాధురేఫాంతమే. అంతేకాదు. అప్పకవి అకార [శకటరేఫ] సీసమాలికయందు కాఱుపోతులు, కాఱడవులు కలవుగాని, "కాఱులు, పట్టుకాఱులు" లేవు.

పైడిమఱ్ఱి వేంకటపతి చంద్రాంగద చరిత్రములోని ప్రయోగమన్న "కాఱు" శబ్దముకూడ సూర్యరాయాంధ్ర నిఘంటువులోనిదే.

అప్పకవికి శతాబ్దిపూర్వుడైన శ్రీకృష్ణదేవరాయల ఆముక్తమాల్యదయందు ఇట్లుకలదు.

"సున్నము మొత్తుటయుం బట్టుకారులం బట్టుటయు
సౌధసౌవర్ణ భూషాది నిర్మాణంబుల యందు" [4ఆ. 187వచ.]

ఇది ఆంధ్రభాషార్ణవ పంక్తి, చంద్రాంగద చరిత్ర పాదముల వలె సూర్యరాయాంధ్ర నిఘంటువునందు ఉదాహరింపఁబడలేదు. కనుక వారికి కనఁబడలేదు.

అప్పకవికి శతాబ్ది అర్వాచీనుడైన అయ్యలరాజు నారాయణామాత్యుని హంసవింశతియందు ఇట్లుకలదు.

"కమటము కట్లసంచి యొరగల్లును గత్తెర సుత్తిచీర్మమున్(ల్)
ధమనియు శ్రావణంబు మొలత్రాసును బట్టెడ నీరుకారు శా
ణము పటకారు మూస బలు నాణెపరీక్షల మచ్చులాదిగా
నమరఁగ భద్రకారక సమాహ్వయుఁడో డొకడుండు నప్పురిన్."
[2ఆ. 182 ప.]

ఇది సూర్యరాయాంధ్ర నిఘంటువునందు కలదుగాని, నీరుకారు నీరుకాఱుగ, పటకారు పటుకాఱుగ కలవు. కాని 1919వ సంవత్సరము నందు జనమంచి శేషాద్రి శర్మగారు, 1938వ సంవత్సరమునందు మద్రాసు ప్రాచ్యలిఖిత పుస్తక భాండాగారములోని ఒక తాళపత్ర గ్రంథమును, మూడు కాగితపు ప్రతులను సంప్రదించి తిరుమల వేంకట రంగాచార్య శిరోమణిగారు పరిష్కరించిన, హంసవింశతి ముద్రిత గ్రంథములందు నీరుకారు, పటకారు అనియే కలదు. అంతేకాదు. మద్రాసు ప్రాచ్యలిఖిత పుస్తక భాండాగారములోని కాగితపు ప్రతులకు కారకులైన సి. పి. బ్రౌన్‌గారి నిఘంటువునందు నీరుకారు, పటకారు, పటుకారు అనియేకలదు. ఉపరి కిటెల్‌గారి కన్నడాంగ్ల నిఘంటువు (రివైజ్‌డు) నందును తెలుగుభాషలో పటకారు, పటుగారు అనుపద బంధములు కలవనియే కలదు.

కనుక "కారు, మొనగారు, నీరుకారు, పటకారు, పటుకారు పటుగారు, పట్టుకారు" అను శబ్దములెల్ల గతశతాబ్ది మధ్యకాలమువఱకు శకటరేఫాంతములుకావని, సాధురేఫాంతములని కరతలామలకము.

ఇక "ప్రౌఢనిఘంటు" కాదు ఏ "నిఘంటు" నైన, "కాఱు-కల్లు-పదములు కేవలము" కాదు; పాక్షికముగనైన "ఉపకరణ వాచకములుగ కనిపించు" నవికావు. కాఱు శబ్దమునకు దట్టమైన (కాఱడవి) పరుషవాక్కు (కాఱులఱచి) అనుఅర్థములు, కల్లుశబ్దమునకు మద్యము (కల్లుదేర) రాయి (కల్పొన్న) చక్రము (కల్లుగ్రుంగిన) అను అర్థములు మాత్రమే ప్రౌఢనిఘంటువునందు ప్రయోగ పూర్వకములుగ కనిపించును.

కనుక "ఉపకరణ వాచకములుగనే కనిపించు" ననుట ఊహాగానము.

2. "విశ్వబ్రహ్మణుల కొలిముట్లలో నేడు మొనగాఱు, నీరుకాఱు అని ఇంకను కాఱువాచకములున్నవి."

విశ్వబ్రాహ్మణుల కొలముట్లలో "నేడు మొనగాలు, నీరుకాలు మొదలైన కాలువాచకములున్న"ను, ఆంధ్ర బ్రాహ్మణుల గ్రంథము లలో నాడు మొనగారు, నీరుకారు, మొదలైన కారువాచకములే కలవు. నేడు విశ్వబ్రాహ్మణుల కొలముట్లలో "కాలు" వాచకములున్నను అవి "అచ్చముగా తెలుగు పదములే" కావలసిన ఆవశ్యకములేదు. అన్య దేశ్యములును కావచ్చును. విశ్వబ్రాహ్మణుల కొలముట్లలో అన్యదేశ్య ములు పదమూడవ శతాబ్ది ఉత్తరార్థమునందే ప్రవేశించినవనుటకు తిక్కన ప్రయోగమే ప్రముఖోదాహరణము.

"—అక్షేణ సత్యులు ధర్మ
పరులును నైన భూసురులు నీవుఁ
ద్రాసులుంబోని చిత్తంబు తోడుతఁ
బజ వివాదము లెడఁబఘముడిగి" శాం.ప. [2 ఆ. 375 ప.]

ఇందలి త్రాసు విశ్వబ్రాహ్మణుల కొలముట్లలో ఒకటే. అది "తరాజూ"అను పారసీకపదము నుండి ఆవిర్భవించిన తెలుగు పదము. అన్యదేశ్యము. తిక్కన భారతమునకు ఇంచుక పూర్వము, 1278 వ సంవత్సరము నాటి కాకతిరుద్రమదేవికి సంబంధించిన ఈపూరు శాసనములందు "త్రాసు నాయము" అను పదబంధము కలదు. ఇది యెల్ల సూర్యరాయాంధ్ర నిఘంటువునందే కలదు. అంతేకాదు. ఆంధ్ర భాషార్ణవమునందు,

"స్వర్ణకారా భిద పరగుఁబారసి యగ
సాలి సౌన్నారి కంసాలి యనఁగ".

అని కలదు. ఇందు స్వర్ణకార - అను సంస్కృత శబ్దమునకు అగసాలి, కంసాలి, సౌన్నారి అను తెలుగు పదములేగాక, "పారసి" అను పదము కలదు. ఇది గమనార్హమైన విశేషము. "పారసి భాష వ్రాసినంగన్నుల పండువైయమరు" అని శ్రీనాథుని ప్రయోగము. (భీ. ఖం. 1ఆ. 74ప.) పారసిభాష అనగా పారసీకభాష. పారసీక శబ్దభవము పారసి. స్వర్ణకారులే పారసీక శబ్దభవులైనపుడు, స్వర్ణ కారుల కొలముట్లలు కొన్ని పారసీక శబ్దభవములగుట కొలత కాదు.

3. "కార్ఖానాలోని 'కారు'నకు యంత్రమని గూడ యర్థము జెప్పిరి కాని యదిగూడ పొసగునట్లు దోచదు. తెలుగులోని 'కారు'నకు శిల్పి యని నైఘంటికార్థము. పనివాడని లోకవ్యవహారము. ఇక పారశీక మైన కారునకు అమోకార,కుంభకారాదులందువలె పనిచేయువాడనియే యర్థము...... గనుక కార్‌ఖానా యనగా పనివారుండెడు స్థలము. యంత్రశాలలో పనివారు పెక్కురుందురు గనుక నేడాపేరు యంత్రా గారములకు పర్యాయమైనది."

తెలుగులోని "కారు" అను పదమునకు శిల్పి అని "నైఘంటి కార్థము" కాదు గాని, సంస్కృతములోని కారు శబ్దమునకు శిల్పి అని ఒక నైఘంటుకార్థము కలదు. ఉకారాంత సంస్కృత కారు శబ్ద మునకు వడ్రంగి, దేవాంగి, గోసంగి, మంగలి, చాకలి మొదలైన అర్థ ములును కలవు. "తక్షా చ తన్తువాయశ్చ నాపితో రజకస్తథా। పఞ్చ మశ్చర్మకారశ్చ కారవః శిల్పినోమతాః" ఇట్లు ఆప్టే సంస్కృతాంగ్ల నిఘంటువునందు కలదు. అది తెలుగునందు "కారువు" అగునుగాని "కారు" కాదు. కాలేదు. "కారువు" అను శబ్దమునకే శిల్పి అను అర్థము సూర్యరాయాంధ్ర నిఘంటువునందు కలదు. అది సంస్కృత శబ్దమని అందే కలదు. సూర్యరాయాంధ్ర నిఘంటువులోని పదములెల్ల "అచ్చముగా తెలుగుపదములు" కావు. తత్సమ, తద్భవములతోపాటు దేశ్యములు, అన్యదేశ్యములును కలవు. ఆచ్ఛిక నిఘంటువులందు అన్యదేశ్యములు కలవు. సంస్కృతమునందు ఉకారాంతదారుశబ్ద మున్నను, తెలుగులోని దారు అన్యదేశ్యమయినట్లు, సంస్కృతమునందు ఉకారాంతకారుశబ్దమున్నను, తెలుగులోని కారు అన్యదేశ్యము కావచ్చును.

కారః అను సంస్కృత వ్యస్తశబ్దమునకు శిల్పి అను అర్థము సమకూరదు. కూరినను, అది తెలుగున"కారుడు" అగును గాని,"కారు" కాదు. వృద్ధాదులలో చేరదు. సమాసాంత కారశబ్దమునకు చేయువాడని అర్థముగాని, శిల్పి అని అర్థము కాదు. గ్రంథకారః = గ్రంథమును చేయువాడు. అనగా రచించువాడు. కుంభకారః = కుండనుచేయువాడు. అనగా ఘటించువాడు. స్వర్ణకారః=బంగారము చేయువాడు. అనగా నగలు తయారు చేయువాడు. శిల్ప సహితముగ కుండను చేయు వాడును, శిల్ప రహితముగ కుండను చేయువాడును కుంభకారుడే.

తెలుగులోని "కారు" అను పదమునకు పనివాడను లోకవ్య వహారము కొన్నిప్రాంతమందు కలదేమోగాని, సర్వప్రాంతమందును లేదు. కుర్రకారు, గడేకారు అను లోకవ్యవహారములు సర్వత్రకలవు. కుర్ర కారు అనగా కుర్రపనివాడని, గడేకారు అనగా గడేపనివాడని అర్థము కాదు. కుర్రకారు అనగా పిన్నవయసువారని, గడేకారు అనగా అల్లరి చేయువాడని అర్థము. కుర్రకారు "అచ్చముగా తెలుగు పదమే" గాని, గడేకారు స్పష్టముగ అన్యదేశ్యము. అన్యదేశ్యమైన "కారు" అను పదమునకే చేయువాడని అర్థము.

ఇక పారసీక పదమైన కార్ శబ్దమునకు బహ్వర్థములు కలవు. అందు చేయువాడను అర్థము ఒకటి. అదే యావదర్థము కాదు. పని ముట్టను పారసీకపదమైన కార్ శబ్దార్థము. కార్ శబ్దమునకు సమగ్ర పారసీకాంగ్లనిఘంటువునందు "ఆపరేటర్" అను అర్థము కలదు. ఆపరేటర్ అను ఆంగ్లపదమునకు "ఒన్ హూ ఆర్ దట్ విచ్

ఆపరేట్స్"అని చాంబర్స్ ట్వెంటియెత్ సెంచరీ ఇంగ్లీషు డిక్షనరీయందు కలదు. "గనుక కార్ఖానా యనగా పనివారుండెడు స్థలము" కాదు. పనిచేయు స్థలమును కాదు. వస్తూత్పత్తి స్థానము. యంత్రాగారమును. "యంత్ర శాలలో పనివారు పెక్కురుందురు గనుక నేడాపేరు యంత్రాగారమునకు పర్యాయము" కాలేదు. కార్ఖానా అనగా పారసీక భాష యందే మేన్యుఫేక్టరీ,డాక్‌యార్డ్ మొదలైన అర్థములు కలవు. లవే హిందీ గుజరాతీ నిఘంటువులందును కలవు. "వహ్ ఇమారత్ యా భవన, జిస్ మేం యంత్రోం ఆది కీ సహాయతా సే కిసీ వస్తుకా అధిక పరిమాణ్ మే ఉత్పాదన్ కియా జాతాహో (ఫేక్టరీ)" అని మానక్ హిందీకోశ్‌లోని అర్థవివరణము.యంత్ర సహాయమున వస్తువులను అధిక పరమాణమున ఉత్పాదన చేయు భవనమని తాత్పర్యము. అనగా యంత్రాగారమేకద! యంత్రమనగా "ఎనీ ఇన్స్ట్రుమెంట్ ఆర్ మెషీన్" అని ఆప్టే సంస్కృతాంగ్ల నిఘంటువునందు కలదు. కనుక పారసీక భాషలోని కార్ శబ్దమే ఉపకరణవాచకము.

ఉపకరణ వాచకమైన, పారసీక పదమైన, కార్ఖానా అను పారసీక పదబంధములోని ఏకదేశమైన కార్ శబ్దమునకు యంత్రమను అర్థము "పొసగునట్లుదోచ"కున్న, అది తోచు యంత్రములోని దొసగు అగును.

4. "మాలాకార శబ్దము 'మాలకరి' యైనది. ఇందలి కరిశబ్దము చేయువాడు అను నర్థమున దేశ్యములందు కకారపు పొల్లు లోపించి పూజ + అరి = పూజారి, కమ్మి + అరి=కమ్మరి, ఉప్పు + అరి = ఉప్పరి ఇటులే దాసరి, దొమ్మరి, మేదరి, వడ్డెరి మున్నగు జాతివాచకములందు కనిపించును."

ఇది వ్యాకరణశాస్త్ర సంప్రదాయమునకు వ్యాహతము. భాషా శాస్త్ర సంవిధానమునకు బాధకము. మఱే మహాశాస్త్ర సంప్రయోగమునకు సాధకమో వారే సెలవీయవలయును.

"అరిపర్వకంబు మతుబర్థంబున జాలాదులకగు" అను వ్యాకరణశాస్త్ర సంప్రదాయమునందు జాతివివక్షలేదు. జాలరి, సుంకరి, కల్లరి, జూదరి మొదలైన దేశ్యములు కలవు. "కనుమరి" అను శబ్దము కన్మరి అయి, కమ్మరి అగునను భాషాశాస్త్ర సంవిధానమునందు కమ్మిశబ్దము లేదు. కమ్మశబ్దమును లేదు.

"కరిశబ్దము చేయువాడు అనునర్థమున దేశ్యములందు కకారపు పొల్లు లోపించి" పూజ + అరి=పూజరి అగుటకు పూజశబ్దము దేశ్యము కాదు. తద్భవము. కమ్మి + అరి=కమ్మరి, ఉప్పు + అరి=ఉప్పరి అయినచో, కమ్మిచేయువాడు కమ్మరిమాత్రమేగాక, ఉప్పుచేయువాడు ఉప్పరి అగును. మన్నుత్రవ్వువాడు ఉప్పరిగాని, ఉప్పుచేయువాడు ఉప్పరికాడు. అయినను, దాసచేయువాడు దాసరి, దొమ్మచేయువాడు దొమ్మరి, మేదచేయువాడు మేదరి, వడ్డెచేయువాడు వడ్డెరి అగుటయేగాక, వడ్డె + అరి=వడ్డెరి అగుటకు పరరూపసంధి ప్రాప్తించును కాఁబోలు ! ఒంటచేయువాడు ఒంటరి, వంటచేయువాడు వంటరి అని కూడ అగును కాఁబోలు!! ఒంటర్లు,వంటర్లు అని కలరు. మాలకరి కూడ మాలరి అగుటయేగాక, జాతివాచకము కూడ అగును కాఁబోలు !!

"కరిశబ్దము చేయువాడు అనునర్థమున దేశ్యములందు కకారపు పొల్లు లోపించి జాతివాచకములందు కనిపించు"టకు కారణము,వ్యాకరణ శాస్త్రముగాక బూకరణశాస్త్రము, భాషాశాస్త్రముగాక దోషాశాస్త్రము కావలయును.

5. "ఈ కార,. కరిశబ్దములేగాక పేనిచే నేర్పడిన 'కారము' అను రూపముగూడ చేయబడినది - అనునర్థమున తెలుగున వెలిగారము, గురిజకారము, సురేకారము మున్నగు పదములందు గనిపించును. చిత్రమేమన ఇవి గూడ విశ్వబ్రాహ్మణ పదములే. వెలిగారమనగా తెల్లగాచేయబడిన శిలా విశేషము. ఇది నేతొక వీధి ద్రవ్యము. గురిజకార మనగా గురివెంద పలుకులు నూరి సిద్ధము చేయు ఒకవిధమైన జిగురుపదార్థము. సురేకారమనగా సోరుప్పు కాల్చి సున్నముకలిపి చేసెడు ఒక పదార్థము."

ఇది చిత్రముకాదు. విచిత్రము. అవిచారమూలకమో, అజ్ఞాన విలాసమో, బుద్ధిపూర్వకమైన బూటకపు తంత్రమో అర్థముకాని మహా చిత్రము.

నిజముగ "కారము" అను శబ్దమునకు "చేయబడినది" అను అర్థముకలదేని, యథార్థముగ వెలిగారము "తెల్లగాచేయబడిన శిలావిశేషము"అగునేని,మఱి గురిజకారము గురిజగా చేయబడిన శిలా విశేషము, సురేకారము సురెగా చేయబడిన శిలా విశేషము కాలేదేమి? - "కారము" అను శబ్దమునకు "చేయబడినది" అని అర్థమున్నట్లు, "చేయబడినది" అను శబ్దమునకు "చేయునది, చేసెడునది" అనికూడ అర్థములున్నవి కాఁబోలు !

వెలిగారము, సురేకారము అను పదబంధములలోని కారము క్షారశబ్దభవము. సురేకారమునకు - సూరేకారము, సూరాకారము అని మాత్రమేగాక, నిరుపపదముగ కారము అను వ్యవహారమును కలదు. అది కటుశబ్దభవమైన కారముకాదు. క్షారశబ్ద భవమైన కారము. సోరుప్పు కాదు సురుప్పు.

"ఒగి సురక్షారమగుఁ బెట్లుప్పనన్సు
రుప్పనంగఁ గళాభాసి తోత్తమాంగ" [ద్వి. కాం. 249ప.]

అని మఱి ఆంధ్రభాషార్ణవమునందే కలదు సూర్యరాయాంధ్ర నిఘంటువునందులేదు సురక్షారశబ్దవికారములే సురుప్పు, సురేకారము, సూరేకారము, సూరాకారము, కారమును సురుప్పునుబట్టి సురేకారము వెల్లదనమును బట్టి వెలిగారము. ఈ రెండును బండశిలలుకావు క్షారములు, లవణములును సురక్షారమునందు క్షారముకలదు సురుప్పునందు ఉప్పు కలదు ఉప్పు లవణమే కారమే గారము

గురిజకారము గురువిందగింజలు అరగఁదీసి తయారుచేయు జిగురు పదార్థమేకాని, అది కారము అగుటకు హేతువు అందు కలుపు వెలిగారము వెలిగారము క్షారము క్షారసంసర్గము వలన గురువింద గింజలగంధము గురిజకారము

ఇట్టికారము విశ్వబ్రాహ్మణుల వృత్తిపదములందు మాత్రమేగాక మఱి దేవబ్రాహ్మణుల వృత్తిపదములందును కలదు "కారము" నూలు తడిపెడు ద్రవ్యవిశేషము ఇట్లు శబ్దరత్నాకరమునందు కలదు కలంకారీ అద్దకములకొఱకు పటిక, తుమ్మజిగురు కలిపి తయారుచేసిన కారమును ఉంచుతొట్టికి "కారంతొట్టి"అనిపేరు ఇట్లు తెలుగు వ్యుత్పత్తి కోశమునందు కలదు పటిక లవణము క్షారమును క్షారసంసర్గము వలన తుమ్మజిగురు కారము

తెలుగు నందుగాని, సంస్కృతమునందుగాని-వృత్తిపదమైనను ప్రవృత్తిపదమైనను "కారము" అనుశబ్దమునకు "చేయబడినది, చేయునది, చేసెడునది" అను అర్థములేమని, రావని ఏపాటి సంస్కృతాంధ్ర భాషాపరిజ్ఞాన మున్నను, ఎవ్వరికైనను తెలియును

6. "పట్టుకారనగా వస్తువులను పట్టుకొను సాధనమని యర్థము" మొనగారు అనగా "మొన=సన్నని మూలి కల పట్టుకారు"అని, నీరుకారు అనగా "నీరు=నివురు=నిప్పును పట్టు సాధనము" అని, కారు అనగా ఉపకరణము=సాధనము అని వారి అర్థవివరణమే కనుక మొనగారు, నీరుకారుసుకూడ "వస్తువులను పట్టుకొను సాధనము"లే కద! నిప్పును వస్తువే పట్టుకారు మాత్రమే వస్తువులను పట్టుకొను సాధనము, మొనగారు, నీరుకారు వస్తువులను పట్టుకొని సాధనములునుకావు మొనగారులోని మొనకు సన్నని మూతి, నీరుకారులోని నీరునకు నిప్పువలె, "పట్టుకారు"లోని పట్టునకును పట్టుకొనుట మాత్రముగాక, మఱొక ప్రత్యేకార్థము ఉండవలయును ఇది గమనింపకుండ "వస్తువులను పట్టుకొను సాధనమని యర్థము" చెప్పిన, అది గ్రామ్యవ్యుత్పత్తి (ఫోక్ ఎటిమాలజీ) అగును

అసలు "పట్టుకారు" అను పదబంధము ఆదిన్ప్రయుక్తమైన వేములవాడ భీమకవి చాటుపద్యము కమసాలి దుకాణమునకు సంబంధించినది కాదు కమ్మరి కార్ఖానాకు సంబంధించినది

"గరళపుముద్ద లోహ మపగాడ మహోశని కోట్లు సమ్మెటల్
హరునయనాగ్ని కొల్మి యురగాధిపు కోఱలు పట్టుకార్లు ది
క్కరటి శిరంబు దాయి లయకాలుఁడు కమ్మరి వైరివీరసం
హరణ గుణాభిరాముఁడగు మైలము భీమన ఖడ్గసృష్టికిన్"

ఇందు లోహము, సమ్మెటలు, కొలిమి, పట్టుకార్లు, దాయి కమ్మరి, కత్తి చేయుట కలవు కమ్మరి కత్తిని ఎట్లుచేయును?

ఇనుపముద్దను కొలిమిలో ఎఱ్ఱగా కాల్చి, తీసి, దిమ్మమీదపెట్టి, దానిని సమ్మెట వ్రేటులలో సాగఁగొట్టి, కమ్మరి కత్తిని తయారుచేయును

ఎఱ్ఱగా కాలిన ఇనుపముద్దను కొలిమిలోనుండి తీసి, దిమ్మమీద పెట్టుటను మాత్రమేగాక, దిమ్మమీద పెట్టిన ఎఱ్ఱగా కాలిన ఇనుప ముద్దను సమ్మెట వ్రేటులతో కమ్మరి సాగఁగొట్టుటకును "పట్టుకారుల" ఆవశ్యకము కలదు బలముకొలది సమ్మెటలతో కొట్టుచు సాగగొట్టునపుడు ఎఱ్ఱగా కాలిన ఇనుపముద్ద అటు, ఇటు, ఎటు కదలకుండ పట్టుకారులతో నొక్కిపెట్టుట జరుగును

పద్యమునందు పట్టుకారులు ఉపమేయము ఉరగాధిపు కోఱలు ఉపమానము అవి పట్టుకొను సాధనములు కావు కాటువేయు సాధనములు కాటువేయుట అనగా కోఱతో పట్టుకొనుట కాదు కోఱతో గ్రుచ్చుట అనగా గట్టిగా నొక్కిపెట్టుటయే

కనుక వేములవాడ భీమకవి చాటుపద్యములోని "పట్టుకారులు" వస్తువులను పట్టుకొను సాధనములు కావు గట్టిగా నొక్కిపెట్టు సాధనములు

ఆముక్తమాల్యదపంక్తిని "సౌవర్ణ భూషాది నిర్మాణంబుల యందు పట్టుకారులంబట్టుట" కలదు నగలు చేయునపుడు కమసాలులు వానిని "పట్టుకారుల"తో పట్టుకొనుటకు హేతువును, అవి కదలకుండ గట్టిగా నొక్కిపెట్టవలసిన ఆవశ్యకమే పట్టుకొను సాధనము ప్రాపణము గట్టిగా నొక్కిపెట్టు సాధనము "పట్టుకారు"

చేమకూర వేంకటకవి సారంగధరచరిత్రమునందు ఇట్లు కలదు

'ఇపుడు ధైర్యముగాని యిసుమంత పుష్పకో
దండ దరుని బాధ తాళలేవు,
పాపమెంచి మీఁదఁ బటుకార్లఁబట్టించు
దండధరుని బాధ తాళఁగలవె?" [2 ఆ 112 ప]

ఇందు పాపముచేసినచో, యముడు పటుకార్లను పట్టించుట కలదు అది యమబాధ కారణము, పట్టించిన పటుకార్లు శరీరమును గట్టిగా నొక్కిపెట్టుటయే

సముఖము వేంకటకృష్ణప్పనాయకుని అహల్యా సంక్రందనము నందు ఇట్లు కలదు

"చక్కని వాఁడింటి చాయకు వచ్చెనా
మాముగా రూరక మండిపడును
పుట్టింటిలో నొక్కపూట యుండఁగరాదు
కత్తికోతగఁబోరు నత్తగారు
నిమిషంబు పొరుగింట నిలిచి యుండఁగరాదు
పటుకార్లఁబట్టును వదినగారు
కడకుఁబోయిన నొక్క కడనుండఁగారాదు
మఱఁదలు కొండేలమారి బసివి
తోడికోడండ్రు చూపోప కాడుకొండ్రు
పట్టపగ పట్టి పోరాడు బావగారు
జార సంగతిఁ గాంక్షించు చంద్రముఖికి
నత్తగారిల్లె కారాగృహంబు దలఁప. [3 ఆ 46ప]

ఇందు కత్తికోత వలె పటుకార్లఁ బట్టుటకలదు కత్తితో కోయు నది కత్తికోత పటుకారులతో గట్టిగా నొక్కిపెట్టుట పటుకార్లఁబట్టుట రెండును శిక్షలు కోత కత్తి లక్షణము గట్టిగా నొక్కి పెట్టుట పటుకారు లక్షణము.

శరీరమునకు పటకారు పట్టించిన, అది చర్మమును గట్టిగా నొక్కిపెట్టుటయే గాక, చర్మమును ఛేదించుట కూడ జరుగును. కనుక గట్టిగానొక్కి పెట్టుటతోపాటు ఛేదించుటకూడ "పట్టు కారు" లక్షణము

నగలు తయారు చేయునపుడు కమసాలులు తివ్వలను పట కారుతో కత్తిరించుట కలదు. ఇనుపతీగను ఎవరైనను పటకారుతోనే కత్తిరించుట కలదు అది, ఇది ఛేదనమే అందుకే పటకారునకు ఆంగ్లభాషయందు కటింగ్ ప్లేయర్ అను వ్యవహారము ప్రసిద్ధముగ కలదు ప్లేయర్ అనగా సాధనము కటింగ్ప్లేయర్ అనగా కత్తిరించు, అథవా, ఛేదించు సాధనము గట్టిగా నొక్కి పెట్టి ఛేదించు సాధనము పటకారు.

కనుక "పట్టుకారు" అనగా "వస్తువులను పట్టుకొను సాధనమని యర్థము." కాదు వస్తువులను గట్టిగా నొక్కి పెట్టు, గట్టిగానొక్కి పెట్టి ఛేదించు సాధనమని అర్థము అది "పట్టుకారు" లోని "పట్టు" నకు ప్రత్యేకార్థము

సంస్కృతకార శబ్దమును సాధనార్థకముగ సాగదీయవచ్చును గాని, అది తెలుగు నందు "కారము" అగును గాని "కారు" కాదు. మఃవర్ణలోపమునకు చరిత్రాదులందు చేరదు ఉత్వప్రాప్తికి మహ కాదు. పారసీకభాషలోని కార్ శబ్దము తెలుగునందు నిరాఘాటముగ క అగును. కనుక ఆంధ్రభాషలోని ఉపకరణ వాచకమైన కారు అ పదము అపశ్యము పారసీక శబ్దభవము అన్యదేశ్యము అది మొనగాఁ నీరుకారు, "పట్టుకారు" మొదలైన పదబంధములందు కలదు మొ గారు లోని మొన, నీరుకారులోని నీరు వలె, "పట్టుకారు" లోని ప దేశ్యము కావచ్చును కాని "గట్టిగా నొక్కిపెట్టు, గట్టిగా నొక్కి పె ఛేదించు" అను ప్రత్యేకార్థము కలిగియుండ వలయును దేశ్యమై పట్టు అను ధాతువు గ్రహణార్థకము కాని, పీడనార్థకము కాదు. ఛే నార్థకమునుకాదు కనుక "పట్టుకారు"లోని 'పట్టు'కూడ దేశ్యము కాద

అసలు శబ్దము "పట్టుకారు", అది పట్టు, కారు అను దేశ ముల కలయిక అయిన, పట్టు + కారు = పట్టుఁగారు అగును పట్టు + కొమ్ము = పట్టుఁగొమ్మ వలె పట్టుకొమ్మ వలె పట్టుకారు అయిన, పటుకొమ్మ అను పదబంధము పటుకొమ్మ, పటకొమ్మ, పట్కొమ్మ కానట్లు, పట్టు కారు అను పదబంధమును పటుకారు, పటకారు, పట్కారు కాఁజాలదు కనుక పట్టుకారు అను పదబంధము పటుకారు, పటకారు, పట్కారు కాలేదు కాదు కార్ఖానా అను పదబంధ... కారఖానా, కారుఖానా అయి నట్లు, పట్కారు అను పదబంధము పటకారు, పటుకారు అగును పటు కారు మఱల పటుగారు, పట్టుకారు, పట్టుగారు కాఁగలదు కనుక పట్కారు ఆద్యప్రకృతి పట్టుకారు సాధ్యవికృతి తెలుగు ప్రజల సత్య వ్యవహారమునందు పట్కారు అని కలదు హిందీ ప్రజల నిత్య వ్యవ హారమునందు పట్కార్ అని కలదు గుజరాతీ గృహిణుల గృహ వ్యవ హారమునందును పడ్కార్ అని కలదు కన్నడ ప్రజల గ్రంథవ్యవ హారమునందు పటకారు అని కలదు కనుక పడ్కార్, పట్కార్, పట్కారు, పటకారు పరస్పరోపబలకములు ఇది శబ్దసంగతి

ఇక అర్థసంగతి—— పారసీక భాషయందు ఫత్ అను శబ్దము నకు (ఎఫ్ ఎ టి) విఱుచుచున్న (బ్రేకింగ్) అను అర్థము కలదు ఫద్ అను శబ్దమునకు (ఎఫ్ ఎ డి హెచ్) బరువుగా అదుముచున్న (ప్రెస్సింగ్ హెవిలీ) అను అర్థము కలదు ఇందు మొదటిది ఛేదించు టకు, రెండవది గట్టిగా నొక్కి పెట్టుటకు సరిపడును ఫత్ + కార్ = ఫత్కార్ అను పదబంధము, ఫధ్ + కార్ = ఫధ్కార్ అను పద బంధము పారసీక భాషయందు నిష్పన్నమగును అదిగాని, ఇదిగాని

గుజరాతీ బాషయందు పడ్కార్, హిందీ భాషయందు పట్కార్, తెలుగు భాషయందు పట్కారు, కన్నడ భాషయందు పటకారు అగును అంతేకాదు ప్రథమతః వ్యవహారప్రసిద్ధము, తదుపరి కవి ప్రయోగము అగును కవుల ప్రజ్ఞను పరభాషా పదము స్వభాషా వైఖరిని సంతరించుకొనును. పారసీక భాషయందు నిష్పన్నమగు ఫత్కార్, పధ్కార్అను పదబంధములకు విడిగా ఛేదించు సాధనము, గట్టిగా నొక్కిపెట్టు సాధనము అను అర్థములు వచ్చును. గుజరాతీ భాషలోని పడ్కార్, హిందీభాషలోని పట్కార్, తెలుగు భాషలోని పట్కారు,కన్నడభాషలోని పటకారు అను పదబంధములకు కలిసి గట్టిగా నొక్కిపెట్టు, ఛేదించు సాధనమని అర్థము వచ్చును శబ్దార్థసంగతి స్వరూపనిశ్చాయకము.

పదమూడవ శతాబ్ది ఉత్తరార్థము నందు తరాజూ అను పారసీకపదము తెలుగు నందు త్రాసు అయినది పదునాల్గవ శతాబ్ది ఉత్తరార్థము నందు కులాహ్ అను పారసీక పదము తెలుగునందు కోహళి అయినది. అదే సమయమునందు ఫత్కార్ లేక ఫధ్కార్ అను పారసీకపద బంధము తెలుగునందు పట్కారు అగును కులాహ్ అను పారసీక పదమును నాచన సోమనాథుడు కోహళి అని ప్రయోగించినట్లు (ఉ హరి 3ఆ. 86 ప) ఫత్కార్ లేక ఫధ్కార్ అను పారసీక పదబంధమును వేములవాడ భీమకవి "పట్టుకారు" అని ప్రయోగించును పట్కారు పటకారు అగును. పటుకారును అగును. కోహళి అను పదము సింహాచలశాసనము నందు "పంచ వక్త్ర కోహళి" అని సమాస ఘటిత ముగ, నారన సూరన వనమాలీవిలాసమునందు "మానిని నీలముఖ స్తన ద్వయీ నిరుపమ కోహళి యుగళి" అని దీర్ఘ సమాస ఘటితముగ మాత్రమేగాక, దీర్ఘాంతముగను కలదు. ఇది సూర్యరాయాంధ్ర నిఘంటువు నందుకలదు. కనుక దీర్ఘసమాస ఘటితము, దీర్ఘాంతమును గనుక కోహళీ శబ్దము స్వచ్ఛముగా సంస్కృత శబ్దమే అనుట ఎట్టిదో; శకట రేఫాంతము కాకపోయినను, ప్రత్యేకార్థము రాకపోయినను, విశ్వబ్రాహ్మణుల వృత్తిపదములందుకలదని "పట్టుకారు" అను పదబంధము "అన్యదేశ్యముగాదు అచ్చముగా తెలుగుపదమే" అనుట కూడ అట్టిదే

కనుక వేములవాడ భీమకవి చాటు పద్యములోని "పట్టుకారు" అను పదబంధము "అచ్చముగా తెలుగు పదము" కాదు. ఖచ్చితముగా అన్యదేశ్యమే

డాక్టరు కొర్లపాటి శ్రీరామమూర్తి

# గ్రంథ విమర్శలు

## ప్రపత్తిభావసంపత్తి

శైవ వైష్ణవ మతాలు ఉధృతంగా పెంపొందిన కాలంలో ఆయా మతావలంబకులు విపరీత ఆసక్తితో ఎంతో వాఙ్మయాన్ని సృష్టించారు మానవులు వైయక్తికంగా తమ హృదయాలను ఉత్తేజింపచేసిన అంశాలను జాతి హృదయపరం చేయాలనే తహ తహ ప్రదర్శించడం సహజమైనదీ, అనివార్యమైనదీను శైవవైష్ణవ మతావలంబకులు సృష్టించిన వాఙ్మయాన్ని పరిశీలిస్తున్నవారికి మన దేశంలో జైనబౌద్ధమతాల ఔద్ధత్యం సాగినకాలంలో ఆనాటి ప్రజల భాషలో ఎంత వాఙ్మయం సృష్టింపబడిందో అన్న జిజ్ఞాస కలగడమూ సహజమే అయితే అదంతా భిన్నమతస్థుల ధాష్టీకానికి గురై నశించిపోయిందేమో అన్న ఆర్తి కలగడంలో కూడా అబ్బురం లేదు ఒక మతంపై కొందరికి గల విశ్వాసం గాఢమైనకొలదీ, భిన్నమతస్థుల విశ్వాసాలతో సంఘర్షణలకు దిగడమూ అనివార్యమేనని ప్రపంచంలోని అన్నిమతాల చరిత్రలూ వేనోళ్ళ చాటుతూనే ఉన్నాయి ఆ విధంగా మన దేశంలో వైష్ణవమతంపట్ల తీవ్ర అభినివేశం పెంపొందిన రోజులలో ఎంత సాహిత్యం ఉద్భూతమై, చివికి చినికి చివరికి కాలగర్భంలో కలిసిపోయి వుంటుందోనన్న సత్యం ఈ గ్రంథం పరిశీలిస్తే తెలియకపోదు

[ గ్రంథనామం తిరునామములు, సంపాదకుడు డా॥ కిండాచి నరసింహాచార్య 1/8 డెమ్మీ - 28 + 484 + 37 పుటలు గల ఉద్గ్రంథం వెల రూ 40/- లు ] రచయిత పిహెచ్ డి పరిశోధనార్థం తెలుగుదేశంలో పర్యటించి స్వయంగా సేకరించిన వైష్ణవ భక్తి కీర్తనలు, గురుపరంపర, శ్రియఃపతి వంటి ఉపశీర్షికలలో నింగడించిన 574 కీర్తనలను సేకరించగలగడం ఎంత కష్టసాధ్యమైన సంగతో వేరుగా చెప్పవలసిన పనిలేదు కాని నిర్మమంగా చదివిన పాఠకుడు ఇంత కృషిఫలోన్ముఖమైందనిమాత్రం విశ్వసించలేడు కాలానుగుణ్యంగా జాతి వివేచనను అనవసర ద్రవ్యాన్ని విసర్జించుకుంటూ, జీవపదార్థాన్ని మాత్రం రక్తనిష్టం చేసుకొనే గుణం సహజమైనదే అట్టి లక్షణంతో విస్మృతమైన సంకీర్తనా సాహిత్యం ద్రవ్యాత్మకంగా తక్కువైందికాదు. కాని పరిశోధనాంశంగా స్వీకరించడంవల్ల - పరిశోధకులకు అవసరమైనంతగా, రంజకమైనంతగా పాఠక సర్వస్వాన్ని ఆకర్షించ గలదనుకోవడం కూడా భ్రమాజనితమే అందుకే పాపం శ్రీ తిరుమల తిరుపతి దేవస్థానంవారు వేలాది రూపాయల ముద్రణా సహాయమొనర్చడమూ, భారత ప్రభుత్వం వారి తగ్గింపుధరకు కాగితం లభింపచేయడమూ జరిగినా పుస్తకం వెల ఉదాత్తమే అయింది ఈ గ్రంథానికి సర్వశ్రీ శ్రీభాష్యం అప్పలాచార్యులు, మరింగంటి శ్రీరంగాచార్యులు, డా॥కోవెల సుప్రసన్నాచార్యులు వంటి సాహితీపరులు ముందుమాట (లందించారు· చిన్నశ్రీమన్నారాయణ రామానుజయర్‌గారు మంగళాశాసనమందించారు· మొత్తానికి గ్రంథం సర్వం శ్రీవైష్ణవంగా భాసిస్తున్నది

అచ్ఛమైన కవిత్వం – ప్రచారస్థాయినిమించి, విభిన్న మతస్థుల హృదయాలను సైతం కవితా ప్రతిస్పందనలతో అలరింపచేయవలసి వుంది ఆ స్థాయికి చేరగలిగిన రచనలు ఈ గ్రంథంలో కొన్నయినా లేకపోలేదు భాషాజ్ఞానశూన్యతవల్లనే సంకర సమాస ఘటనం ఏర్పడుతోందని మొత్తుకొనే కురచచూపు పండితులకు, పండితులూ, విద్వాంసులూ, సృజనాత్మక శక్తిగల కవులూ మాత్రమే పరంపరాగతంగా మిశ్రమ సమాసాలు రూపొందిస్తూ వస్తున్నారనీ, కన్యాశుల్కంలోని అగ్నిహోత్రావధానుల భాషకుమల్లే భ్రష్టరూపాన్ని సృజించేది ఛాందసులేననీ అర్థం చేసుకోలేదు ఈ సంకీర్తనలలో - బహుమంది, సోగముత్యపు ఝల్లుముక్కలు, వంటి వ్రాతలు కోకొల్లలుగా కనిపిస్తాయి

వైష్ణవమతం ప్రధానంగా నైతిక నైష్టిక జీవితానికి భిన్నంగా– "ఒకసారి శరణన్న వారి మరి లెక్కలేని పాతకములు చేసిన మక్కువతోడుత సర్వసంపదలు నిక్కమిచ్చి రక్షింతుమనెడు మాట తిరుగరాదే, తమరాడిన మాట తిరుగరాదే!" అనే అలుసేర్పడి, పాపాలు నిశ్శంకగా ఆచరించినా ఫరవాలేదనే స్థిరచిత్తం పేర్రేగిపోయింది రాను రాను ఈ అలసభావంవల్ల సర్వాంశా భ్రష్టాచారమే ప్రబలి, వైష్ణవమతం క్షీణించడానికీ, శ్రీమద్రామానుజుల సర్వజన సుఖంకరార్తితో రూపొందిన సిద్ధాంతానికే కాలదోషం పట్టడానికీ అవకాశమేర్పడింది అందరూ శ్రీ వైష్ణవులే అయితే బుట్టెడు నెత్తళ్ళు (మత్స్యవిశేషం) ఏమై పోయాయో? అనే సామెత ఉత్తనే పుట్టిందంటే నమ్మే వెర్రివాళ్ళెవరూ ఉండరు యోగివేమన కాలంనాటికి అనేక మతాలతో పాటు శ్రీవైష్ణవం ఎంత భ్రష్టుపట్టి పోయి ఉండకపోతే ఆ మహనీయుని నిశితాస్త్రాలబారిపడి అవహేళన పొందగలుగుతుంది?

తిరునామములుగా పేర్కొనబడిన ఈ సంకీర్తన పదాలు– ముఖ్యంగా ఆర్తి చిత్తశుద్ధిగల భక్తుల చేరబంచబడి గానం చేయబడినవి కావడంవల్ల అక్కడక్కడైనా కవితా వాల్లభ్యంతో భాసించక

పోలేదు. అలాంటి కవితాగుణ శకలాలు పాఠకుల రసనల కందించ డంలో మేలు జరక్కపోదు. వాచవిగా కొన్ని వాక్యాలు

1. తొలగరేని మేనిదొడ్డసెగల గమికి బుగులు దగిలి మగువనంటు వానియందు మమతగల్గుటేమయా?

2 లోకమున కచభరము చీకటందురు గాని, చీకటైతే చుక్క చేరు లవి యేవే?

3. మూలనున్న వానిదీసీ నన్నూ ముంగిటిలో బాడావేసీ...

4 కోపశేమునికి కరుకెక్కించెదవా?

5. మున్నుగంగతో కావేరీ యెన్నిన ఇక్ష్వాకుపెన్నిధానా?

6. శేషిణీ ఆర్తావనైక విశేషగుణ మణి భూషిణీ
శేషగిరి హరిమానసాంబుజ పూషవత్కృత వేషిణీ

వంటి హృద్యమైన కవితాశకలాలు అందందు తగిలి హృదయాన్ని చుర్రుమనిపిస్తాయి

"రూప విభ్రమాభిరామ రూఢిమించి క్షుద్రసతి-పాపమనన్ కూడినట్టి బాపనయ్య నేలవే?" అనే వాక్యాలలో ఏదో ప్రత్యేక వ్యక్తి గత చరిత్రాంశమేదో తొంగి చూస్తోంది అది ఆ గీతాన్ని ఆలపించిన భక్తవరునిదైనా కావచ్చు! కొన్ని కీర్తనలలో కృతికర్తనామం అంకితంతోపాటు కనిపిస్తుంది కొన్ని కీర్తనలలో బహుశా ఆ భాగం జారిపోయి వుండవచ్చు

"అతి సాధ్వియైన సీతమ్మనడవిలోకి పంపినట్టి
మితిలేని కరినుడవీవు మేరలేదు నడవడికి!"

అనే వాక్యాలలో వ్యాజ్యస్తుతి నుద్దేశించినా, ఉత్తర రామాయణ గాథాంశాన్ని స్మరిస్తాడు గేయకారుడు! త ద్వా రా అధిక్షేపమూ ధ్వనిస్తుంది

"దాస వృజినహారీ ర హ స్య త్ర య సంగతకారీ—కోసవేశ హృత్కోక శనిహారీ!" అనే వాక్యంలోనూ, "వృషగిరి నిలయా సంపుషి తకువలయా విషరుహదళ విపుల నయన విశధరశయనా?" అనే వాక్యంలో ఉద్దేశించిన అభిప్రాయమేదో అభివ్యక్తిం కాదు

ఏమైనా ఒకనాడు దేశాన్ని పాలించిన సంకీర్తనా పదసంప్ర దాయంలో ఒక మేలిమి భాగాన్ని ఈ గ్రంథం ఆవిష్కరించిందన డంలో సందేహంలేదు. ఆ కష్టభరిత కృషికి బాధ్యులైన సంకలనకర్త నరసింహాచార్యు అభినందన పాత్రులే!

**శ్రీ సోమసుందర్**

# ఇదియే ఇస్లాం

[మూలం · సయ్యద్ అబుల్ అలా మౌదూది (రహ్మాల్లై) అనువాదం ఎస్ ఎమ్ మలిక్ క్రౌను 236 పుటలు. వెల రు 10-00 ప్రకాశకులు తెలుగు ఇస్లామిక్ పబ్లికేషన్స్, లక్కడ్‌కోట్, ఛత్తా బజార్, హైదరాబాదు-500 002.]

ఈనాడు తెలుగులో 'ఇస్లాం' ధర్మాన్ని వివరించే బహుకొద్ది గ్రంథాల్లో 'ఇదియే ఇస్లాం' ఒకటి ఇందులో ఏడు అధ్యాయాలు ఉన్నవి మొదటి అధ్యాయంలో 'ఇస్లాం' నిర్వచనంతో పాటు వ్యాప కత్వం వివరించబడింది— "యావజ్జగత్తు అనుసరించే ఆచరణ నియ మావళి— 'ధర్మం' [ఇస్లాం]. దైవాజ్ఞకు లోబడి మెలిగే వస్తు, జీవ సముదాయం అంతాకూడ 'ముస్లిములే" అంటాడు రచయిత రెండవ అధ్యాయం జ్ఞానం, విశ్వాసం, పరలోకం, ఈమాన్‌లను గూర్చి చర్చిం చింది

మూడవ అధ్యాయంలో నబి (ప్రవక్త), రసూల్ (దేవదూత), దీన్ (ధర్మం), షరీఅత్ (చట్టం) లను విపులంగా వివరించారు. 1400 సం॥ నాడు అరబుదేశంలో 'ఇస్లాం'కు దారి తీసిన పరిస్థితు లను వివరించారు రచయిత— "అది ప్రభుత్వంలేని దేశం వారిది ఆటవిక జీవితం పాశవిక విధానాలు, వ్యభిచారం, జూదం, మద్య పానంలో ఆరితేరినవారు మానినీమణులు సైతం నగ్నంగా కాబా' ప్రదక్షిణలో పాల్గొనేవారు ఎవరినయినా అల్లునిగా అంగీకరించటం అంటే నీచంగా భావించేవారు ఈ మూర్ఖపు పరువు ప్రతిష్ఠల కొరకు తమ ఆడ సంతానాన్ని సజీవంగా పూడ్చిపెట్టేవారు తండ్రి మరణా నంతరం సవతి తల్లిని నిర్మొహమాటంగ పెళ్లాడేవారు " ఆ తర్వాత దైవప్రవక్త మొహమ్మద్ ఆవిర్భవించటానికి కారణాలు సూచించి, ప్రవక్త జీవితము, బోధనలు క్లుప్తంగ వివరించారు రచయిత

నాలుగవ అధ్యాయంలో 'ఈమాన్' ముఖ్యాంశాలు చర్చించారు. 'ముస్లిమ్' అంటే దైవవిధేయత పాటించేవారు అని విశదీకరిం చారు. ఇంకా 'కలిమా', 'లా ఇలాహ ఇల్లల్లాహ్' (అల్లాహ్ తప్ప వేరే దైవం లేదు ) బోధన, 'ఖుర్ ఆన్' సందేశము, జన్మచక్రం, ప్రళయం, పరలోకం విషయాలపై చర్చ జరిగింది

అయిదవ అధ్యాయంలో 'ఇబాదత్' (ఆరాధన), 'నమాజ్' (దైవోపాసన), 'రోజా' (ఉపవాస వ్రతం), సామూహిక శిక్షణ 'జకాత్' (త్యాగనిరతి), 'హజ్' (మక్కాయాత్ర)ల వివరణ జరిగింది

ఆరవ అధ్యాయంలో షరీఅత్ (ధర్మ శాస్త్రం)కు 'ఖుర్ ఆన్' మతగ్రంథం, 'హదీస్' (మహాప్రవక్త)లు ఆధారాలుగా వివరించ బడ్డాయి. 'ఫికహ్' (ఇస్లామియా న్యాయశాస్త్రం) లోని సూక్ష్మ విష యాలు తెలుపబడ్డాయి 'తసవ్వుఫ్' (ఆధ్యాత్మిక తత్త్వం) వివరించ బడింది. ఏడవ అధ్యాయంలో షరీఅత్ ఆదేశాలు, సూత్రాలు వివరించ బడ్డాయి. ప్రతివ్యక్తిపై నాలుగు విధాల బాధ్యతలు— 1) దైవసంబంధ మైన, 2) స్వంతవి, 3) తోటిమానవులపట్ల, 4) సమాజానికిగాను భగవత్ప్రసాదితములైన వనరులపట్ల— రచయిత విపరించారు. చివ రగా 'ఇస్లామియ షరీఅత్' విశ్వజనీన మైనదిగా రచయిత పేర్కొన్నారు.

స్థూలంగ 'ఇస్లాం'ను గురించి తెలుసుకో దల్చుకున్నవారికి ఈ పుస్తకం సరళశైలిలో సులభమైన భాషలో చక్కగ ఉపకరిస్తుంది కాని రచయిత కొన్ని సందర్భాలలో ఇతర మతాలను గూర్చి చులకన భావం చూపాడు ఉదా - "బౌద్ధమతం పరిపూర్ణ ధర్మం కాకపోయి నప్పటికీ, అందులో కేవలం కొన్ని నైతికనియమాలే ఉన్నప్పటికీ, అది భారతదేశం దాటి అటు జపాను, మంగోలియా వరకు, ఇటు ఆఫ్ఘనిస్తాన్, బుఖారా వరకు వ్యాపించింది దాని ప్రచారకులు దూర ప్రయాణాలు చేసి బహుదూర ప్రాంతాల్లో దానిని ప్రచారం చేశారు" ఇక్కడ రచయితకు మతసహనం లోపించిందనిపిస్తుంది

**కెప్టెన్ షేక్ మౌలాలీ**

## ఆర్. ఎస్. సుదర్శనం గారి రెండు పుస్తకాలు

### 1. సాహిత్యంలో దృక్పథాలు.రెండపకూర్పు (పరిష్కృతం)

(క్రౌను సైజు 270 పుటలు. వెల రు 20/-)

### 2. సాహిత్య నేపథ్యం

(వెల రు 12-50 క్రౌను సైజు 166 పుటలు)

[ప్రచురణ శ్రీమతి ఆర్ వసుంధరాదేవి ప్రతులకు శ్రీమతి ఆర్. వసుంధరాదేవి, 8_241, సువిశేషపురం, రాజమండ్రి-533104 లేదా నవోదయా పబ్లిషర్స్, ఏలూరురోడ్, విజయవాడ-2]

సుదర్శనంగారి సాహిత్యంలో దృక్పథాలు సాహితీ ప్రియు లందరికీ సుపరిచితం ఇది కీ. శే శ్రీ శివలెంక శంభు ప్రసాదుగారికి అంకితమివ్వబడింది

తొమ్మిది పుటల ప్రవేశికలో సుదర్శనం గారు తమ వ్యాసాల ధ్యేయమేమిటో స్పష్టపరిచారు "సాహిత్య వ్యవసాయమూ, సత్యా న్వేషణమూ జీవితంలో ఒకటైన కవి లేక నవలా రచయిత తన దృక్ప థంలో సమన్వయం సాధించటానికి ప్రయత్నిస్తాడు రచయితకు సంబం ధించిన ఆ ఆత్మకథను అతని సాహిత్య కృషి ప్రతిబింబిస్తుంది ఈ పద్ధతిలో కొందరు రచయితలను వారి గ్రంథాలనూ పరామర్శించడమే ఈ వ్యాసాల ఉద్దేశం" అని ప్రవేశికలో పేర్కొన్నారు ఈ పుస్త కంలో అల్లసాని పెద్దన, గురజాడ, ఉన్నవ లక్ష్మీనారాయణ, విశ్వ నాథ సత్యనారాయణ, గోపీచంద్, చలం, బుచ్చిబాబు, రాచకొండ విశ్వనాథ శాస్త్రి, జి వి కృష్ణారావు, నోరి నరసింహశాస్త్రి-అనే శీర్షి కలతో మొత్తం పది వ్యాసాలున్నాయి

"కావ్యార్థ వివరణ సమగ్రంగా, సవ్యంగా చేయని విమర్శ సాహిత్య విమర్శేకాదు" అంటారు రచయిత ప్రవేశికలో అందరూ అంగీకరిస్తారు సాంప్రదాయకమైన విమర్శ ప్రాచీన సాహిత్యాన్ని అర్థంచేసుకోవడానికి తోడ్పడుతుంది. అసలు విషయం అర్థమైతే కవి దృక్పథం పాఠకుల స్థాయినిబట్టి అంతోయింతో బోధపడుతుంది. కవిత్వ దృక్పథాన్ని మాత్రమే తెలిపే ఆధునిక విధానపు సాహిత్య విమర్శ అసలు సాహిత్యాన్ని అర్థంచేసుకోవడానికి మాత్రం ఉపకరిం పక పోవడం గమనార్హం సుదర్శనంగారు అల్లసాని పెద్దన రచించిన మనుచరిత్ర కావ్యంలో ధ్వనిస్తున్న కవి తాత్త్విక దృక్పథాన్ని బాగా దర్శించి తమవ్యాసంలో ప్రదర్శించారు అయితే మనుచరిత్రను టీకా తాత్పర్యాలతో చదువుకొని అర్థంచేసుకొన్న పాఠకులకే ఈ వ్యాసం రుచిస్తుంది. అసలు అర్థం తెలిసిన తరువాతే ఏ వ్యంగ్యార్థమైనా తెలి సేది 'మనుచరిత్ర సమగ్ర స్వరూపం యిన్నాళ్ళూ మరుగున ఉండి పోయి'నదని సుదర్శనంగారు భావించడం కొందరికైనా ఆశ్చర్యం కలిగిస్తుంది వీరు తమవ్యాసంలో చెప్పిన విషయాలనే గాక, ఇంకా ఎన్నో అద్భుత విషయాలను మన పెద్దలు తమ సాహిత్యోపన్యాసా లలో తరచూ చెప్పడం ఎందరికో తెలుసు ప్రబంధ సాహిత్యం అంతో యింతో చదువుకున్నవారికి అది భక్తిగ్రంథాల మయంగా కనిపిస్తుంది. ఈ యుగానికి, ఆ కావ్యాలకూ 'ప్రబంధ' శబ్దాన్ని ప్రయోగించడం విషయమై జరిగిన లపకతవలను గూర్చి శ్రీ స్ఫూర్తిశ్రీగారు ఎప్పుడో చక్కని విమర్శచేశారు సుదర్శనంగారు ప్రబంధమంటే అందరికి శృంగారమే జ్ఞాపకం వస్తుందనే నమ్మకంతో తమ 'అల్లసాని పెద్దన' వ్యాసాన్ని ప్రారంభించారు వస్త్వైక్యం, శృంగారరస ప్రాధాన్యం మొదలైన లక్షణాలన్నీ తన కావ్యంలో ఉండాలనే ఉద్దేశం పెద్దనకు లేవు కాబట్టి ఆయన తన కావ్యంలో చెప్పదలచుకొన్నదేమిటో గ్రహించి, దానిని విడమరచి చెప్పడమే సహృదయ విమర్శకులు చేయ

వలసిన పని ఆ పనిని సుదర్శనంగారు సమర్థవంతంగా నిర్వహించారు "వరూథినీ ప్రవరుల ఉదంతాన్నిదాటి కావ్యాన్ని సమగ్రంగా చూడలేక పోవడానికి మన హ్రస్వదృష్టే కారణమేమో" అని రచయిత అనడం సబబుగా లేదు సుదర్శనంగారు వంటి వారెందరో ఉండి సద్విమర్శలు వెలయిస్తూఉంటే మనకు హ్రస్వదృష్టి ఎలా ఉంటుంది?

మనుచరిత్రలో "వరూథినీ ప్రవరుల సంవాదం చాల ప్రసిద్ధమైన కావ్యభాగం" మిగతాది అంత ప్రసిద్ధం కాకపోవడానికి కారణం అది అంత రసవంతంగా లేకపోవడమే! విమర్శలు రాసేవాళ్ళు, ఉపన్యాసాలిచ్చేవాళ్ళు, పరిశోధనలు చేసేవాళ్ళు ఎక్కువగా చదువు తుంటారు ఆ భాగాల్ని. సుదర్శనంగారు ఈ కావ్యాన్ని సమగ్రంగా ఆకళింపు చేసుకొని తమ పద్ధతిలో పెద్దనలోని భావ సంఘర్షణకు పరిణామమేమిటో, సమన్వయమేమిటో తెలియచేశారు ఉదాత్త శృంగారానికి శ్రీకారం చుట్టిన నన్నయకవులకు కూడా పెద్దిన పితామహుడు అని నిరూపించారు శాంతమే యిందలి ప్రధాన రసమని చెబుతూ ఈ వ్యాసాన్ని ముగించారు.

గురజాడను ప్రశంసిస్తూ వ్రాయబడిన వ్యాసంలో "తెలుగు కావ్యాల్లో శృంగార రసానుభూతికే ప్రధాన స్థానం ఇవ్వబడినట్లు హాస్యానికి జీవితానుభవం దృష్ట్యా ఏ ఉన్నతస్థానం చెందవలెనో ఆ స్థానం లేకపోయినట్లు గురజాడకు తోచింది" అని రచయిత అంటారు ప్రబంధకవులలో పెద్దవాడనిపించుకున్న పెద్దన మనుచరిత్రలో శాంతం ప్రధాన రసమని సుదర్శనంగారు నిరూపించారు గనుక గురజాడ పొరపాటు పడినట్లు స్పష్టమవుతూంది ఇక హాస్యానికి వస్తే ప్రాచీన కాలంలో ప్రపంచంలో ఏ ఉత్తమకావ్యాల్లోనూ హాస్యానికి ప్రాధాన్యం ఉన్నట్లు కనబడటం లేదు ఆధునిక యుగంలో హాస్యానికి కొరవలేదు హాస్యం ఎక్కువైతే ప్రధాన ఇతివృత్తం దెబ్బతింటుందనడంలో సందేహంలేదు కన్యాశుల్కమే ఇందుకు ఉదాహరణ కన్యాశుల్కానికి ఉన్న "మహత్తరమైన నైతిక ప్రయోజనం" సామాన్యులకు స్పష్టం కాక పోవడానికి ఇదే ప్రధానకారణం సుదర్శనంగారు కన్యాశుల్కాన్ని చదివే పద్ధతిని చక్కగా సూచించారు "గిరీశం పాత్రలో హాస్యరసానుభూతి పొందాలంటే పాఠకుడు నీతి అనే కొలబద్దను తాత్కాలికంగానైనా అవతల పెట్టాలి" అంటారు గిరీశం పాత్ర పాఠకుని ఎందుకు ఆకట్టుకుంటుందో సోదాహరణంగా నిరూపించారు గిరీశం, ఫాల్ స్టాఫ్ పాత్రల భేద సాదృశ్యాలను చక్కగా వివరించారు

మన నవలా సాహిత్యంలో మాలపల్లి నవలకు ఉన్నస్థానాన్ని ఒక వ్యాసంలో చర్చించారు "హైందవ సమాజోద్ధరణం హరిజనోద్ధరణ మీద ఆధారపడిందనీ ఆ రెండూ కూడా వ్యక్తులలో జరిగే ఆత్మోద్ధరణం మీదా అహంకార నిర్మూలనం మీదా ఆధారపడినవేననీ మాలపల్లి నవల పిండితార్థము" అని ఆ నవల ధ్యేయాన్ని నిర్వచించారు. ఈ సందర్భంలో స్మరింపదగ్గ ఇంకొక వాక్యం— "సవర్ణులలో అహంకారం ఎంతవరకు క్షీణించిందో చెప్పడం కష్టమే గాని, భారత రాజ్యాంగం ప్రసాదించిన ప్రత్యేకత ద్వారా హరిజనులలో జాత్యభిమానము పొటమరించి పాదుకొని పోవడం మాత్రం జరిగింది"

ఈ గ్రంథంలో డెబ్బయిరెండు పేజీలనాక్రమించిన పెద్ద వ్యాసం 'విశ్వనాథ సత్యనారాయణ ఏకవీర, వేయి పడగలు, చెలియలి కట్ట, స్వర్గానికి నిచ్చెనలు, తెఱచిరాజు, పునర్జన్మ - అనే విశ్వనాథ నవలల విమర్శనం ఈ వ్యాసంలో విషయం విశ్వనాథవారి రచనలు ఆత్మాశ్రయాలని నిరూపించడమే సుదర్శనంగారి లక్ష్యం ఆయా నవలల్లో విశ్వనాథ మూర్తి ఎలా గోచరిస్తుందో రచయిత విపులీకరించారు విశ్వనాథవారి ఆధ్యాత్మిక కాల్పనికవాద దృక్పథాన్ని సుదర్శనంగారు సోదాహరణంగా విమర్శించారు

గోపీచంద్ వ్యాసంలో పరివర్తన, అసమర్థుని జీవయాత్ర, పిల్లతెమ్మెర, గడియపడని తలుపులు, మెరుపుల మరకలు, శిథిలాలయం, పండిత పరమేశ్వరశాస్త్రి వీలునామా - నవలల విమర్శనమున్నది గోపీచంద్ మానసిక స్థితిగతుల ప్రభావం ఆ నవలలపై ఎలా ప్రసరించిందీ రచయిత నిరూపణ చేశారు

ఈ మధ్య చలం రచనలపై కావలసినంత దుమారం లేచింది. ఆయన రచనలు చేసే కాలంలోనూ అంతే! ఆయన రచనలకున్న ప్రాధాన్యం దీన్ని బట్టి స్పష్టమవుతోంది అమీనా, అరుణ నవలలపైనా పురూరవ సంవాదం గూర్చి విమర్శ సాగింది అనిబద్ధ కవిత్వంగా అమీనా నవలను సుదర్శనంగారు గుర్తించడం గమనార్హం. బుచ్చిబాబుగారి చివరకు మిగిలేది నవలను విమర్శిస్తూ రచయిత "మనోవైజ్ఞానిక నవల అంటే ఏదో మనస్తత్వ శాస్త్రం పఠించడం ద్వారా దానికి అనుగుణంగా ఊహించుకొని కథనూ, పాత్రలనీ కల్పించడం కాదు" అంటారు రచయితలు గుర్తుంచుకోవలసిన వాక్యం ఇది అల్పజీవి నవల్లో సుబ్బయ్య పాత్రను రాచకొండ విశ్వనాథశాస్త్రిగారు ఎలా తీర్చిదిద్దిందీ మనోహరంగా విమర్శించారు

"...చస్తున్నాను, బాధపడుతున్నాను... అతి నిజంగా చస్తాను" అనే వాక్యాలను ఉటంకించి "పై పంక్తులు పుస్తకం మధ్య ఉన్నవి ఈ రచనలో కీలక సందేశాన్ని వ్యక్తికరించే మాటలివి" అని వదిలేశారే గాని ఆ కీలక సందేశం ఆ పంక్తులలో ఎలా నిబిడీకృతమై ఉన్నదో సుదర్శనంగారు వివరించలేదు జి వి కృష్ణారావుగారి కీలుబొమ్మలు విమర్శనం సంక్షిప్తంగా సాగింది కీలుబొమ్మలు నవలలో ఉన్న వ్యక్తి మనస్తత్వం, వర్గ రాజకీయాలు, సామాజిక సంక్షోభం-

వీటిని వ్యాఖ్యానిస్తే వ్యాసం పరిధి విస్తృతమవుతుందేమోనని వాటిని పాఠకులకే వదిలి పెట్టి, రచయిత దృక్పథాన్ని మాత్రమే సుదర్శనం గారు ప్రస్తావించారు. ధర్మాన్ని దృష్టిలో పెట్టుకొని ఈ నవలను చదవాలని సుదర్శనంగారు వ్రాశారు నోరి నరసింహశాస్త్రిగారి ధూర్జటి నవలలో ఈ గ్రంథ రచయిత గమనించిన రహస్యాలనెన్నిటినో ఒక చిన్న వ్యాసంలో వెలువరించారు

మొత్తంమీద విమర్శన పద్ధతి పాశ్చాత్య పద్ధతిలో సాగింది పోలికలు, నిర్వచనాలూ పాశ్చాత్యుల నుండే గ్రహింపబడ్డాయి. ఆఖరికి పెద్దన వ్యాసంలో ధర్మాన్ని గూర్చి చెప్పేటప్పుడు గూడా ఆంగ్ల వాక్యాలే ఉదహరింపబడ్డాయి "కవి వ్యక్తిత్వానికీ, సంఘానికీ, కావ్యానికీగల మౌలికమైన సంబంధాన్ని గుర్తించలేని సాహిత్య విమర్శ వెఱ్ఱి తలలు వేస్తుంది' అని సుదర్శనంగారు వ్రాసిన వాక్యంతో కొందరు ఏకీభవించలేరు తమవ్యక్తిత్వాలకూ, కవిత్వాలకూ సంబంధం కనబడని కవులు కొల్లలుగా కనబడుతున్నారీనాడు హేతువాద విప్లవకవిగారు డబ్బుకోసం భక్తిగీతాలు వ్రాయడానికి వెనుదీయడం లేదు ఇక వ్యక్తిత్వానికీ, కావ్యానికీ మౌలిక సంబంధం ఎక్కడున్నట్లు? పుస్తకాలల్లో తీర్చిదిద్దబడిన పాత్రల మనస్తత్వాలను బట్టి కవుల జీవితాలను, వ్యక్తిత్వాలను ఊహించి వ్రాస్తే చదవడానికి సరదాగానే ఉన్నా, అన్ని చోట్లా 'సత్యం' అనడానికి మాత్రం వీల్లేదు. అలా వ్రాయడం విమర్శకుని ప్రతిభకు నిదర్శనమేమోగాని సత్యదర్శనం మాత్రం కాదేమో!

## 2. సాహిత్య నేపథ్యం

ఈ పుస్తకంలో ఆధునిక సాహిత్యంలో కాలం, మానవత్వము-ఆధునికత, మార్క్సు దృష్టిలో సాహిత్యం, విప్లవము - సాహిత్యము, సాహిత్యంలో సామాజిక స్పృహ, తెలుగు సాహిత్యంలో అస్తిత్వవాదం, తెలుగులో తాత్త్విక నవల, తెలుగు కవిత్వ పరిణామం - ఉద్యమాలు, తెలుగుకథ - శిల్పం, సాహిత్యంలో స్పృజన, సాహిత్య విమర్శ స్వరూపం, సాహిత్య లక్ష్యం అనే పన్నెండు వ్యాసాలున్నాయి రచయిత ఈ గ్రంథాన్ని పితృపాదులు దాదాజీగారికి అంకితమిచ్చారు

"సాహిత్య సౌధంలో అధికారంతో విహరించేందుకు శాస్త్ర పరిజ్ఞానం తాళంచెవి లాంటిది శాస్త్ర పరిజ్ఞానం అంటే అలంకారశాస్త్ర పరిజ్ఞానం మాత్రమే కాదు ఆ పాత తాళంచెవితో ఆధునిక సాహిత్య సౌధం ద్వారాలు తెరవబడటం లేదు" అంటూ సుదర్శనంగారు 'ఆధునిక సాహిత్యంలో కాలం' వ్యాసాన్ని ఆరంభించి ఆధునిక సాహిత్యాన్ని అర్థం చేసుకోవడానికి ఆధునిక శాస్త్రాల పరిచయం గూడా అవసరమని వివరించారు "కాలమడగించు. . జనుడు గాలవృత్తి తెలుగు నెఱుగునే" అనే భారతం శాంతిపర్వంలోని తిక్కన పద్యంతో వ్యాసం ముగించారు ఇందులో ఉదహరించిన ఒకటి రెండు రచనలు కాలాన్ని గూర్చిన శాస్త్రీయ అవగాహనకు సంబంధించినవే అనిపిస్తుంది మొత్తం మీద ఈ వ్యాసం పాఠకులకు సాహిత్యంలో కాలం స్థానం ఏమిటో స్పష్టంగా తెలియజెప్పదు 'మానవత్వము - ఆధునికత' వ్యాసంలో "బుచ్చిబాబు నవల చివరకు మిగిలేది అతని కథలూ చాలామందికి నచ్చాయి కాని వాటిలో వ్యక్తమవుతున్న నూతనధర్మ ప్రమాణాలను ఎవరూ గుర్తించిన జాడలేదు" అని రచయిత బాధపడ్డారు చాలమందికి ఆ రచనలు నచ్చాయో లేదో చెప్పడం కష్టంగాని, ఎక్కువమంది బుచ్చిబాబు రచనల్లోని కొత్తదనాన్ని మాత్రం గుర్తించారని నొక్కి చెప్పవచ్చు

'మార్క్సు దృష్టిలో సాహిత్యం' వ్యాసం సుదర్శనంగారి సమగ్ర పరిశీలనా దృష్టికి, నిష్పాక్షికతకూ నిదర్శనం "తెలుగు దేశంలో నేటి సాహిత్యం అటు పుస్తక విక్రేతల చేతుల్లోనూ, ఇటు మార్క్సిజం విక్రేతల చేతుల్లోనూ పెట్టుబడిదారీ ఉత్పత్తిగా మారడం వల్ల సాహిత్యంలో సృజన క్షీణించి సామాజిక స్పృహ నేతిబీరకాయలో నేయిగానే మిగిలిపోతున్నది" అని నేటి మన సాహిత్య స్థితిని గూర్చి వ్యాఖ్యానించారు 'విప్లవము - సాహిత్యము' వ్యాసం సుదర్శనంగారి విపుల పరిశీలనాదృష్టికి నిదర్శనం "తిరగబడు, కొట్టు, చంపు, మార్చు అంటూ కేకలు పెట్టడం కవిత్వం కాదు" అని నిర్ద్వంద్వంగా చెప్పారు "మా కొద్దీ తెల్లదొరతనమూ...కొల్లాయి గట్టితేనేమి... సాహిత్యంగా నిలవలేవు" అని తెగవేసి చెప్పారు. "కొల్లాయిగట్టితే... నేమి..." గేయం వింటుంటే ఇప్పటికీ ఆనందం కలుగుతూనే ఉంది. 'రాష్ట్రగానం' ఇప్పటికీ కావ్యానందం కలిగిస్తోంది ఇది నిలుస్తుంది, ఇది నిలవదు అని చెప్పడం కష్టం! సాహిత్యంలో సామాజిక స్పృహ వ్యాసంలో మౌలికమైన విషయాలనెన్నిటినో రచయిత స్పృశించారు. తెలుగు సాహిత్యంలో అస్తిత్వవాదం పెద్దవ్యాసం తెలుగు నవలల్లో, కథల్లో, కవిత్వంలో విమర్శకుడు దర్శించిన అస్తిత్వవాదాన్ని సోదాహరణంగా వివరించారు 'తెలుగులో తాత్త్వికనవల' వ్యాసంలోనేగాక ఇంకా చాలచోట్ల సుదర్శనంగారు తమ ఇతర రచనలను ఉదాహరణలుగా ఇచ్చారు ఇది ఒక పద్ధతి 'తెలుగు కవిత్వ పరిణామం - ఉద్యమాలు' విపులంగా వ్రాయవలసిన వ్యాసం సంక్షిప్తతవలన ఎన్నో చెప్పలేకపోయారు "మినీకవిత ప్రక్రియద్వారా మళ్ళీ కవిత్వం పుంజుకుంటున్నది" మొదలైన భావాలు అందరూ అంగీకరించేవికావు. "ఇది రాజకీయ ఉద్యమం కాకపోవచ్చుగాని ప్రజల ఉద్యమం"

అంటారు. సుదర్శనంగారి వంటి సంయమనం గల విమర్శకులు అన దగిన మాటలేనా అని ఆశ్చర్యం కలుగుతుంది! 'తెలుగు కథ - శిల్పం' అందరూ చదవదగిన మంచి వ్యాసం సాహిత్యంలో సృజన, సాహిత్య విమర్శ స్వరూపం, సాహిత్య లక్ష్యం అనేవి ఈ రెండుపుస్తకాల సింహావలోకనంగా భావించవచ్చు. "సైన్సుకు, ఫిలాసఫీకి ఏ మేధాగత మైన అన్వేషణకూ లొంగని జీవిత రహస్యాన్ని నిక్షేపించి అందించ డమే సృజనాత్మక సాహిత్య లక్ష్యం" అని తమ చివరి వ్యాసాన్ని ముగించారు దీన్నిబట్టి ఏ శాస్త్రపరిజ్ఞానమూ పాఠకులకుగాని, రచయిత లకుగాని అవసరం లేదనిపిస్తోంది

అభ్యుదయం, శాంతీ కాంతులు
అన్ని దిశలింక వెలుగక మానవు
సహజీవన సమానత్వములు
పరగున రాక మానవు! మానవు!

అనే కవిగారి ఆ శా వా దా న్ని హర్షిద్దాం దుర్గారావుగారు ఇట్లాంటి కవిత్వం రాద్దామనుకున్నప్పుడు అభివ్యక్తీకరణలో మార్పు, భాషలో సహజత్వం, శిల్ప సంవిధానంలో గడుసరితనం అలవరచుకొంటే ఇక మీదట ఇంతకంటె బలమైన కవిత్వం రాయగలరని నా నమ్మిక

# శ్రీ పులిచెర్ల సాంబశివరావు

## వీ ధి దీ ప ం (వచన గేయ కవితా సంపుటి)

[పి దుర్గారావు వెల రు 4-00లు, ప్రతులకు పి దుర్గా రావు, యం. ఒ. యల్; చెరుకుపల్లి పోస్టు, వయా నక్రేకల్, నల్ల గొండ జిల్లా ]

"ఈ వచన గేయములు అప్పుడప్పుడు వ్రాసికొనినవి. శ్రామిక వర్గంమీద నాకున్న అనుభూతి, అర్ద్రభావములే ఈ రచనకు ప్రోద్బ లకము" అని వినయ వాక్యములో రచయిత చెప్పుకున్నారు శ్రామిక వర్గంయొక్క గాథలు అగాథాల వంటివని, వాళ్ళబాధలు సుడిగుండాల వంటివని, వాళ్ళ దుఃఖం సముద్రమంత దరిలేదని, వేదన హిమాలయ మంతఅని, తన కవిత్వంలో దుర్గారావుగారు చెప్పారు శ్రామికవర్గానికి ఈనాడు కావలసినది దాక్షిణ్యం కాదని, దారుణ దారిద్ర్యం నుండి విముక్తి అని కవి గ్రహించారు భూమంతా ప్రజలదనీ, భూతలసంపద జనులదని పిడుగుపాటు శబ్దంతో పిడికిలెత్తి చాటమంటున్నారు విజ్ఞా నం—అజ్ఞానం, వెలుతురు—చీకటి, విలాసం—దారిద్ర్యం, భోగం—రోదన ఈద్వంద్వాలు సంఘంలో అట్టేకాలం ఉండకూడదని, వాటినిర్మూలనకు కవులు, రచయితలు, కళాకారులు పాటుపడాలని వీరు ఆశిస్తున్నారు కొండల్లో, తుఫానుల్లో, సుడిగుండాల్లో పయనిస్తూ, త్యాగంచేస్తూ, రక్తదానంచేస్తూ పయనిస్తేగాని హింస, దౌర్జన్యాలు లేని నూతన సమాజం పుట్టదని నమ్మకంగా రాస్తున్నారీయన

దారిద్ర్యం, దోపిడి, పీడన
దాస్యము లిల తొలగక మానవు
ధాత్రీజన సమూహమొకటై
తరియింపక మానదు మానదు

## విప్లవించిన ప్రకృతి

చిమనగుంథి జగదీశ్వర్ వెల రు 6-00 లు ప్రతులకు 1) ఎమెస్కో, 3237, రాష్ట్రపతి రోడ్, సికింద్రాబాద్-500003, 2) బ్రాహ్మణవీధి, వనపర్తి-509103, మహబూబ్‌నగర్ జిల్లా]

"ప్రస్తుతం పలువిధాలైన సమస్యలతో కొట్టుమిట్టాడుతున్న దేశాన్ని ఎవరికి తోచిన విధంగా వాళ్ళు ఉద్ధరించాలి" అని అనుకునే వాళ్ళలో తానొకడుగా జగదీశ్వర్‌గారు విప్లవించిన ప్రకృతి కవితా సంకలనాన్ని వేశారు ఈ సంకలనంలో విప్లవించిన ప్రకృతికి బదులు వికారమైన వికృతే నాకు కనబడింది పాదాలు పేర్చినంత మాత్రంలో వచనం అది మంచిదైనా, చెడ్డదైనా కవిత్వంకాదు అనుభూతికి ఆకృతి ఇవ్వటానికి కవికాదల్చుకున్నవాడు చాలా శ్రమపడాలి అను కున్నది అనుకున్నట్లుగా ఏ ఆలోచనవస్తే ఆ ఆలోచనను కథగానో, కవితగానో రాద్దామనుకునేవారు రచనా రంగంలో అతి శీఘ్రంగా ఫెయిల్ అవుతారు జగదీశ్వర్ గారికి ఏదో చెప్పాలనే తీవ్ర తపన ఉన్నట్లు ఈ సంకలనం చెబుతుంది ఆ తపన అక్షరరూపం దాల్చ టానికి వ్యుత్పత్తి, అంతకంటె స్వయం ప్రతిభ అవసరంగదా! ఈ సంకలనంలో కవిత్వాంశ చాలా అల్పంగా కనబడుతుంది

ఈ న్యాయస్థానాలు వెలయాలి స్థనాలు
ఈ నల్లకోటు ప్లీడర్లు చట్టబద్ధమైన తార్పుడుగాళ్ళు
ఈ ప్రత్యక్షసాక్షులు
డబ్బువలలో చిక్కుకున్న పక్షులు
ఈ వాదోపవాదాలు చెట్టుపైకి విసిరిన రాళ్ళు
ఈ తీర్పు వాక్యాలు రాలిపడిన పక్కు

సత్యాసత్యాలమాట ఎలా ఉన్నా ఇట్లాంటి పాదాలు సంకలనంలో చాలా అరుదు. అంతే కాకుండా

కలం పట్టుకొని కూర్చున్నవాని ఆలోచన కంటె
ఒక్కొక్కసారి చెంబు పట్టుకెళ్ళి
కూర్చున్నవాడి ఆలోచనే గొప్ప!

లాంటి పాదాలు కవితా సంకలనంలో చేర్చటం కవిననుకొనే వాడికి ఎవరికైనాసరేఁగ్గా?"మా గురువుగారు చెప్పిన ఉన్నత కవితాంబరాల వైపు వెళ్ళవలసి యున్నది? కలవిస్తారా..." అంటున్నారు జగదీశ్వర్‌గారు అట్టవెనుక అవశ్యం సెలవు తీసుకోండి

## ఊపిరి ఊసులు

[ఎ బసవలింగప్ప వెల రు 6_00 లు ప్రతులకు 1) దేశీ బుక్ హవుస్, నారాయణగుడ, హైదరాబాద్, 2) ఎ పార్వతి, హెచ్. నెం 2_1_254, నల్లకుంట, హైదరాబాద్_44]

"ఆవేదన అనుభవంగా, ఆలోచన ఆయుధంగా అప్పుడప్పుడు ముసిరే మూగ బాధను నాకు తెలిసిన మాటల్లో 'ఊపిరి ఊసులు'గా అందిస్తున్నాను ఇందులో వ్యక్తం చేసిన వాటి కంటె వ్యక్తం చెయ్యనివే ఎక్కువ. సాహిత్యపు లోతులూ, ఎత్తులూ ఇంకా తెలియని నా కవితలను ఆదరిస్తారనే ఆశ" అని బసవలింగప్పగారు యధార్థాన్ని నిజాయితీగా చెప్పుకొన్నారు కావ్యాలకు ముందు మాటలురాసేవాళ్ళు మొహమాటాన్ని వీడి సత్యాన్ని రాస్తే కవితా ప్రాంగణంలోకి ఆమితోత్సాహంతో అడుగుపెడుతున్న వాళ్ళకి మార్గదర్శకత్వంగా ఉంటుంది

'బసవ లింగప్ప ప్రయోగాలు చదువుతుంటే ఈ మధ్య చేయి తిరిగిన కవుల రచనలు గుర్తుకు వస్తాయి' అనే ఎల్లోరాగారి మాట అతిశయోక్తి బసవ లింగప్పగారు కవితా రచనలో ప్రాథమిక దశలో ఉన్నారని ఈ సంకలనం చెబుతోంది "కమిట్‌మెంటు - విప్లవం వంటి రాజకీయవాదాల నినాదాల వాదాలు వినిపించవు" అని ఎల్లోరాగారే చెబుతున్నారు వెనకటికెవరో అన్నట్లుగా అసలు కవిత్వ పదార్థమే ఉంటే 'రాజకీయమైనా రంకు పురాణమైనా' అది కవిత్వమే.

తన ఊసులు అర్థంకాని బాసలు కావని, నిన్నటి ఆలోచన అచ్చుల్లోంచి తీసిన మూసలుకావని, అలజడుల ఆకాశంలోంచి సూటిగా దిగిన రేచులని, 'సమాజపు అశాంతిలో, సామాన్యుని అంతులేని ఆవేదనలో ఓనమాలు దిద్దుకున్న నవీన ఓంకార వరుస'లని బసవ లింగప్పగారు చెప్పారు. సమాజం మారాలని కోరుతున్నారు. వచనత్వాన్ని పరిహరించి కవిత్వాన్ని భవిష్యత్తులో రాయాలని మనస్ఫూర్తిగా కాంక్షిస్తున్నాను

## రేఖలు (యువభారతీయుల కవితా సంకలనం)

[వెల రు 3-00 లు ప్రతులకు 1) కే, కింగ్స్‌వే, సికిందరాబాద్-500003, 2) యువభారతి కార్యాలయం ఆంధ్ర సారస్వత పరిషత్ భవనములు తిలక్‌రోడ్ - హైదరాబాద్-500001]

యువభారతి సాంస్కృతికసంస్థ ఇప్పటికి చాలా గ్రంథాలను ప్రచురించి దాని ప్రాశస్త్యాన్ని ఋజువు చేసుకుంది ఈ రేఖలు కవితా సంకలనం అట్లాంటి గ్రంథాల్లో ఒకటి దీనికి సమీక్ష రాసేముందు పీఠికలను గురించి కొంతచెప్పాలి డా॥ జి వి. సుబ్రహ్మణ్యంగారు యువభారతి పుస్తకాలకు నేను చదివినంతవరకూ ముందుమాటలు రాస్తూనే ఉన్నారు అది వారిలోని మంచితనమూ కావచ్చు, ఆ సంస్థతో ఆయనకున్న అనుబంధమూకావచ్చు మంచిగా సాహిత్యంలో ఉండాలని కాంక్షించటంలో తప్పులేదుగాని హద్దుమీరిన మంచితనం అనర్థదాయకంగదా! "నేటి సమస్యకవిత ఎర్రగాఉందా, నల్లగా ఉందా, తెల్లగాఉందా అనికాదు అసలు కవిత కవితలాఉందా?" అని ప్రశ్నించిన జి వి. సుబ్రహ్మణ్యంగారు ఈ సంకలనానికి ముందు మాట ఎందుకు రాసినట్లు?

ఈ సంకలనంలో కవిత్వం అల్పమై వచనం అధికమైందని చదివిన ఏ పాఠకుడైనా తేలిగ్గా గ్రహిస్తాడు కదిలిన ప్రతిభావమూ కవిత్వమైతే, ఉలిదెబ్బపడిన ప్రతిరాయి శిల్పమైతే ఈదేశం కవులతో, శిల్పులతో నిండిపోతుంది ఈ సంకలనంలో ప్రతిష్ఠులు, కానివారూ చాలామందున్నారు కవిత్వాన్ని అన్వేషించటానికైతే ఈ సంకలనం చదవవలసిందే

## భావ కవితా కుసుమాలు

[పి వజీర్‌ఖాన్, బి ఎ వెల రు 4-50 లు ప్రతులకు పి వజీర్‌ఖాన్, 1-428, గిరిరావువీధి, మదనపల్లె, చిత్తూరుజిల్లా]

కవిహృదయ సరోవరంలో విరిసిన ఊహల కమలాలే ఈ భావ కవితా కుసుమాలు సులభమైన శైలిలో బాలలకుసైతం బోధపడే పద్ధతిలో రాసిన కవితాఖడింకలివి ఈ కవితల్లో లోకంపోకడ, మానవ నైజం, కవికీ-కవిత్వానికీ ఉన్నసంబంధం, మనిషినిగురించిన ఆలోచన, ప్రణయవిరహం, మహిళాభ్యున్నతి, దేశాన్నిపాలించే సింహాసనంకథ మొదలైన అనేక అంశాలపై కవిఅభిప్రాయాలు వ్యక్తం చెయ్యబడ్డాయి.

భగవంతుడు దశరూపధారి
నేను శతసహస్ర రూపధారిని
కానీ అన్నీ కల్పించే కవిని నేను

అంటారు కవిగారు.

## తెలుగులమ్మపదాలు

["అమర్‌జీ" (జి ఆర్ కె రెడ్డి), వెల రు 2-00 లు ప్రతులకు రచయిత, చినకొదమగుండ్ల, వయాకారెంపూడి-522614 గురజాలతాలూకా, గు జి ]

ఆరుద్రగారి కూనలమ్మపదాలు విననీ, తెలియని కవితా పాఠకులు అరుదు ఆ బాణీలో ఈ తెలుగులమ్మపదాలు మొదటి మూడు పాదాలు సాధారణంగా పదిమాత్రలు, చివరిపాదం తొమ్మిదిమాత్రలు కలిగిఉన్న ముత్యాలసరంలాంటిది ఈ కవిత దీంట్లో సూక్తులు,ఉక్తులు చతురోక్తులు చాలాఉన్నాయి మచ్చుకి

తరుణులతో తిరుగకు,
తిరిపెమెపుడు అడుగకు
తల్లిభాష మరువకు
ఓ తెలుగులమ్మా- అనేసూక్తి

విద్యార్థులమీద ఒక చలోక్తి

చదువు కీడు ఎగనాము
గురువు కీడు పంగనాము
లేదులె నీకు బద్‌నాము
ఓ తెలుగులమ్మా

## స్త్రీ-కవితా సంకలనం

[సంకలనకర్త జాతశ్రీ వెల రు 1-50 లు ప్రతులకు 1) విశాలాంధ్రబుక్‌స్టాల్, ఇల్లెందు - 507123, ఖమ్మంజిల్లా, 2) విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, మాచవరం, విజయవాడ-520004]

"పాలిచ్చి పెంచిన ప్రపంచాన్ని పిడికెళ్ళు ఎత్తి ప్రశ్నించండి" అంటూ ఈ సంకలనం ప్రారంభమవుతుంది ఇలివృత్తానికి కేంద్ర బిందువు స్త్రీ, ఆమె స్వేచ్ఛాస్వాతంత్ర్యాలు ఈ సంకలనంలో కవులూ, కవయిత్రులూ ఉన్నారు సంకలనానికి యన్నంరెడ్డి వెంకటరెడ్డిగారు ముందుమాటలాంటిది రాశారు దాంట్లో పత్రికలపైనా, సమీక్షలపైనా విమర్శలపైనా వారికి గల సదవగాహనను అసహనంతో వ్యక్తీకరించారు. ఏ కాలంలోనైనా ఎప్పుడైనా కవిత్వం బతకడానికి కవిత్వమే కారణమవుతుంది 'పత్రికల పక్షపాత సమీక్షల కాటాలో, సాహితీవేత్తల అద్దాల బీరువాల్లో బతకకపోయినా - జనం గుండెల్లో బతుకుతుంది' అనే ధైర్యం కలవాళ్ళు అసలు సమీక్షలకు పంపటం శుద్ధ తెలివితక్కువ తనం కదా! మహామహా గొప్ప కవిత్వమనుకునేదే ఇంకా జనందాకా జేరలేదు, ఇహ ఈ సంకలనం గుండెల్లోకి వెళ్ళేది ఎప్పుడో? అహంకారం సర్వానర్థాలకు మూలం ఇంతగా గగ్గోలుపెట్టిన వెంకట రెడ్డిగారి ఖండికలోనే కవిత్వం లేదుగదా! (ఈ మాట కూడా పాక్షికమేనా?)

కవితా సంకలనంలో—

ఛాందస ఆచారాల గూడుపురానీలో
పావులాగ బిగబడ్డ స్త్రీత్వం తిరగబడందే
స్త్రీ విమోచనోద్యమాలు
అలలై...
గాలి నిండిన చోటిల్లా కదలాడందే...
నా ఈ దేశంలో స్త్రీ
కట్టు బానిసగానే కనబడుతుంది — అంటూ

స్త్రీ తిరుగుబాటును బోధించే గేయాలు ఎక్కువగా ఉన్నాయి.

## మళ్ళీ సూర్యోదయం
## కాగితం పువ్వు

[ఎ సూర్యప్రకాశ్ వెల రు 3-00, రు 4-00 లు. ప్రతులకు రచనా పబ్లిషర్స్, 1-7-87, పంత్‌రోడ్, ఆర్మూర్-503224 ]

మళ్ళీ సూర్యోదయం, కాగితం పువ్వు ఈ రెండూ వచనకవితా సంకలనాలే నిరంతర తపనతో, సంఘర్షణతో, సాంద్రతరమైన అనుభూతుల ఒత్తిడితో, ఆలోచనా తీవ్రతతో తల్లడిల్లిపోయే మనస్తత్వంతో, క్షోభ, ఉద్వేగం, సహానుభూతి, ఆనందం, అశాంతి, ఆరాటం, ఆవేశం, తన రచనకు ఆలంబనాలుగా, తనచుట్టూ విస్తరించిన సమాజంలోని ప్రజల ఆకలిని, దారిద్ర్యాన్ని, బాధలను, కన్నీళ్ళను, ఆశయాలను, అవరోధాలను తన కవితలో పలికిస్తున్నాడు సంఘంలో ఉన్న పరిస్థితులకు రాజీపడలేక బూటకపు విలువలపై చావుదెబ్బ తీయటానికి

ప్రయత్నిస్తూ నేటి అస్తవ్యస్త సమాజంలో జీవిస్తున్న మనిషి స్థితిని కళ్ళకు కట్టించి మనిషి బ్రతుకులో చైతన్యాన్ని రేకెత్తించాలనే ఆశతో తాను కవితాయుధాన్ని ధరించానని సూర్యప్రకాశ్‌గారు చెబుతున్నారు కవిత్వం ప్రజలకోసమని, సమకాలిక జీవితం కవిత్వంలో ప్రతిబింబించాలని, ఆధునిక కవిత్వానికి వాస్తవికత ప్రాణలక్షణమని, తన అనుభూతిని తనదైన ప్రత్యేకమార్గంలో కవిత్వరూపంగా ప్రకటించాలని సూర్యప్రకాశ్‌గారి ఆశయం, ఆకాంక్ష

మళ్ళీ సూర్యోదయం కవితాఖండికల సంకలనం, కాగితం పువ్వు నగర జీవితపర్వనకు సంబంధించిన సంపూర్ణ రచన గేయకావ్యం లుప్తమైన మానవతా విలువలమధ్య, డబ్బుకోసం నానా గడ్డీ మేస్తూ, రూపాయివెనుక పరుగులు తీస్తూ, సర్వ మానవ సౌభ్రాతృత్వమూ, వసుధైక కుటుంబం, వాస్తవం కాని కలగా మిగిలిపోయిన లోకంలో మనుష్యులు మనస్సును పోగొట్టుకొని యంత్రాలుగా మారిన సంఘంలో స్వాతంత్ర్యం కోతి చేతికి దొరికిన కొబ్బరికాయగా మారి, పిచ్చివాడి చేతి కత్తిగా మారి, జాతీయ జెండాలు మనుషుల గుండెల్లో బదులు వీధుల్లో ఎగురుతున్న దేశంలో కృత్రిమ నాగరికత, కుహనాసంస్కృతి, చమట బిందువులను, కన్నీటిచుక్కలను, రక్తపుబొట్లను హీనంగా, హేయంగా, దుమ్ములో ధూళిలో కలుపుతున్న గడ్డమీద, మానవ మస్తిష్కంలో చీకటి గడ్డి కడుతున్న సమయాన, ఖద్దరు లాల్చీల క్రింద కల్మషాన్ని నింపి, విషభావనలమీద గాంధీ టోపీలను మూత పెట్టి, చెట్టుపేరు చెప్పుకొని కాయలమ్ముకుంటున్న కాలాన కవుల కలాలు కరవాలాలై ఈ అవినీతి విషవృక్షాన్ని ఖండ ఖండాలుగా తెగ వేస్తాయి సూర్యప్రకాశ్‌గారి కలం కత్తిగా ఈ కుష్ఠు వ్యవస్థాశరీరాన్ని స్త్ర చికిత్స చెయ్యడానికి పూనుకుంది మృత్యువు కళ్ళల్లో కళ్ళుపెట్టి ంతకంటె గట్టిగా నేను నవ్వలేనా అనే టింతటి తీవ్ర ఆశావాద కవిత ఈయనది నిరాశ మంటల్లో కాలిపోతున్న ప్రపంచాన్ని ఆలింగనం చేసుకొని, నీరసాన్ని నీరసింపచేసి, ఆకాశమంత చేతులెత్తి మంటలను ఆర్పే ప్రయత్నంలో చివరి ఊపిరవరకూ తన గుండెను వెలిగిస్తానని చెబుతున్నారీ కవి

వెలుగు కత్తై చీకటి కడుపును చీలుస్తానని, వజ్రాయుధమై అవినీతి కొండను ఛేదిస్తానని, కొత్తబాట తీస్తూ, కొత్తరాత రాస్తూ తెరవకూడని ద్వారం తెరిచి చూడకూడని దృశ్యాన్ని చూపిస్తానని, మనిషిలోనున్న భయాన్ని ముక్కముక్కలుగా నరికి విశ్వమానవ జాతికి అభయహస్తం ఇస్తానంటున్నారీయన ఈ వ్యవస్థను దిశమొలతో చూసి - ఇది ఎన్నడో మానభంగం చేయబడిందని తెలుసుకొని, అకృత్యాలు నిత్యసత్యాలుగా మారటం తెలుసుకొని, ఈ సంస్కృతి సిఫిలిస్ సంస్కృతి అని, ఈ నాగరికత గనేరియా నాగరికత అని సూర్యప్రకాశ్‌గారు భావించారు అంతు తెలియని రోగాల్తో, లోతు తెలియని గాయాల్తో, కళ్ళనిండా చక్రవడ్డీల లెక్కల్తో ఇక్కడ ప్రతిఒక్కడూ భీకర భూకంపాలను గుండెల్లో, పెనుతుఫానులను కళ్ళల్లో, గరళాన్ని గళాల్లో బంధించి నిష్క్రియాత్వాన్ని భజన చేస్తుంటే - అసురశక్తులను తుదముట్టించడానికి, అసలైన, సిసలైన సూర్యోదయం కోసం భవిష్యదాశాగీతాన్ని సూర్యప్రకాశ్‌గారు ఆలపిస్తున్నారు నగర జీవితంలోని భయంకర దృశ్యాలను కాగితం పువ్వులో ఈకవి చూపించిన తీరు ప్రతీకాత్మకతను, వ్యంగ్యాన్ని ఆశ్రయించింది నగరం ఒక విషవలయమని, నగర జీవితం చేదువిషమని, నగరం ఒక కత్తుల బోనని, నగరం కాగితం పువ్వని, నగరం పలచని ముసుగేసుకున్న వేశ్య అని, నగరం ప్లాస్టిక్ పువ్వు అని, లిప్‌స్టిక్ నవ్వు అని, అక్కడ అవినీతి అందెల రవళులు వినబడతాయని ఈయన చెప్పటంలో ఉన్న కవిత్వ వ్యంగ్యం ఆధునిక నగరజీవితం యొక్క కృతకత్వాన్ని సహస్రాక్షులతో మన ముందుంచుతుంది ఈయన స్వీకరించిన వస్తువు అభ్యుదయకరమైనది, తత్వం మార్పును ఆశించటం

**శ్రీ టి. ఎల్. కాంతారావు**

# శ్రీమద్భగవద్గీతోపనిషత్తులు

[శ్రీ కృష్ణానందాశ్రమ గీతాప్రచార సంఘం, దిల్‌సుఖ్, నగర్ హైదరాబాదు - 36 వెల రు 20]

ఇది పదవిభాగ, టీకాతాత్పర్యాలతో, భావయుక్తంగా పఠించుటకు సూచనలతోసహా రూపొందిన తాత్త్విక గ్రంథం

'భగవద్గీతాసు ఉపనిషత్సు'- అని ప్రతీఅధ్యాయంచివర ఉన్నందున గ్రంథంపేరు బహువచనాంతముగా ఉందని అనుకోవచ్చు ఇదొక విశిష్టత.

భగవద్గీత పేరుతోతెలుగున ఇంతవరకు నేనుచూసినవి పది గ్రంథాలవరకు ఉన్నాయి వాటిలోకొన్ని కేవలం తాత్పర్యరూపంగానూ, కొన్ని వివరణాత్మకంగానూ, కొన్ని పద్యరూపంగానూ ఉన్నవే.

నేనుకూడా ముఖ్యవిషయంచూపుతూ గద్యాత్మకంగా సంగ్రహించి వ్రాశాను అముద్రితం

ఈ గ్రంథం అన్నిటికన్నా ప్రత్యేకపధాన వెలసింది. అక్షరాస్యులందరూ చదివి సులభంగా అర్థం చేసుకోగలరు.

పదవిభాగం, ప్రతిపదార్థం, తాత్పర్యంకల యీ గ్రంథం ఆధ్యాత్మిక తత్వానికి అద్దం పట్టినట్టుంది ఇంత ప్రత్యేకపరిశ్రమచేసి యీ యోగశాస్త్రాన్ని తెలుగువారి కందించిన ఈ సంఘంవారిని ప్రత్యేకించి అభినందిస్తున్నాను

వీరుచేసినపని కొండను త్రవ్వి ఎలుకను పట్టడంకాదు గనిని భేదించి మణిని తెలుగు జాతికందించారని నా అభిప్రాయం.

'ఆత్మయేసత్యం- జగత్తులేదు ఈతత్త్వదృష్టితో అర్థంచేసుకోండి' ఈ గ్రంథ వ్యాఖ్యాత బోధ ప్రతిపుటలోనూ హెచ్చరిస్తూన్నట్టుంటుంది.

సాధన చతుష్టయం అంటే ఏమిటి ? సాధనలక్షణాలెన్ని ? అవిఏవి ? షట్కర్మలేవి ? అన్నేప్రశ్నలకు చక్కని సమాధానాలు ఈ వ్యాఖ్యాత ఇవ్వడంవల్ల అక్షరాస్యులు కృతార్థులవుతారు

వీరి వివరణకి ఉదాహరణ

'అనన్యాశ్చింతయంతోమాం యే జనాః పర్యుపాసతే
తేషాం నిత్యాభియుక్తానాం యోగక్షేమం వహామ్యహమ్'

ఎవరు శాశ్వత సుఖమును కోరినవారై శాశ్వత సుఖస్వరూపమైన నన్నే జగత్తుకంటెవేరైన నన్నే వారిజగత్తునూ, లౌకికములను విడిచి సాధన చేస్తారో వారుచేసిన సాధనభంగంకాకుండా వారుచేయవలసిన సాధనలో అభివృద్ధిని పొందేటట్టుగా నేను భారంవహిస్తాను.

ఇది తక్కువ వాక్యాలలో మాధవతత్త్వాన్ని తెలిపే వివృతి అని అందరూ గ్రహిస్తారు.

విశేషించి ఉదాహరిస్తే నా సమీక్ష ఒకగ్రంథమై కూర్చుంటుంది అని స్వల్పాక్షర పరిమితంగా ఉదాహరించాను.

ఈ గ్రంధరచయిత ప్రధానోద్దేశం తాత్వికదృష్టితో సాధన చెయ్యాలి అన్నది

మాధవ బోధఅంతా సంగ్రహించి చెప్పాలంటే 'యద్యత్పశ్యసి నేత్రాభ్యాం తత్తద్బ్రహ్మేతి భావయ'- నీకళ్ళతో చూసేదంతా బ్రహ్మమే అని భావించు- అన్నది.

క్షేత్రమూ, క్షేత్రజ్ఞుడూ అనే విషయం సర్వజన బోధ్యంగా విశదించారు నాకు చాలా నచ్చింది పొలమూ దానియందలి సస్యమూ ఫలప్రాప్తి-ఉదహరిస్తూ సువ్యక్తం చేశారు

'పత్రం పుష్పం ఫలం తోయం యోమేభక్త్యాప్రయచ్ఛతి' అనే శ్లోకాన్ని బాగానే వివరించారు కానీ సర్వసాధన పద్ధతిగా భక్తికి ప్రాధాన్యం ఇవ్వకపోవడం కొందరు అసంతృప్తులౌతారని నా అభిప్రాయం ఉపనిషత్తు - బ్రహ్మవిద్య - యోగశాస్త్రం - అని యీ జగజ్జాన్య తాత్విక గ్రంధానికి అపరనారాయణుడు పెట్టినపేర్లు సామదాయికంగా ఏతద్గ్రంధవ్యాఖ్యాత సరిగా సమన్వయించి వివరించడం తాత్వికులకు కనువిప్పవుతుంది

బ్రహ్మనుగూర్చి తెలిపేది బ్రహ్మవిద్య జ్ఞానమే విద్యఅయినపుడు, దానిని తెలుసుకోడం ఎలాగంటే యోగమూలకంగా తెలుసుకోవాలి సమాధానమిది

యోగం అంటే యుక్తి విడదీయరాని కలయిక. ఏమిటా కలయిక ? అస్థిరమైన శరీరాన్ని నమ్మక సుస్థిరమైన అంతరాత్మని సాధనసూత్రం ఆధారం చేసుకుని దరిజేరి నిత్య ప్రకాశ శీలమైన ఆ జ్యోతిస్వరూపములో కలిసిపోవడం ఈ ఆధ్యాత్మిక విషయాన్ని సులువుగా తెలిసే తెలుగులో చెప్పడం కష్టసాధ్యం కాని చెప్పి యీ గ్రంధవ్యాఖ్యాత కృతార్థుడయినట్టు గట్టిగా చెప్పవచ్చు

ముందుమాటలో పేరు పెట్టకుండా ఆదిశంకరులను, పీఠాధిపతులను, సన్న్యాసులనూ ఆక్షేపించడం మోటు మాటలతో రూపొందింది

అలాగే 'చచ్చుపూజలు', 'వెట్టివెంగళప్పలు', 'మట్టి బుర్రలు'' 'హూనం హూనం చేస్తాను '— అనేపదాలు మాధవునినోట అనిపించడం సభ్యతాదూరమనీ యీలాంటి పదాలు యీలాంటి పవిత్ర గ్రంధాలలో ఉపయోగించ కూడదనీ నేను ఎంతోచింతించి ఇటుపై వ్రాసే గ్రంధాలయివి పునరావృత్తాలు కారాదని సలహా ఇస్తున్నాను.

భక్తికూడాభవబంధచ్ఛేదనకి చెప్పేసాధనాలలో ప్రముఖమైగానే వ్యాసులవారి భాగవతాదులలో కనిపిస్తుంది ఆ భక్తిని కూడ అన్యపద్ధతిని వ్యాఖ్యానించడం నాస్తికత్వానికి దారి తీస్తుందని అనుకుంటాను

ఏది యేలాగున్నా గీతోపనిషదాత్మతత్వానికి ఈ రచన సరిక్రొత్త మణి-దర్పణం అని అనవచ్చు

**శ్రీ యామిజాల పద్మనాభస్వామి**

Printed and Published for Nagaswara Rao Estates (Private) Ltd , by S Radhakrishna at the Andhra Patrika Press, Gandhinagar, Vijayawada-3 Editor . S. Radhakrishna, Vijayawada Phones . 75667 & 61247.



# అమృతాంజన్‌కే తెలుసు తలనొప్పి బాధ

అసలు తల నొప్పి అంటేనే భరించలేని బాధ. దాన్ని పోగొట్టుకోడానికి సులువైన మార్గము. కొంచెము అమృతాంజన్ తీసుకొని కణతల మీద బాగా గట్టిగా నిమిరి పట్టించండి. వెంటనే తల నొప్పి తగ్గిపోయి హాయిగా వుంటుంది.

అమృతాంజన్ ఇతర మందులువలెగాదు. అమృతాంజన్‌లో చేరివున్న శక్తివంతమైన 10 ఔషధాలు అమోఘంగా పని చేసి రాసిన చోట పై చర్యవల్ల అతి త్వరగా ఇట్టే నొప్పిని నివారిస్తుంది. ఏ అపాయం వుండదు.

85 సంవత్సరాలకు పై బడిన ప్రసిద్ధి కల అమృతాంజన్ వొంటి నొప్పులకు, బెణుకులకు, జలుబులకు గొంతు నొప్పులకు కూడా చాలా అమోఘంగా పనిచేసి నివారిస్తుంది.

ఎప్పుడూ అమృతాంజన్ చేతికి అందుబాటుగా వుంచుకోటం మంచిది. ఎందుకంటే ఎప్పుడు అవసర మొస్తుందో చెప్పలేము.




**అమృతాంజన్**

శీఘ్ర నివారిణి. నమ్మకమైనది. ఏ ఇతర బాధనూ కలుగచేయదు.

OBM 7652 TG-R